అవధూత చింతన

శ్రీగురుదేవదత్త

సంకలనం

శ్రీగురుచరణ సేవాసమితి

ప్రచురణ

శ్రీపాద వల్లభ మహాసంస్థాన్ ట్రస్ట్

9-102, సంగమం దగ్గర, శ్రీక్షేత్ర గాణుగాపురం, అఫ్జల్‌పూర్ తాలూకా, గుల్బర్గా జిల్లా, కర్నాటక.

& 08470-290255, 09611216234.

www.sreepadavallabhamahasamstantrust.org

సర్వస్వామ్యములు	:	దత్తభగవానునివి
ప్రథమముద్రణ	:	శ్రీ సర్వజిత్‌నామసంవత్సర ఆషాఢ పౌర్ణమి, 2007
ప్రతులు	:	1000
ద్వితీయముద్రణ	:	2008 వ సంవత్సరం
ప్రతులు	:	1000
మూల్యము	:	అమూల్యము

ప్రతులకు :

శ్రీపాద వల్లభ మహాసంస్థాన్ ట్రస్ట్

9-102, సంగమం దగ్గర, శ్రీక్షేత్ర గాణుగాపురం, అఫ్జల్‌పూర్ తాలూకా, గుల్బర్గా జిల్లా, కర్నాటక.

✆ 08470-290255, 09611216234.

www.sreepadavallabhamahasamstantrust.org

సమర్పణ

ఏడు ఖండముల మూడు లోకముల
గురుని కన్నమిన్న దొరకరెవరు
ఈశ్వరుండు తలచి ఏమి చేయడు
గురుడు తలచినేని జరుగునన్ని
మరచిపోకుడు శివానందునిమంచిమాట

ఆత్మీయులైన దత్తగురు బంధువులందరకు వినయ పూర్వకవందనములు!

భారతదేశము యోగభూమి. మానవులకు బ్రహ్మత్వమును, అమృతత్వమును అందించునది యోగవిద్య. అది గురుముఖతః మాత్రమే అందించబడుతుంది. ఒక్క భారతదేశంలోనే గురుశిష్య సాంప్రదాయం పటిష్ఠంగా వెలుగొందుచున్నది. యోగవిద్యకు అధిష్ఠానదేవత యోగనాధుడైన దత్తుడే! సృష్టిస్థితిలయలు నిర్వహించే త్రిమూర్తులు లోకములో పెద్దవారు. అయితే త్రిమూర్తులు ఒక మహాప్రజ్ఞ (పరబ్రహ్మము) యొక్క సంకల్పము ననుసరించి వారి నిర్దేశిత కార్యములు నిర్వహించుచున్నారు. దివ్యమైన ఆ మహాప్రజ్ఞయే దత్తుడు. కనుక అందరికన్న పెద్ద దత్తుడే! అందరికంటె మిక్కిలి పెద్దయైన వారిని “గురువు” అంటారు. కాబట్టి దత్తస్వామి ఏకైక గురువు. నిరాకార నిర్గుణ పూర్ణ పరబ్రహ్మతత్వము యోగమును ప్రసాదించుటకై అత్రి, అనసూయ దంపతులకు, తద్వారా సమస్తమానవాళికి దత్తమై సాకారంగా ఆవిర్భవించింది. అందుకే దత్తాత్రేయుడే ఆదిగురువు, త్రైలోక్యగురువు, విశ్వగురువు! సమస్త ధర్మములయందును, మతములయందును, సిద్ధాంతములయందును స్వప్రకాశముతో వెలుగొందువాడు దత్తుడే! జీవుల అభీష్టములు, అభిరుచులను బట్టి, ఆయా స్థితులను బట్టి, వాటియందు భిన్న భిన్న తత్వములుగా తోచువాడు దత్తుడే! వాటి మాటున దాగియుండే ఏకత్వమూ దత్తుడే! సమస్త దేవి దేవతా స్వరూపములద్వారా పూజలను, స్తోత్రములను అందుకొని అనుగ్రహించువాడు దత్తుడే! సృష్టియందలి సమస్త సద్గురు స్వరూపముల ద్వారా జ్ఞానమును, యోగమును, మోక్షమును అనుగ్రహించునదీ దత్తుడే! బహిర్ముఖ సాధకుడైనా, అంతర్ముఖ సాధకుడైనా వాని యోగక్షేమములు సదా కని పెట్టియుండువాడు దత్తుడే! దత్తుడు సర్వతంత్రస్వతంత్రుడు. అన్ని ఆధ్యాత్మిక సాధనామార్గములు దత్తుని ఆధారంగా ప్రవర్తిల్లుచున్నవి. అంతేకాని ఆయనకొక నిర్దిష్టమైన విధానమనునది లేదు.

ఇట్టి సర్వసమన్వయాత్మక మహోన్నత జ్ఞానము కలియుగంలో లోపించుచున్నది. కలిపురుషుడు కూడా ఇటీవల కొన్ని గురు రూపములు ధరించి, వివిధ మతముల, సాధనామార్గముల, గురువుల

మధ్య భేధ భావములను సృష్టించి, ఎవరికి వారు, వారు అందించేదే సర్వోన్నతమైన నూతన మార్గమని ప్రచారం చేస్తూ, మూలతత్త్వము విడిచి ముఠాతత్త్వమును నూరిపోస్తూ, అనేక వర్గములుగా విడదీస్తూ అమాయక భక్తులను భ్రష్టు పట్టిస్తున్నాడు. విశ్వసమైక్యతకు, విశ్వప్రేమకు, విశ్వశాంతికి తద్వారా సనాతన ధర్మమునకు హాని కలిగిస్తున్నాడు. ఇట్టి విపత్కరపరిస్థితుల నుండి భక్తులను బయట పడవెయ్యడానికి - దివ్యజీవనులు, భాగవతోత్తములు, సంత్‌శ్రేష్ఠులు, దత్తగురుభక్తి ప్రచారదీక్షితులు, సమర్థ సద్గురువులు, దత్తావధూత శ్రీశ్రీశ్రీ స్వామి శివానంద మహరాజ్‌గారు, మా శ్రీగురుచరణ సేవాసమితి భక్త బృందమును, దత్తుని, దత్త తత్త్వమును, దత్తభక్తిని, దత్తావతారములను, దత్తగురుమార్గమును పరిచయము జేసే గ్రంథమును తయారుచేసి అందించడమే తక్షణ కర్తవ్యమని ఆదేశించినారు. దానికి అవసరమైన ప్రచోదనమును, దివ్యాశీస్సులను మాకు అందించారు. వాటి ఫలితమైన ఈ **"అవధూత చింతన శ్రీగురుదేవదత్త"** అనే గ్రంథమును గురుభక్తులకు సవినయముగా సమర్పిస్తున్నాము. ఈ గ్రంథ పఠనము ద్వారా, ఇందలి విషయముల మననము ద్వారా దత్తుని గురించి, దత్త తత్త్వము గురించి, సత్యమైన గురుమార్గముగురించి, దత్త సాంప్రదాయమునకు చెందిన మహనీయుల గురించి, అవధూతతత్త్వము గురించి, నిజమైన గురువులు ఎలా ఉంటారనే విషయములలో చక్కటి అవగాహన కలుగుతుంది. ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తున్న గురువుల విషయంలో భక్తులు జాగరూకత వహించడం జరుగుతుంది. దత్తావధూత శ్రీస్వామి శివానంద మహరాజ్‌గారి దివ్యప్రణాళిక గురించి తెలుస్తుంది. పాపకర్మల ఫలితము క్షీణ దశకు వచ్చినప్పుడు, పుణ్యకర్మలు సత్ఫలితములివ్వనారంభించినప్పుడు మాత్రమే మానవులలో దత్త భక్తి ఉదయిస్తుంది. అట్టి శుభసమయం మనందరకు ఆసన్నమైందనడానికి నిదర్శనమే ఈ గ్రంథము అందుబాటులోనికి రావడం. పూర్ణగురు స్వరూపమైన దత్త ప్రభువు ఈ గ్రంథరూపంలో మరోసారి మనకుదత్తమైన ఈ గురుపూర్ణిమ దినం చిరస్మరణీయమైనది. ఇకనుండి ప్రతి పూర్ణిమ గురుపూర్ణిమయే!

దత్త, సాయి, శివానందమహరాజ్‌ల దివ్యఆశీస్సులు మనపై ఎల్లవేళలా వర్షించాలని, దత్తగురుమార్గములో నడిపించాలని ప్రార్థిస్తున్నాము. గురుభక్తులకు ఎంతో ఉపయుక్తమైన ఈ గ్రంథమును సంకలనం చేయించిన దత్తావధూత శ్రీస్వామిశివానంద మహరాజ్‌గారి దివ్యచరణారవిందములకు మరోసారి కృతజ్ఞతాభివందనములు సమర్పిస్తున్నాము.

శ్రీ సర్వజిత్ నామ సంవత్సర
ఆషాఢపౌర్ణమి (గురుపౌర్ణమి)
ది. 29-7-2007.

శ్రీ గురుచరణ సేవాసమితి

శ్రీపాద వల్లభ మహాసంస్థాన్ ట్రస్ట్

జయగురుదత్త! జయసాయినాథ! జయగులాబ్‌బాబా! జయశివానంద!

అవధూత చింతన

శ్రీగురుదేవదత్త

ధ్యానమూలం గురోర్మూర్తిః
పూజామూలంగురోఃపదమ్ ।
మంత్రమూలం గురోర్వాక్యమ్
మోక్షమూలం గురోః కృపా ॥

గురుబ్రహ్మ గురుర్విష్ణుః గురుదేవో మహేశ్వరః ।
గురుసాక్షాత్ పరంబ్రహ్మ తస్మై శ్రీ గురవే నమః॥

దత్తాత్రేయం బ్రహ్మవిద్యా సంవేద్యానంద విగ్రహమ్ ।
త్రిపన్నారాయణాకారం దత్తాత్రేయముపాస్మహే ॥

సదా సత్స్వరూపం చిదానందకందమ్
జగత్సంభవస్థాన సంహార హేతుమ్ ।
స్వభక్తేచ్ఛయా మానుషం దర్శయంతమ్
నమమీశ్వరం సద్గురుం సాయినాథమ్ ॥

గురుపాదుకాపీఠ విరాజిత దత్తావధూతం
బ్రహ్మ సమరస సన్మార్గ శాంతిదూతం
నిరతాగ్ని సేవనం పాపకర్మ విదాహినం
చిదానందరూపం వందే శివానంద సద్గురుమ్ ॥

ఓం ద్రాం శ్రీ దత్తాత్రేయాయ నమః
ఓం ద్రాం శ్రీ పాదశ్రీవల్లభాయ నమః
ఓం ద్రాం శ్రీ నృసింహ సరస్వత్యై నమః
ఓం ద్రాం శ్రీ మాణిక్యప్రభువే నమః
ఓం ద్రాం శ్రీ స్వామి సమర్థాయ నమః
ఓం ద్రాం శ్రీ సాయి నాథాయ నమః
ఓం ద్రాం శ్రీ వాసుదేవానంద సరస్వత్యై నమః
ఓం ద్రాం శ్రీ గజాననాయ నమః
ఓం ద్రాం శ్రీ తాజుద్దీన్ బాబాయ నమః
ఓం ద్రాం శ్రీ గులాబ్ బాబాయ నమః
ఓం ద్రాం శ్రీ స్వామి శివానంద గురవే నమః

దత్తాత్రేయ సమారంభాం సాయినాథ మధ్యమాం
స్వామి శివానంద పర్యంతం వందే గురు పరంపరాం

విషయాను క్రమణిక

	పుట
అవధూత చింతన శ్రీగురుదేవదత్త	5
సృష్టిక్రమం	7
పురాణాల్లో దత్తాత్రేయుడు	9
అత్రి అనసూయలు - రహస్యార్థం	14
దత్తాత్రేయుడు - కాలము - ఖగోళసంబంధము	16
దత్తాత్రేయుడు - నామౌచిత్యము	18
దత్తమంత్రబీజము - విశిష్టత	20
దత్తాత్రేయుని స్వరూప స్వభావములు	22
దత్తాత్రేయుడు - పంచమాశ్రమం	25
దత్తాత్రేయుణ్ణే ఎందుకు ఆరాధించాలి?	27
దత్త సంప్రదాయము - ఆత్మధ్యానము	30
దత్తావతార వైభవము	32
శ్రీపాద శ్రీవల్లభులు	34
శ్రీపాదవల్లభులు - దత్తాత్రేయ తత్త్వరహస్యము	46
శ్రీ నృసింహ సరస్వతి	54
మాణిక్య ప్రభువు	60
స్వామి సమర్థ (అక్కల్‌కోట మహరాజ్)	67
సాయినాథుడు	76
శ్రీవాసుదేవానంద సరస్వతీ (టెంబేస్వామి)	83
శ్రీ గజానన మహరాజ్	95
హజరత్ తాజుద్దీన్ బాబా	102
శ్రీ సిద్ధేశ్వర్ సంత్ గులాబ్‌బాబా	107
దత్తావధూత శ్రీ స్వామి శివానందమహరాజ్	120
శ్రీ షిరిడిసాయి గురుపాదుకాపీఠం	122
దత్తావధూత శ్రీస్వామి శివానందమహరాజ్‌గారి తత్త్వము - సందేశము	129
శ్రీ శివశివానీ పీఠము, శ్రీక్షేత్ర గాణుగాపురం	136
సద్గురుచరిత్రల పఠనావశ్యకత	139
విజ్ఞప్తి	142
గురుదేవ మంగళహారతి	144

సృష్టి క్రమం

మహాప్రళయానంతరం ఒక దివ్య తేజోమండలం ప్రకాశించింది. దానిలో శ్వాశ్వతమైన గోలోకం, దానికి యాభై యోజనాల దూరంలో దక్షిణ భాగంలో వైకుంఠం, వామ భాగంలో శివలోకం ఉన్నాయి. ఈ మూడు లోకాలు లయం కావు. గోలోకమనే ఈ పరబ్రహ్మలోకంలో దేదీప్యమానంగా ప్రకాశించే పరంజ్యోతి మధ్యలో నిత్యసత్య అవినాశి, సచ్చిదానంద స్వరూపము, కేవల పరబ్రహ్మమైన శ్రీకృష్ణ పరమాత్మ విరాజిల్లుతూ ఉంటాడు. వైకుంఠంలో శ్రీమహాలక్ష్మీ సమేతంగా శ్రీమన్నారాయణుడుంటాడు. శివలోకంలో ఉమాసహితంగా సదాశివుడు ఉంటాడు. ఆ పరబ్రహ్మ విశ్వములన్నీ సర్వశూన్యమై ఉండటం చూచాడు. సృష్టి చేద్దామనే సంకల్పం కలిగింది. వెంటనే ఆయన పురుషుడు, ప్రకృతియనే రెండు రూపాలుగా విభక్తమయ్యాడు. ఆ ఆద్యప్రకృతియైన మహామాయయే రాధ. ఆ పురుషుడే శ్రీకృష్ణుడు. మొదట ఆ పురుషుని దక్షిణ భాగమునుండి జగములకు మూలకారణములైన సత్వరజస్తమోగుణాలు పుట్టాయి. ఆ గుణాలనుంచి మహత్తత్వము, అహంకారం, పంచభూతాలు, శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలు క్రమంగా ఉద్భవించాయి. ఆ సగుణ పరబ్రహ్మలో శంఖచక్రగదా పద్మాలు ధరించిన శ్రీమన్నారాయణుడు జన్మించాడు. ఆ పరబ్రహ్మ వామభాగమునుండి సదా శివుడు, నాభికమలం నుంచి ఆది బ్రహ్మ ఉదయించాడు. ఆ పరమాత్మ వక్షస్థలం నుంచి ధర్మదేవత ఆవిర్భవించింది. ముఖము నుంచి సరస్వతి, మనస్సు నుంచి శ్రీ మహాలక్ష్మి, మన్మథుడు, బుద్ధి నుంచి ఈశ్వరి, జిహ్వాగ్రం నుంచి సావిత్రి ప్రాదుర్భవించారు. శ్రీకృష్ణుని నుండి (పరబ్రహ్మ) స్ఖలనమైన సంకల్పశక్తి మహాగ్ని రూపంలో వెలువడి జలములో పడింది. సహస్రవర్షముల అనంతరం అది మహాండరూపం దాల్చింది. అదే హిరణ్మయాండం. అందులో నుంచి విరాట్ పురుషుడు పుట్టుకొని వచ్చాడు. ఆయన శరీరంలో ఎన్ని రోమకూపాలున్నాయో అన్ని బ్రహ్మాండాలు ఈ విశ్వంలో ఉన్నాయి. ఈ విరాట్ పురుషుడే మహా విష్ణువు. ఆయన సదామహార్ణవ జలంలో శయనించి ఉంటాడు. సర్వవిశ్వములకూ ఆయనే ఆధార భూతుడు. ఆయన పవళించి ఉన్నప్పుడు ఆయన కర్ణమలమునుండి మధుకైటభులనే రాక్షసులు ప్రభవించారు. వారు, తన నాభికమలం నుంచి వచ్చిన బ్రహ్మ పైకి దండెత్తిరాగా, ఆయన వారిని సంహరించాడు. వాళ్ళ మేధస్సుతోనే ఈ మేదిని ఏర్పడింది. ఇదంతా మొదటిదైన బ్రహ్మ కల్పంలో జరిగింది. తర్వాత వరాహకల్పములో మేదిని జలములో మునిగిపోతే శ్రీ మహావిష్ణువు వరాహం రూపం ధరించి ఆ భూమిని ఉద్ధరించాడు. పద్మకల్పంలో సృష్టికర్తయైన బ్రహ్మ శ్రీ మహావిష్ణువు నాభికమలం నుంచి జనించి బ్రహ్మలోకం వరకు ఉన్న త్రిలోకాలు సృజించాడు. బ్రహ్మలోకం పైనున్న వైకుంఠం, శివలోకం, గోలోకం దివ్యమైన నిత్యలోకాలు.

బ్రహ్మ సహస్ర దివ్యవర్షములు తపస్సుచేసి, అభీష్టసిద్ధి పొంది మొదట మేదిని (భూమిని) సృష్టించిన తర్వాత సుమేరువు, కైలాసము, మలయము, హిమాలయం, ఉదయాచలం, అస్తాచలం, సువేలము, గంధమాదనము అనే ఎనిమిది మహా పర్వతములు, ఇతర పర్వతములను సృజించాడు.

అట్లాగే సప్తసముద్రములను, నదులను సృష్టించాడు. సప్తద్వీపములు సృజించాడు. మేరుపర్వతం మీద ఉన్న ఎనిమిది శిఖరాలపై ఎనిమిది పురాలను అష్టదిక్పాలకుల కోసం నిర్మించాడు. పర్వత మూలభాగమైన పాతాళ నగరంలో ఆదిశేషువుకోసం, పాతాళ నగరం నిర్మించాడు. ఆ పర్వతం మీద భూర్లోక, భువర్లోక, స్వర్లోక, మహర్లోక, జనలోక, తపోలోక, సత్యలోకాలనే ఏడు స్వర్గాలు నిర్మించాడు. ఆ పర్వత అధో భాగంలో అతల, వితల, సుతల, తలాతల, మహాతల, పాతాళ, రసాతలములనే ఏడు పాతాళాలు సృజించాడు. ఇలా ఏడు ద్వీపాలతో, ఏడు స్వర్గాలతో, ఏడు పాతాళాలతో విరాజిల్లుతున్న దాన్నే మనం 'బ్రహ్మాండం' అంటున్నాం. ఇది బ్రహ్మ యొక్క అధికారానికి లోబడి ఉంటుంది. శ్రీ మహా విష్ణువుకు (విరాట్ పురుషుడు) ఎన్ని రోమ కూపములున్నవో, అన్ని బ్రహ్మాండములు ఆయన రోమ కూపములలో ఉన్నవి. ఒకొక్క బ్రహ్మాండంలో బ్రహ్మ, విష్ణు, శివుడు, దేవతలు ఉంటారు. ఈ సృష్టి క్రమం బ్రహ్మ వైవస్వత పురాణములో వర్ణించబడింది.

ఈ సృష్టి క్రమమును వివిధ పురాణములు తమదైన వివిధ పద్ధతులలో వెల్లడించాయి. ఇదంతా సామాన్యమైన అల్పస్థాయి భావన మాత్రమే. కేవలం మాయాప్రభావం. ఆ పరబ్రహ్మ సృష్టించాలని మొదట రెండుగా మారి, ఆ తర్వాత అనేకమయ్యాడు. ఈ తత్వరహస్యమును గ్రహించనంత వరకు భిన్నత్వ దృష్టిలో మ్రగ్గిపోవలసినదే. ఈ భిన్నత్వంలోని ఏకత్వ దర్శనము ప్రసాదించుటకే జ్ఞానస్వరూపమైన దత్తావతారం వచ్చింది. మూడు మూర్తులు, మూడు గుణములు తనవేనని, త్రిగుణాత్మకుడు, త్రిగుణాతీతుడు తానేనని, నామరూప రహితమైన, చిదానంద స్వరూపమైన పరబ్రహ్మము తానేనని జ్ఞాన ప్రబోధం చెయ్యటానికే గురుదేవదత్తగా ఆ పరబ్రహ్మ అవతరించాడు.

ఈ సమస్త సృష్టికి మూలతత్వం దత్తాత్రేయులవారు. 33 కోట్లమంది దేవతలు, సమస్త జీవులు, అనేక కోట్ల బ్రహ్మాండములు ఆయన యందే ఉన్నవి. ఆయన వల్లనే శక్తి వంతములు చైతన్య వంతములవుతున్నవి. ఏ దేవత నారాధించినను ఆ ఆరాధన ఆయనకే చెందుతుంది. ఆయనను ఆరాధిస్తే సమస్త దేవతలను ఆరాధించినట్లే అవుతుంది. కోటానుకోట్ల బ్రహ్మాండములందంతటా వ్యాపించి ఉండి, దానిని అతిక్రమించి ఉన్న ఏకైక తేజో మహారాశి దత్తుడు. ఆయన గురించి జీవితమంతా శ్రమించి తెలుసుకొన్నా ఆ తెలుసుకొన్నది పరమాణువులోని సహస్రాంశము కూడా కాజాలదు.

అవధూత చింతన శ్రీగురుదేవదత్త!

పురాణాల్లో దత్తాత్రేయుడు

భాగవతంలో దత్తాత్రేయుడు విష్ణువుయొక్క ఇరవై ఒక్కటి అవతారములలో ఆరవదిగాను, శ్రీమన్నారాయణుని లీలావతారాల్లో నాలుగవదిగాను చెప్పబడింది. దత్తావతారం దశావతారములకంటె ఎంతో పురాతనమైనది. అన్ని అవతారములు తమకు నిర్దేశింపబడిన కార్యము పూర్తి చేసుకొని, లోకంనుండి నిష్క్రమించాయి. దత్తావతారం మాత్రం నిత్యసత్యావతారంగా విరాజిల్లుతున్నది. ఇది దుష్టులను సంహరించుటకు గాక, దుష్టభావాన్ని రూపుమాపి జనులందరిని జ్ఞాన ప్రబోధంతో సన్మార్గగాములయ్యేటట్లు చేయటానికి వచ్చిన విలక్షణ అవతారం. ఏ అవతారమూర్తికి లేని "గురుదేవ" అన్న విశేషణం దత్తాత్రేయుల వారికి మాత్రమే ఉంది.

బ్రహ్మ మానసపుత్రులైన మహర్షులలో అత్రి ఒకరు. కర్దమ ప్రజాపతి దేవహూతి దంపతులకు జన్మించిన నవకన్యలలో ఒకరైన అనసూయ అత్రి మహర్షికి భార్యయైనది. బ్రహ్మదేవుడు తనకుమారుడైన అత్రి మహర్షిని పిలచి సృష్టి క్రియలో తనకు సాయం చెయ్యమని కోరెను. అత్రి ఆ శక్తిని సంపాదించుటకు భార్యా సహితంగా ఋక్షాద్రి పర్వతముపైకి పోయి అనేక శతసంవత్సరములు కఠోర దీక్షతో తీవ్రంగా తపస్సు చేశాడు. ఆయన శరీరం నుండి తపోగ్ని జ్వాలలు బయలుదేరి ముల్లోకాలను దహించివేయసాగాయి. అది చూచి త్రిమూర్తులు ఆయన వాంఛ సఫలం చెయ్యాలని అత్రి మహర్షిముందు ప్రత్యక్షమయ్యారు. అత్రి ఆశ్చర్యముతో, "పుత్రార్థినై నిర్గుణమైన ఏకత్వమును ధ్యానిస్తే త్రిమూర్తులైన మీరు అనుగ్రహించారేమిటి?" అన్నాడు. దానికి త్రిమూర్తులు "మునీంద్రా! నీవు అత్రివైనా ఒక ప్రత్యేక సంకల్పముతో సగుణంగానే ధ్యానించావు కాబట్టి ముగ్గురం వచ్చాం. నీకు దత్తమవుతున్నాం. మా అంశలవల్ల నీకు ముగ్గురు కుమారులు పుట్టి లోక విఖ్యాతులై నీయశాన్ని దశదిశలా విస్తరింపజేస్తారు. శుభం భూయాత్" అని పలికి అదృశ్యమయ్యారు. బ్రహ్మాండపురాణంలో దత్తాత్రేయ జననమునకు కారణమైన పై వృత్తాంతమే కాకుండ మరో రెండు వృత్తాంతములు కూడా చెప్పబడినవి.

ప్రతిష్ఠానపురంలో కుష్ఠు వ్యాధి పీడుతుడైన కౌశికుడనే బ్రాహ్మణుడుండేవాడు. పతిని పరమేశ్వరునికన్నా మిన్నగా ఆరాధించే మహాసాధ్వియైన సుమతి అతని భార్య. అతను ఇంటి ముందునుండి పోవుచున్న ఒక వేశ్యను చూచి ఆమె పొందు కావాలని భార్యను వేధించాడు. సుమతీ మహాసాధ్వి చీకటి పడ్డాక ఒక తట్టలో భర్తను కూర్చుండ బెట్టి తలపై మోస్తూ బయలుదేరింది. దారిలో చేయని తప్పుకి రాజుచేత కొఱత వేయబడిన మాండవ్య మహాముని ప్రక్కనుండి వెడుతుంటే

కౌశికుని కాలు ఆ మునికి తగిలి బాధతో విలవిలలాడి ఆగ్రహంతో "నాకీ బాధ కలిగించిన దుర్మార్గుడి శిరస్సు రేపు సూర్యోదయం కాగానే వేయిముక్కలైపోవునుగాక!" అని శపించాడు. అది విని కలతపడిన సుమతి "సూర్యుడసలు ఉదయించకుండుగాక!" అని ప్రతి శాపం ఇచ్చి భర్తను తీసుకొని ఇంటికి తిరిగి వచ్చింది. మహాపతివ్రతయైన సుమతి శాపంవల్ల సూర్యోదయం ఆగిపోయి జగమంతా అంధకారబంధురమైంది. సంధ్యావందనాది నిత్యకర్మానుష్ఠానములు, క్రతువులు ఆగిపోయాయి. ప్రజలంతా హాహాకారాలు చేయసాగారు. దేవతలు ఈ అకాల ప్రళయమును నివారించమని బ్రహ్మను కోరగా "పతివ్రతశాపం వల్ల సూర్యోదయం ఆగిపోయింది కనుక మళ్ళీ సూర్యోదయం కావాలంటే మరో పతివ్రత వల్లే జరగాలి. అత్రి మహర్షి సహధర్మచారిణియైన అనసూయ మహాపతివ్రత ఆమెను ప్రార్థించండి. ఆమె ఈ విపత్తునుండి రక్షించగలదు" అని బ్రహ్మదేవుడు చెప్పాడు. దేవతలు అనసూయ మాతను శరణువేడారు. ఆమె సుమతి దగ్గరకు పోయి నచ్చచెప్పి తన శాపమును ఉపసంహరించుకొనేటట్లు చేసి సూర్యోదయమయ్యేటట్లు చేసింది. సూర్యోదయంకాగానే కౌశికుడి తల బ్రద్దలై మరణించాడు. వెంటనే అనసూయామహాసాధ్వి తన పాతివ్రత్య శక్తితో ఆ కౌశికబ్రాహ్మణుని పునరుజ్జీవితుణ్ణి చేసింది. కుష్ఠు వ్యాధి నుండి కూడా విముక్తి కలిగింది. ఆ సమయంలో త్రిమూర్తులు, అసాధ్యమైన దైవకార్యమును తన మహాశక్తితో సునాయాసంగా సాధించినందుకు అనసూయమాతను వరం కోరుకొన మన్నారు. అప్పుడామె త్రిమూర్తులు కుమారులుగా జన్మించాలని, సర్వమానవాళి దుఃఖ నివృత్తికై యోగమును అనుగ్రహించాలనేది తన, తనభర్త యొక్క కోరిక అని విన్నవించింది. "తథాస్తు!" అని పలికి త్రిమూర్తులు అంతర్ధానమయ్యారు.

మరియొక సందర్భములో త్రిమూర్తులు అనసూయాదేవి పాతివ్రత్యమహిమ పరీక్షించ దలచి అతిథి రూపములలో వచ్చి భిక్షయాచించి వివస్త్రయై వడ్డించాలనే షరతుపెట్టారు. అప్పుడు ఆ మహాసాధ్వి తనమహిమచే వారిని శిశువులుగా మార్చి ఆకలి తీర్చి లాలించింది. అప్పుడు త్రిమూర్తుల పత్నులు వచ్చి ఆమెను వేడుకొనగా ఆ శిశువులను మరల త్రిమూర్తులుగా మార్చి అప్పగించింది. అప్పుడు అత్రి మహర్షి తపస్సు నుంచి వచ్చాడు. త్రిమూర్తులు వరం కోరుకొనమని చెప్పగా పైన చెప్పిన కోరికే ఆమె విన్నవించింది.

కొంతకాలం గడిచింది. ఒకరోజు అత్రి మహర్షి తన తపస్సు ముగించి, ఋతుస్నాతయై ప్రకృతిలోని పవిత్రతనంటిని తనలోనే నిలుపుకుని ప్రక్కన కూర్చున్న అనసూయాదేవి ముఖంలోకి అనురాగ వీక్షణములను ప్రసరింప జేశాడు అత్రి మహర్షి. వెంటనే ఒక దివ్య తేజస్సు అందరూ అవలోకిస్తుండగా అనసూయాదేవి పురాకృత పుణ్య విశేషం వల్ల ఆమె శరీరంలో ప్రవేశించి, గర్భంలోకి

జొరబడింది. త్రిమూర్తుల ద్వారా సృష్టి స్థితి లయములు నిర్వహిస్తున్న నిరాకార, నిర్గుణ, అఖండ సచ్చిదానంద పరబ్రహ్మయైన దత్త ప్రభువు అత్రిమహర్షికిచ్చిన వాగ్దానం నెరవేర్చాలన్న సంకల్పంతో అనసూయాసుతుడు కాదల్చుకున్నాడు. అనసూయాదేవి గర్భం ధరించింది. అది సప్తమితిథి. సప్తమి నుండి పూర్ణిమ వరకు గల తొమ్మిది రోజులు తొమ్మిది మాసాలుగా భావించాడు దత్తమూర్తి. తొమ్మిదవ నెలలో అంటే తొమ్మిదవరోజు మార్గశిర శుద్ధ పూర్ణిమనాడు 'దత్త ప్రభువు' అవతరించాడు. దేవతలు ఆనందంతో దేవదుందుభులు మ్రోగిస్తూ పుష్పవృష్టి కురిపించారు.అప్సరసలు నాట్యం చేశారు. సర్వదిశలలో ప్రశాంతమైన వాతావరణం నిండిపోయింది. భువనమోహనంగా ఉన్న ఆ చిన్నారి శిశువు వదనంలో త్రిమూర్తుల వదన త్రయం దర్శించిన అత్రి ఆనంద భరితుడయ్యాడు. బ్రహ్మాంశతో చంద్రుడు, విష్ణ్వంశతో దత్తుడు, రుద్రాంశతో దుర్వాసుడు జన్మించారు. అత్రి మహర్షికి జన్మించిన చంద్రుడు మనకు కనిపించే చంద్రగోళంకాదు. వేదములో చంద్రుని సోముడంటారు. చంద్రునియందలి ఆధ్యాత్మిక ప్రజ్ఞయే అత్రికి జన్మించిన చంద్రుడు. పరవశత్వమనబడు మనోలయస్థితిని యోగులకు ప్రసాదించువాడితడు. ప్రాణులందరికి తిధినక్షత్రములననుసరించి చంద్రకిరణములు ప్రసరింపజేసి, లోక వ్యవహారములకు కావలసిన మానసిక స్థితిని ఆయువును ప్రసాదిస్తున్నాడు. దత్తాత్రేయుడు యోగనాధుడై భుక్తిముక్తి ప్రదాతయై గురుదేవుడై విలసిల్లాడు. దుర్వాసుడు యమనియమములకు అధిదేవత. యతి మార్గాన్ని అవలంభించి, ఉన్మత్త వ్రతం స్వీకరించి దేశమంతటా తిరగజొచ్చాడు.

త్రిమూర్తులు, అత్రి మహర్షి అనసూయాదేవిలనే పరీక్షించడానికి, వారికే దత్తమవడానికి, వారి విశిష్టతలను కొన్ని పురాణగాధలు వివరిస్తున్నాయి. స్వారోచిషమన్వంతరంలో, సప్తఋషులలో అత్రిమహర్షి ప్రధాన స్థానం వహించారు. ఋగ్వేదంలోని శాకలశాఖ పంచమమండలాన్ని, తన తపో మహిమచేత అత్రి సందర్శించగలిగాడు. కృత యుగంలో రోగాలు పెచ్చుమీరి, ప్రాణి లోకానికి హానికలుగుతుంటే "ఆయుర్వేద" మనే ఉపవేదాన్ని దర్శించి, లోకాన్ని ఉద్ధరించాడు. మరోసారి మనుప్రణీతమైన ధర్మశాస్త్రం దురవగాహంగా ఉందని ప్రజలు చింతిస్తుంటే, తేట తేట మాటలతో తానే ఒక మనుస్మృతిని సంతరించాడు. మరొకప్పుడు దేవదానవ సంగ్రామంలో, సూర్యచంద్రులు శత్రువులకు బందీలై చిక్కిన కారణాన, లోకమంతా అంధకారం అలుముకుంది. అప్పుడు దేవతల ప్రార్థన మన్నించి తానే సూర్యుడు చంద్రుడు కూడా అయి లోకాలకు వెలుగు ప్రసాదించాడు. ఇక అనసూయమాత గురించి చెప్పవలెనంటె, ఆ అద్భుతాలకు లెక్కలేదు. ఒకప్పుడు తీవ్రమైన ఎండలకు గంగానది ఎండిపోతే మునిజనుల సౌకర్యార్థం అ నదిని ఆమె పునరుజ్జీవింపచేసింది. మరొకసారి మహాక్షామం సంభవించి నేలలో మొలకన్నది లేకుండా మాడిపోతే ఆమె వేలమంది మునిజనులకు,

నిరంతరం కందమూలాలను సృజించిపోషించింది. ఇంకొకప్పుడు మహాపాపుల దేహస్పర్శవల్ల గంగానది తన పవిత్రతను కోల్పోయి నల్లబడిపోగా, ఆ మహాసాధ్వి తన కమండలోదకాన్ని ప్రోక్షించి, గంగాదేవి కాలుష్యాన్ని క్షణంలో తొలగించి, పునీతను గావించింది. కౌశికబ్రాహ్మణుడిని పునరుజ్జీవింపజేయడం, త్రిమూర్తులను పసిపాపలుగా మార్చి జోలపాడడం వంటి అద్భుత చర్యలను పైన చెప్పుకున్నాం. తత్వపరంగాను, మహిమాపరంగాను, అత్యున్నతమైన స్థితిలో ఉండి లోక కళ్యాణ కాంక్షతో జీవిస్తున్న అత్రిమహర్షి, అనసూయాదేవిల కన్నా జగద్గురువైన దత్తప్రభువుకు జననీ జనకులు కాగలిగిన యోగ్యత ఎవరికుంటుంది?

దత్తాత్రేయ మహత్త్వమును మార్కండేయ పురాణం, మత్స్యపురాణం, బ్రహ్మాండ పురాణం, హరివంశం, భాగవతం ఎంతగానో కీర్తించాయి. దత్తస్వామి పరశురాముడికి త్రిపురా రహస్యం బోధించాడు. కార్తవీర్యార్జునకు, విష్ణుదత్తుడికి, ప్రహ్లాదుడికి, అలర్కుడికి, పింగళినాగుడికి, యదువుకూ ఇంకా మరెందరికో జ్ఞానబోధచేసి గురువై విరాజిల్లాడు. ఈ వివరములన్నీ "శ్రీ దత్తపురాణం" లో మనోహరంగా వర్ణింపబడినవి.

ముఖ్యంగా కార్తవీర్యార్జునుడి విషయంలో దత్తస్వామి ప్రసాదించే మహాయోగం ఏమిటో అర్ధమవుతుంది. చొట్టచేతులతో నిర్వీర్యుడై, రాజ్యపాలనకు అశక్తుడై ఉన్న కార్తవీర్యార్జునుడనే రాజు సర్వస్వశరణాగతి భావంతో, భక్తితో దత్తస్వామిని సేవించి ఆయన అనుగ్రహమునకు పాత్రుడయ్యాడు. దత్తస్వామి "ఏంకావాలో కోరుకో ఇస్తాను." అన్నాడు. కార్త వీర్యార్జునుడు "స్వామీ! నా పాలనలో ధర్మార్థములు వర్ధిల్లేటట్లూ, పరుల మనోభావాలు నాకు తెలిసేటట్లు, యుద్ధాలలో అజేయుడనై నిలిచేటట్లూ, నాకు వేయి బాహువులుండేటట్లూ, అణిమాది సిద్ధులన్నీ నాకు వశమై ఉండేటట్లు, ఎచ్చటికైనా సరే నిరాఘాటంగా నేను పోగలిగేటట్లు, నేనెప్పుడైన అధర్మ మార్గంలో సంచరిస్తున్నప్పుడు వెంటనే సన్మార్గ దర్శనం చేయించేటట్లు, నాదేశంలో నన్ను స్మరించే వాళ్ళకు పోయిన ధనం లభించేటట్లు, సదా నీయందు నిశ్చల భక్తి నిలచి ఉండేటట్లూ నాకు వరాలు ప్రసాదించండి" అని కోరాడు. దత్తస్వామి సంతోషంగా ఆ వరాలన్నీ అనుగ్రహించాడు. అతడు అడిగిన వరాలన్నీ సిద్ధింపజేసేందుకు, "అనఘాష్టమి వ్రతం" మార్గశిర బహుళ అష్టమినాడు దత్తస్వామి ఆచరింపజేశాడు.

దత్తాత్రేయుడే అనఘుడు. "అఘము" అంటే పాపము. పాపాలులేనివాడు అనఘుడు. ఆయన యోగశక్తే అనఘాదేవి. అనఘాదేవి సమేత అనఘుడు దత్తాత్రేయులవారి యొక్క అర్ధనారీశ్వర రూపము. త్రిమూర్తులకు సృష్టి స్థితి లయ కార్యములకు ప్రేరణనిచ్చి, వారితో తాదాత్మ్య స్థితి కలిగియుండి,

వాటికి ఆధారంగాను, అతీతంగాను ఉన్నది అనఘుడు. అలాగే మహాసరస్వతీ, మహాలక్ష్మి, మహాకాళి రూపములతో తాదాత్మ్యత కలిగియుండి, వారికి శక్తిని ప్రేరణనిచ్చి వారికి ఆధారముగాను అతీతముగాను ఉన్నది అనఘాదేవి లేదా అనఘాలక్ష్మి స్వరూపము. అణిమాది అష్ట సిద్ధులు అనఘుడు, అనఘాదేవి యొక్క పుత్రులు. సర్వశ్రేయోదాయకమైన అనఘాష్టమీ వ్రతం కార్తవీర్యార్జునుని చేత ఆచరింపజేస్తూ, దత్తస్వామి దత్తభక్తులందరికి అందించారు.

కార్తవీర్యార్జునుడు సహస్రబాహువులతో మహాబలవంతుడై అనేక రాజ్యాలను జయించాడు. అనేక యజ్ఞ యాగాది క్రతువులు నిర్వహిస్తూ, ధర్మ పరిపాలన గావిస్తూ, గొప్ప చక్రవర్తిగా ప్రసిద్ధిగాంచెను. వీటికొఱకే దత్తుని ఆశ్రయించాడు. కనుక, దత్తుడు మొదట వాటినే ఇచ్చాడు. దత్తుని యోగం భౌతికాన్ని విసర్జించమని చెప్పదు. భౌతికంలో నుండి ఆధ్యాత్మికములోనికి ఎలా సాగాలో తెలియజేస్తుంది. కర్మ ఫలితములను ఈశ్వరార్పణ చేస్తూ కర్మాచరణ చేయడం నేర్పిస్తుంది. దీనినే శ్రీకృష్ణుడు “యోగః కర్మసు కౌశలం” అని చెప్పినది. కర్మ నిర్వహణలోని కౌశల్యము (నేర్పరితనం) యోగార్హత కలిగిస్తుంది. అదే క్రియాయోగం. ఇలా చిత్తశుద్ధి లభించిన తర్వాత దత్తస్వామి బ్రహ్మసత్యం జగత్తు మిధ్య అనే జ్ఞాన బోధచేశారు. అప్పుడతనిలో సహజంగా వైరాగ్య భావ ముదయించింది. ఈ సందర్భములోనే బృహస్పతి ఇంద్రుడికి బోధించాడని సప్తోదాహరణలు (సప్త గాధలు) దత్తస్వామి కార్త వీర్యార్జునుడికి బోధించాడు. ప్రతివారు వారికి విహితమైన కర్మలు, నిస్వార్ధంగా ఈశ్వరార్పణ బుద్ధితో నిర్వహిస్తూ అవిద్యామూలకమైన మోహాన్ని తొలగించుకొని, భిన్నత్వంలో ఏకత్వాన్ని దర్శించడమనే ఉపాసనలోని చివరిమెట్టు ఎలా చేరవచ్చో అవి తెలియజేస్తున్నాయి. అప్పుడు దత్తుడు యోగమును కార్తవీర్యార్జునకు అనుగ్రహించాడు. ఇది మరింత వివరంగా శ్రీ దత్త పురాణములో లభిస్తుంది.

స్వాయంభువ మన్వంతరం వచ్చిన ఒక కృతయుగంలో బ్రహ్మ జీవ సృష్టి వృద్ధి కోసం అవిద్యను సృష్టిస్తే, ఆ ‘అవిద్య’ బ్రహ్మనే పట్టుకొంది. తత్ఫలితంగా బ్రహ్మదేవుడు వేదాలన్నింటిని మరిచి పోయాడు. బుద్ధి మందగించింది. అప్పుడు శ్రీమన్నారాయణుని దగ్గరకు పోయి ప్రార్ధిస్తే “దత్తాత్రేయుణ్ణి ఆశ్రయించు, ఇప్పుడు నేను ఆ స్వరూపంలో సహ్యాద్రిలో ఉన్నాను” అని ఆయన చెప్పాడు. బ్రహ్మ ఆ విధంగా చేసి, దత్తానుగ్రహంతో వేదాలను తిరిగి స్మృతికి తెచ్చుకున్నాడు. బ్రహ్మకు గురుత్వం వహించిన దత్తాత్రేయుని “పరమగురువు” అనడం పరమసత్యం.

అవధూత చింతన శ్రీగురుదేవదత్త!

అత్రి అనసూయలు - రహస్యార్థం

బ్రహ్మ మానసపుత్రులైన తొమ్మిదిమంది ఋషులలో అత్రి ఒకరు. కర్దమ ప్రజాపతి తొమ్మిది మంది కుమార్తెలలో అనసూయ ఒకరు. అత్రి అన్నపదం సాధకుడి యొక్క ఉన్నత స్థితిని సూచిస్తుంది.

"ఆధ్యాత్మికాది తాపత్రయ రహితత్వేన అత్రి శబ్దవాచ్యో జీవన్ముక్తో కశ్చిన్మహర్షి" అని అత్రి శబ్దం నిర్వచించబడింది. మూడు లేనివాడు లేదా మూడు కానివాడు ఎవడో వాడు. అత్రి ఆధ్యాత్మిక, ఆదిభౌతిక, ఆదిదైవికములనే తాపత్రయములు, సత్వరజస్తమోగుణములు, బ్రహ్మగ్రంధి, విష్ణుగ్రంధి, రుద్రగ్రంధి యని పిలవబడే గ్రంధి (దోష) త్రయములు ఈ మొదలైన త్రయములేవి లేనివాడు అత్రి. అంటే వాటినన్నిటిని అధిగమించిన స్థితిలో ఉన్నవాడు. ఈ స్థితిని సాధకుడు పొందాలంటే ముందుగా అనసూయ స్థితిని పొందాలి అంటే అసూయను పూర్తిగా వదిలిన మానసిక స్థితి. అత్రి మహర్షి అనసూయను సహధర్మ చారిణిగా చేసుకొన్నాడని చెప్పారు. అసూయను వీడిన స్థితి అనసూయది. అనగా జీవుడు మాయను వదిలిన స్థితి. త్రిమూర్తులు పరీక్షార్థం అనసూయను వివస్త్రవై భిక్ష పెట్టమని కోరితే ఆమె ఆ విధంగా చేసింది. జీవుడికి స్వస్వరూప జ్ఞానం కలుగకుండా చేసేందుకు మాయ ఒక వస్త్రంలాగా కప్పివేస్తుంది. ఆ మాయను తొలగిస్తే దిగంబరత్వమనే జ్ఞాన స్థితి లభిస్తుంది. అనసూయత్వం సిద్ధిస్తుంది.

చతుర్విధ పురుషార్థ సాధనకు అవరోధంగా నిలచేవి కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములనే ఆరు శత్రువులే కాక పైశున్యం (కొండేలు లేక చాడీలు చెప్పడం), అసూయ అనే మరో రెండు గుణాలను కలిపి వరాహ పురాణంలో చెప్పబడింది. లోతుగా పరిశీలిస్తే, అసూయను ఆధారం చేసుకొనే మిగిలిన ఏడు దుర్గుణాలు విస్తరిస్తాయి.. మానవునికి ఉండవలసిన విశిష్ట లక్షణం గురించి శాస్త్రం "ఆత్మోపమ్యేన భూతానాం దయాం కుర్వీత మానవః" అని చెప్పింది. మానవుడు దయకలిగి ఉండాలి. ప్రేమ, జాలి కూడినదే దయ. ప్రేమ ఉన్నచోట ద్వేషం ఉండదు. ద్వేషమున్న చోట ప్రేమ ఉండదు. మనిషిని ద్వేషించకుండా ఉంటే ఏదోరోజున ఆ మనిషిపై ప్రేమ కలుగుతుంది. ఎవరిమీదైనా అసూయ కలిగినప్పుడే మనకు తెలియకనే వారిపై ద్వేషం కలుగుతుంది. అసూయను మనలో చేరనీయకుండా చేయటమే, అనసూయను సహధర్మచారిణిగా చేసుకొనడం. అనసూయత్వం మనలో నిండుతున్నకొలది కామక్రోధాదులు నశిస్తాయి. అన్ని తాపత్రయాలు దూరమవుతాయి. మనసు నిశ్చలత నొంది జీవన్ముక్త స్థితికి తీసుకొని వెడుతుంది. అందుకనే మన ఋషులు సాధనలో అనసూయత్వానికి అంత ప్రాధాన్యమిచ్చారు. సాధకుడు అనసూయను మానసిక సహధర్మచారిణిగా

చేసుకొన్నప్పుడు క్రమంగా తమోగుణం రజోగుణంలో కలిసి, ఆ రెండు వాటి ప్రత్యేకతను కోల్పోయి సత్వగుణంలో విలీనమవుతుంది. ఆ తర్వాత అది శుద్ధ సత్వంగా మారుతుంది. అప్పుడు నిర్గుణ యోగశక్తిని అంటే దత్తశక్తిని దత్తం చేసుకోవటం ప్రారంభమవుతుంది. ఇలా రజోగుణం, తమోగుణం సత్వంలో కలిసి శుద్ధ సత్వంగా మారినప్పుడే దత్తుని యోగశక్తి లభిస్తుందని చెప్పడానికే దుర్వాసుడు తన తమోగుణాన్ని, చంద్రుడు తన రజోగుణాన్ని సత్వగుణ ప్రధానుడైన దత్తునికిచ్చి వెళ్ళిపోయారని పురాణాల్లో చెప్పటం జరిగింది. దత్తుడి యోగపరిణామక్రమంలోని రహస్యమిది. అత్రి అనసూయలు కలిసి యోగశక్తి ఎట్లా దత్తం చేసుకోవచ్చో నిరూపించారు. సచ్చిదానంద రూపమైన నిర్గుణ పరబ్రహ్మమును యోగేశ్వరేశ్వరుడైన సగుణ పరబ్రహ్మముగా, దత్తాత్రేయునిగా, ఈ లోకంలో అవతరింపజేశారు. ఆయనతో పాటే యోగశక్తి కూడా దిగివచ్చింది. కాబట్టే మనకీనాడు యోగ శక్తిని పొందే అవకాశం లభించింది. పుణ్యమూర్తులైన అత్రి అనసూయాదంపతులు ప్రజ్ఞామూర్తులై, సాధకుల హృదయములలో అత్రి అనసూయతత్వములను సాధించుకొనేందుకు దోహదం చేస్తుంటారు. దత్తయోగమును సిద్ధింపజేస్తారు. అందుకనే వారిరువురుని ధ్యానించిన తర్వాత దత్తమంత్ర జపం చేయ్యాలనే సాంప్రదాయముంది.

అనసూయాదేవి ధ్యానం:

అత్రి పత్నీం మహాలక్ష్మీం పాతివ్రత్య శిరోమణీం!
శ్రీ దత్తాత్రేయ జననీ మనసూయామహంభజే!!.

అత్రిధ్యానం:

దండకమండలు కరయుగళం మస్తక విద్యుద్విలసజ్జటిలం!
చంద్రమోదత్తదుర్వాసః పితరం వస్తుధ్యాయిన మత్రి మహమీడే!!

అవధూత చింతన శ్రీగురుదేవదత్త!

దత్తాత్రేయుడు - కాలము - ఖగోళసంబంధము

దత్తాత్రేయుడు ఏ బ్రహ్మకల్పంలో జన్మించారనేది స్పష్టముగా చెప్పబడలేదు. అత్రి మహర్షి కాలాన్ని బట్టి ఆయన పుత్రుడైన దత్తాత్రేయుడి కాలాన్ని నిర్ణయించ వలసివస్తుంది.

"కృతయుగే, మాధవ మాసి కృష్ణపక్షే, దశమ్యాం, ధిషణస్యవాసరే, పౌష్ణేచఋక్షే, ఝషే, ఝషాంకే, దత్తస్త్రిమూర్తిః స్వయమా విరాసీత్"

ఈ శ్లోకాన్ని పట్టిచూస్తే కృతయుగంలో ఒకానొక వైశాఖ బహుళదశమి గురువారంనాడు రేవతీ నక్షత్రయుక్త మీనలగ్న మీనాంశలో, త్రిమూర్త్యాత్మకుడైన దత్తాత్రేయుడు స్వయంగా అవతరించాడని తెలుస్తున్నది. ఈ కృతయుగం స్వాయం భువమన్వంతరంలోని కృతయుగంగా ఋక్షాద్రి పర్వతంపై తపస్సు చేస్తున్న అత్రి మహర్షి ముందు త్రిమూర్తులు ప్రత్యక్షమై త్రిమూర్త్యాత్మక స్వరూపంగా మారిపోయిన దత్తాత్రేయ మూలశక్తి ఆవిర్భావ కాలాన్ని తెలియజేస్తున్నది. దత్తాత్రేయుడి ఆవిర్భావం 170 కోట్ల సంవత్సరాల క్రితం జరిగిందని కొంతమంది పండితులు అంచనావేస్తున్నారు.

ఖగోళంలోని కొన్ని నక్షత్రమండలములను వివిధ దేవతా స్వరూపములుగా భావించి పూజించే విధానం ఋషులు ఏర్పాటు చేశారు. విశ్వకేంద్రం నుంచి విశ్వశక్తి ఈనక్షత్ర మండలముల ద్వారా భువిపైన మనం ఆరాధించే దేవతా స్వరూపముల ద్వారా లభ్యమవుతుంది. ఖగోళంలోని నక్షత్రమండలములలో జరిగే పరిణామముల ననుసరించే భువిపైన అవతార పురుషుల ఆవిర్భావం, ప్రపంచ స్థితి గతులు, జాతి యొక్క విజ్ఞాన వికాసములు ఆధారపడి ఉంటాయి. స్వాయంభువ మన్వంతరంలో ప్రథమ కృతయుగంలో ఖగోళంలోని ప్రజాపతి బ్రహ్మస్థానం (ఛారిటీర్ – ఈనక్షత్ర మండలమును"ఆరిగ" అని పిలుస్తారు), పాలపుంత క్రిందనున్న రుద్రస్థానం (ఓరియన్ అంటారు), పాలపుంతకు దగ్గరలో ఉన్న విష్ణుస్థానం, రాశి చక్రంలో అతి సన్నిహితంగా ఉన్నప్పుడు దత్తాత్రేయుని త్రిమూర్త్యాత్మక స్వరూపంగా ఏర్పడుతున్నది. దీనికి సరిగా 180 డిగ్రీల దూరంలో ధనుస్సురాశికి సమీపంగా శేషశాయిగా ఉన్నవిష్ణు స్వరూపం ఉంది. దాని వెనుక 30వేల కాంతి సంవత్సరాల దూరంలో విశ్వ కేంద్రం ఉంది. కనుక విశ్వకేంద్రం, విష్ణుస్థానం, త్రిమూర్తుల కలయికగా ఉన్న దత్తుడిస్థానం ఒకే సరళరేఖపై ఏర్పడి ఉన్నది. దత్తుడు జన్మించిన మార్గశిర మాసంలో పూర్ణిమనాడు మనం ఉన్న భూమి దత్తుడి స్థానానికి అతి దగ్గరగా మిధునరాశిలోను, ఆత్మకారకుడైన రవి ఎదురుగా ధనుస్సు రాశిలోను ఉండటం జరుగుతుంది. రవి ధనుస్సులోను, చంద్రుడు మిధునరాశిలోను ఉండటం

వలన ఆయన జన్మించిన సమయానికి మనంకూడా (భూమి) అదే సరళరేఖలో వచ్చి నిలుస్తున్నాం. అందువల్ల ఆ శక్తిని మనం పుష్కలంగా పొందేందుకు అవకాశం కలిగింది.

కాబట్టి దత్తాత్రేయుడు సృష్టి ఆరంభంలోనే అవతరించాడని తెలుస్తుంది. సృష్టి ఆరంభం నుండి మహాప్రళయం వరకు చతుర్యుగావతారంగా దత్తావతారం కొనసాగుతూ, జీవులకు జ్ఞానోపదేశం చేస్తూ ఉంటుందని, అనేకత్వంలో ఏకత్వాన్ని దర్శింపచేస్తూ, వసుధైక కుటుంబ స్థాపనకు సహకరిస్తూ, విశ్వసమైక్యతకు దోహదపడుతూ, కులమతాలకు అతీతంగా తేజరిల్లుతూ, విశ్వకళ్యాణమునకు పూలబాటలు పరవడమే ఆ అవతారధ్యేయమనీ మనకు బోధపడుతుంది.

అవధూత చింతన శ్రీగురుదేవదత్త!

వ్రాసి తెలుపుట కిది యేమి వార్త కాదు
చూసి వివరించుటొక్కటే ఒప్పు గొలుపు
వరుడు, వధువు ఇద్దరొక్కటై మురియుచుండ
తెల్లబోయిరి పెండ్లివారపుడూ
మరచిపోకుడు శివానందుని మంచిమాట

❋ ❋ ❋

తనకు త్రాగునీరు దాపరించదు గానీ
పంచిపెట్టగలడా ప్రజలకు పాలు
తను మనస్సు నిలుపలేదు కాని మనస్సు నిలుపు మనుచు
ఇతరులకేమి ఉపదేశమివ్వగలడు
మరచిపోకుడు శివానందుని మంచిమాట

దత్తాత్రేయుడు - నామౌచిత్యము

దత్తాత్రేయుడు అనే నామంలో తత్వపరమైన రహస్యార్థం ఉంది. దత్తుడంటే దత్తమైనవాడు. ఆత్రేయుడంటే అత్రియొక్క సంతానం అని అర్థం. శాండిల్యోపనిషత్తులో దత్తాత్రేయుడనే పేరులో గల తత్వజ్ఞాన రహస్యమును తెలుసుకొన్నవాడు సర్వము తెలిసిన బ్రహ్మ జ్ఞానియగుచున్నాడు అని చెప్పుచున్నది. శుద్ధ చైతన్యం నుండి (ప్రకృతి నుంచి) త్రిగుణాలు పుట్టి జగత్తు ఏర్పడింది కనుక జీవులందరకు త్రిగుణాత్మక ప్రవృత్తి ఉంటుంది. అయితే వీటిని గమనించి జీవుడు త్రిగుణాతీతుడైనప్పుడే జీవన్ముక్తుడౌతాడనేది దత్తాత్రేయతత్వ సాధనలో గల రహస్యం.

భగవద్గీతలోని గుణత్రయ విభాగయోగంలో శ్రీ కృష్ణుడు "సాధకుడు తాను ఆ త్రిగుణములకంటే భిన్నంగా ఉన్నానని ఎప్పుడు తెలుసుకొన గలుగుతాడో (అంటే త్రిగుణాతీతుడుగా, అత్రిగా) అప్పుడే ఎవ్వడైనా ముక్తుడు కాగలుగుతాడు" అని చెప్పాడు. స్థిత ప్రజ్ఞత్వం సాధకుడు సాధిస్తే తప్ప త్రిగుణాతీతుడు కాలేడు. స్థిర చిత్తంతో సుఖదుఃఖాలను, మానావమానాలను నిందాస్తుతులను, శత్రుమిత్రులను, ప్రియాప్రియములను సమానంగా భావించి, ఫలాపేక్ష రహితంగా కర్మాచరణ చేస్తూ, రాగద్వేషాలకు అతీతంగా, కేవలం సాక్షిగా ఉండడం స్థిత ప్రజ్ఞ అవుతుంది. ఏనాడో దత్తుడు అత్రి మహర్షి ద్వారా తెలియజేసిన మార్గమునే శ్రీ కృష్ణుడు మరల చెప్పాడు.

సత్వగుణ ప్రధానుడైన విష్ణు(దత్తుడు) స్థానం హృదయం. భగవంతుని యొక్క కళ్యాణ గుణములు కీర్తించడం, ప్రేమించడమనే భక్తిమార్గము ద్వారా సత్వగుణం వృద్ధి చెందుతుంది. ఇచ్ఛా శక్తి జాగృతమవుతుంది. విష్ణుగ్రంధి భేధనం జరుగుతుంది. రజోగుణం రాగాత్మకమైనది. కోరికలను రేకెత్తించి కర్మాసక్తి కలిగిస్తుంది. లోభత్వం కలిగిస్తుంది, మానసిక సంఘర్షణకు అశాంతికి గురిచేస్తుంది. సత్యాసత్య, నిత్యానిత్య, ధర్మాధర్మ వివేచన ద్వారా అంటే జ్ఞానమార్గము ద్వారా జ్ఞానశక్తి జాగృతమై రజోగుణం అదుపులోనికి వస్తుంది. మెదడు లేదా మనస్సు నందలి బ్రహ్మ గ్రంధి భేధనం జరుగుతుంది. తమో గుణం అజ్ఞానజనితం. అందుకని భ్రమ, మరుపు, నిద్ర, బుద్ధిమాంద్యము మొదలగు లక్షణాలు కలిగిస్తుంది. తన చుట్టూ ఉన్న రూపములందు దైవమును గుర్తిస్తూ నిష్కామభావంతో సేవించడం ద్వారా తమోగుణం స్వాధీనములోనికి వస్తుంది. క్రియాశక్తి జాగృతమవుతుంది. ఇది కర్మమార్గము. దీనివల్ల వెన్నుపాములోని రుద్రగ్రంధి భేదనం జరుగుతుంది. ఈ విధంగా తమోగుణం రజోగుణంలో, ఈ రెండూ కలసి సత్వగుణంలో లీనమవుతాయి. అది శుద్ధ సత్వంగా పరిణమిస్తుంది. సాధకుడు త్రిగుణాతీత స్థితికి (జ్ఞానాతీత లేదా వేదాతీత స్థితికి) చేరుకొని అవధూతగా మారిపోతాడు. అందుకే లోకంలో అవధూత స్థితికి అత్రిమహర్షి అనసూయాదేవి ఆద్యులు. సాధకుడు ఈస్థితికి చేరుకున్నప్పుడే

అత్రి అవుతాడు. అప్పుడు పరబ్రహ్మ శక్తి లేదా విశ్వశక్తి లేదా యోగ శక్తి సంపూర్ణంగా స్వంతమవుతుంది. అంటే ఆత్మ స్థితమౌతుంది. యోగశక్తి ఆత్రేయమౌతుంది.

ఈ విధంగా సాధకుడికి ముందు దత్తమైన త్రిమూర్త్యాత్మక శక్తి – ఆ తర్వాత అతని సాధానాబలం వల్ల త్రిగుణాతీత స్థితికి చేరుకొని, అతణ్ణి అత్రిగా మార్చి, యోగశక్తిగా మారి అతడికి పూర్తిగా వశమౌతుందన్న సాధనారహస్యమును వెల్లడించేటందుకే ఆ శక్తిని సాధకుడి యొక్క కుమారుడుగా చెప్పి "దత్తాత్రేయు" డని వ్యవహరించటం జరిగింది. ఇది లౌకిక స్థాయిలో అర్థమవ్వాలంటే – దత్తుడు దర్శనమిచ్చి నీకు దత్తమయ్యాను అని చెప్పడం నా ఆస్తి నీదే అని ప్రకటించడం. అత్రిగా మారి ఆ యోగశక్తిని స్వంతం చేసుకొని తన ఆత్మశక్తిగా మార్చుకోవడం దస్తావేజు వ్రాయించుకొని రిజిస్ట్రేషను చేయించుకోవడం లాంటిది. ఈ సాధనా మార్గమునకు ఆద్యుడు, మార్గదర్శి అత్రిమహర్షి. తన భక్తుడైన అత్రి పేరును అజరామరం చేయదలచి దత్తప్రభువు "దత్తాత్రేయుడు"గా ప్రసిద్ధి వహించాడు. అందుకనే ఆయన భక్త కీర్తి వివర్ధనుడుగా కీర్తింప బడుతున్నారు. సాధకులందరికి స్మరణమాత్రం చేతనే సులభ సాధ్యుడై, వాళ్ళకు దత్తుడై, ప్రజ్ఞా స్వరూపంగా వాళ్ళలో నెలకొని, వాళ్ళ నందరిని అత్రిగా మార్చి, వాళ్ళను తన విశ్వ గురుశక్తి కేంద్రాలుగా మార్చుకొని విశ్వకళ్యాణాన్ని సాధిస్తున్నాడు.

అవధూత చింతన శ్రీగురుదేవదత్త!

నేను దర్శించితినని చెప్పుటెట్లు
నాదువర్ణ నంబెవ్వడు నమ్మగలడూ
ఉన్న రీతిగా ఈశ్వరున్ని ఉండనిమ్ము
గానమొనరింతు వాని కళ్యాణగుణమ్ము
మరచిపోకుడు శివానందుని మంచిమాట

దత్తమంత్ర బీజము - విశిష్టత

దత్తమంత్రాలలో చాలా వాటికి శబర రూపియైన పరమేశ్వరుడు ఋషి. అంటే ఆ మంత్రములన్నీ పరమేశ్వరుడు చేత అందించబడినవి. జ్ఞాన స్వరూపంగా భావించ బడుతున్న పరమేశ్వరుడు, యోగేశ్వరుడు యోగ నాథుడైన దత్తాత్రేయుడి మంత్రము లన్నింటికి ఋషియై ఉండటం ఒక విశేషం.

దత్త మంత్రానికి బీజం "ద్రాం" అని చెప్పబడింది. "దక్షిణామూర్తి బీజంచ రామబీజేన సంయుతం, ద్రామిత్యే కాక్షరం జ్ఞేయం బిందునాద కళాత్మకం, ఏతద్బీజం మయాప్రోక్తం బ్రహ్మ విష్ణు శివాత్మకం, వేదవ్యాసేన కథితం ప్రకారాంతరముచ్యతే, దత్త స్యాది మంత్ర స్యాదాత్రేయ స్యాదిమస్వరః, తత్రస్థరేఫ సంయుక్తం బిందునాద కళాత్మకం, ఏతద్బీజం మయాప్రోక్తం బ్రహ్మ విష్ణు శివాత్మకం"

ఈ విధంగా పరమశివుడు పార్వతితో చెప్పినట్లు మంత్ర శాస్త్రంలో కలదు. దక్షిణామూర్తి శివ స్వరూపం. అంటే జ్ఞాన స్వరూపం. ఆ విధంగా దత్తాత్రేయుల వారు కూడా జ్ఞాన స్వరూపమే! దత్తాత్రేయులే మరో సగుణరూపం స్వీకరించి దక్షిణామూర్తియై సనక సనందనాదులకు గురుత్వం వహించాడు. వ్యాసమహర్షి అందించిన దత్తమంత్ర బీజం "ద" లేక "దా". ఇది ఐహిక సుఖాలను ప్రసాదిస్తుంది. పరమేశ్వరుడు అందించిన దత్త మంత్ర బీజం "ద్రాం" జన్మరాహిత్యమును ప్రసాదిస్తుంది. అగ్ని బీజమైన రకారం (జ్ఞానాన్ని), పాశ బీజమైన "ఆం" (అసాధ్యములను బంధించగలిగిన మహా శక్తిమంతమైన బీజం ఇది) అను రెండూ పరబ్రహ్మ బీజమైన "ద" కారంతో కలిసి ద్రాం బీజమై దత్తాత్రేయుడిలోని పరబ్రహ్మ తత్వాన్నీ, గురుతత్వాన్నీ వెల్లడిస్తున్నది.

బృహదారణ్యకోపనిషత్ లో ఒక కథ ఉంది. రాక్షసులు, మానవులు, దేవతలు ఒకసారి బ్రహ్మదేవుని దగ్గరకు వెడతారు. అక్కడ బ్రహ్మలోనుంచి "ద" అనే శబ్దం ఒక్కటే ఆయన సందేశంగా వెలువడింది. దాని అర్థం ఏమై ఉంటుందా అని అందరూ ఆలోచించారు. రాక్షసులు – తమలో దయాగుణం లేదని అది కలిగి ఉండమని చెప్పాడనుకున్నారు. మానవులు – తమలో దానగుణం (త్యాగం) లోపించుచున్నదని, అది కలిగి ఉండమని చెప్పాడనుకున్నారు. దేవతలు – తమలో "దమం" అంటే అంతరింద్రియ నిగ్రహం లోపించుచున్నది కనుక దానిని కలిగి ఉండమని చెప్పాడనుకున్నారు.

ఈ కాలంలో రాక్షసులు, దేవతలు అనేవాళ్ళు వేరే ఎక్కడో లేరు. మనిషి హృదయంలోనే అసురగుణాలు, దైవీగుణాల రూపంలో వాళ్ళున్నారు. రాక్షస గుణం తొలగించు కోవడానికి అనసూయత్వమును స్వీకరించి దయను పెంపొందించు కొని మానవుడుగా మారాలి. తర్వాత త్యాగ గుణం పెంపొందించుకొని మానవత్వమును సంపూర్ణంగా వికసింప చేసుకోవాలి. తర్వాత

అంతరింద్రియ నిగ్రహం పాటించి దివ్యత్వంలోకి ఎదగాలి. అప్పుడు స్థిత ప్రజ్ఞుడు అనిపించుకొంటాడు. ఆ మానసిక పరిణామంతో జ్ఞాన యోగంతో విశ్వశక్తిని (పరబ్రహ్మ శక్తి) పొందగలుగుతాడు. "దత్తోహం" (నేనే దత్తుడిని) గా మారిపోతాడు. "ద్రాం" బీజం సర్వమంత్రాలకే కాదు ఈ విశ్వమంతటికీ మహాప్రాణమై ఉంది. జగత్‌యొక్క ఉనికికి ఈ బీజమే కారణమౌతున్నది. విశ్వశక్తి యావత్తూ ఈ బీజంలోనే నిక్షిప్తమై ఉంది. "దత్తాత్రేయం బ్రహ్మరంధ్రస్థం" అని చెప్పటం చేత పరబ్రహ్మయైన దత్తుడి స్థానం సహస్రార చక్రం. అందుకే దాన్ని బ్రహ్మరంధ్రమని కూడా అన్నారు. సాధకులకు దత్తమయ్యే శక్తి పరబ్రహ్మ శక్తేనని తెలియుచున్నది. ధీ బలాన్ని (బుద్ధి బలాన్ని) ప్రసాదించటంలో గాయత్రి కన్నా శ్రేష్టమైనదిగా దత్తబీజం పరిగణించబడింది.

"ఓం దత్తాత్రేయాయ విద్మహే, గాయత్రీశాయ ధీమహి, తన్నో గురుః ప్రచోదయాత్". ఈ గురుగాయత్రీ మంత్రం ఈ సత్యమునే వెల్లడిస్తున్నది.

అవధూత చింతన శ్రీగురుదేవదత్త!

గ్రంథములు వ్రాయువాడు గ్రంథకర్త
వ్యవహారిక జీవన వ్యధితుడతడూ
అన్ని దిక్కుల ఆత్మయే అమరియుండ
ఆత్మదృష్టి లిఖియింప వాని అద్భుతరమే
మరచిపోకుడు శివానందుని మంచిమాట

మంచిదినములు ముందుగా మించిపోయె
గురునితో కలియక నీకు కుదరకుండా
చివర కిటులను తాపంబు చెందనేల
కొట్టుకొనిపోయె పంటను పిట్టలెపుడో
మరచిపోకుడు శివానందుని మంచిమాట

దత్తాత్రేయుని స్వరూప స్వభావములు

మాలా కమండలు రధః కరపద్మయుగ్మే
మధ్యస్థ పాణియుగళే దమరుత్రిశూలే
యస్యస్త ఊర్ధ్వ కరయోః శుభశంఖచక్రే
వందేత మత్రి వరదం భుజషట్కయుక్తం!!

దత్తాత్రేయుడు అనగానే మూడు ముఖములు, ఆరు చేతులు, వెనుక కామధేనువు, ఔదుంబర వృక్షం, ముందు నాలుగు కుక్కలు గల దేవతా స్వరూపం మన కళ్ళకు గోచరమవుతుంది. బ్రహ్మ విష్ణు మహేశ్వరులే మూడు శిరస్సులుగా, వారికి ఆధారమైన ప్రజ్ఞానమే దేహంగా, షట్‌శాస్త్రాలే హస్తములుగా, అవిద్యను దరిజేరనీయని వేదాలే కుక్కలుగా, ధర్మమే గోవుగా, విశ్వశాంతియే ఔదుంబరంగా, ఆత్మజ్ఞాన ప్రబోధార్థం యోగేశ్వరుడుగా ఆవిర్భవించిన మహాచైతన్యం యొక్క షోడశ కళాపూర్ణమైన వ్యక్త స్వరూపమే దత్త ప్రభువు. అత్రి మహర్షి తపస్సుకి మెచ్చి అత్రి వరదుడుగా దత్తాత్రేయుడు దర్శనమిచ్చిన రూపం ఇది అని, దత్తుని షోడశ అవతారములలో ఇది రెండవదిగా పేర్కొనడం జరిగింది.

అయితే పైరూపమేకాక దత్తుడిని ఏక ముఖుడుగా, చతుర్భుజుడుగా, "చతుర్బాహు ముదారాంగం" అని శాండిల్యోపనిషత్తు చెప్పింది. వివిధ దత్తమంత్ర ధ్యాన శ్లోకములలో "సాధకః ప్రాతరుత్థాయ కృత శౌచక్రియస్మరేత్, ఆత్రేయం, బ్రహ్మ రంధ్రస్థం ద్విభుజం గురురూపిణం" అనీ, "యోగారూఢం యోగపట్టేనవీతం హస్తద్వంద్వం జానుయుగ్మే ప్రసార్య" అనీ, అద్వైత మాలా మంత్రంలో "వరాభయ కరం దేవం సచ్చిదానంద విగ్రహం" అనీ, వజ్ర కవచంలో "వామహస్తేనవరదం దక్షిణేనాభయప్రదం". ఇలా చాలా చోట్ల దత్తుడికి ఒకే ముఖము రెండే చేతులున్నట్లు వెల్లడిస్తున్నవి. శ్రీ వాసుదేవానంద సరస్వతీ స్వామి వారు ఏకముఖం, వరదా, అభయ హస్తములతో సిద్ధాసనంలో కూర్చున్న దత్తమూర్తినే ఆరాధించే వారు. ఈ మూర్తి భేదాలను అధిగమించి దత్తుడు మనకు బోధించిన నిర్గుణ తత్వమును (యోగమును) పట్టుకుంటే అనూహ్యమైన శక్తి దత్త మౌతుందనే విషయాన్ని గ్రహించడం మంచిది.

ఆయన స్వభావం చెప్పాలంటే దత్తాత్రేయుడు స్మరణమాత్ర సంతుష్టుడు. స్మరించగానే కదిలివచ్చేటటు వంటివాడు. అందుకనే "స్మర్తృగామి" గా కీర్తించ బడుతున్నాడు. ఆ స్వామికి మంత్ర తంత్రములతో, నిష్ఠుర నియమాలతో పనిలేదు. ఆయనకు కావల్సింది తనను స్మరించుకోవడమే.

"దత్త దత్త ఇదం వాక్యం తారకం సర్వదేహినాం, శ్రద్ధాయుక్తోజపేన్నిత్యం దత్త ఇత్యక్షరద్వయం" అని "శ్రీ దత్తస్తవరాజం" లో మహాదేవుడు, శుక మహర్షికి చెప్పటం జరిగింది. "దత్త దత్త" అన్న నామస్మరణమే, ఆసంకీర్తనమే, ఆధ్యానమే పరమార్థాన్ని ప్రసాదిస్తుంది. ఒకసారి దళాదన మహర్షి "దత్తాత్రేయుడు స్మర్తృగామి" అనే విషయం ఎంత వరకు నిజమో పరీక్షించాలని దత్తాత్రేయుడిని స్మరించాడు. వెంటనే దత్త ప్రభువు ప్రత్యక్ష మయ్యాడు. అది చూచి ఆయన ఆశ్చర్యపోతుంటే

"మమ ప్రకృతిరీదృశీ, స్మర్తృగామీ న సందేహోద్వి సప్తభువనే
వ్యహం, అభక్త్యావా సుభక్త్యావా యత్స్మరేన్మామనన్యధీః
తదానీ మహమాగమ్య దదామి తదభీప్సితం"

నా స్వభావం నీవు అనుకుంటున్నదే. నేను స్మర్తృగామిననటంలో సందేహంలేదు. భక్తి ఉన్నా లేకపోయినా, అనన్య బుద్ధితో (నిశ్చల చిత్తంతో) ఎవరు నన్ను స్మరిస్తారో వాళ్ళ దగ్గరకు నేను పోయి వాళ్ళ కోరికలు తీరుస్తాను. నా రాక వృథాకారాదు" అని ఆమహర్షికి వజ్ర కవచమును ఉపదేశించాడు.

ఆయన స్వభావంలో ఇంకో లక్షణం – ఆయన తన భక్తులకు దత్తమౌతాడు. వాళ్ళ స్వాధీనంలో తానుంటాడు. వాళ్ళకు కుమారుడిలా సేవజేస్తాడు. వాళ్ళ కీర్తిని ప్రవర్ధమానం చేస్తాడు. తన మహిమలను చూపటం కంటె, తన భక్తుని మహిమలను అతిశయించేటట్లు చేస్తాడు. వాళ్ళ కీర్తిని విస్తరింప జెయ్యాలని కాంక్షిస్తాడు. అందుకనే "భక్త కీర్తి వివర్ధనుడు"గా ప్రసిద్ధి చెందాడు.

ఆయన స్వభావంలో మరో లక్షణం ఆయన "భుక్తి ముక్తి ప్రదాత". తన భక్తులకు ఇహ సౌఖ్య సమృద్ధి కలిగిస్తాడు. వాళ్ళ హృదయములలో ప్రజ్ఞా స్వరూపంగా ప్రకాశిస్తూ భక్తిని పరిపాకానికి తీసుకొని వచ్చి జ్ఞానాన్ని ప్రసాదించి సగుణం నుంచి నిర్గుణంలోకి మళ్ళించి యోగ సిద్ధిని ప్రసాదించి జీవన్ముక్తులను గావిస్తాడు.

దత్తాత్రేయుడు ఒకసారి బాలుడుగా, ఒకసారి కుమారుడుగా, ఒకప్పుడు యువకుడుగా, ఒకసారి వృద్ధుడుగా ఉంటాడు. ఒకసారి అవధూతగా ఉంటాడు. మరొకసారి ఉన్మత్తుడుగా, పిశాచవిష్టుడుగా ఉంటాడు. ఒకసారి పరమ నిష్ఠా గరిష్టుడైన యతీశ్వరుడుగా ఉంటాడు. ఒకసారి తలపై జడలుంటాయి. ఇంకోసారి సిగలుంటాయి. ఒకప్పుడు చేతిలో మద్యం పాత్ర ధరించి, దివ్యాంగనాలింగితుడై, మదవిహ్వలాక్షుడై ఉంటాడు. ఒకోసారి బంగారుమేని ఛాయతో చిత్ర విచిత్ర మాల్యాంబరములతో శోభిల్లుతూ ఉంటాడు. ఒకోసారి కల్లుత్రాగుతూ, శరీరం నిండా బూడిద పూసుకొని దిగంబరుడుగా ఉంటాడు.

బ్రహ్మాండ పురాణంలో దత్తాత్రేయస్వామి కొలువు తీరిన వైభవం మనోహరంగా వర్ణించబడింది.

మందార వృక్షం, దాని క్రింద మణి పీఠం, దానిపై ఆసీనుడైన దత్త స్వామి. ఆయన జడలలో మల్లెలు, మొల్లలు, జాజులు మొదలైన నానావిధ పరిమళ సంభరితపుష్పాలు, మెడలో మణిహారాలు, ఫణిహారాలు, రుద్రాక్ష స్ఫటిక మాలలు-మొలలో బంగారు మొలత్రాడు వామాంకమున యోగలక్ష్మియైన అనఘాదేవి (మధుమతి), వెనుక కామధేనువు, నాలుగు వైపుల శ్వానరూపాలలో చతుర్వేదాలు ఉంటాయి. స్వామి వారిని సనకసనందనాది సాధు సత్తములు, యోగులు, మహర్షులు, నవనాధులు, సిద్ధులు మొదలైన వాళ్ళంతా పరివేష్టించి ఉంటారు. పరాశక్తి, వాగేశ్వరి, కామేశ్వరి, భువనేశ్వరి, శ్రీదేవి, భూతజాలము అష్టసిద్ధులు, ఐశ్వర్యములు, దేవతలు దానవులు ఆయన ముందు చేతులు జోడించి నమస్కరిస్తుంటారు. భక్తవరదుడైన దత్తస్వామి వారికోర్కెలను అనుగ్రహిస్తుంటారు. అత్రి మహర్షి, అనసూయాదేవి ఒక ప్రక్కన, చంద్రుడు దుర్వాసుడు మరో ప్రక్కన కూర్చుని దత్త వైభవాన్ని వీక్షిస్తూ ఉంటారు. గంధర్వులు గానం చేస్తుంటే, అప్సరసలు నాట్యం చేస్తుంటారు. ఇలా నైమిశారణ్యంలో దత్తాత్రేయుల వారు రంగ రంగ వైభవంగా కొలువుతీరి ఉంటారని బ్రహ్మాండ పురాణంలో వర్ణించబడింది. ఈ వర్ణన దత్తాత్రేయుల వారి పరబ్రహ్మ తత్వాన్ని, గురు స్వరూపాన్ని, విశ్వరూపాన్నీ వెల్లడిస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే దత్తత్రేయులవారు సర్వజగన్మోహనుడు. ఆయన స్వరూప స్వభావములు వర్ణించాలంటే మాటలు చాలవు. "ఓంకార ప్రత్యగాత్మానం పరబ్రహ్మ స్వరూపిణం పరమాత్మన మవ్యక్తం" అని హృదయ పూర్వకంగా భక్తి ప్రవత్తులతో నమస్కారం చేయడమే మనకర్తవ్యం.

ప్రతి రోజు దత్తస్వామి ఆసేతు హిమాచలం సంచరిస్తుంటాడు. పురాణములు ఆవిషయం ఈ విధంగా వర్ణించాయి. దత్తాత్రేయుడు సహ్యాద్రిపై నివాసముంటాడు. రాత్రి సమయంలో మాహుర్‌గడ్‌లో (మాతాపురం) శయనిస్తాడు. ఉదయ స్నానం కాశీలోని గంగానదిలో చేసి, గాణుగాపురంలో ధ్యానం చేసి, కురుక్షేత్రంలో ఆచమనం చేసి, గాణుగాపురంలో మాధ్యాహ్నికం నెరపి, ధూతపాపేశ్వరంలో భస్మధారణకావించి, కర్ణాటకంలో సంధ్యావందనం చేసి, కొల్హాపురంలో (కరవీరపురం) భిక్షచేసి, పండరీపురంలో తిలక ధారణచేసి, పాంచాలేశ్వర్‌లో గ్రహించిన భిక్షభుజించి, తుంగభద్రలో జలపానంచేసి, బదరీ నారాయణంలో శ్రవణం జరిపి, గిర్నార్‌లో విశ్రాంతిగైకొని, సాయం సంధ్యా వందనం పశ్చిమ సముద్ర తీరంలో నిర్వహిస్తాడు. అంటే దత్తపాదస్పర్శతో పునీతంకాని ప్రదేశం భారతదేశంలో లేదు. యోగ్యులైన సాధకులకు ఆయన నిత్యం దర్శనమిస్తూ, అనుగ్రహిస్తూ ఉంటాడు. దత్తుడివల్లనే భారతదేశం యోగ భూమిగా ప్రసిద్ధికెక్కింది.

దత్తాత్రేయుడు - పంచమాశ్రమం

చతుర్విధపురుషార్థ సాధనకోసం, మానవ జీవితంలో బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్యాసాశ్రమము అనే చతుర్విధ ఆశ్రమములు నెలకొల్పబడినవి. దత్తాత్రేయుల వారు బ్రహ్మచారి అని చెప్పబడినా ఆయన ఈ నాలుగు ఆశ్రమములకు అతీతంగా ఉండి 'అత్యాశ్రమి' అని పేరు పొందాడు. ఆయన్ను బ్రహ్మచారి అని అన్నప్పటికి అందులో ప్రధాన ఉద్దేశం ఆయన సగుణ స్వరూపంలో ఉన్న పరబ్రహ్మ అయినా సదానిర్గుణ పరబ్రహ్మతత్వములో రమించే (చరించే) వాడు అన్నదే అందులో రహస్యం. ఒకసారి దత్తాత్రేయుడి వేషం చూచి పింగళి నాగుడు ఆశ్చర్యపడి "మీదే ఆశ్రమం"? అని ప్రశ్నిస్తే దత్తస్వామి ఇచ్చిన సమాధానంలో ఆయన యోగపద్ధతి ఆయన ధ్యేయం మనకు బోధపడుతుంది. "ఈ నా ఆశ్రమము గురించి ఇంతకు ముందెప్పుడు ఎవరూ కని విని ఎరుగరు. చతుర్విధ ఆశ్రమముల కంటె నా ఆశ్రమం భిన్నమైనది. ఈ ఆశ్రమంలోని వాళ్ళంతా జగత్తును తన ఆత్మగా సందర్శిస్తుంటారు. త్రిగుణా తీతులై, నిస్సంగులై ఉంటారు. వాళ్ళకు వేదాలతో, మంత్రాలతో, తంత్రాలతో, పూజలతో, జపాలతో, తపాలతో పనిలేదు. సదాపరతత్వ వశులై ఉంటారు." దత్తాత్రేయుడు చెప్పిన ఈ పంచమాశ్రమం అవధూతాశ్రమం. దత్త సంప్రదాయంలోని వాళ్ళంతా "దత్తోహం" అని నిరంతరం ధ్యానిస్తూ తామే అవధూతగా (దత్త స్వరూపంగా) మారిపోతారు. అవధూతగీత లో "అవధూత" అన్న పదములోని నాలుగు అక్షరములకు గల అర్థాలను ఇట్లా వివరించింది.

ఆశాపాశ వినిర్ముక్తో ఆదిమధ్యాంత నిర్మలః
ఆనందేవర్తతే నిత్యం "అ" కారస్తస్య లక్షణమ్॥

వాసనా వర్జితయేన వ్యక్తంచ నిరామయః
వర్తమానేషు వర్తతే "వ" కారస్తస్యలక్షణమ్॥

ధూళీ ధూసర గాత్రాణి ధూత చిత్తో నిరామయః
ధారణధ్యాన నిర్ముక్తో "ధూ" కారస్తస్య లక్షణమ్॥

తత్వచింతా ధృతాయేన చింతా చేష్టావివర్జితః
తమోహంకార నిర్ముక్తః "త" కారస్తస్య లక్షణమ్॥

అవధూత పదంలోని "అ" అనే దానికి ఆశాపాశముల నుండి విముక్తి పొందినవాడు, ఆదిమధ్యాంతములందు నిర్మలుడు, ఆనందాన్ని నిరంతరం పొందేవాడు అని. "వ" అనేదానికి వాసనల

నుండి (పూర్వ కర్మ వాసనలనుండి) విడివడిన వాడు. నిరామయమైన బ్రహ్మగా పేర్కొనదగిన వాడు, వర్తమానంలోనే (భూత భవిష్యత్ ఆలోచన లేక) ఉండేవాడని. "ధు" అనే దానికి ధూళితో కూడిన శరీరం గలవాడు, మనస్సును స్వాధీనం చేసుకొన్నవాడు. దోష రహితుడు, ధ్యాన ధారణలు లేనివాడు అని, "త" అనే దానికి తత్త్వ చింతనకలిగినవాడు. తమో గుణమును, అహంకారమును విడిచినవాడు అని అర్థము.

శ్రుతి స్మృతులు బోధించే విషయాలన్నిటియందు పరిపూర్ణ జ్ఞానముగలవాడై, పరబ్రహ్మయందే మనస్సు లగ్నము చేసినవాడై, జీవన్ముక్తుడైన మహాజ్ఞానినే, "అవధూత" అని నిరాలంబోపనిషత్తు చెప్పింది. దిగంబరుడు, మహాజ్ఞాన స్వరూపుడైన అవధూతే దత్తప్రభువు.

అవధూత చింతన శ్రీగురుదేవదత్త!

చెప్పు మాత్మానుభూతి విశేషమంచు
ప్రశ్నవేసిన నేనేమి చెప్పగలను
తీపితిన్న మూగను రుచి తెల్పమంటూ
ప్రశ్నవేసిన వాడేమి బదులు పల్కు
మరచిపోకుడు శివానందుని మంచిమాట

తెలిసికొన్నది బుద్ధికి తెచ్చుకొనక
బుద్ధి కలిగియు ఆచార శుద్ధిలేక
అంధుడగువాడు వేరొక్క అంధునికిని
మార్గమెట్టుల చూప సమర్థుడగునూ
మరచిపోకుడు శివానందుని మంచిమాట

దత్తాత్రేయుణ్ణే ఎందుకు ఆరాధించాలి ?

ధర్మార్థకామమోక్షములనే చతుర్విధపురుషార్థముల సాధనే జీవిత లక్ష్యమని పెద్దలు చెప్పారు. లోకంలో నాలుగు రకాల జీవులుంటారు. వారు ఆర్తులు, అర్థార్థులు, జిజ్ఞాసువులు (ముముక్షువులు) జ్ఞానులు (ముక్తులు). అర్థకామముల ప్రాప్తికోసం దైవాన్ని ఆశ్రయించే ఆర్తులు, అర్థార్థులు, ఏదేవిదేవతా రూపమును ఆశ్రయించినా తప్పులేదు. భగవంతుడు కరుణామయుడు కనుక చాలా సందర్భములలో వారి కష్టములు తొలగించి కోరికలు తీరుస్తూనే ఉన్నాడు. అయితే అవి తీరగానే కోరికలపట్టిక మరొకటి సిద్ధంగా ఉంటున్నది. సత్యము, జ్ఞానము అనంతముయైన పరబ్రహ్మ గురించి మాత్రమే వేదములు ఘోషిస్తుంటే, ఆ తర్వాత కాలంలో వచ్చిన ఆగమాలు పురాణేతిహాసములు త్రిమూర్తుల గురించి, అనేక దేవీదేవతామూర్తుల గురించి అవతార పురుషుల గురించి వెల్లడించాయి. అనేక ఆరాధనాపద్ధతులు, ఉపాసనామార్గములు లోకంలో వెలిసాయి. వివిధ దేవతామందిరములు నిర్మించేవారు, నిర్వహించేవారు, అందలి అర్చకులు "మా దేవుడు గొప్పంటే మా దేవుడు గొప్ప. మా దేవుడు దగ్గర మ్రొక్కుకుంటే ఏ కోరికయైనా తీరుతుంది" అంటూ పోటీలు, కీచులాటలవల్ల ఆస్తికుల మధ్య అనైక్యత ప్రబలిపోయింది. ధర్మము, జ్ఞానము మోక్షము కొరకు ప్రయత్నం చేసే ముముక్షువులు తక్కువైపోయారు. జిజ్ఞాసువులు లేదా ముముక్షువులు కానివాళ్ళకు దైవంకాని, ఏ గురువుకాని చెయ్యగలిగింది ఏమీలేదు. కర్మ, భక్తి, జ్ఞాన, సమ్మిళితమైన యోగసిద్ధిని పొందగోరే జిజ్ఞాసువు లందరూ దత్తాత్రేయుడిని ఆశ్రయించి ఆరాధించవలసినదే! ఏ మహాశక్తి లేదా పరబ్రహ్మశక్తి లోకంలోని అజ్ఞానాన్ని రూపుమాపి, గురుస్వరూపమై జ్ఞానప్రభలను విరజిమ్ముతున్నదో, ఏ మహాశక్తి సాధకులకు ప్రజ్ఞాస్వరూపంగా తనకు తాను దత్తమై, ఉన్నత శిఖరములను అధిరోహింప జెయ్యటానికి ఈలోకంలో అవతరించిందో, ఎవరు యోగస్వరూపులో, ఎవరు చిచ్ఛక్తి స్వరూపులో, ఎవరు సర్వమంత్రాత్మకులో, ఎవరు సర్వ దేవమయులో, ఎవరు సాక్షాత్తు పరబ్రహ్మస్వరూపులో, ఎవరు భుక్తి ముక్తి ప్రదాతలో, ఆ సకల స్వరూపుడు దత్తాత్రేయస్వామి. ఆయన తత్త్వమును గ్రహించకుండా, ఏదో విష్ణ్వంశతో జన్మించిన సామాన్య అవతారమని, ఒక యోగి అని భావించినచో ఆయన ఇవ్వదలచిన అమూల్యమైన జ్ఞానసంపదకు మోకాలడ్డుపెట్టినట్లే అవుతుంది.

ఒక్కో దేవతకు ఆయా లక్షణాలను బట్టి పూజలు, అర్చనలు, అభిషేకములు, స్తోత్రములు ఏర్పాటుచేశారు. కాని దత్తాత్రేయులవారి విషయానికి వస్తే ఆయన అల్ప సంతోషి "దత్తాదత్తా" అని ఆయనను స్మరిస్తేనే చాలు, మన ముందువచ్చి నిలిచే కరుణావలయుడు. ఇతర దేవీ దేవోపాసనల్లో

లాగా, నియమ బాహుళ్యాలు పాటించవలసిన అవసరం లేదు. అన్ని కులాల వాళ్ళు, అన్ని మతాల వాళ్ళు, స్త్రీలు, ఉపనయన సంస్కారము లేని వాళ్ళు, ఆబాలగోపాలం నిరభ్యంతరంగా దత్తోపాసన చేయవచ్చు. జన్మతః ఏకులం ముద్రవేయబడినా, దత్తోపాసన సర్వులకూ బ్రహ్మజ్ఞానాన్ని కలిగించి బ్రహ్మవేత్తలుగా మారుస్తుంది. దత్తోపాసన అన్ని ఉపాసనలకంటె తేలికైనది. శీఘ్ర ఫలితాన్ని ప్రసాదించేది అయి ఉన్నది. ఒక పూజ చేస్తే ఆ పూజ ఆ దేవతకే చెందుతుంది. ఆ దేవతే కరుణించి వరాలను ప్రసాదిస్తుంది. దత్తాత్రేయుడు సర్వదేవతాస్వరూపుడు. కనుక ఆయనను పూజిస్తే అందరు దేవతలను పూజించిన ఫలితం వస్తుంది. దేవతలంతా పరోక్షపరబ్రహ్మ స్వరూపాలైతే దత్తాత్రేయుడు ప్రత్యక్ష పరబ్రహ్మస్వరూపము. ఆ పరబ్రహ్మ జగత్తుగా మారకముందు అంటే "నేననేకమౌదునుగాక!" అనే మహాసంకల్పం చేయకముందు త్రిమూర్తుల తత్వములన్నీ ఏకతత్వముగా ఉన్నప్పటి పరబ్రహ్మమూర్తే దత్తమూర్తి.

దత్తావతారంలోని మరో విశిష్ట లక్షణమేమిటంటే ఆయన గురుదేవుడు కావటం. ఏ అవతారపురుషుడికి "గురుదేవ" అన్న విశేషణం లేదు.

ఆ పరబ్రహ్మ కంటె పెద్దది, అధికమైనది మరేది లేదు. అందుకే అది గురువైంది. ఆ పరబ్రహ్మమే దత్తుడు కనుక దత్తుడే గురువు. "గు" శబ్దస్త్వంధకారస్స్యాత్ "రు" కారస్తన్నిరోధకః అంధకారనిరోధత్వాత్ గురురిత్యభిధీయతే" అనేది గురుశబ్దానికి అర్థం. అత్రి మహర్షి అజ్ఞానమును తొలగించడంతో దత్తప్రభువు తన గురుత్వానికి శ్రీకారం చుట్టాడు. ఆవిధంగా గురుపదానికి ఆద్యుడు, గురుపరంపరకు మూలపురుషుడయ్యాడు.

జీవుడి ఆత్మచుట్టూ మూడు పొరలుంటాయి. వాటినే స్థూల, సూక్ష్మ, కారణ దేహాలని అంటారు. స్థూలదేహం ధాతునిర్మితమైనది. ఇది పంచభూతాత్మకం. పైకి కనిపిస్తుంది. రెండవది సూక్ష్మదేహం. ఇది 19 రకాల సూక్ష్మశక్తుల కలయికతో ఏర్పడి, స్థూల దేహమును ఆశ్రయించి ఉంటుంది. మూడవది కారణదేహం. నిజానికి ఇది దేహం కాదు. ఇది సూక్ష్మాతిసూక్ష్మమైన శక్తి. ఇది జీవిపుట్టుకకు, స్థూల సూక్ష్మదేహాలకు కారణం మాత్రమే. జీవికి త్రిగుణములతో కూడిన అహంకారం ఉంటుంది. సాత్విక అహంకారం నుండి మనస్సు, బుద్ధి, చిత్తము అహంకారమనే నాలుగు అంతః కరణములేర్పడినాయి. తామసిక అహంకారం నుండి పంచభూతములు, శబ్ద, స్పర్శ, రూప, రస, గంధము లనే పంచతన్మాత్రలు ఏర్పడినవి. రాజసిక అహంకారం నుండి పంచజ్ఞానేంద్రియములు, పంచకర్మేంద్రియములను పనిచేయించే పది శక్తులేర్పడినవి. ఈ మొత్తం కలసి 24 అంశాలు. ఇవి

శరీరములోపల, బాహ్యప్రకృతిలోను అంటే సృష్టి అంతా వీటితో కూడి ఉంది. ఈ 24 అంశములలోను పరమాత్మ అవ్యక్తంగా ఉంటాడు. ఇలా ప్రకృతిలోని 24 తత్వముల నుంచి అవ్యక్తపరమాత్మను సాధించటమే యోగం. దత్తుడు తనకు 24 మంది గురువులున్నారని వారినుంచి జ్ఞానము పొందానని చెప్పింది ఈ యోగమార్గము గురించే. ప్రకృతిలో దేనిని మనం నిరాకరించరాదు. ప్రతి అంశములో అంతర్లీనంగా అంతర్యామిత్వం చెంది ఉన్న అవ్యక్తపరమాత్మను సమదృష్టితో గుర్తించాలి. (సమత్వం యోగముచ్యతే). ప్రకృతిలోని ప్రతి అంశమునకు మనలో ప్రతికూల ప్రతిస్పందన ఉన్నట్లైతే అది గమనించి వదిలించుకోవాలి. అప్పుడు అవ్యక్తపరమాత్మ యొక్క యోగమాయా శక్తిధారణ చేయగలుగుతాడు. అప్పుడు ప్రపంచంలో ఉంటూ కూడా నిష్ప్రపంచుడుగా, నిర్లిప్తుడుగా, జీవన్ముక్తుడుగా బ్రహ్మానందంలో తేలియాడుతూ ఉంటాడు. ఇదే పరిపూర్ణమైన అవధూతస్థితి. ఇదే దత్తుడు బోధించే యోగమార్గం.

అవధూత చింతన శ్రీగురుదేవదత్త!

బద్ధ శిష్యుడు సంసారబద్ధుడైన
గురువునాశ్రయించి ముక్తి పొందబోడు
బంధరహితుడౌ సద్గురుని బడసినంతనే
పొందగలవు నీవు సంసార విముక్తి
మరచిపోకుడు శివానందుని మంచిమాట

దత్త సంప్రదాయము - ఆత్మధ్యానము

దత్తసంప్రదాయములో మనం త్రిగుణాత్మకమైన శరీరధారులం కనుక దత్తుని యొక్క సగుణోపాసనతోనే ప్రారంభించాలి. దత్తుని యొక్క అనంత కళ్యాణ గుణవైభవమును స్మరిస్తూ, కీర్తిస్తూ ఆయనపట్ల నిర్మలమైన భక్తి (ప్రేమ)ని, శరణాగతి భావమును పెంపొందించుకోవాలి. తగుమాత్రంగా పూజ, అర్చన, స్తోత్రపఠనము చేసుకోవాలి. సత్వగుణము, దైవీగుణములు పెంపొందించుకుంటూ ఈశ్వరార్పణ బుద్ధితో విహితకర్మలు చేస్తూ ఉండాలి. క్రమంగా అంతరంగసాధనలోనికి, నిర్గుణోపాసనలోకి ప్రవేశించాలి. దత్తుని యోగమునకు ఆత్మసాక్షాత్కరమే లక్ష్యం. ఆత్మ సాక్షాత్కారమునకు ఆత్మజ్ఞానము కావాలి. ఆత్మజ్ఞానానికి ధ్యానమవసరం. ధ్యానమంటే ఆత్మస్వరూపచింతనమే అని శంకర భగవత్పాదులు సెలవిచ్చారు. ధ్యానమునకు ముందు కొంతసేపు సులభమైన ప్రాణాయామం చెయ్యాలి. ఇది చక్కగా రక్తప్రసరణ జరిగి మనోనిశ్చలతకు దోహదం చేస్తుంది. ధ్యానం చేస్తున్న సమయంలో "నేనెవరు?" అనే ఆత్మచింతన చెయ్యాలి. అప్పుడు అలర్కుడి మాదిరిగా "నేను మనస్సును కాను. బుద్ధిని కాను. అహంకారాన్ని కాదు. శరీరాన్ని కాదు. వీటి అన్నిటికంటే విలక్షణమైన వాడను. నాకు ఇంతదగ్గరగా ఉన్న ఈ దేహమే నేను కానప్పుడు మరి నేనెవరు? నేను ఆత్మను. నేను చైతన్యాన్ని. అలాగే అన్ని జీవుల్లో ఉన్న ఆత్మను నేనే! అన్ని జీవులూ నేనే! నేను కానిది ఈలోకంలో ఏదీలేదు. సర్వగతమైన చైతన్యాన్నే నేను. నేనే సచ్చిదానందపరమాత్మను" అనే మానసిక పరిణామం ధ్యానంలో కలుగుతుంది. ఈభావం స్థిరంగా నిలవడానికి నిరంతర ధ్యానం అవసరం. అఖండ ధ్యానం అవసరం. ఈ భావం కళ్ళు మూసుకొని కదలకుండా కూర్చున్నప్పుడు మాత్రమే నిలిస్తే సరిపోదు. ఈ సర్వాత్మభావన మెలకువలో కూడా, ఏ కర్మ ఆచరిస్తున్నా కూడా, అంతరంగంలో నిలుపుకోవాలి. అందుకు అత్రి తత్త్వం, అనసూయతత్త్వం స్వంత చేసుకోవాలి. అంటే రాగద్వేషాలు, అహంకారమమకారాలు, కర్తృత్వ, భోక్తృత్వ భావములేని కర్మాచరణము అలవర్చుకోవాలి. ఈ సాధనజీవితంలో ఒక భాగంగా కాక జీవితమంతటిని ఈ సాధనగా మలుచుకోవాలి. "అహంబ్రహ్మాస్మి" లేక "దత్తోఽహం" అనే భావం సుస్థిరపరుచుకోవాలి. ఈ సాధన చేస్తుంటే ఏ క్షణంలోనైనా దత్తానుగ్రహంతో ధ్యానసిద్ధి లభిస్తుంది.

లోకంలో అన్ని ఆధ్యాత్మిక సాధనా సంప్రదాయములు దత్తుడిని ఆధారంగా చేసుకొని ప్రవర్తిల్లుచున్నవే కాని, దత్తుడు నిర్దేశించిన ప్రత్యేక సంప్రదాయమంటూ ఏదీ లేదు. ఏ సాధనామార్గమునైనా యోగముగా మలచి యోగసిద్ధిని ప్రసాదించేవాడు దత్తస్వామి. దత్తోపాసన నాథ, మహానుభావ, వార్కరి, సమర్థ, అతీత, ఆనంద, భైరవ, అఖాడ సంప్రదాయములలో నెలకొని

ఉన్నది. అన్యమతస్థులైన శిక్కులు, క్రైస్తవులు, ముస్లిములు కూడా దత్తాత్రేయులవారిని ఆరాధించటం మనకు కనపడుతుంది. కర్ణాటకలోని బాబా బుడంగిరి మొదలగు కొన్ని దత్త మందిరములలో ముస్లిమ్ భక్తులే పూజారులుగా ఉంటారు.

"సమస్త ధర్మములయందు, మతములందు, సిద్ధాంతములందు, స్వప్రకాశముతో వెలుగొందువాడను నేనే! ఆయా జీవుల అభీష్టములను బట్టి, అభిరుచులను బట్టి, వారనుసరించుమార్గములనుబట్టి, ఆయా స్థితులనుబట్టి, భిన్న భిన్న తత్త్వములతో తోచువాడను నేనే! నేను సర్వతంత్ర స్వతంత్రుడను గనుక, సాధ్యాసాధ్యములు లేని వాడను గనుక, నాకు నిర్దిష్టమైన విధానమనునది లేదు. సమస్త దేవీ దేవతా రూపములలో అంతర్నిహితముగా, జాజ్జ్వల్యమానముగా ప్రకాశించువాడను నేనే! కనుక ఆయా స్వరూపముల ద్వారా పూజలను స్తోత్రములను అందుకొనువాడను నేనే! అందరిని అనుగ్రహించువాడను నేనే!" అని దత్త ప్రభువు తన తత్త్వమును "శ్రీపాదవల్లభ చరితామృతం" లో మరొకసారి స్పష్టపరిచియున్నారు. దత్త భక్తుడు ఇది గ్రహించి దత్త స్మరణము చేసుకొన్నచో జన్మధన్యమే కదా!

అవధూత చింతన శ్రీగురుదేవదత్త!

దేహమును నేను ప్రమిదగా తీర్చినాను
అందులో జీవుని వత్తిగా పొందుపరచి
రక్తమునే తైలముగా ధారపోయుచుంటి
ప్రియుని దర్శించువేళకై వేచియుంటి
మరచిపోకుడు శివానందుని మంచిమాట

దత్తావతార వైభవము

ఏ మహాసంకల్పమునననుసరించి సృష్టి, స్థితి, లయములు జరుగుచున్నవో ఆ మహాసంకల్ప స్వరూపమే దత్తాత్రేయుడు. అనేకత్వంతో కూడిన ఈ చరాచర సృష్టి కంతటికి ఆధారంగా ఆ మహాసంకల్పమునననుసరించి ఒకే పరబ్రహ్మ చైతన్యం అవ్యక్తంగా, జీవులకు లోపల వెలుపలా సర్వత్రా వ్యాపించి ఉంది. సత్, చిత్, ఆనందములు ఆ పరబ్రహ్మ చైతన్యం యొక్క సహజ స్వభావం. జీవులందరూ సర్వగతమైన చైతన్యమును గుర్తించి పరస్పరము ప్రేమానురాగములు పంచుకుంటూ, సహాయ సహకారములు అందించుకుంటూ విశ్వప్రేమను అలవర్చుకొని, విశ్వకుటుంబ భావంతో శాంతియుత సహజీవనం సాగించి, సచ్చిదానంద స్వరూపులై, జీవన్ముక్తులై విశ్వకళ్యాణాన్ని సాధించాలి. ఇదే సనాతన ధర్మ సూత్రం. ఇదే జీవులందరి ఆత్మ ధర్మం లేక స్వధర్మం. దీనిని ఆచరిస్తూ జీవించడమే జీవులందరి కర్తవ్యము, లక్ష్యము. ఈలక్ష్యసాధనలోనే సృష్టి వికాశం ఇమిడి ఉంది. దీని కొఱకే అత్రి మహర్షి, అనసూయాదేవి దంపతులు ఆ మహాసంకల్పరూపమైన నిరాకార, నిర్గుణ, అవ్యక్త పరబ్రహ్మమును భువిపైకి సాకారముగా దత్తాత్రేయ రూపంలో దిగివచ్చేటట్లు చేశారు. జీవులు పైన చెప్పిన లక్ష్యసాధనకోసం తనను తాను దత్తం చేసుకొన్న విశిష్టమైన అవతారం దత్తాత్రేయుడు.

కాలక్రమేణ కలిప్రభావంతో సనాతన ధర్మజ్ఞానము విస్మరించి అసూయ, ద్వేషము, కామక్రోదాధి అరిషడ్వర్గములకు, స్వార్ధ, సంకుచిత, అహంకార మమకారాదులకు వశులై సృష్టి వినాశము దిశగా మానవజాతి సాగిపోతున్న వేళ మనపై కరుణతో, ప్రేమతో దత్తాత్రేయుల వారు ఆవిర్భవించి ఆదిగురువై నిలిచారు. అయితే కొన్ని సహస్రాబ్దములుగా కర్మభ్రష్టులు, ధర్మభ్రష్టులు, పరమార్ధ భ్రష్టులైన మానవులను సంస్కరించేందుకు సహస్ర ముఖములతో కొన్ని శతాబ్దముల కృషి అవసరం అని గుర్తించిన దత్తస్వామి అనేక అవతార మూర్తులు, అవధూతలు, సంత్‌లు, యోగుల రూపములలో ఒక దివ్య ప్రణాళికకననుసరించి అవతారకార్యం ప్రారంభించారు. దత్తస్వామి వటవృక్షమైతే వీరందరూ దాని కొమ్మలు, ఊడలు వంటివారు. వీరిలో కొందరు ఊడలవలె భూమిలో దృఢంగా నాటుకుని మూల వృక్షంతో సమానముగా నిలిచి భక్తుల భవతాపాన్నిబాపి బ్రహ్మత్వాన్ని సిద్ధింపజేస్తుంటారు. వారిని దత్తావతారములుగా ఆరాధిస్తుంటారు. అట్టి వారిలో ప్రసిద్ధి చెందిన తొమ్మిది మంది దత్తావతారములను సంక్షిప్తముగా స్మరించుకుందాము. వారు, శ్రీపాదశ్రీవల్లభులు, శ్రీనృసింహ సరస్వతీ, శ్రీ మాణిక్యప్రభువు, శ్రీ స్వామి సమర్ద అక్కల్‌కోట మహరాజ్, శ్రీ షిరిడిసాయి నాథులు, శ్రీవాసు దేవానంద సరస్వతీ, సంత్ గజానన్ మహరాజ్, హజరత్ తాజుద్దీన్ బాబా, సిద్దేశ్వర్ సంత్ శ్రీగులాబ్‌బాబా గారు. జగత్తంతా

దత్త మయం. ఆ మహా శక్తి లేని చోటు ఏదీ ఈ విశ్వంలో లేదు. ప్రతి జీవి త్రిగుణాత్మక ప్రకృతితోనే ఉంటుంది. అందుకని త్రిగుణాత్మకుడైన దత్తాత్రేయుని ఆరాధనలో ప్రతిజీవి స్పందన పొందేందుకు ఎక్కువ అవకాశం ఉంది. ఈ దత్తావతారముల చరిత్ర పారాయణము, చింతనము ప్రతిజీవికి దత్త స్పందనను కలిగిస్తుంది. ఈ దత్తావతారములను గురు శక్తి ప్రసారకేంద్రములుగా తన వాహికలుగా చేసుకొని ప్రచండమైన గురుశక్తి ధారను అఖండముగా దత్తస్వామి మనపై ప్రవహింపజేస్తున్నారు. ఈ దత్తావతారములందరి ద్వారా ప్రకటమవుతున్నది ఒకే దత్త తత్త్వమని, అనంతంగా సాగే ఒకే దత్త చరిత్రలోని వివిధ అధ్యాయములవంటి వారే ఈ దత్తావతారములన్నీ అనే భావంతో నిత్యము స్మరించుకొంటే అది అనన్యచింతనగామారి భిన్నత్వంలో ఏకత్వమును దర్శింపజేసే అద్వైత జ్ఞానమును, యోగసిద్ధిని దత్తస్వామి అనుగ్రహిస్తారు.

పాపకర్మలు క్షీణదశకు వచ్చినప్పుడు, పుణ్య కర్మలు ఫలిత మివ్వడం ప్రారంభించినప్పుడు మాత్రమే సర్వోత్కృష్టమైన దత్తభక్తి కలుగుతుంది. కనుకనే మనం దత్తుని గురించి, దత్తావతారములు గురించి ఇలా తెలుసుకొనే అవకాశం కలిగింది.

అవధూత చింతన శ్రీగురుదేవదత్త!

రేపు భజియింతునని నేడు, రేపు కూడా
రేపు భజియింతునని నేడు రేపులెన్నో
జరిగిపోయె భజనంబు జరుగకుండా
చివరకు అవకాశమే లేక గడుతుమీరు
మరచిపోకుడు శివానందుని మంచిమాట

శ్రీ పాద శ్రీ వల్లభులు

కృతే జనార్ధనోదేవః త్రేతాయాం రఘునందనః ।
ద్వాపరే రామకృష్ణౌ చ కలౌ శ్రీపాదవల్లభః ॥

శ్రీపాదవల్లభ స్తోత్రం

శ్రీపాదవల్లభ గురోః వదనారవిందం
వైరాగ్యదీప్తి పరమోజ్వల మద్వితీయం
మందస్మితం సుమధురం కరుణార్ద్ర నేత్రం
సంసార తాపహరణం సతతం స్మరామి

శ్రీపాదవల్లభ గురోః కరకల్ప వృక్షం
భక్తేష్ట దాననిరతం రిపుసంక్షయంవై
సంస్మరణ మాత్రచితి జాగరణం సుభద్రం
సంసార భీతి శమనం సతతం భజామి

శ్రీపాదవల్లభ గురోః పరమేశ్వరస్య
యోగీశ్వరస్య శివశక్తి సమన్వితస్య
శ్రీపర్వతస్య శిఖరం ఖలు సన్నివిష్టం
త్రైలోక్య పావన పదాబ్జ మహం నమామి

ఇంతవరకూ దత్తాత్రేయుల వారి ప్రథమావతారమైన శ్రీపాదుల సంపూర్ణ చరిత్ర మనకు లభించ లేదన్న కొఱత తీరిపోయింది. గురుచరిత్రలోని శ్రీ పాదుల చరిత్రకు సవిస్తరణగా, వ్యాఖ్యాన ప్రాయంగా, శ్రీపాదుల అనేక బాల్య లీలలతోపాటు అనేక తత్వరహస్యాలూ, విశేషాలు వెల్లడిస్తూ దత్తతత్వాన్ని (శ్రీపాదుల తత్వాన్ని) ప్రకటిస్తూ, ఇంతవరకు కాలగర్భంలో దాగి, శ్రీపాదుల జీవితకాలంలోనే 14 వ శతాబ్దిలోనే "శంకరభట్టు" అనే కన్నడ దేశస్థునిచేత మొదట సంస్కృతంలో వ్రాయబడి, ఆ తర్వాత శ్రీ పాదుల ఆదేశానుసారం శ్రీపాదుల మాతామహవంశమైన "మల్లాది" వారింటికి చేరి, కొంతకాలానికి తెనిగించబడి, పిఠాపురంలోని శ్రీపాద శ్రీ వల్లభ మహాసంస్థానం వారికి ఇటీవల అందచేయబడిన "శ్రీపాదశ్రీవల్లభ చరితామృతం" అనే గ్రంథం దత్తభక్తుల చిరకాల తపోఫలంగా సంభావించబడి వెలువడింది. ఆ గ్రంథం చదివి విశేషాలు గ్రహించవచ్చు. ఆ గ్రంథంలోని కొన్ని ముఖ్య విషయాలు మాత్రమే ఇక్కడ ప్రస్తావించబడుతున్నవి.

శ్రీపాద శ్రీవల్లభుల మాతామహులది అసలు గుంటూరు జిల్లా పల్నాడు ప్రాంతంలోని 'మల్యాద్రి' గ్రామం. ఆ మల్యాద్రే కాలక్రమాన జనవ్యవహారంలో "మల్లాది" గా మారిపోయింది. ఆ గ్రామంలో మల్లాది ఇంటిపేరు గల రెండు వంశాలు ఉండేవి. హరితస గోత్ర సంభవులైన మహాపండితులని పేరుగాంచిన మల్లాది బాపన్నావధానులు గారిది ఒకటి. రెండోది కౌశికస గోత్రసంభవులైన మహాపండితులని ప్రసిద్ధికెక్కిన మల్లాది శ్రీధర అవధానులు గారిది. శ్రీధర అవధానులగారి సోదరైన రాజమాంబను బాపన్నావధానులుగారు పెళ్ళిచేసుకొన్నారు. ఆ విధంగా వాళ్ళు బావా బావమరదులు. గోదావరీ మండలాంతర్గతమైన అయినవిల్లి గ్రామానికి ఆ వేద పండితులిద్దరూ పోయి, అక్కడ జరగుతున్న యజ్ఞానికి నిర్వాహకులై పాల్గొని ఆ యజ్ఞం చూడటానికి వచ్చిన వాళ్ళందరికీ పూర్ణాహుతి సమయంలో స్వర్ణ గణపతి దర్శనం కావించారు. గణపతి ఆ పూర్ణాహుతిని తన తొండంతో అందుకొని, అనతికాలంలోనే తాను సర్వకళలతో గణేశ చతుర్థినాడు శ్రీపాద శ్రీవల్లభ రూపంతో అవతరించబోతున్నానని చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచాడు.

ఆ తర్వాత "సత్య ఋషీశ్వరులని పేరుగాంచిన బాపన్నావధానులు, శ్రీధర పండితులు ఇద్దరూ కలిసి ఒకసారి వరసిద్ధి వినాయకుణ్ణి ప్రతిష్ఠించటానికని "కాణిపురం" వెళ్ళారు. ఆ సమయంలో వరసిద్ధి వినాయకుడు వాళ్ళను చూచి, "శ్రీపాద శ్రీవల్లభుల అవతారానికి సమయం ఆసన్నం కాబోతున్నది. శ్రీధరా! మీ ఇంటిపేరును "శ్రీపాద" గా మారుస్తున్నాను. కౌశికస గోత్రులైన మీ వంశస్థులు నేటి నుండి శ్రీపాద గృహనామమున వర్థిల్లెదరు గాక!" అని ఆశీర్వదించాడు. కొంతకాలం తర్వాత వాళ్ళిద్దరూ పిఠాపురం వలసపోయి అక్కడ నివసించసాగారు.

బాపన్నావధానులకు వెంకావధానులనే కుమారుడు, సుమతి అనే కూతురు జన్మించారు. ఆ బాలిక జాతకంలో అన్నీ శుభలక్షణాలు ఉండటం వల్లా, ఆమె నడిచేటప్పుడు ఆ నడకతీరు, ఆ ఠీవి, మహారాణిని తలపించేటట్లు ఉండటం చేత, తన కూతురికి ఆయన "సుమతి మహారాణి" అని పేరు పెట్టాడు.

ఇట్లా ఉంటూ ఉండగా, ఒక రోజు మహాపండితులైన బాపనార్యుల కీర్తి ప్రతిష్టలు విని, ఆయన దగ్గర శాస్త్రాలు చదువుకొందామని భారద్వాజ గోత్రసంభవుడూ, ఆపస్తంబసూత్రుడూ, వెలనాటి వైదిక శాఖకు చెందిన "ఘండికోట అప్పల లక్ష్మీ నరసింహరాజశర్మ" అనే బ్రాహ్మణబాలుడు పిఠాపురం వచ్చాడు. అప్పలరాజ శర్మ ఇంట్లో తాత ముత్తాతల కాలంనుండి పూజిస్తూ వస్తున్న కాలాగ్నిశమన దత్తాత్రేయ విగ్రహం ఒకటి ఉండేది. తల్లీ తండ్రీ చిన్నతనాన్నే గతిస్తే అప్పలరాజశర్మ ఆ విగ్రహాన్ని

పూజిస్తూ ఉండేవాడు. పూజా సమయంలో ఆ దత్తుడు స్పష్టంగా మాట్లాడుతూ ఆదేశాలిస్తూ ఉండేవాడు. ఒకరోజు అతడు ఆ విగ్రహాన్ని పూజిస్తూంటే దత్తుడు “పీఠికాపురం పోయి బాపన్నావధానుల దగ్గర విద్యాభ్యాసం చేయ”మని ఆదేశించాడు. ఆ ఆదేశానుసారం అతడు వచ్చి, బాపన్నావధానుల దగ్గర విద్యాభ్యాసం చేస్తుండేవాడు.

కొంతకాలం గడిచింది. ఒకరోజు బాపన్నావధానులు తమ ఊళ్ళో ఉన్న కుక్కుటేశ్వర దేవస్థానానికి పోయి, అక్కడున్న లింగాన్ని అభిషేకిస్తుంటే, ‘నాయనా! బాపన్నావధానులూ! మీ అమ్మాయి సుమతిని అప్పలరాజశర్మ కిచ్చి వివాహం చెయ్యి. లోక కళ్యాణం జరుగుతుంది. ఇది దత్త ప్రభువుల నిర్ణయం” అనే గంభీరవాణి ఆ లింగంలోంచి వినిపించింది. బాపన్నావధానులు దత్తుడి ఆజ్ఞ శిరసావహించి, ఆ ఇద్దరికి వివాహం జరిపించాడు. కొంతకాలానికి ఆ దంపతులకు ఇద్దరు పుత్రులు పుట్టారు. అందులో ఒకరు అంధుడు. రెండోవాడు కుంటివాడు. ఆ పిల్లలు అట్లా పుట్టటం చూచి తల్లిదండ్రులు ఎంతగానో విచారించి, “అంతా దత్తుడి దయ” అని ధైర్యం వహించారు.

ఒకరోజు కొందరు బంధువులు “అయినవిల్లి” లో ప్రసిద్ధిగాంచిన విఘ్నేశ్వరాలయం నుంచి ప్రసాదం తీసుకొని వచ్చి ఆ దంపతులకిచ్చారు. ఆ ప్రసాదం వాళ్లు పుచ్చుకొన్నారు. ఆ రోజు రాత్రి సుమతి మహారాణికి స్వప్నంలో ఐరావతం (తెల్లని ఏనుగు) కనిపించింది. అప్పటి నుండి ప్రతిరోజు రాత్రి త్రిమూర్తులు, దేవతలు, సిద్ధులు మొదలైన వాళ్ళ దర్శనాలు కావటం మొదలు పెట్టాయి. ఈ విషయాలన్నీ ఆమె తన తండ్రితో చెబితే, ఆయన చాలా సంతోషించి “అమ్మా! నీ గర్భవాసాన ఒక మహాత్ముడు పుట్టబోతున్నాడనటానికి ఇవి శుభసూచనలు” అని అన్నాడు. అప్పలరాజశర్మ నిత్యం తాను పూజిస్తున్న కాలాగ్నిశమన దత్తుణ్ని ప్రశ్నిస్తే, ఆ విగ్రహం నుండి దివ్యతేజస్సుతో ఒక బాలుడు వెలువడి, తన శరీరంలోకి ప్రవేశించినట్లు ఆయనకు కనిపించింది. అందుకు ఆయన ఆశ్చర్యపోతుంటే “ఇప్పుడు నీవు చూచిన అవతారము నా రాబోయే అవతారము . పూర్వజన్మలో నీవెవరో తెలుసా? చూడు!” అని దత్తప్రభువు రాజశర్మ భ్రూమధ్యమును తాకాడు. వెంటనే రాజశర్మకు పూర్వం తాను విష్ణుదత్తుడనే పేరుతో జన్మించినట్లూ, తన భార్య సుశీల అనే నామాంతరముతో భార్యయై ఉన్నట్లూ స్ఫురించింది. అప్పుడు దత్తుడు “నేనప్పుడు మిమ్మల్ని ఏదైనా కోరిక కోరుకోమన్నాను. మీరు సరియైన కోరిక కోరుకోలేక పోయారు. పితృశ్రాద్ధ దినాన భోజనానికి రమ్మన్నారు. అట్లాగే వచ్చాను. మీ పితృదేవతలకు శాశ్వత బ్రహ్మలోక ప్రాప్తి నిచ్చాను. నేను శ్రీపాద శ్రీవల్లభ నామంతో అవతరించాలనుకుంటున్నాను. ఎన్నో వందల యేళ్ళ నుంచి ఈ భూమ్మీద శ్రీపాదశ్రీవల్లభునిగా యోగులకూ, మహాపురుషులకూ దర్శనమిస్తూనే ఉన్నాను. ఈ పీఠికాపురంలో “సవితృకాఠకచయనా”న్ని

భారద్వాజ మహర్షి త్రేతాయుగంలో చేశాడు. ఆయనకు అప్పుడు నేనిచ్చిన మాట ప్రకారం నేను అవతరించబోతున్నాను. ఆ తర్వాత మీనాంశ మీనలగ్నంలో 'నరసింహ సరస్వతి'గా జన్మించి, అనేక లీలలు చూపి, శ్రీశైల కదళీవనంలో 300 సంవత్సరాలు తపోసమాధిలో ఉండి, ఆ తర్వాత స్వామి సమర్థ నామంతో ప్రజ్ఞాపురంలో నివసించి, శని మీనంలోకి ప్రవేశించినప్పుడు శరీరాన్ని త్యజిస్తాను" అని పలికి అంతర్హితుడయ్యాడు.

ఈ విషయం బాపనార్యులు విని "నాయనా! పూర్వ జన్మలో దత్తుడికి భోజనం పెట్టిన పుణ్యాత్ముడవు నీవు. ఈ జన్మలో కూడా ఏ రూపంగానైనా దత్తుడు వచ్చి మిమ్మల్ని భోజనం పెట్టమని అడుగవచ్చు. అది ఏ రోజైనా సరే? పితృశ్రాద్ధ దినమైనా సరే! సంకోచించక మీరు భిక్ష పెట్టండి!" అని చెప్పాడు. ఆ తర్వాత సుమతి, యతీంద్రుడికి భిక్ష ఇవ్వటం, తదనంతరం కుమారుడు కలగటం సంభవించింది.

శ్రీపాదులు జన్మించినప్పుడు మూడు తలల నాగుబాము పద్దెనిమిది రోజులపాటు వారికి ఎక్కడ పరుండబెట్టిననూ పడగపట్టుతుండేది. వారు మాతృగర్భమునుండి మామూలు శిశువుగా జన్మించలేదు. జ్యోతి స్వరూపంగా వెలువడ్డారు. వారు పుట్టిన మరుక్షణమే సుమతి మహారాణి సొమ్మసిల్లిపోయింది. పురుటిగదిలోనుండి మంగళవాయిద్యాలు, వేదఘోష బయటికి వినిపించింది. శ్రీ పాదులు పుట్టినతోడనే ప్రణవాన్ని ఉచ్చరించారు. ఉయ్యాలలో ఉన్నప్పుడు కూడా సంస్కృతభాషలో ప్రసంగాలు చేసేవాడు. నెలల బాలుడుగా ఉన్నప్పుడే, స్వేచ్ఛగా నడిచిపోయేవారు. తాతగారితో పాటు పండిత పరిషత్తులకు పోయి శాస్త్ర ప్రసంగాలు చేస్తూ ఉండేవారు. ఈ విచిత్రం చూచి ఆ ఊళ్ళోని "నరసావధాను"లనే బ్రాహ్మణుడు, "వేదపండితుడైన వాడు ఎవరో ఈ పిల్లవాణ్ణి ఆవేశించి, ఇట్లా ఆదేశిస్తున్నాడు. అంతేగాని ఈ పిల్లవాడు దత్త ప్రభువని భావించటం తప్పు" అని ప్రచారం చేయసాగాడు.

నరసావధానులు తన ఇంట్లో తోటకూర పెంచుతుండేవాడు. ఆ తోటకూర రుచిగా ఉండేది. ఎవరు అడిగినా ఇచ్చేవాడు కాదు. ఎవరి దగ్గరనుండైనా తనకు బాగా లాభం వస్తుందని తోస్తే ఇచ్చేవాడు. ఒక రోజు శ్రీపాదులు తన తల్లిని తోటకూర వండిపెట్టమన్నాడు. ఆ తోటకూర కూడా నరసావధానులు గారి ఇంటినుండే తెమ్మన్నాడు. తాతగారు శ్రీ పాదులను ఎత్తుకొని సరసావధానులు ఇంటికి వచ్చాడు. వాకిట్లో అరుగుమీద అవధానులు కూర్చుని ఉన్నాడు. ఆయనకు పొడుగైన పిలక ఉండేది. క్షురకుడు వచ్చి ఆయనకు క్షురకర్మ చేయబోతున్నాడు. తాతగారి భుజంపై ఉన్న శ్రీపాదులు

నరసావధానులను చూచి చేతులు జోడించి నమస్కరించాడు. ఆ పిల్లవాడు తనకు నమస్కారం చేయటం చూచి నరసావధానులు నివ్వెరపోయాడు. శ్రీపాదుల తీక్షణ దృష్టి ఆయన పిలకపై పడింది. వెంటనే అది ఊడి క్రింద పడింది. అప్పుడు శ్రీపాదులు తాతగారిని చూచి "తాతా! నరసన్నతాతకు అత్యంత ప్రీతిపాత్రమైన పిలక ఊడి కిందపడింది. అందుకు విచారిస్తున్నాడు. ఇప్పుడు తోటకూర మనం అడగడం బావుండదు. ఇంటికి తిరిగిపోదాం పద" అని తాతగారితో ఇంటికి వెళ్లిపోయారు. ఆ తర్వాత ఎప్పుడూ తనకు తోటకూర కావాలని శ్రీపాదులు అడగలేదు. ఆ రోజున నరసావధానులు ధ్యానంలో కూర్చున్నప్పుడు తన పోలికలున్న మనిషి ఒకడు తనలోంచి బయటకు రావడం కనిపించింది. "నీవెవ్వరివి? ఎక్కడకు పోతున్నా"వని ఆ మనిషిని ఆయన అడిగాడు. "నేను నీలో ఉన్న పుణ్యశరీరాన్ని నీవు ఎన్నోసార్లు వేదం చదివావు. స్వయంభూదత్తుణ్ణి ఆరాధించావు. అతడే శ్రీపాదుడుగా పుడితే ఆయన్ని అవమానించావు. నీకు నీశిఖ మీద, నీ దొడ్లో ఉన్న తోటకూర మీద ఉన్న ప్రేమాభిమానాల్లో లక్షాంశమైనా, శ్రీపాదులవారి యందుంటే, నీవు తరించేవాడివి. నీవు మోహపాశగ్రస్థుడివి. నీకు త్వరలోనే దరిద్రం చుట్టుకోబోతున్నది. దానిని నివారించటానికి శ్రీపాదులు నీ నుంచి తోటకూర దానం అడిగారు. నీకు ఇవ్వటానికి బుద్ధిపుట్టలేదు. చేజేతులా ఈ జన్మలో కలిగే ఐశ్వర్యాన్ని పోగొట్టుకున్నావు. అయినా శ్రీపాదులు దయా సముద్రులు. వచ్చే జన్మలో వారు మరొక అవతారం ధరింపబోతున్నారు. ఆ సమయంలో నీవు దరిద్ర బ్రాహ్మణుడిగా పుడతావు. అప్పుడు కూడా నీవు తోటకూరనే నీ దొడ్లో పండిస్తావు. సరియైన సమయం చూచి నేను మళ్ళీ నీ శరీరంలోకి ప్రవేశిస్తాను. అప్పుడు శ్రీపాదులు మీ ఇంటికి వచ్చి, నీవు ప్రేమతో వండిపెట్టిన తోటకూర భుజించి నీకు ఐశ్వర్యం కలిగిస్తారు. శ్రీపాదుల చేత నమస్కరించబడుటవలన నీలోని పుణ్యరూపమైన నన్ను పోగొట్టుకున్నావు" అని చెప్పి అంతర్ధానమయ్యాడు. ఆ నరసావధానులు కొన్ని రోజుల తర్వాత మరణించగా, శ్రీపాదులు ఆయన్ని తిరిగి బ్రతికించాడు. మరోసారి బావన్నావధానులు అగ్నిహోత్ర కార్యం సలుపుదామనుకొన్నప్పుడు ఎన్ని మంత్రాలు చదివినా అగ్ని సృష్టికాకపోతే, శ్రీపాదులు అగ్ని దేవుణ్ణి ఆజ్ఞాపించి, అగ్ని జ్వాల లెగసేట్టు చేశాడు. తాతగారి చేతిలోని జలకలశం తీసుకొని ఆ నీళ్ళు అగ్నిగుండంలో పోసి, ఆ జ్వాలల్ని మరింతగా ప్రజ్వరిల్లేటట్లు చేశాడు. ఇటువంటి బాల్యలీల లెన్నో ఆ గ్రంథంలో ఉన్నవి. గురుచరిత్రలోని కథలకు ఆ గ్రంథం వ్యాఖ్యానంగా ఉంది. కురుగడ్డలో శ్రీ పాదులవారి బట్టలుతికిన రవిదాసే పిఠాపురంలో శ్రీపాదుల బట్టలుదికిన తిరుమలదాసు కొడుకు. అతడే మరుజన్మలో బీదరు నవాబు అయ్యాడు.

పిఠాపురంలో శ్రీపాదులవారి మీద మంత్ర ప్రయోగం చేసిన మాంత్రికుడే గంధర్వ నగరంలో

అశ్వద్ధ వృక్షంపై వసించి ఉండి, నరసింహ సరస్వతి వలన శాపవిమోచనం పొందిన బ్రహ్మరాక్షసుడు. శ్రీ పాదులవారి రెండవ యేట పిఠాపురమునకు వచ్చి, స్వయంభూదత్తుని విగ్రహము ఏలానదిలోనుండి బయటకు తీయించి, సుమతి అప్పలరాజు దంపతులచే ప్రతిష్టి చేయించిన ఉన్మత్త సిద్ధుడైన అవధూతే (ఆయన అసలు పేరు మాధవుడు) ఆ తర్వాత విద్యారణ్యుడుగా జన్మించాడు. ఆయన మరల "కృష్ణసరస్వతి" గా జన్మించి, కాశీలో నరహరికి సన్యాసదీక్ష ఇచ్చాడు. ఈ విధంగా శ్రీపాదశ్రీవల్లభుల అవతారంలో ఆయనతో సన్నిహితంగా ఉన్న వ్యక్తులే ఆ తర్వాత అవతారంలో కూడా ఆయనతో సాన్నిహిత్యం కలిగి ఉండటం మనం గమనిస్తాం. గ్రుడ్డివాడైన శ్రీపాదుల పెద్దన్నగారి పేరు శ్రీధరరాజశర్మ. దత్తావతారానికీ శ్రీపాదశ్రీవల్లభ అవతారానికీ మధ్య కాళరాత్రి నడచింది. అది కేవలం అంధకార స్వరూపం. దానికి ప్రతీకగా శ్రీధరరాజశర్మ జన్మించాడు. ఆ రాత్రి గడచిన తర్వాత ఉన్న స్థితి అనుమానాలు, నాస్తికవాదాలు, కుతర్కాలు, వక్రభాష్యాలు మొదలైనవి ఉన్న స్థితి. దానికి ప్రతీకగా చిన్నన్నగారైన శ్రీరామరాజశర్మ జనించాడు. ఏ జీవియైనా మహాంధకార సదృశమైన తమస్సును వదలి, కుతర్కాలు, శంకలూ, వక్రభాష్యాలూ మొదలైన వాటితో గూడిన మనశ్చాంచల్యస్థితిని అధిగమించిన తర్వాత శ్రీవల్లభుని అనుగ్రహం పొందగలడన్నదే వారి జననంలోని రహస్యం. ఈ గుట్టును ఆ చరిత్ర విప్పి చెప్పింది. శ్రీపాదుల తర్వాత ఆయనకు ఒక సోదరి జన్మించింది. ఆమె పేరు "శ్రీవిద్యాధరి" ఆమె వివాహం మల్లాది రామకృష్ణావధానులుగారి కుమారుడు చంద్రశేఖరావధానులతో శ్రీపాదులు జరిపించారు. ఆ తర్వాత మరొకసోదరి జన్మించింది. ఆమె పేరు"రాధ" ఆమెను విజయవాడ వాస్తవ్యులు విశ్వనాథ మురళీకృష్ణావధానుల కిచ్చివివాహం చేశారు. రాధ తరువాత 'సురేఖ' అనే ఆమె జనించింది. ఆమెను మంగళగిరి నివాసులైన తాడేపల్లి దత్తాత్రేయ అవధాన్లు అనే వారి కిచ్చి వివాహం చేశారు. శ్రీ గురుచరిత్రలో చెప్పబడని ఈ విషయములు "శ్రీపాదవల్లభచరితామృతం" లో చెప్పబడినవి.

"శ్రీపాదుల వారు నాలుగేండ్ల ప్రాయంలో ఉన్నప్పుడు పీఠికాపురానికి "కులశేఖరు"డనే ఒక మల్లయోధుడు వచ్చాడు. అతడు మర్మకళాప్రవీణుడు. మన శరీరంలోని చాలా భాగాలను నియంత్రించే కొన్ని జీవశక్తి కేంద్రాలను 'మర్మ' అని అంటారు. ఈ మర్మలపై కొడితే లేక తాకితే మనిషికి స్పృహ పోతుంది. శరీర భాగం పనిచేయకుండా కూడా చేయవచ్చు. మర్మలలో ప్రాణశక్తి విశేషంగా ఉంటుంది. కాబట్టి అక్కడ వత్తిడి కలిగించటం ద్వారా ప్రాణాపాయం నుంచి కూడా రక్షించవచ్చు. దీర్ఘవ్యాధులనూ నయం చెయ్యవచ్చు. ఆ మల్లయోధునితో తలపడటానికి గూనివాడు, బలహీనుడూ అయిన భీముణ్ణి శ్రీపాదులు ప్రేరేపించి, అతనిచేత కులశేఖరుడు ఓడిపోయేటట్లు చేయడమే కాక కులశేఖరుడు కొట్టిన దెబ్బలకు వాని గూనిపోయేటట్టు చేశారు.

కలియుగ దత్తావతార పంచకంలో "శ్రీపాద శ్రీ వల్లభులు, శ్రీ నరసింహ సరస్వతి అవతారాలు రెండూ దైవదూషణ చేసేవారిని సంస్కరించాలనీ, దైవభక్తులను కంటికిరెప్పగా కాచి రక్షించాలనే ప్రధానోద్దేశాలతో, ఈ సృష్టిలోకి వచ్చిన అవతారాలు."శ్రీ పాదులవారికి సాధ్యాసాధ్యములు లేవు" అని ఆ గ్రంథం చెప్పి, ఆ తర్వాత అవతారమైన మాణిక్యప్రభువు – "ఆనాడు జానకీరాములు మారుతికి పుత్రవాత్సల్యంతో ప్రసాదించిన తమ ఆత్మశక్తికి ప్రతీకయైన మణిహారాన్ని, ఆ హనుమకొరికి చూచి అందులో రామనామం లేదని నిరసి అవతల పడవేస్తే ఆ హారాన్ని నేను తీసి భద్రపరిచాను. ఆ హారం దత్తస్వరూపం. నాలో ఉండే ఆత్మజ్యోతి చేత ఆ హారానికి ప్రాణం కల్పించబడింది. ఆ మాణిక్యహారమే గురుస్వరూపమై విరాజిల్లుతుంద"ని శ్రీపాదులు పలికే పలుకులు ఆ అవతరామే తాననీ, చెప్పినట్లయింది. శ్రీపాదులే తర్వాతి అవతారంలో నరసింహ సరస్వతిగా జన్మించి, కదళీవనంలో 300 సంవత్సరాలు యోగసమాధిలో ఉండి ఆ తర్వాత శ్రీస్వామి సమర్థగా అక్కలకోట చేరిన విషయం కూడా ప్రస్తావించబడింది. శ్రీసాయినాథుడు హనుమంతుని అవతారమనీ, "నాథ" అనే బిరుదాన్ని శ్రీ పాద శ్రీవల్లభులే ఆయనకు ప్రసాదించి, "ఏశక్తి ప్రాభవాలు నాలో ఉన్నవో అవన్నీ నీలో కూడా ఉండేటట్లు అనుగ్రహిస్తున్నాను. నేను శ్రీ సమర్థగా ఉండి, నా శరీరాన్ని వదిలే సమయం ఆసన్నమైనప్పుడు సాయిరూపంలో ఉన్న నీలోకి అవతరిస్తాను. నా అవతారం (దత్తావతారం) నీలో ఉన్నదని సుస్పష్టంగా ప్రకటిస్తాను. నీవు నా యొక్క సర్వసమర్థ సద్గురు అవతారంగా విఖ్యాతి పొందగలవు" అని శ్రీపాదులు హనుమను ఆశీర్వదించినట్లు చెప్పబడింది. ఈ అవతారాలు ఐదూ భౌతికంగా చూస్తే వేరు వేరుగా కనిపిస్తున్నా, ఆత్మపరంగా చూస్తే అంతర్లీనంగా వాటిలో ఉన్న శక్తి ఒక్కటేననీ, అదే దత్తాత్రేయ శక్తి అనీ బోధపడి, ఆ అనేకత్వంలోని ఏకత్వాన్ని మనం అనుభవంలోకి తెచ్చుకొంటాం.

శ్రీపాదులు తమ పదహారేళ్ళవయస్సులో పీఠికాపురము విడిచి బదరీ కేదారాది పుణ్యక్షేత్రాలకు పోయి, "ద్రోణగిరి" అనే సంజీవనీ పర్వతం దగ్గరకు వెళ్ళారు. కొన్ని రోజులు అక్కడి ఋషులతో కాలం గడిపారు. అక్కడి నుండి కల్కిఅవతారము జనించు "శంబల" అనే గ్రామానికి వెళ్ళారు. అక్కడ ఉన్న స్ఫటిక పర్వతంలో ఉన్న శుద్ధజలాన్ని త్రాగారు. అది త్రాగినవాళ్ళ వయస్సు నిలిచిపోతుంది. అందువల్ల వారి శరీరంలో ఎటువంటి మార్పు లేక 16 సంవత్సరముల బాలుడివలెనే ఉండేవారు. ఆ తర్వాత గోకర్ణ క్షేత్రానికి పోయి, అక్కడ మూడేళ్ళు ఉండి శ్రీశైలం వెళ్ళారు. అచ్చటనుండి వారు తమ యోగమార్గాన సశరీరంతో మహాగ్ని గోళ సదృశులై సూర్యమండలానికి పోయారు. అక్కడి నుండి ధ్రువనక్షత్రంలోకి, సప్తర్షి మండలంలోకి అచ్చటి నుండి ఆర్ద్రా నక్షత్రానికి పోయి తిరిగి

శ్రీశైలానికి 4 నెలల తర్వాత వచ్చి, ఆర్ద్రా నక్షత్రమందున్న మహర్షుల కోరిక మేరకు ఆ సిద్ధులందరినీ సమావేశపరచి "దివ్యజ్ఞానయోగ"మనే అత్యంత నూతన యోగ మొకదాన్ని బోధించి, ఆ సిద్ధపురుషులను తిరిగి ఆర్ద్రా నక్షత్రంలోకి పంపి, కురుగడ్డ చేరారు.

ఆనాడు దత్తాత్రేయులవారు తనను వెన్నంటి వస్తున్న సిద్ధ ముని, ఋషి, యోగ, గణాన్ని మాయామోహితులను చెయ్యాలని నదీ గర్భంలో అదృశ్యమైనారని చెప్పబడినదే ఈ కృష్ణానది అనీ, ఆ ప్రదేశమే కురువపురమనీ, పూర్వం కౌరవపాండవ వంశానికి మూలపురుషుడైన కురుమహారాజుకు దత్తుడు జ్ఞానోపదేశం చేసిన చోటే కురువపురమనీ, అదే ఈనాడు కురుంగడ్డగా పేర్కొనబడుతున్నదనీ, ఆ పుర మాహాత్మ్యం వర్ణించటానికి ఆదిశేషుడికైనా అలవికాదనీ ఆ చరిత్రలో వెల్లడించబడింది.

కురుగడ్డలో శ్రీపాదులు ఉంటున్నప్పుడు, ప్రతి గురువారం కృష్ణా నదిని దాటి, పంచదేవ పహాడ్‌కు పోయి అక్కడ దర్బారు చేస్తుండే వారు. శ్రీపాదులు కృష్ణానదిమీద అడుగులు వేస్తూ వెళ్ళేటప్పుడు, ఆయన అడుగు వేసే చోటులో పద్మం మొలుస్తూ ఉండేది. ఆ పద్మంమీద ఆయన తొడుక్కున్న కఱ్ఱపాదుకలు ఎట్లా నిలచేవో? అది మన ఊహకందదు. మొదట్లో ఆయన నీళ్ళమీద అట్లా నడిచిపోతూ ఉండటం అందరికీ వింతగా ఉండేది. తర్వాత అది ఆయన మహత్తుకు నిదర్శనమై మామూలైపోయింది. శ్రీపాదులు కృష్ణ దాటి పంచదేవపహాడ్‌కు రాగానే అక్కడున్న భక్తులు సాదరంగా ఎదురేగి స్వాగతం పలికేవాళ్ళు. సాయంత్రం వరకూ దర్బారు సాగేది. ఆ తర్వాత అదే రీతిగా ఆయన కృష్ణ దాటి వచ్చేటప్పుడు భక్తులు ఆయన్ను వెన్నంటి వీడ్కోలు చెబుతుండేవాళ్ళు. రాత్రిపూట కురుగడ్డలో ఆయన ఎవరినీ ఉండనిచ్చేవారు కాదు. ఒంటరిగానే ఉండేవారు. ప్రతి శుక్రవారం ఆయన వివాహం కావలసిన కన్యలకూ, సౌభాగ్యం కోరే మహిళలకూ పసుపు కొమ్ములు ఇస్తుండేవారు. తనకంటే పెద్దవాళ్ళైన మహిళలను "అమ్మా! సుమతి తల్లీ!" అనీ – మరోసారి "అమ్మా! అనసూయమ్మ తల్లీ", "అమ్మా!సురేఖా" అనీ, " అమ్మా! వాసవీ!" అనీ పిలుస్తుండేవారు. "వాసవికన్యకాపరమేశ్వరి నా సోదరి" అని ఆయన తరచుగా చెబుతూ, చాలా మందికి ఆమె దర్శనాన్ని కూడా ప్రసాదించారు. తన తండ్రి వయస్సులో ఉన్న పురుషులను, "అయ్యా," అని గానీ, "నాయనా!" అనిగానీ, "బాబా" అని గాని పిలుస్తుండేవారు. చిన్నవాళ్ళను "ఒరే అబ్బీ", "బంగారు" అని పిలుస్తుండేవారు. తనకు తాత వయస్సులో ఉన్న వాళ్ళను "తాతా!" అనీ, స్త్రీలయితే " అమ్మమ్మా!" అని పిలుస్తుండేవారు.

గురు, శుక్ర వారాల్లో దర్బారు ఒకొక్కసారి కురుగడ్డలో, ఒకొక్కసారి పంచదేవపహాడ్‌లో ఆయన చేస్తూ ఉండేవారు. అదంతా ఆయన యిష్టానుసారం జరుగుతుండేది. ఆదివారం నాడు

మాత్రం “యోగవిద్య”ను గురించి, సోమవారం నాడు “పురాణ గాథల” ను గురించి , మంగళవారం నాడు “ఉపనిషత్” లను గురించి బోధించేవారు. బుధవారం నాటి దర్బారులో “వేదాలు – వేదార్థాలు” గురించి వివరించేవారు. గురువారం నాడు “ గురుతత్వాన్ని” విశదపరచి బోధించేవారు. శుక్రవారం నాటి దర్బారులో “శ్రీవిద్య”ను గురించి బోధించి, అందరికీ తప్పనిసరిగా పసుపు కొమ్ములు పంచిపెట్టేవారు. శనివారం “శివారాధన” గురించి బోధించేవారు. దర్బారు సమయంలో అందరికీ భోజనాలుండేవి. ఒక్కొక్కప్పుడు ఆయనే స్వయంగా అందరికీ వడ్డిస్తుండేవారు. కొసరి కొసరి పదార్థాలు వడ్డించి అందరూ తృప్తిగా భోంచేసేటట్టు చేసేవారు. “నా ఖజానా ఎల్లప్పుడూ నిండుగానే ఉంటుంది. ధనాభావ, అన్నాభావ ప్రసక్తే ఉండ”దని అంటుండేవారు. గురువారం నాటి విందులో తప్పనిసరిగా “తీపి పిండివంట” ఉంటూ ఉండేది. “దత్తపురాణం” చదవండి! “దత్తానుగ్రహం” లభిస్తుంది అని భక్తులనందరినీ ఉద్బోధిస్తుండేవారు. ఆయన ప్రేమ చూస్తుంటే భక్తులకు “అది కోటి తల్లుల ప్రేమ” అని అనిపిస్తుండేది. శ్రీపాదులవారి భోజనం మాత్రం గుప్పెడు మెతుకులే. అది వరి అన్నంగాని, జొన్నన్నంగాని, లేదా రాగిసంకటిగాని అయి ఉండేది. తన భక్తుల కడుపు నిండితే తన కడుపు నిండినట్లేనని ఆయన నవ్వుతూ పలుకుతుండేవారు.

రాత్రి వేళలలో దేవతలు విమానాలలో కురుగడ్డకు వచ్చి, ఆ మహాగురువును సేవించి పోతుండేవాళ్ళు. ఒక్కోసారి హిమాలయాలనుండి కొంతమంది సిద్ధులు, యోగులు వచ్చేవాళ్ళు. వాళ్ల దేహాలు కాంతితో నిండి ఉండేవి. వాళ్ళందరికీ శ్రీపాదులే స్వయంగా భోజనం పెడుతుండేవారు.

ఒకనాడు నవ దంపతులు శ్రీపాదుల దర్శనార్థం వచ్చారు. వారిని ఆయన పంచదేవపహాడ్‌లోని తన దర్బారులో ఉండమని ఆజ్ఞాపించారు. రెండు రోజులకు ఆ భర్త మరణించాడు. ఆ నవ వధువు దుఃఖానికి అంతం లేకపోయింది. ఆ నవదంపతుల బంధువులకీ విషయం తెలిసి, పంచదేవపహాడ్‌కు వచ్చారు. శవాన్ని దహన నిమిత్తం తీసుకొని పోవాలనుకొంటుంటే, అక్కడి వాళ్ళు “గురువాజ్ఞ లేనిదే ఇక్కడినుంచి తీసుకొని పోవుటకు వీలులే”దని చెప్పారు. ఇంతలో శ్రీపాదులు అక్కడికి వచ్చారు. నవ వధువుశ్రీపాదులవారి పాదాలపైబడి “స్వామీ! మీరు భక్తరక్షకులు, మిమ్మల్ని సందర్శిస్తే సమస్త శుభాలు కలుగుతాయి. మీరే మాకు రక్ష అని భావించి వచ్చాం. ఇట్లా చేసారేమి స్వామి? నా మాంగల్యం కాపాడండి! మీరే దిక్కు” అని మొరబెట్టుకుంది. అప్పుడు శ్రీపాదులు “నాపై నీకంత విశ్వాసముంటే నీ భర్త తప్పక జీవిస్తాడు. కర్మసిద్ధాంతానికి వ్యతిరేకంకాని ఒక ఉపాయం నేను చెబుతాను. అట్లా చెయ్యి. నీ భర్త బరువుకు సమానమైన కట్టెలను నీ మంగళసూత్రం అమ్మి తీసుకొనిరా? ఆ కట్టెలను గాడిపొయ్యిలో పడవేసి అన్నం వండుదాం! అంతటితో నీ మాంగల్యం పోగొట్టుకోబోతున్న అమాంగళ్యం,

కట్టెలతో నీ భర్త శరీరం కాలి భస్మమయ్యే అమాంగళ్యం,తదుపరి వండబడెడి శ్రాద్ధాన్న అమాంగళ్యము వంటి మృత్యురూపకర్మ స్పందనలు ఆకర్షింపబడిన ఆకట్టెలు దగ్ధమవగా, అమాంగళ్యములన్నీ శాంతిస్తవి" అన్నారు ఆమె అట్లా చెయ్యగానే ఆమె భర్త బ్రతికాడు.

మరోసారి ఒక బీద బ్రాహ్మణుడు శ్రీ పాదులవారి దగ్గరకు వచ్చాడు. "మీరు నాపై దయచూపకపోతే నాకిక మరణం తప్ప గత్యంతరం లేదు" అని స్వామి పాదాలపై బడి దుఃఖించాడు. వెంటనే శ్రీపాదులవారు మండుతున్న ఒక కొరివి తీసుకొని ఆ బ్రాహ్మణుడి వీపుకంటించారు. ఆ మంటలకు ఓర్చుకోలేక అతడు "లబోదిబో" మంటుంటే"నీవు ఆత్మహత్య చేసుకోవాలనుకున్నావు. నేను మెదలకుండా ఉంటే నిజంగా నీవు అంతపనిచేస్తావు. అందువల్ల ఆ ఆత్మహత్యకు సంబంధించిన సమస్త పాపకర్మల స్పందనలను ఈ మండుతున్న కొరివితో అంటించి వాటినన్నింటిని నాశనం చేశాను. ఇకమీదట నీకు దారిద్ర్యబాధ ఉండదు. ఈ చల్లారిన కొరివిని నీ ఉత్తరీయంలో చుట్టుకొని, మీ ఇంటికి తీసుకొనిపో!" అని చెప్పారు. ఆ బ్రాహ్మణుడు ఇంటికిపోయి మూట విప్పి చూస్తే ఆ కొరివి స్థానంలో బంగారపు ముద్ద కనిపించింది.

శ్రీపాదులు తమ "అగ్నియజ్ఞము" అనే ఒక విచిత్ర ప్రక్రియ ద్వారా భక్తుల పాపకర్మలను ధ్వంసం చేస్తుండేవారు. ఒక్కొక్క పర్యాయము ఆయన తన భక్తులను బీరకాయలో, బెండకాయలో, వంకాయలో మరే కాయగూరలో తెమ్మనేవారు. వాళ్ళు తెచ్చిన ఆ కాయగూరల్లోకి వాళ్ళ పాపకర్మరూప స్పందనలను ఆకర్షించేవారు. ఆ రకంగా తేబడిన కాయగూరల వంటకాన్ని భక్తులందరిచే తినిపించి వారి కర్మదోషాలను తొలగించేవారు.

ఒక అమ్మాయికి రజస్వల అయిననూ వివాహం కాలేదు. ఆమెకు కుజదోషం ఉన్నదని గ్రహించి ఆమెచే కందులు తెప్పించి, వాటితో వంటకం చేయించి ఆ అమ్మాయితో సహా ఆ వంటకాన్ని అందరికీ తినిపించారు. అట్లాచేసి ఆ అమ్మాయి కర్మబంధం వదిలించారు.

ఒక పర్యాయం ఒక భక్తుడు జబ్బుపడి మంచం పట్టాడు. అతడు పడుకొనే గదిలో ఆముద దీపం పెట్టి, ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ రాత్రి ఆరిపోకుండా ఉండేటట్లు చమురు పోస్తూ ఉండమని ఇంట్లో ఉన్న వాళ్ళను శాసించారు. ఆ ఇంటివాళ్ళు అట్లా చేయగానే ఆ భక్తుడు రోగవిముక్తుడయ్యాడు.

మరొక భక్తుడు పాపం! దుర్భర దారిద్ర్యంతో వ్యధ చెందుతూ ఉండేవాడు. వారింట్లో శ్రీ పాదులు వారం రోజులపాటు గోఘృతంతో దీపారాధన చేయించి, "ఇది ఆరిపోకుండా, అఖండంగా

వెలుగుతూ ఉండేట్టు చూస్తే మీ ఇల్లు లక్ష్మీ నిలయమౌతుం"దని చెప్పారు. శ్రీపాదులు భక్తుల కర్మ విమోచనం కోసం చేసే పద్ధతులు మానవ మాత్రులకు తెలుసుకోవడం అసాధ్యంగా ఉంటూ ఉండేవి.

ఒక పర్యాయం క్షయవ్యాధి పీడితుడొకడు కురుగడ్డకు వచ్చాడు. అతనికి మధుమేహంతో పాటు మరికొన్ని వ్యాధులు కూడా ఉన్నవి. అతణ్ని చూచి శ్రీపాదులు అసహ్యించుకొన్నారు. పూర్వజన్మలో వాడొక గజదొంగ. ఎందరో అమాయకుల సొమ్ము అపహరించాడు. కొందరిని చంపాడు. మరికొందరిని గాయపరిచాడు. కుమార్తె పెండ్లికని పాపం! ఒక తండ్రి కూడబెట్టిన ధనాన్ని అపహరించాడు. వరకట్నం సొమ్ములేకపోవటంతో, ఆ పిల్ల పెండ్లి ఆగిపోయింది. ఆ పెళ్లికుమార్తె ఆత్మహత్య చేసుకొంది. ఇన్ని పాపాలు మూటగట్టుకొన్న ఆ వ్యాధి పీడితుడు శ్రీపాదుల చరణాలపై బడి శరణువేడాడు. అన్ని పాపాలు చేసినా అతడు చేసిన సుకృతలేశ మేదో అతణ్ణి శ్రీపాదులవారి దగ్గరికి చేర్చింది. శ్రీపాదులు వానిపై దయతలచి, "పంచదేవపహాడ్ దర్బారులోని గోశాలలో అతనిని పడుకోబెట్టం"దని ఆజ్ఞాపించారు. అక్కడ దోమల బాధ ఎక్కువ. "వానికి త్రాగుటకు మంచినీళ్ళైనా ఇవ్వవద్ద" ని శ్రీపాదులు శాసించారు. ఆ రోగికి – ఆ రోజు రాత్రి కలలో రాక్షసులు కనిపించి, తన కంఠం నొక్కి చంపుతున్నట్లు కల వచ్చింది. ఒక పెద్ద రాతిబండ తన ఛాతీపై పెట్టి ఎవరో బలిష్ఠుడైనవాడు దానిపైకెక్కి అదుముతున్నట్లు మరో కలవచ్చింది. ఈ రెండు స్వప్నాలవల్ల అతని కర్మఫలము పరిపక్వమై స్వస్తుడయ్యాడు. భౌతికంగా అనేక సంవత్సరాలు బాధపడవలసియున్న అతని కర్మఫలాన్ని శ్రీపాదులవారు ఆ క్షయవ్యాధి పీడితుని చేత మానసికంగా అనుభవింపచేసి, కర్మ విముక్తుణ్ణి గావించారు. ఇటువంటి చిత్రమైన లీలలెన్నింటినో వారు చూపారు.

ఇంతలో ఆశ్వయుజ కృష్ణ ద్వాదశి వచ్చింది. ఆనాడు హస్తానక్షత్రం. శ్రీపాదులు కృష్ణానదిలో స్నానం చేసి కొంతకాలం ధ్యానస్థులయ్యారు. ఆ రోజు శంకరభట్టు (శ్రీపాద శ్రీ వల్లభ చరిత్రామృతం మూల గ్రంథ రచయిత) ఎంతరాజేసినా గాడిపొయ్యి రాజుకోలేదు. నిప్పు ఆరిపోయింది. ఆయన్ను శ్రీపాదులు మళ్ళీ స్నానం చేసి రమ్మన్నారు. ఆ తర్వాత "శంకరభట్టూ! నేను గుప్తరూపం వహించటానికి సమయం ఆసన్నమైంది. నేను కృష్ణానదిలో అంతర్ధానమౌతాను. కాని ఈ కురువపురంలో గుప్తరూపంగా తిరుగుతూ, అర్హులైన భక్తులకు నా దర్శనాన్ని ప్రసాదిస్తుంటాను. వాళ్ళ మనోరథాలు సిద్ధింపచేస్తుంటాను. మరికొంతకాలానికి "నరసింహ సరస్వతి" అనే పేర అవతరించి, సన్యాసాశ్రమ ప్రాశస్త్యాన్ని లోకానికి వెల్లడించి, గురు ప్రాముఖ్యతను బహుముఖాల విస్తరింపచేస్తాను." అని చెప్పి, తన పాదుకలను ఆయనకు బహూకరించి అంతర్హితుడయ్యారు.

"శ్రీపాదశ్రీవల్లభ చరితామృత" మనే ఆ అపార సింధువులో నుంచి ఇప్పుడు మనం గ్రహించింది, ఒక బిందువు మాత్రమే. శ్రీకృష్ణుని దర్శనార్థం ఉడుపికి వచ్చిన కర్ణాటక దేశస్థుడైన శంకరభట్టు, అక్కడి శ్రీకృష్ణుని ఆజ్ఞానుసారము కన్యాకుమారికి వచ్చి, అక్కడి కన్యకాపరమేశ్వరిని దర్శించి, ఆమె "కురువపురమునకు పోయి, అక్కడగల శ్రీ పాదశ్రీవల్లభస్వామిని దర్శించి జన్మ సార్థక్యము పొందు"మని చెప్పగా, అక్కడినుండి కురువపురమునకు బయలుదేరి, దారిలో వ్యాఘ్రేశ్వరశర్మ, సిద్ధయోగీంద్రుడు, పళనిస్వామి, నామానందులు, తిరుమలదాసు మొదలైన శ్రీపాదభక్తులద్వారా శ్రీపాదుల దివ్యలీలలు గ్రహిస్తూ, చివరికి కురువపురం చేరుకొని, శ్రీపాదుల దివ్యాశీస్సులకు పాత్రుడు కావటంతో ఈ గ్రంథం సమాప్తమౌతున్నది. వివిధ వ్యక్తులద్వారా తాను విన్నవి, కన్నవి శ్రీపాదులు స్వయంగా చూపినవి, ఎన్నో లీలలు ఈ గ్రంథంలో ఆయన పొందుపరిచాడు. వేదంవలె స్వతః ప్రామాణికమైన గ్రంథంగా దాన్ని రూపొందించాడు. శ్రీ పాదతత్త్వమంటే దత్త తత్త్వమనీ, సర్వకారణ కారణ తత్త్వమే దత్తతత్త్వమనీ ఆయన విస్ఫుటంగా చెప్పాడు. దత్తభక్తులు తెలుసుకోవలసినవీ, ఆచరణలో పెట్టవలసినవీ అయిన అనేకధర్మాలు, రహస్యాలు ఆ గ్రంథంలో ఉన్నవి. "శ్రీగురుచరిత్ర" లాంటి మరో దివ్యచరిత్ర "శ్రీ పాదశ్రీవల్లభ దివ్యచరితామృతం." ఆ దివ్యచరిత్ర చదివిన వాళ్ళు, విన్నవాళ్లు అమృతత్వాన్ని చూరగొంటారనటంలో సందేహంలేదు." శ్రీపాద శ్రీ వల్లభ చరిత్రామృతం" ద్వారా శ్రీ పాదులు ప్రథమదత్తావతారము మాత్రమే కాదు కలియుగంలో ప్రధానమైన దత్తావతారమని తెలియుచున్నది. కలిమాయామోహితులై సర్వభ్రష్టులైన మానవ జాతిని ఉద్ధరించేందుకు ఒక పటిష్టమైన దివ్యప్రణాళికతో అవతరించినట్లు స్పష్టమవుతున్నది. ఆయన తర్వాత వచ్చిన దత్తావతారములు, అవధూతలు, సిద్ధపురుషులు, యోగులు అందరూ కూడా ఆయనతో సంబంధం కలిగి, ఆయన ఆదేశం మేరకు, ఆయన దివ్యప్రణాళికను నిర్వహిస్తున్నారనేది నిరూపించబడినది. ఈ ప్రణాళికలో ఆయన ప్రత్యక్షపాత్రను చాలా పరిమితం చేసికొని, అజ్ఞాత, అదృశ్య సూత్రధారిగా, అనుసంధానకర్తగా పరోక్షంగా ప్రముఖపాత్ర వహిస్తున్నారు.

అవధూత చింతన శ్రీగురుదేవదత్త!

ముఖ్యక్షేత్రములు, మార్గము : శ్రీపాదులు జన్మించిన పిఠాపురం, కాకినాడకు 18 కిలోమీటర్ల దూరంలో విజయవాడ-విశాఖపట్నం రైలు మార్గంలో ఉన్నది. ఆయన ఎన్నో మహిమలు చేసిన "కురువాపురం" చూడాలంటే, హైదరాబాదు నుండి రాయచూర్ బస్సు మార్గములో మక్తాల్‌లో దిగి, అక్కడ నుంచి పంచదేవపహడ్ చేరి, అక్కడ కృష్ణానదిని దాటి ఆ క్షేత్రమును చేరవచ్చు.

శ్రీపాద వల్లభులు - దత్తాత్రేయ తత్వ రహస్యము

"శ్రీపాదశ్రీ వల్లభ చరితామృతం" లో శ్రీపాదులవారు దత్తాత్రేయతత్త్వములోని లోతులను, రహస్యములను బహుముఖంగా, సాధికారికంగా బహిర్గతం చేశారు ఆయన తర్వాత వచ్చిన ఏ దత్తావతారము చెప్పనివిధంగా, శ్రీపాదులవారు తానే ఆ దత్తుడినని పదే పదే నిస్సంశయంగా తెలియచేశారు. నేటి ప్రపంచమునకు ఆధ్యాత్మిక సమన్వయమును బోధపర్చుటకు అవసరమైన దత్తాత్రేయ తత్త్వరహస్య ప్రకాశమును మనపై ప్రసరింపచేశారు. అట్టి కొన్ని జ్ఞాన సుధలను గ్రోలుదాం.

★★★

నేను బ్రహ్మస్వరూపుడిననుటలో బ్రహ్మకు సృష్టి ప్రేరణను ఇచ్చువాడనని అర్థము. ఈ సృష్టించబడిన సమస్త జీవులను, సృష్టిజాతమును కొంతకాలము వరకు స్థితియందుంచటం జరుగును. ఇది విష్ణు స్వరూపం చేసేపని. ఆ విష్ణువుకు ప్రేరణనిచ్చు మహావిష్ణువును నేనే! సరస్వతీ వేరు. మహాసరస్వతి వేరు. సరస్వతి సృష్టికి సంబంధించిన జ్ఞానస్వరూపము. మహా సరస్వతి ఆ సరస్వతీ స్వరూపమునకు ప్రేరణనూ, శక్తినీ ఒసగెడి అనఘా స్వరూపము. సృష్టి యొక్క స్థితికి కారణమైన వస్తు సమృద్ధి లక్ష్మీరూపము. మహాలక్ష్మి అనునది లక్ష్మీ స్వరూపమునకు ప్రేరణనూ, శక్తినీ ఇచ్చెడి అనఘా స్వరూపము. సృష్టియొక్క శక్తి స్వరూపము కాళీ రూపము. మహాకాళి అనుననది కాళీస్వరూపమునకు ప్రేరణను, శక్తిని ఇచ్చెడి అనఘా స్వరూపం.

★★★

అనఘా లక్ష్మీ సమేతుడైన "అనఘు"డనునది నా యొక్క దత్త స్వరూపము, మహాసరస్వతి, మహాలక్ష్మి, మహాకాళి రూపముల సమన్వయమున, ఈ మూడింటికంటే భిన్నముగా మరియొక దివ్యమాతృస్వరూపముగా అనఘాలక్ష్మి ఆవిర్భవించుచున్నది. అందుచేత అనఘాలక్ష్మిని మహాసరస్వతి, మహాలక్ష్మి, మహాకాళీస్వరూపములను తాదాత్మ్యస్థితిలో ధరించి, ఈ మూడింటికీ ఆధారమైన, అతీతమైన దివ్యశక్తిగా గుర్తెరుంగుము. నా యొక్క అనఘా స్వరూపము బ్రహ్మ విష్ణు రుద్రులను తన తాదాత్మ్యస్థితిలో ధరించి, ఈ మూడింటికీ ఆధారముగను, అతీతముగను ఉండి, త్రిశక్తి స్వరూపిణియైన అనఘను వామభాగమున ధరించి ఉన్న శాక్తరూపముగా తెలుసుకొనుము. త్రేతాయుగమునందలి సావిత్రికాఠకచయనము ఫలితంగా నా యొక్క దివ్యభవ్య స్వరూపము అర్ధనారీశ్వర తత్త్వమును ఆధారముగా చేసుకొని, మహా వైష్ణవ మాయతో యతి స్వరూపమున శ్రీపాదశ్రీవల్లభ రూపమున నా తత్త్వము శ్రీపీఠికాపురములో అవతరించినది.

★★★

సమస్త సృష్టియొక్క మహాసంకల్ప స్వరూపమును నేనే! సమస్త దేవీ దేవతలకు వచ్చెడి సంకల్పములు నా మహా సంకల్పము యొక్క అంశమాత్రం చేత కలిగే సంకల్పములు. ఈ అంశమాత్ర సంకల్పములకు కొంతమేరకు మాత్రం స్వతంత్ర్యం ఉంటుంది. ఒక ఆవును పంటకాపు చెట్టుకు కట్టివేస్తాడు. ఆ కట్టిన తాడు పొడుగెంత ఉంటుందో అంతదూరం వరకు ఆ ఆవుపోయి గడ్డి మేయగలుగుతుంది. అంటే ఆ ఆవుకు గడ్డి మేసేటందుకు ఒక హద్దు కాపువాడు ఏర్పాటు చేసాడన్నమాట! ఆ హద్దులో ఉన్న ప్రదేశం వరకు ఆ ఆవు స్వేచ్ఛగా తిరిగి మేత మేయగలుగుతుంది. అంటే దానికి ఇవ్వబడిన స్వేచ్ఛ, ఒక పరిమితికి లోబడిన స్వేచ్ఛ. అది పరిపూర్ణ స్వేచ్ఛకాదు. తనకివ్వబడిన పరిధి దాటి అది మేత మేయాలంటే, పంటకాపు అనుమతి తప్పనిసరిగా ఉండితీరాలి. అక్కడి మేత అయిపోయినప్పుడు పంటకాపు దానిని వేరేచెట్టుకు కట్టివేయటమో, లేదా అదే చెట్టుకు కట్టిన తాడు పొడుగును పెంచి కట్టటమో చేస్తాడు. అదేవిధంగా కొన్ని కొన్ని ధర్మ, కర్మ సూత్రాలకు లోబడి అంశావతారాలకు స్వేచ్ఛ ఇవ్వబడుతుంది. అందువలన సంకల్పం మూలతత్త్వం నుంచి వస్తుంది. దాన్ని అమలు చేసే బాధ్యత అంశావతారానికి ఇవ్వబడుతుంది. ఏవైన సమస్యలు ఉత్పన్నమైనప్పుడు అంశావతారాలు మూలతత్త్వానికి ఈ ఆవేదనలు నివేదిస్తారు. మూలతత్త్వం నుంచి అనుగ్రహాన్ని గ్రహించి జీవులకు శ్రేయస్సు కలిగిస్తారు. మానవులకు ఉండేటట్లుగా రాగద్వేషాలు, అహంకారాది దుర్గుణాలు అంశావతారాలకు లేకపోవటం వల్ల మూలతత్త్వం ఏఏ కార్యాలు చేయటానికి సామర్థ్యం కలిగి ఉంటుందో అంశావతారాలు కూడా ఆయా కార్యాలను చేయగలుగుతూ ఉంటాయి. అందువలన జీవులకు సంబంధించినంత వరకు అంశావతారముగా వచ్చిననూ, పూర్ణావతారముగా వచ్చిననూ వ్యత్యాసమేమీ ఉండదు.

★★★

దత్తుడనైన నేను సులభసాధ్యుడను. తక్కిన దేవతలు భక్తులు చేసిన తపస్సుతో సంతుష్టులై వరాలిస్తారు. అయితే గురుస్వరూపమైన దత్తుడు తన శిష్యులు వరము పొందుటకు అడ్డుపడే దుష్టశక్తులను తన తపోశక్తిచే పరిహరించి, అనుగ్రహించు పరమకారుణ్య స్వరూపము. అందువల్లనే నన్ను స్మృతి మాత్ర ప్రసన్నుడని అందురు. సమస్త గురు స్వరూపమున ఉన్నది నేనే! ఇది మహాకరుణతో అవతరించిన పరమగురు స్వరూపము. కనుక అవతార పరిసమాప్తిలేదు. నా భక్తుని పిలుపు నాకు చేరిన తక్షణమే నేను జవాబిచ్చెదను. నా భక్తుని నుండి పిలుపు ఎప్పుడు వచ్చునా యని నేను నిరీక్షించుచుందును. నావైపు ఒక అడుగువేసిన నేను నా భక్తునివైపు నూరు అడుగులు వైచెదను. నా భక్తులను కంటికి రెప్పవలె కాపాడి అన్ని విపత్తులనుండి బాధలనుండి కాపాడుట నా సహజనైజము.

అనంతకోటి బ్రహ్మాండముల సృష్టిలయముల నొందించు మహా సంకల్పం ఏదైతే ఉన్నదో అట్టి నిరాకార నిర్గుణ తత్త్వమే సాకార సగుణ స్వరూపమై, పూర్వము దత్తాత్రేయుడుగా అవతరించి, ప్రస్తుతము ఈ యుగమున – ఈ కాలమున – శ్రీపాదశ్రీవల్లభరూపము దాల్చినది. శ్రీపాదులను నరాకారముగా భావించుట మహాదోషము. వారు నరాకారముగా తోచు నిరాకారము. సగుణముగా తోచు నిర్గుణము. ఒక దేవతా స్వరూపముగా తోచు సర్వదేవతా స్వరూపము. అన్ని యోగ మార్గములకునూ గమ్యము. సృష్ట్యాది నుండియూ మహర్షులు తమ తమ సాధనా విశేషముల వలన సాక్షాత్కారమును పొందిన దేవతా స్వరూపములన్నియూ శ్రీవారి దివ్యరూపములే.

★★★

సమస్త ధర్మములయందును, మతములయందును, సిద్ధాంతములయందును, స్వప్రకాశముతో వెలుగొందువాడను నేనే! ఆయా జీవుల అభీష్టములను బట్టి, అభిరుచులను బట్టి, వారనుసరించు మార్గములను బట్టి, ఆయా స్థితులను బట్టి భిన్న భిన్న తత్త్వములతో తోచువాడను నేనే! నేను సర్వతంత్ర స్వతంత్రుడను గనుక, సాధ్యాసాధ్యములు లేనివాడను గనుక, నాకు నిర్దిష్టమైన విధానమనునది లేదు. సమస్త దేవీ దేవతాస్వరూపములతోనూ అంతర్నిహితముగా, జ్వాజ్వల్యమానముగా, ప్రకాశించువాడను నేను. కనుక ఆయా స్వరూపముల ద్వారా పూజలను, స్తోత్రములను అందుకొనువాడను నేనే! అందరిని అనుగ్రహించువాడను నేనే! సాధకుడు బహిర్యాగము ద్వారా నైనను, అంతర్యాగము ద్వారా నైనను నన్ను పొందవచ్చును. సాధకుడు బహిర్ముఖుడైనను, అంతర్ముఖుడైనను సదా నేను వానిని కనిపెట్టుకొని యుండువాడను. పలుకరించువాడను నేనే! సత్యం జ్ఞాన మనంత మని వేదములో చెప్పబడినది నేనే! సమస్త గురుస్వరూపము నేనే! ఎవరైతే నిర్మల భక్తితో నన్ను ఆరాధించెదరో, సర్వభారము నాపై వేసి సర్వస్య శరణాగతి పొందుదురో వారి యోగక్షేమములను సదా కనిపెట్టియుండువాడను నేనే! నేను శ్రీపాదుడను! శ్రీ వల్లభుడను!

★★★

ఎవరైననూ సరే! నన్ను వాత్సల్యభక్తితో ఆరాధించిన, వారి ఇళ్ళయందు నేను పసిబాలుడనై తిరుగుచుందును. నా అడుగుల సవ్వడి వారి హృదయములలో సదా ప్రతిధ్వనించుచుండును.

★★★

శ్రీ పాదులవారి శ్రీ చరణముల మ్రోల వినమ్రులై, శిరసువంచి, శరణాగతులైన వారు తల్లి ఒడిలో సంపూర్ణ రక్షణలో నున్న పసిపిల్లలవలె హాయిగా నుందురు. సర్వశుభములను, సౌఖ్యములను పొందెదరు.

శ్రీదత్త ప్రభువుల సంకల్పమువలన భవిష్యత్తు వర్తమానముగా మారవచ్చును. వర్తమానము భూతకాలముగా మారవచ్చును. భూతకాలము వర్తమానముగా రూపుదిద్దుకొనవచ్చును. శ్రీదత్తప్రభువుల చైతన్యము నిత్యవర్తమానము. గతములో జరిగినది., ప్రస్తుతము జరుగుచున్నది. భవిష్యత్తులో జరుగబోవునది అంతయును వారి సంకల్పముననుసరించి ఉండును. ఒక విషయము జరుగుటకు గాని, జరుగకుండా ఉండుటకు గాని, వేరొక వినూత్న పద్ధతిలో జరగుటకు గాని శ్రీదత్త ప్రభువు యొక్క సంకల్పమే ప్రధానము. ఏ మహాసంకల్పముతో సృష్టి స్థితి లయములు జరుగుచున్నవో, ఆ మహాసంకల్పము యొక్క స్వరూపమే శ్రీ దత్తాత్రేయులు. వారే ప్రస్తుతము శరీరధారియై శ్రీపాదశ్రీవల్లభులుగా ఈ భూమండలమున అవతరించిరి.

★★★

దత్తతత్త్వము నీకు అనుభవములోకి రావలయునన్న కొన్ని లక్షల జన్మలు కావలసి వచ్చును. కోటానుకోట్ల బ్రహ్మాండములందంతటా వ్యాపించి యుండి, దానిని అతిక్రమించియున్న ఏకైక తేజోమహారాశియే దత్తుడని తెలియుము. ఆ దత్తప్రభువే సాక్షాత్తు నీ ఎదుటనున్న శ్రీ పాదశ్రీ వల్లభుడని తెలియుము.

★★★

దత్త ప్రభువులు భోగమోక్షప్రదులు. వారిని ఆరాధించుటకు వారి పాదుకలను ఆరాధించిననే చాలును. వారి పాదుకలను నాలుగు వేదములు నాల్గు కుక్కల రూపములను బొంది నాకుచున్నవి. అన్ని అపవిత్రతలనూ పోగొట్టగలిగిన వేదములే అపవిత్ర శునకములై వారి పాద పద్మముల వద్ద పడియుండగా, వారి పవిత్రతను ఊహించుటకు మానవులకే కాదు దేవతలకూ, సప్తర్షులకూ కూడా అసాధ్యము.

పూర్వము వామనావతారము వచ్చినప్పుడు వారికి సమకాలికుడుగా వామదేవమహర్షి అనే ఋషి ఉండేవాడు. ఆయన జన్మసమయమున మాతృగర్భము నుండి తల ఒక పర్యాయము బైటికి

వచ్చి, పరిసరములను పరికించి, తిరిగి గర్భస్థమయ్యెను. అప్పుడు దేవతలు, ఋషులు ప్రార్థించగా వారు తిరిగి జన్మించిరి. వారు ఆ జన్మ బ్రహ్మచారులు.

అదేవిధముగా శ్రీపాదులవారి జననములోనూ జరిగినది. వారు కేవలము జ్యోతిస్స్వరూపము. ఈ ప్రకారముగా రెండుసార్లు జన్మించుట వలన వారు ఆజన్మద్విజులు. తమ సంపూర్ణమైన అఖండ, అనంత, అద్వైత, సచ్చిదానందముతో అవతరించిరి కనుక, ఆ అవతారమున వారికి గురువను వ్యక్తియే లేడాయెను. వాస్తవమునకు వారు త్రిమూర్తుల సంయుక్త రూపముగాక, వారికి అతీతముగా నున్న ఒకానొక ప్రత్యేక తత్త్వము. అందువలన వారు త్రిమూర్తుల కతీతమైన నాలుగవ తత్త్వమని సూచించుటకు చతుర్థీతిథినాడు జనించిరి. సృష్టియందలి ప్రవృత్తి గణములు, నివృత్తి గణములు రెండింటికి అధిపతియైన గణేశతత్త్వమని సూచించుటకు గణేశచతుర్థిదినమున ఆవిర్భవించిరి. మాతృగర్భము నుండి తల ఒకసారి బైటకు వచ్చి, తిరిగి గర్భస్థ మవగా, మహాయోగులు, సిద్ధ పురుషులు, దేవతలు ప్రార్థించగా తిరిగి జన్మించిరి. కనుక వారు ఆజన్మ బ్రహ్మజ్ఞాన సంపన్నులు.

★★★

అవతారములు కాలానుగుణ్యముగా వచ్చుచుండును. మానవుడు భగవంతుడైన యెడల సమర్థసద్గురువని పిలువబడును. దైవము మానవునిగా వచ్చిన యెడల అవతార మనబడును. మత్స్యము నీటిలో వడిగా పరుగెత్తగలదు. కూర్మము నీటిలోనూ, భూమిమీద వడిగా పోవగలదు. వరాహము అనగా ఖడ్గమృగము భూమిమీద వడిగా పరుగెత్తగల జంతువు. నారసింహము మృగములో శ్రేష్ఠమైన సింహపు ముఖావృత్తితోనూ, మిగిలిన భాగము మనుష్య రూపముతోనూ ఉన్న అవతారము. యాచనా ప్రవృత్తిగల తమోగుణ ప్రధానముగా వచ్చినది వామనావతారము. రజోగుణ ప్రధానముగా వచ్చినది పరశురామావతారము. సత్త్వగుణ ప్రధానముగా వచ్చినది రామావతారము. త్రిగుణులకు అతీతమైన నిర్గుణతత్త్వ ప్రధానముగా వచ్చినది శ్రీకృష్ణావతారము. కర్మప్రధానముగా వచ్చినది బుద్ధావతారము. సమస్త సృష్టిలోని ఏకత్వమునందలి అనేకత్వమును, అనేకత్వము నందలి ఏకత్వమును తనయందే నిలుపుకుని వచ్చిన అత్యంత అద్భుతమైన, అత్యంత విలక్షణమైన యుగావతారము శ్రీపాద శ్రీవల్లభావతారము. శ్రీపాదులకు ఋణానుబంధములేని యోగసాంప్రదాయములుగాని, మతములుగాని, ధర్మములు గాని సృష్టిలో లేనేలేవు. శ్రీపాదులవారి స్థితి ఎంతటి ధీమంతులకైనను గోచరము కానిది. వారికి వారే సాటి. అన్ని సిద్ధాంతములును, అన్ని సాంప్రదాయములును వారి యందు సమన్వయము చెందును. ఈ సృష్టికంతటికిని ఆది బిందువువారే! స్పందన శీలమైన ఈ

జగద్వ్యాపారమునంతయును పర్యవేక్షించునది. గతినొందించునది వారే! ఇది నిగూఢమైన దైవ రహస్యము.

శ్రీ పాదులవారి సంకల్పముననుసరించి గ్రహములు, ఫలితము లిచ్చుచుండును. ఏ రకములైన జ్యోతిష ఫలితములైనను నిర్దేశిత భౌతిక కాలమునందు భౌతిక దేశమునందు జరిగి తీరవలయుననెడి నియమములేదు. అది యోగకాలమును బట్టి, యోగదేశమునుబట్టి నిర్ణయించబడుచుండును.

శ్రీపాదులవారు జ్యోతిషశాస్త్ర రీత్యా వెయ్యి సంవత్సరముల తర్వాత జరుగవలసిన సంఘటలను ఇప్పుడే జరిపించగలరు. అనగా యోగకాలమును ఇప్పుడే నిర్ణయించగలరు. ఎక్కడో సుదూరముగా జరుగవలసిన సంఘటనను ఇక్కడే జరిపించగలరు. అనగా యోగదేశమును నిర్ణయించగలరు. శ్రీపాదులవారు ఆ దేశ కాలాదులను తమ ఇష్టమువచ్చినట్లు మార్చి వేయగలరు.

★★★

కురుంగడ్డ అరుణాచల పర్వతమునకు సమానమైన స్థితి. అర్ధనారీశ్వర రూపమునందున్న అరుణాచలేశ్వరుడే శ్రీపాద శ్రీ వల్లభుడు. అరుణాచలము నందున్న మహాసిద్ధుడు కూడా ఈ యతీశ్వర వేషధారియే! అరుణాచలంలో కొండ సాక్షాత్తు శివరూపమైనట్లు ఈ కురుంగడ్డ సాక్షాత్తు శ్రీవల్లభులవారి రూపమే! అరుణాచల శివలింగమునందు శివశక్తులున్నట్లు శ్రీపాదశ్రీవల్లభ రూపమునందును శివశక్తులున్నవి. అయితే అరుణాచలమునందలి మహాసిద్ధుని రూపమునందున్న పరమేశ్వరుని దర్శనము అత్యంత దుర్లభము, శ్రీపాద శ్రీవల్లభ రూపమున ఉన్న ఈ మహాసిద్ధరూపము సాధకులకు అత్యంత సులభప్రదమై ఉన్నది.

శ్రీపాదులవారి వామభాగమున శక్తి సంచారము, కుడిభాగమున శివసంచారము గలదు. కావున వారు శివశక్తి స్వరూపులు. వారి హృదయమునందు పద్మావతీ అమ్మవారు కలదు. హృదయము దయకు స్థానము. అనాహత చక్రమునకు స్థానము. అక్కడ నుండి శక్తి ఊర్ధ్వచక్రములకూ, అధోచక్రములకూ చేరుచుండును. అందువలన మరియొక చైతన్యమయ దివ్యశరీరములో వారు శ్రీ పద్మావతీ వేంకటేశ్వరులు. వారు వాణీహిరణ్యగర్భుల స్వరూపము కూడా. పరా పశ్యంతి మధ్యమావైఖరీ స్వరూపముగా నుండెడి వాణీదేవి (సరస్వతీదేవి) వారి నాలుకపై ఉండును. వాణీమాత దివ్యమానసము, హిరణ్యగర్భుని దివ్యమానసము అద్వైత స్థితిలో ఉండును. వారు వాణీ హిరణ్యగర్భులనెడి చైతన్యశరీరము, శివపార్వతులనెడి చైతన్యశరీరమును, పద్మావతీ వేంకటేశ్వరు లనెడి చైతన్య శరీరమును

ఏకకాలమున ధరించుచు, వీటికి అతీతమైన శ్రీపాదశ్రీవల్లభులనెడి చైతన్య శరీరమునొకటి ధరించియుందురు. ఇందులో ఏ ఒక్క శరీరము మరియొక దానితో కనీసము స్పర్శను కూడ కలిగియుండదు. ఇది వారి యోగమాయ. వారిని ద్వైతులన్నను, అద్వైతులన్నను, విశిష్టాద్వైతులన్నను వాటికన్నిటికి అతీతులన్నను చెల్లును. ఆత్మమాయచేత తన్ను తానే సృష్టించుకొన్న ఆ దత్తప్రభువుకు అసాధ్యమంటూ ఏముంటుంది?

ఈ గ్రంథంలో శ్రీ మల్లాది బాపన్నావధానులుగారు తమ మనుమడైన శ్రీపాద శ్రీవల్లభులను సాక్షాత్తు దత్తాత్రేయునిగా దర్శించి, స్తోత్రించిన ఆ మహాస్తోత్రాన్ని ఈ క్రింద ఉల్లేఖిస్తున్నాను. ఈ స్తోత్రం పఠిస్తే అనఘాష్టమీ వ్రతం చేసి, సహస్ర బ్రాహ్మణ భోజనం పెట్టిన ఫలితం వస్తుంది. సమస్త దుఃఖాలు, కష్టాలు పోతవి. అభీష్ట సిద్ధి అవుతుంది. శ్రీపాదుల దివ్యానుగ్రహానికి పాత్రులౌతారని ఆ గ్రంథంలో చెప్పబడింది. ఆ సిద్ధ మంగళాస్తోత్రం పఠించండి!

అవధూత చింతన శ్రీగురుదేవదత్త!

అంతరంగముల గురుడు సొంతంబుగా నిలచి
నిలిపినాడు నన్ను నిశ్చలముగా
ఉన్మనీ స్థితి ఉడిగె, చాంచల్యంబు ఉడిగె
మాటలుడిగె, నవ్వులాటలుడిగె
మరచిపోకుడు శివానందుని మంచిమాట

ప్రేమలేకున్న, శాంతి లభింపబోదు
విరహమే లేక, వైరాగ్యవిభూతి లేదు
సద్గురుండు లేక, మనస్సులోని సంశయమాది
మలిన దోషంబు లెట్టుల మాయమగునూ
మరచిపోకుడు శివానందుని మంచిమాట

– శ్రీ స్వామి శివానంద మహరాజ్

సిద్ధ మంగళాస్తోత్రం

శ్రీ మదనంత శ్రీ విభూషిత అప్పల లక్ష్మీనరసింహరాజా ।
జయ విజయీభవ, దిగ్విజయీభవ, శ్రీమదఖండ శ్రీవిజయీభవ॥
శ్రీ విద్యాధరి రాధా సురేఖా శ్రీరాఖీధర శ్రీపాదా ।
జయ విజయీభవ, దిగ్విజయీభవ, శ్రీ మదఖండ శ్రీ విజయీభవ ॥
మాతాసుమతీ వాత్సల్యామృత పరిపోషిత జయ శ్రీపాదా ।
జయ విజయీభవ, దిగ్విజయీభవ, శ్రీ మదఖండ శ్రీ విజయీభవ ॥

సత్యఋషీశ్వర దుహితానందన బాపనార్యనుత శ్రీచరణా ।
జయ విజయీభవ, దిగ్విజయీభవ, శ్రీ మదఖండ శ్రీ విజయీభవ ॥

సవితృకాఠకచయన పుణ్యఫల భరద్వాజ ఋషి గోత్ర సంభవా ।
జయ విజయీభవ, దిగ్విజయీభవ, శ్రీ మదఖండ శ్రీ విజయీభవ ॥

దోచౌపాతీ దేవ్ లక్ష్మీఘన సంఖ్యాబోధిత శ్రీచరణా ।
జయ విజయీభవ, దిగ్విజయీభవ, శ్రీ మదఖండ శ్రీ విజయీభవ ॥

పుణ్య రూపిణీ రాజమాంబ సుత గర్భపుణ్యఫల సంజాతా ।
జయ విజయీభవ, దిగ్విజయీభవ, శ్రీ మదఖండ శ్రీ విజయీభవ ॥

సుమతీనందన నరహరినందన దత్తదేవ ప్రభు శ్రీపాదా ।
జయ విజయీభవ, దిగ్విజయీభవ, శ్రీ మదఖండ శ్రీ విజయీభవ ॥

పీఠికాపుర నిత్యవిహారా మధుమతి దత్తామంగళరూపా ।
జయ విజయీభవ, దిగ్విజయీభవ, శ్రీమదఖండ శ్రీవిజయీభవ ॥

ఓం ద్రాం శ్రీపాద శ్రీవల్లభాయ నమః
శ్రీ దత్త శ్శరణం మమ; శ్రీపాదరాజం శరణం ప్రపద్యే
దిగంబరా! దిగంబరా! శ్రీపాదవల్లభ దిగంబరా!

అవధూత చింతన శ్రీగురుదేవదత్త!

శ్రీనృసింహ సరస్వతి

మాయాతమోర్కం విగుణం గుణాఢ్యం । శ్రీవల్లభం స్వీకృతభిక్షువేషం ॥
సద్భక్త సేవ్యం వరిష్టం । వందే నృసింహేశ్వర పాహి మాం త్వం ॥

మహారాష్ట్ర దేశంలోని అకోలా జిల్లాలోని “కరంజా” అనే గ్రామంలో శుక్లయజుశ్శాఖకు (యాజ్ఞవల్క్యశాఖకు) చెందిన మాధవశర్మ, అంబ అను దంపతులకు నరసింహ సరస్వతి జన్మించారు. గత జన్మలో శ్రీపాద శ్రీవల్లభులచే తాను పుత్రునిగా జన్మించగలనని వరం పొందిన మూర్ఖ పుత్రుని తల్లియైన అంబికయే ఈ అంబ. తమ కుమారుడు పుట్టినవెంటనే అందరు పిల్లలు పుట్టగానే ఏడ్చినట్లు ఏడవక ఓంకారాన్ని ఉచ్ఛరించటం చూచి ఆ తల్లిదండ్రులు ఆశ్చర్యపోయారు. జ్యోతిష్కులు ఆ పిల్లవాడి జాతక చక్రాన్ని చూచి “ఈపిల్లవాడు భవిష్యత్తులో జగద్గురు వౌతాడు. ధర్మోద్ధరణ చేస్తాడు. ఈ పురుష శ్రేష్ఠుని వల్ల మీ వంశం యావత్తూ తరిస్తుంది.” అని చెప్పటం వల్ల వాళ్ళు ఆ పిల్లవానికి “నరహరి” అని పేరు పెట్టారు. నరహరి అంటే “నరులలో శ్రేష్ఠమైనవా”డని అర్థం. పురుషోత్తముడని విశేషార్థం.

తన దగ్గర పిల్లవాడికి చాలినన్ని పాలు లేకపోవడం చూచి, “ఒక ఆవునుగాని, మేకనుగాని, లేదా ఒక దాదిని గాని ఏర్పాటుచేయ”మని అంబ భర్తతో చెబుతుంటే, చంకలోని ఆ పిల్లవాడు తల్లి వక్షోజాలను కిలకిలా నవ్వుతూ తాకాడు. వెంటనే వాటిలో నుంచి పాలు ధారాపాతంగా స్రవించాయి. ఈ అద్భుత లీలను వాళ్ళు చూచి, ఇది అందరికి తెలిస్తే దిష్టి తగులుతుందని భయపడి ఎవ్వరికీ చెప్పలేదు.

పిల్లవాడికి ఏడేళ్ళు వచ్చినా అతడు ప్రణవం తప్ప ఏ మాటలు ఉచ్ఛరించేవాడు కాదు. తల్లిదండ్రులు ఆ పిల్లవాడికి మాటలు రావాలని ఎన్నో విధాల ప్రయత్నించారు. కాని లాభం లేకపోయింది. అందుకు వాళ్ళు కలత చెంది విచారిస్తుంటే నరహరి తన దగ్గర ఉన్న ఒక ఇనుప వస్తువును తాకాడు. వెంటనే అది సువర్ణంగా మారింది. ఆ లీల పరమార్థం ఏమిటో వాళ్ళు గ్రహించలేక మరికొన్ని ఇనుప వస్తువులు ఆ పిల్లవాడి చేతికిచ్చి తాకించారు. అవన్నీ బంగారంగా మారాయి. ఈ వింత చూచి తమ పిల్లవాడు మామూలు పిల్లవాడు కాదనీ, ఏ సిద్ధ పురుషుడో ఇట్లా తమకు పుత్రుడై జన్మించాడనీ వాళ్ళు భావించినప్పటికీ, అతడు మాట్లాడకపోవడం జూచి చాలా దిగులుపడుతూ ఉండేవాళ్ళు.

ఒకరోజు అంబ తన కుమారుణ్ణి దగ్గరకు తీసుకొని "నాయనా! నీవెప్పుడు మాట్లాడుతావురా? నీ ముద్దుమాటలు వినేభాగ్యం మాకు లేదా తండ్రీ?" అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకొంది. నరహరి చేత్తో సైగలు చేస్తూ తనకు ఉపనయనమై యజ్ఞోపవీతం మెళ్ళోపడిన తర్వాత గాయత్రీ ఉపదేశమైన వెంటనే మాట్లాడుతా"నని తెలియచేశాడు.

తల్లిదండ్రులు పరమానందభరితులై తక్షణం కుమారుడికి ఉపనయనం చేయాలని సంకల్పించి సుముహూర్తం నిశ్చయించి, అందరికి ఆహ్వానాలు పంపించారు. "మాటలే రాని పిల్లవాడు గాయత్రీ మంత్రాన్ని ఏం ఉచ్ఛరిస్తాడు? మూగవాడికి ఈ వడుగేమిటి? వీళ్ళ పిచ్చి కాకపోతే?" అని అంతా విడ్డూరంగా చెప్పుకొన్నారు. ఉపనయన సందర్భంలో తండ్రియైన మాధవశర్మ ఉపదేశించిన గాయత్రీ మంత్రాన్ని సుస్వరంతో నరహరి పలకటాన్ని చూచి అంతా విభ్రాంతులయ్యారు. ఇక తల్లిదండ్రులకైతే వాళ్ళ ఆనందానికి పట్ట పగ్గాల్లేవు. ఉపనయనంలో ప్రప్రథమంగా మాతృమూర్తి వటువుకు భిక్ష ఇవ్వటం విధి. కాబట్టి అంబ కుమారుడి దగ్గరకు పోయి "నాయనా! భిక్ష అడుగు!" అంది. వెంటనే నరహరి "అగ్నిమీళే" అనే ఋగ్వేదంలోని ప్రథమ మంత్రాన్ని పఠించి భిక్ష యాచించాడు. తల్లి మొదటి భిక్ష పెట్టింది. అతడు రెండవసారి యజుర్వేదంలోని "ఇషేత్వా" అనే రెండోపనస చదివి భిక్ష అర్థించాడు. మూడవసారి "అగ్న ఆయాహి" అని సామవేద మంత్రాన్ని చదివాడు. ఉపనయనానికి వచ్చిన వాళ్ళందరూ విభ్రాంతులై "నరహరి సాక్షాత్తు భగవదవతారమే గాని నరుడు కాదు. జగద్గురువు" అని భక్తి పూర్వకంగా నమస్కరించారు.

భిక్ష కాగానే నరహరి "అమ్మా! నువ్వు నన్ను భిక్ష అడుగమన్నావు. నీవు మాట తప్పరాదు అడుగుతున్నాను. నీ మాట ప్రకారం నేను నా యావజ్జీవం భిక్షతోనే కాలం గడుపుతాను. సన్యాసాశ్రమం స్వీకరించటానికి అనుజ్ఞ ఇవ్వు!" అని అడిగాడు. ఇన్నాళ్ళు మూగగా ఉండి, అకస్మాత్తుగా మాట్లాడుతున్న పుత్రుడి ముద్దుమాటలు వింటూ ఆనందంలో తేలిపోతున్న ఆ తల్లిదండ్రులకు, నరహరి మాటలు అశనిపాతాలయ్యాయి. దుఃఖం కట్టలు త్రెంచుకుంది. "నాయనా! మాకు నువ్వు ఒక్కగానొక్క కుమారుడివి. నువ్వు ఇల్లు విడిచిపోతే మాకింక దిక్కెవరు తండ్రీ!" మేం బ్రతికే దెట్లారా నాయనా?" అంటూ ఆ బాలుణ్ణి కౌగిలించుకుని వాళ్ళు శోకించటం మొదలుపెట్టారు.

అప్పుడు నరహరి తల్లిని చూచి "అమ్మా! ధర్మరక్షణ కోసం నేను ఈ భూమిపై అవతరించాను. నీకు నలుగురు పుత్రులు జన్మిస్తారు. వాళ్ళు మిమ్మల్ని ఎంతో భక్తిగా సేవించి వంశాన్ని ఉద్ధరిస్తారు.

పూర్వజన్మలో శివార్చన చేసి, తత్ఫలితంగా నన్ను పుత్రునిగా నీవు పొందావు" అని చెప్పి ఆమెకు పూర్వజన్మ స్మృతి కలిగేటట్లు చేశాడు. ఆమె తన పుత్రుడే శ్రీపాదశ్రీవల్లభుడన్న సత్యాన్ని గ్రహించింది. అతని పాదాలపై వ్రాలింది. నరహరి ఆమెను లేవనెత్తి "అమ్మా! నాకు తీర్థాటనకై అనుజ్ఞ ఇవ్వు!" అని అడిగితే, ఆమె "నాయనా' నాకు నలుగురు కుమారులు కలుగుతా రన్నావు. ఒక కుమారుడు కలిగేటంతవరకైనా నీవు మా వద్ద ఉండు" అని అంది. "అట్లాగేనమ్మా! ఒకడు కాదు. ఇద్దరు కలిగేటంతవరకు మీ దగ్గర ఉంటాను. ఆ తర్వాత మీరు నాకు సన్యసించటానికి ఆజ్ఞ ఇవ్వాలి" అన్నాడు. అందుకు తల్లిదండ్రులు అంగీకరించారు.

ఇట్లా ఒక సంవత్సరం గడిచింది. అంబ గర్భం ధరించి కవల పిల్లలను గన్నది. అప్పుడు నరహరి తల్లిని చూచి "అమ్మా! నీ కోరిక నెరవేరింది గదా? ఇంకా నీకు మరి ఇద్దరు పుత్రులు, ఆ తర్వాత ఒక కూతురు జన్మిస్తారు. అందరూ పూర్ణాయుష్మలై ఉంటారు. నేను నా మాట నిలుపుకొన్నాను. ఇక నీవు సంతోషంగా నాకు ఆజ్ఞ ఇవ్వవచ్చు. ముప్ఫై సంవత్సరాల తర్వాత మీకు మరలా నా దర్శనం లభిస్తుంది." అని చెప్పి, తల్లిదండ్రుల అనుజ్ఞ తీసుకుని, బదరీ నారాయణుని దర్శనార్థం బయలుదేరాడు.

బదరీ దర్శించి ఆ తరువాత కాశీకి ఆయన వచ్చాడు. అక్కడ ఆయన చేసే యోగాభ్యాసనం తపస్సు చూచి అక్కడి వాళ్ళంతా ఆశ్చర్యపోయారు. అక్కడ ఉన్న సన్యాసుల్లో మహాజ్ఞాని అనిపించుకొన్న "కృష్ణసరస్వతి" అనే వృద్ధ తపస్వి నరహరిని చూచి, ఆయన భగవదవతారమని గ్రహించి, సన్యాసమివ్వాలని సంకల్పించాడు. నరహరి ఆ మహాత్ముని వద్ద సశాస్త్రీయంగా సన్యాసాశ్రమ దీక్ష స్వీకరించాడు. గురుదేవులైన కృష్ణ సరస్వతి ఆయనకు "నరసింహ సరస్వతి" అనే యోగ పట్టా బహూకరించి, తన జన్మ ధన్యమైందని భావించాడు. కాశీపట్టణంలో అనేకులు ఆయనకు శిష్యులయ్యారు. అక్కడి నుంచి శిష్య సమూహంతో గంగాసాగర క్షేత్రానికి వచ్చి, అక్కడ నుంచి ప్రయాగ తీర్థానికి వచ్చారు. ఆ ప్రదేశంలో "మాధవు" డనే బ్రాహ్మణునకు సన్యాస దీక్ష ఇచ్చారు. చాలా మంది శిష్యులున్నప్పటికీ నరసింహ సరస్వతికి ఈ మాధవ సరస్వతిపై ప్రీతి ఎక్కువగా ఉండేది. స్వామి వారి శిష్యుల్లో ప్రధానులైన వాళ్ళు ఏడుగురు. వాళ్ల పేర్లు బాలసరస్వతి, కృష్ణ సరస్వతి, ఉపేంద్రసరస్వతి,, మాధవసరస్వతి,, సదానందసరస్వతి, జ్ఞానజ్యోతిసరస్వతి, సిద్ధసరస్వతి. ఈ సిద్ధ సరస్వతే గురుచరిత్రను నామధారకుడికి చెప్పటం జరిగింది.

ఉత్తర ప్రదేశమంతా తిరిగి, నరసింహసరస్వతి దక్షిణ దేశానికి వచ్చి, తీర్థయాత్రలు చేస్తూ

కరంజానగరానికి తిరిగి వచ్చారు. అక్కడ తల్లిదండ్రులను, తమ్ముళ్ళి, చెల్లెల్ని ఆనందింపచేశారు. అక్కడి బ్రాహ్మణులంతా నరసింహసరస్వతి స్వామిని తమ తమ ఇండ్లకు ఆహ్వానించగా, అందరి ఇండ్లకు బహురూపాలు గైకొని, ఏక సమయంలో పోయి, అందరినీ ఆశ్చర్యపరిచారు. చెల్లెలైన రత్న తన భూతభవిష్యత్తులు చెప్పమని కోరగా వాటిని తెలిపి, పూర్వజన్మలో నీవు గోవును కర్రతో కొట్టిన పాపము వల్ల ఈ జన్మలో నీకు కుష్ఠురోగం వస్తుంది. అప్పుడు నా దర్శనం మరల నీకు లభిస్తుంది. ఆ రోగం వచ్చిన వెంటనే గంధర్వనగరానికి (గాణగాపురానికి) నీవు వచ్చి భీమానది తీరానికి దక్షిణంగా ఉన్న పాపవినాశ తీర్థంలో స్నానం చెయ్యగానే ఆ రోగం నశించి నీవు మామూలు స్థితికి రాగలవు" అని చెప్పి అక్కడనుండి నాసికాత్ర్యంబకానికి ప్రయాణమై వెళ్లారు. అచ్చటినుండి మంజరీక క్షేత్రంలో గల మాధవారణ్యకం చేరారు. అక్కడి నృసింహ భక్తుడైన మాధవారణ్య యతికి నరసింహస్వామిగా దర్శనమొసగి ఆయన్ను సంతృప్తుణ్ణి గావించారు.

అటు పిమ్మట వాసర క్షేత్రానికి పోయి, గోదావరిలో ప్రాణత్యాగం చేసుకోబోతున్న బ్రాహ్మణుని కాపాడి, ఆయన ఉదరశూల పోగొట్టారు. సాయందేవుని భక్తిని మెచ్చుకొని, శిష్యునిగా స్వీకరించి, 15 సంవత్సరాల తర్వాత మరల తన దర్శనం లభించగలదని వరమిచ్చారు. తన దగ్గరున్న శిష్యులనందరినీ తీర్థయాత్రలు చేయవలసిందిగా ఆజ్ఞాపించి, వారందరిని పంపి, సిద్ధుడనే శిష్యుణ్ని మాత్రం తోడు తీసుకొని, వైద్యనాథం పోయి అక్కడ ఒక సంవత్సరము నివసించారు. ఆ తరువాత భిల్లవాటికి (ఔదుంబరు క్షేత్రానికి) వచ్చి, హస్త స్పర్శ మాత్రం చేతనే మూర్ఖ బ్రాహ్మణుడిని మహాజ్ఞాని అయ్యేటట్లు చేశారు. ఆ తర్వాత అమరపురానికి పోయి అక్కడ పన్నెండేళ్ళు ఉన్నారు. ఆ పురంలోని పేద బ్రాహ్మణుని ఇంటికి భిక్షకు పోయి, వాళ్ళ పెరటిలో ఉన్న తమ్మచెట్టు తీగెను పీకి, దాని పాదులో నిధి లభించేటట్లు చేసి, ఆ బ్రాహ్మణుని దారిద్ర్యాన్ని పోగొట్టారు. గంగానుజుడిని తన యోగశక్తితో వెంటనిడుకొనిపోయి, ఒక్కరోజులో కాశి, గయ, ప్రయాగలు చూపించి ఇంటికి తిరిగి తీసుకొని వచ్చారు. ఆ తర్వాత ఆయన గాణుగాపురం వెళ్ళి, అక్కడే తాను కృష్ణానదిలో అదృశ్యమయ్యేవరకు (అవతార సమాప్తివరకు) నివసించారు.

గాణుగాపురంలో నరసింహ సరస్వతి చూపిన లీలలకు లెక్కలేదు. గొడ్డుబోతు బఱ్ఱెను పాలిచ్చేటట్లు చేశారు, త్రివిక్రమ యతికి విశ్వరూపం చూపించారు. తాను ప్రసాదించిన భస్మధారణ మాత్రం చేత ఛండాలుని నోట వేదాలు పలికించారు. ఎండిన మేడికొమ్మను చిగురించేటట్లు చేశారు. వృద్ధ వనితకు పుత్రోదయమయ్యేటట్లు చేశారు. బ్రహ్మరాక్షసుడికి శాపవిమోచనం కలిగించారు. ఏక కాలంలో

ఎనిమిది ప్రదేశాల్లో తన దర్శనం ప్రసాదించారు. బీదరు నవాబు రాచపుండు పోగొట్టారు. పూర్వాశ్రమంలో తన చెల్లెలైన రత్నాబాయి కుష్ఠును, నరహరి అనే బ్రాహ్మణుని కుష్ఠును పోగొట్టారు. బాస్కర బ్రాహ్మణుడు ముగ్గురికి సరిపడేవంట చేస్తే, ఆ వంట అక్షయం చేసి వేలాదిమంది భుజించేటట్లు చేశారు. నిరక్షరకుక్షియైన నందిశర్మను మహాకవీశ్వరుని గావించారు.

ఈ లోకంలోకి తాను వచ్చినపని విజయవంతంగా పూర్తి చేసుకొని, అవతార సమాప్తి గావించాలని నిశ్చయించి, మఠంలో తన నిర్గుణ పాదుకలనుంచి, శ్రీశైలయాత్ర మిషతో నరసింహ సరస్వతి తన నలుగురు శిష్యులను తీసుకొని గాణుగాపురం నుంచి బయలుదేరారు. తనను విడువలేక వెన్నంటి వస్తున్న జనులను చూచి "నేనెక్కడికి వెళ్ళటం లేదు. నా నిత్యకృత్యాలన్నీ యథాప్రకారంగా ఉదయం సంగమంలో జరుగుతుంటాయి. మధ్యాహ్న సమయానికి ఎప్పటి మాదిరిగానే నేను మఠానికి వచ్చి అక్కడే ఉంటాను. నాపై నిజమైన నిశ్చల భక్తి కలిగిన వాళ్ళకే నా దర్శనం లభిస్తుంది. భిక్షా సమయంలో అర్హత కలిగిన వాళ్ళు ఇక్కడ నన్ను దర్శించగలుగుతారు. ఈ గంధర్వపురానికి నా దర్శనం కోసం వచ్చే వాళ్ల కోరికలన్నీ నేను తీరుస్తాను. ప్రాతఃకాలంలో సంగమంలో స్నానం చేసి, అక్కడ నా నివాసస్థానమైన అశ్వత్థ వృక్షాన్ని అర్చించి, నా సగుణ పాదుకలు పూజించి, మఠానికి వచ్చి నా నిర్గుణ పాదుకలను సందర్శించి పూజించే వాళ్ళను అనుగ్రహించి, సదా వాళ్ళ వశవర్తినై ఉంటాను. మఠంలో నేను లేననేమాట మరిచిపోండి!" అని చెప్పి వాళ్ళను వెనుకకు మరలించారు. వాళ్ళు మఠానికి తిరిగి వచ్చి చూచేసరికి యథాస్థానంలో కూర్చునిఉన్న నరసింహ సరస్వతి స్వామి, వాళ్ళకు కనిపించాడు. అప్పుడు వాళ్ళకు స్వామి మాటల్లోని సత్యం బోధపడి మనస్సు తేలికైంది.

నరసింహ సరస్వతి శ్రీశైలం చేరి, తాను లోగడ చెప్పిన ప్రకారం తన దర్శనం కోసం వచ్చి, తన రాకకోసం నిరీక్షిస్తున్న శిష్యులను కలుసుకొని వాళ్ళకు పరమానందం చేకూర్చారు. ఆ తర్వాత తన నలుగురు శిష్యులతో పోయి పాతాళగంగలో స్నానం చేసి, తన అనుష్ఠానాలన్నీ పూర్తి చేసుకొని, శిష్యులను పిలిచి, "నాకొక పుష్పాసనం తయారుచేయండి! దానిపై కూర్చుని ప్రయాణించి నా స్వస్థానానికి వెళ్ళుతాను" అని, వాళ్ళు తెచ్చిన ఆ ఆసనం మీద కూర్చుని, "మీకు నాలుగు పుష్పాలు ప్రసాదంగా పంపుతాను. వాటిని గ్రహించి భద్రంగా మీ దగ్గర ఉంచుకోండి! నా నిర్గుణ పాదుకలను భక్తితో ఆరాధించండి! మీ అభీష్టం సిద్ధిస్తుంది." అని చెప్పి, శిష్యులు చూస్తుండగానే కొంత దూరంపోయి అంతర్థానమయ్యారు.

కొంతసేపటికి కొందరు నావికులు వాళ్లను సమీపించి "మేము స్వామి వారిని చూచాం. వారి

చేతిలో దండకమండలాలున్నవి. ఆ యతిస్వరూపుడు మమ్ము చూచి, "నాశిష్యులు ముందర ఉన్నారు. నేను కదళీవనానికి పోతున్నానని చెప్పి, మిమ్మల్ని గంధర్వ నగరం పొమ్మని సెలవిచ్చారు." అని గురు సందేశం చెప్పి వాళ్లు వెళ్లిపోయారు. ఇంతలో నాలుగు పుష్పాలు నదీజలాల్లో తేలియాడుతూ వాళ్ళున్న చోటుకు వచ్చి ఆగిపోయాయి. ఆ నలుగురు శిష్యులు గురుప్రసాదంగా లభించిన ఆ నాలుగు పుష్పాలను కళ్ళకద్దుకొని పరమానంద భరితులై స్వీకరించారు.

గురు మహిమను ఎవ్వరూ వాక్కులతో వర్ణించలేరు. అట్లా వర్ణించే శక్తి కూడ ఎవ్వరికీ ఉండదు. గురుప్రసాదాన్ని పుష్కలంగా పొందిన గంగాధర సరస్వతి "గురోశ్చరిత్రం ఖలు విస్తరేణ మయోదితం కామధుగాదరేణ" అని – నేను చెప్పిన ఈ గురుచరిత్ర కామధేనుసదృశమైన దని – ఉద్ఘోధించాడు. ఈ చరిత్ర వేదతుల్య మనటంలో ఎటువంటి సందేహం లేదు. దత్తావతారాల్లో శ్రీపాదులు యతి ధర్మానికి ఆద్యులై నిలిచి, గురు తత్వానికి బీజావాపనం గావిస్తే, శ్రీ నరసింహ సరస్వతిస్వామి దానికి దోహదం చేసి మహావృక్షం గావించారు. ఆ తర్వాత అది శాఖోపశాఖలై ఎట్లా విస్తరించిందో! ఆ తర్వాత వచ్చి, విస్తరిల్లిన గురుపరంపరే నిదర్శనంగా నిలుస్తున్నది.

ఓం ద్రాం శ్రీ నృసింహ సరస్వత్యై నమః

అవధూత చింతన శ్రీగురుదేవదత్త !

ముఖ్యక్షేత్రము, మార్గము : పూనా నుండి రాయచూర్ వెళ్ళు రైలు మార్గములో గాణుగాపూర్ స్టేషన్ కలదు. ఇక్కడ దిగి 14 మైళ్ళు దూరములో ఉన్న భీమా–అమరజ నదుల సంగమం దగ్గరగా ఉన్న గాణుగాపురం బస్సుపై వెళ్ళవచ్చును. గుల్బర్గా స్టేషన్‌లో దిగి బస్సులపై గాణుగాపురం చేరుకోవచ్చును.

సేవజేతు నేను సమర్థుని సేవకునిగా
తప్పులెన్నడు నా సేవలో దొరలకుండా
నగ్నయై పతివ్రతయున్న నష్టమేమి
పతికి లజ్జాకరంబుగా ఉండదెపుడూ
మరచిపోకుడు శివానందుని మంచిమాట

– శ్రీ స్వామి శివానంద మహరాజ్

మాణిక్య ప్రభువు

గురుదత్తం మహాత్మానం భక్తకార్యకల్పద్రుమం ।
సకల మతస్థాపకం వందేహం మాణిక్యప్రభుమ్ ॥

శ్రీవత్సగోత్ర దేశస్థ బ్రాహ్మణుడైన మనోహరనాయక్ హరకుడే, బయాదేవి దంపతుల గర్భశుక్తి ముక్తాఫలంగా 1817 సం॥రం డిశంబర్ 12వ తేదీనాడు (ఈశ్వరనామ సంవత్సర మార్గశిర శుద్ధ చతుర్దశీ మంగళవారం నాడు - దత్తజయంతి పర్వదినాన) ద్వితీయ కుమారుడుగా శ్రీమాణిక్య ప్రభువు జన్మించారు. వీరి తల్లిదండ్రులు దత్తభక్తులు. గాణుగాపూర్‌లోని నరసింహ సరస్వతీ స్వామివారు వారి ఇష్టదైవం. 16 సం॥లు అఖండంగా వారు గురుచరిత్ర పారాయణ చేశారు. వారి నియమ నిష్ఠలకూ, అచంచలమైన భక్తిప్రపత్తులకూ దత్తప్రభువు సంతోషించి వారికి దర్శనమిచ్చి "మీకిష్టమైన వరమేదైనా కోరుకోండి ఇస్తా" నంటే వారు "మీవంటి పుత్రుడు మాకు కావాలి స్వామి!" అని కోరారు. ఆ కోరిక తీర్చుట కొరకు దత్తప్రభువు వారికి పుత్రుడై జన్మించాడు. ఆయనకు తల్లిదండ్రులు పెట్టినపేరు "మాణిక్య". మాణిక్యప్రభువు చిన్నతనంలోనే తండ్రి మరణించటంతో ఆ కుటుంబపోషణ బాధ్యత యావత్తు మేనమామపై పడింది.

శ్రీకృష్ణుడు బాల్యంలో ఎన్ని లీలలు చూపించాడో మాణిక్య ప్రభువు కూడా బాల్యంలో అన్ని లీలలు చూపించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. అది చూచి ప్రజలంతా ఆయన్ను దత్తాత్రేయ అవతారంగా భావించేవారు. ఆ పిల్లవాడు ఏమి చెబితే అది జరిగి తీరుతుందని అంతా నమ్మి ఆయన్ను "వేడాభావు" (పిచ్చితమ్ముడు) అని పిలుస్తుండేవారు. మాణిక్య ప్రభువుకు చాలామంది పిల్లలు స్నేహితులుగా ఉన్నా "గోవిందు" అంటే చాలా ఇష్టపడుతుండేవాడు. ఎక్కడికి వెళ్ళినా ఇద్దరూ కలసిపోతుండేవారు. ప్రతిరోజు వచ్చే సమయానికి ఒకరోజున అతడు రాకపోయేసరికి "ఎందుకు రాలేదా?" అని వాళ్ళింటికి వెళ్ళాడు. అకస్మాత్‌గా గోవిందు చనిపోతే, అందరూ అతని శవం చుట్టూ చేరి ఏడుస్తున్నారు. మాణిక్య మెల్లగా గోవిందు దగ్గరికి పోయి, నిద్రపోతున్నవాణ్ణి చేత్తో కదిపి లేపేవిధంగా కదుపుతూ, "గోవిందా! లేరా! లే! ఇప్పటికే ఆలశ్యమైంది. పోదాం పద!" అంటూ పిలిచాడు. నిద్రపోతున్నవాడు లేచినట్లు గోవిందు చివుక్కున లేచి కళ్ళు నులుముకొంటూ ప్రభువును చూచి "పద! పోదాం!" అని ఆయన చెయ్యి పట్టుకొని పరిగెత్తుకుంటూ వెళ్ళాడు.

ఒకసారి మామిడిపండ్లమ్మే స్త్రీని చూచి "నాకు మామిడి పండ్లిస్తావా? తినాలనుంది" అని అడిగాడు ప్రభువు. "పళ్ళు ఊరికే రావు పైసలిస్తే వస్తాయి!" అంది. "నా దగ్గర పైసల్లేవు. పదకొండు

పళ్ళిస్తే నీకు 11 మంది పిల్లలు పుడతారు ఇస్తావా మరి? అని అన్నాడాయన. ఆమె ఆ పళ్ళన్నీ ఇవ్వగా ఆమెకు ఐదుగురు ప్లిలలు పుట్టారు. ఆమె ప్రభువు దగ్గరకొచ్చి "నాకు సంతానం చాలు బాబూ! ఇక వద్దు; ఆపు" అని వేడుకొంది. "అట్లాగే జరుగుతుందిలే! వెళ్ళు!" అని అభయమీయగా ఆమెకు పిల్లలు పుట్టటం ఆగిపోయింది.

నిజాం ప్రభుత్వసైన్యంలో జమాదారుగా పనిచేసే అప్పారావు తన భార్య భీమాభాయిని తీసుకొని సంతానార్థియై బాలమాణిక్యను దర్శించేందుకు కళ్యాణి నగరానికి బయలుదేరారు. దారిలోని అడవిలో బాలమాణిక్య స్నేహితులతో ఆడుకుంటూ ఆటలో మిగిలిన వారితో గొడవ పడుతున్నాడు. ఆ పిల్లవాడే మాణిక్య ప్రభువని వారికి తెలియదు. గొడవకు కారణమడుగగా "నేను ఈ పిల్లలకు ఎనిమిది గవ్వలు (పూర్వం పైసలకు బదులు వాడేవారు) బాకీ పడ్డాను. "నువ్వు వాటినిస్తావా?" అని మాణిక్య భీమాభాయిని అడిగాడు. ఆమె వాటినివ్వగానే "నీకు 8 మంది సంతానం కలుగుతారు. లే!!" అంటూ వెళ్ళిపోయాడు. భీమాభాయి దంపతులు మాణిక్య ఇంటికి వెళ్ళి అతనికోసం మూడురోజులు భోజనం చెయ్యకుండా ఎదురుచూశారు. మూడవరోజున మాణిక్య వచ్చి, భీమాభాయిని చూచి "నీకిదివరకే 8 మంది పిల్లల్నిచ్చానుగా! ఇంకా ఎందుకీ ఉపవాసాలు?" అనేసి బయటికి ఆడుకునేందుకు పరుగెత్తాడు. ఆమెకు ఆవిధంగానే 8మంది పిల్లలు కలిగారు.

మాణిక్య ప్రభువు స్నేహితుడైన కాలాభట్ రోజూ శివలింగాన్ని బిల్వపత్రాలతో పూజించేవాడు. ఒకరోజు ప్రభువు "ఆ శివలింగాన్ని పూజించే బదులు సాక్షాత్తు శంకరునే పూజించవచ్చు కదా!" అన్నారు. మరి శంకరుడు నాకు ప్రత్యక్షంగా కనిపించడుకదా! అన్నాడతడు. "ఐతే ఇదిగో నావైపు చూడు" అంటూ మాణిక్యప్రభువు జటాజూటంతో వ్యాఘ్రచర్మాంబరంతో, నాగహారాలతో, త్రిశూలం ధరించి పరమశివునిగా దర్శనమిచ్చాడు. అప్పటినుండి పరమానందంతో ప్రభువుకే రోజూ బిల్వార్చన చేసేవాడు. 16 ఏళ్ళు వచ్చినా చదువు, సంధ్య లేకుండా ఇంటి బాధ్యతలు పట్టించుకోకుండా తిరుగుచున్న ప్రభువును మేనమామ మందలించడంతో ఇల్లువదిలి వచ్చేశారు. పుణ్యక్షేత్రాల్లో, అడవుల్లో నివసించసాగారు.

శ్రీపాదశ్రీవల్లభులు, నరసింహ సరస్వతి మాదిరిగానే ప్రభువు కూడా ఆజన్మ బ్రహ్మచారి. ఆయన బాల్యంలో అడవుల్లో ఏకాంతావాసంలో గొప్పతపస్సు చేశారు. ఆ తపఃశక్తి వల్ల ఆత్మజ్ఞానం కలిగిన పూర్ణపురుషుడయ్యాడు. ముఖం బ్రహ్మవర్చస్సుతో ప్రకాశింపజొచ్చింది. ఆధ్యాత్మిక చర్చలు

చేసేటప్పుడు ఆదిశంకరులను తలపింపజేస్తుండే వారు. అనతికాలంలోనే ఆయన ఖ్యాతి భారతదేశం నలుమూలలకు విస్తరించి ప్రజలు ఆయన దర్శనార్థం తండోపతండాలుగా వస్తుండేవారు. వారి కోరికలు తీరి, బాధలు తొలగుతుండేవి. చివరిదాకా భిక్షావృత్తిని వదల్లేదు. ధనాన్ని కాంక్షించక, భక్తులిచ్చిన కానుకల్ని ఇతర అవసరాలకు, ధర్మకార్యాలకు ఖర్చుపెడుతుండేవారు. అయినా వారి ఖజానా ఎప్పుడు చూచినా నిండుగా వుండేది. బంధువులంతా వెళ్ళి ఆయన్ని ఇంటికి రమ్మని ప్రార్థించినా ఆయన సమ్మతించలేదు. ఆ సమయంలోనే ఆయన తన నోరు తెరచి దత్తాత్రేయమూర్తిని తల్లికి చూపించారు. ఆయనెక్కడుంటే అక్కడికి వేలాదిమంది ప్రజలు వస్తుండేవారు.

చాలకాపురం అనే గ్రామం ప్రక్కన గల అడవిలో మారుతీ ఆలయముంది. క్రూరమృగాల భయం చేత పూజారి చీకటి పడకుండానే పూజ ముగించి వచ్చేవాడు. మర్నాడు ఉదయం వెళ్ళినపుడు మారుతీ విగ్రహం తలమీద గుడ్డలమూట కనిపించింది. ఏమిటా? అని విప్పి చూస్తే, అందులో పాతగుడ్డలు, చెప్పుల జత కనిపించాయి. పూజారి కోపంతో చుట్టూ చూడగా మండపంలో ఒక యువకుడు గుఱ్ఱుపెట్టి నిద్రపోతున్నాడు. పూజారి అతన్ని లేపి నీవేనా మారుతి తలమీద గుడ్డలమూట పెట్టిందని గద్దించి అడిగాడు. "అవును, నేనే! ఇక్కడ దొంగల భయమెక్కువని ఈ మూటను జాగ్రత్తగా చూడమని ఆయనకు చెప్పి ఇచ్చాను." అన్నాడాయువకుడు. పూజారి కోపంతో కర్ర తీసుకొని కొట్టసాగెను. అయితే ఆ దెబ్బలన్నీ మారుతి ఒంటిమీద కనిపించసాగాయి. మారుతి మెడలోని పూలదండ, ఒంటిమీద వస్త్రం ఆ వ్యక్తి మీద కనిపించాయి. పూజారి ఆశ్చర్యపోతుంటే ఈలోపల జనమంతా వచ్చారు. వారివల్ల తాను కొట్టింది మాణిక్య ప్రభువునని తెలిసి క్షమించమని పాదాలపై వ్రాలిపోయాడా పూజారి.

వెంకమ్మ సంపన్న వైశ్య కుటుంబములో పుట్టింది. బాల్యంలోనే భర్త మరణించాడు. ఆ దుః ఖంతో సంసారమంటే విరక్తి పుట్టి, తగిన గురువుకోసం అన్వేషిస్తూ, మైలారులో ప్రభువున్నాడన్న విషయం విని వచ్చింది. ప్రభువు పాదాలు పట్టుకొని సర్వస్వశరణాగతు రాలైంది. "నాదగ్గర నీవుండాలంటే నీ ఒంటిమీద నగలేవీ ఉండరాదు." అని ప్రభువంటే, వెంటనే నగలన్నీ అక్కడున్న బీదలకు పంచిపెట్టింది.

ఒకరోజు వెంకమ్మ స్నానం చేస్తున్నది. "ఎట్టి పరిస్థితుల్లో ఉన్నప్పటికి, ఉన్నది ఉన్నట్లు నాదగ్గరకు రావలసింది" అని మాణిక్యప్రభువు ఆమెకు కబురు పంపించారు. వెంటనే ఆమె ఆ ఆజ్ఞానుసారం

నగ్నంగా ప్రభువు సన్నిధికి వచ్చింది. ప్రభువు తనపై వున్న వస్త్రాన్ని ఆమెపైకి విసిరి, ధరించమని ఆజ్ఞాపించారు. ఆ పవిత్ర వస్త్రాన్ని ఆమె ధరించగానే ఆమె పాపమంతా దగ్ధమై నూతన జన్మ ఎత్తినట్లైంది. ఆరోజు నుండి ఆమె శ్వేత వస్త్రాన్ని మాత్రమే ధరిస్తూ, భస్మధారణ చేయటం మొదలుపెట్టింది. ఎల్లప్పుడు ప్రభునామాన్నే జపిస్తూ వుండేది. ఒక సంవత్సరం యోగసమాధిలో ఉంది. ఆ సమయంలో ఆమె ఆకలిదప్పులను, అరిషడ్వర్గాన్ని జయించింది.

క్రీ॥శ 1862లో వెంకమ్మ భౌతిక కాయాన్ని విడిచింది. ప్రభువును ప్రజలెంత గౌరవించేవారో వెంకమ్మను కూడా అంతా అట్లా గౌరవించేవారు. ఆమెకు అంత్యక్రియలు జరిపించడానికి ఆమె బంధువులు ఆమెను పైకి లేవనెత్తగానే “ఓం” అనే శబ్దం ఆమె నోటినుండి వెలువడింది. అంతా ఆశ్చర్యపోయి ఆమెను క్రిందికి దించారు. మళ్ళీ ఎత్తగానే తిరిగి ఓంకారం ఆమె నోటినుండి వెలువడింది. ఇట్లా మూడుసార్లు జరిగింది. ప్రభువు ఈ విషయం తెలిసికొని “ఆమె తన అంత్యక్రియలు బ్రాహ్మణులే చేయాలని కోరుతున్నది. కనుక బ్రాహ్మలే ఆపని చేయాలి” అని ఆదేశించారు. కొంతకాలమైన తర్వాత ప్రభువు వారి శిష్యుడైన “రావుజీబువా” తన శిష్యుల సహాయంతో వెంకమ్మ సమాధి నిర్మించి దానిచుట్టూ ఒక పెద్ద దేవాలయాన్ని కట్టించాడు. ఆ దేవాలయంలో ఈనాటికీ వెంకమ్మ సిద్ధ స్వరూపిణిగా పూజలందుకొంటున్నది.

ఆ తర్వాత ప్రభువు అనేక గ్రామాలు పర్యటించి బీదర్ సమీపంలో ఉన్న ఝరనీ నరసింహ క్షేత్రానికెళ్ళి కొన్ని రోజులున్నారు. బీదరు వాస్తవ్యులు వారిని తమ ఇండ్లకు రమ్మని ఆహ్వానిస్తే, అట్లే తాము వస్తామని చెప్పి, అక్కడున్న వారున్నట్లుగానే వుండి, ఒకే సమయంలో అందరి ఇళ్ళకు వెళ్ళి వారి పూజలు స్వీకరించి తన విశ్వరూపాన్ని ప్రకటించారు. ప్రభువు కళ్యాణి నగరానికి ప్రయాణమయ్యారు. దారిలో వారెక్కిన పల్లకి ఒక మహారణ్య మధ్యలో దట్టంగా అల్లుకున్న తీగెలమధ్య చిక్కి ఆగిపోయింది. ప్రభువు కిందికి దిగి “కారణమేమిటా?” అని చూస్తే అక్కడి స్థానదేవతలు తమను అక్కడ స్థిరనివాసమేర్పరచుకొని ఉండమంటున్నారని గ్రహించి, అక్కడే నిలచిపోయారు. తన జీవిత కాల పర్యంతం అచ్చటనే నివసించారు. అక్కడే “మాణిక్యనగర్” ఆ తర్వాత అనతి కాలంలోనే నిర్మించబడింది.

మాణిక్యనగర్ నిర్మాణం ప్రారంభంతోపాటు ప్రభువు ఒకగాదీని కూడ అక్కడ స్థాపించారు. దానిపేరు “దత్తాజీ గాది”. ఆ తర్వాత బండారు ఖానా (వంటశాల) ఏర్పాటైంది. రోజూ ఎందరో

వచ్చి అక్కడ భోజనం చేసి వెడుతుండేవారు. ప్రభువు మాత్రం నిత్యం తాము తెచ్చుకున్న మాధుకరాన్ని "గాది"కి నివేదించి, ఒక చిన్న జొన్నరొట్టె ముక్క మాత్రం తింటుండేవారు. ప్రభువు గాదిని నిర్మించిన చోట సిద్ధ దేవాలయం దివ్యంగా నిర్మించబడింది. దేవాలయం పైనున్న ఐదు కలశాలు బంగారు కలశాలే! ఒక్కొక్క బంగారు కలశానికి తాపించిన బంగారు రేకు బరువు ఒక మణుగు. అంటే దాదాపు వెయ్యి తులాలుంటుంది.

ప్రభువు తరచుగా దర్బారు నిర్వహిస్తుండేవారు. దర్బారంటే అవధూత (దత్తాత్రేయుడు) దర్బారే! దానికి కాలనియమమంటూ లేక ఒక్కొక్కసారి వరుసగా వారం రోజులు కూడా జరిగేది.

హమీనాబాద్‌లో ప్రభువుతో ఎప్పుడూ వేదాంతచర్చ చేసే ఒక ముసలి బ్రాహ్మణుడుండేవాడు. ఒకరోజున 60 ఏళ్ళుపైబడ్డ తన భార్యతో ప్రభువు దర్శనార్థం వచ్చాడు. ఆ సమయంలో వెంకమ్మకూడా ప్రభువు దర్శనంకోసం వచ్చింది. వెంకమ్మను చూచి ప్రభువు "నాలుగు రోజులనుండి కనిపించడం లేదేం" అని అడిగారు. తాను బహిష్ఠు అవ్వడం వలన రాలేదని చెప్పింది." "బహిష్టు అంటే విసుగ్గా ఉందా?" అని ప్రశ్నించారు ప్రభువు. "ఔనండి ఆమె." అలాగైతే ఎవ్వరికన్నా ఇవ్వగూడదా?" అన్నారు ప్రభువు. ఎవరు పుచ్చుకొంటారు ప్రభూ దీన్ని? అని ప్రభువును ప్రశ్నించిందామె. "ఎందుకు పుచ్చుకోరు – ఇదిగో! ఈమె చేతిలో కొంచెం నీరు తీసుకువచ్చి, ధారపొయ్యి!" అన్నారు ప్రభువు వృద్ధ బ్రాహ్మణస్త్రీని చూపించి. వెంకమ్మ ప్రభువు చెప్పినట్లే చేయగా ఆమెకు బహిష్టు ఆగిపోయింది. ఆ బ్రాహ్మణ స్త్రీ బహిష్టయినది. ఆ తర్వాత గర్భాన్ని ధరించి ఒక పిల్లవాణ్ణి కన్నది. ఆ పిల్లవానికి ప్రభువే "మాణిక్య" అని పేరుపెట్టారు. ఈవిధంగా మాణిక్య ప్రభువు చూపించిన మహిమలు అసంఖ్యాకంగా ఉండేవి.

శృంగేరి పీఠాధిపతులు శ్రీనృసింహ భారతీస్వామివారు, శ్రీ హంపీ విరూపాక్ష పీఠాధిపతులు శ్రీ మదభినవశంకర భారతీ స్వామివారు క్రీ.శ. 1859లో మాణిక్య ప్రభువును దర్శించి ఎంతగానో శ్లాఘించారు. ప్రభువు వారి బిరుదావళి పఠించడానికి అనుజ్ఞ పొందడంతోపాటు కృష్ణా, గోదావరి మధ్య దేశాల్లో తమకు గల అధికారాన్ని హంపీ విరూపాక్ష పీఠాధిపతులు ప్రభువు వారికి సమర్పించారు.

మాణిక్య ప్రభువు శిష్యులతో ముందే సూచించిన విధంగా సమాధికోసం త్రవ్వించుకొన్న గోతిలో మార్గశిర శుద్ధ ఏకాదశినాడు (దత్తజయంతికి మూడు రోజులముందు) అనగా 1865వ సంవత్సరం నవంబరు 29వ తేదీన కూర్చుని చేతులలో "శ్రీగురుచరిత్ర" గ్రంథము దగ్గర ఉంచుకొని

శిష్యులచేత పైభాగాన్ని మూయించుకొని సజీవ సమాధి చెందారు. వారి అన్నగారి పెద్దకుమారుడైన శ్రీ మనోహర్ మాణిక్ ప్రభువు పీఠాన్ని అధిష్టించారు.

శ్రీ మాణిక్యప్రభువు మహారాజ్ నేటికీ దివ్యశక్తి సంపన్నులై భక్తులకు కొంగుబంగారంగా విలసిల్లుతున్నారు. అర్హులైన వారికి దర్శనానుభూతిని ప్రసాదిస్తున్నారు. జగత్ ప్రభువైన దత్తుని మెడలో మాణిక్యప్రభువు మాణిక్యహారమై వెలుగొందుతున్నారు.

మాణిక్య ప్రభువుల సంప్రదాయంలో వారి బిరుదావళిని మంగళాచరణములుగా జయజయధ్వానములతో స్మరించడం నియమంగా కొనసాగుచున్నది. అది ఈ క్రింద ఇవ్వబడింది.

మంగళాచరణము

శ్రీ సద్గురు మార్తాండమాణిక్యప్రభు
గురుపరబ్రహ్మణే నమః
శ్రీ భక్తకార్యకల్పద్రుమ, గురుసార్వభౌమ
శ్రీమద్రాజాధిరాజ యోగిమహారాజ
త్రిభువనానంద, అద్వైత, అభేద
నిరంజన, నిర్గుణ, నిరాలంబ
పరిపూర్ణసదోదిత
సకలమత స్థాపిత
సద్గురు శ్రీ మాణిక్యమహారాజ్‌కీ జయ్ !
శ్రీ మాణిక, జయమాణిక, హరమాణిక
హరిమాణిక, చిన్మాణిక, సన్మాణిక
జయ జయహో, సకలమతా, విజయహో!

ఓం ద్రాం శ్రీ మాణిక్యప్రభువే నమః

అవధూత చింతన శ్రీగురుదేవదత్త !

ముఖ్యక్షేత్రము, మార్గము : హైదరాబాదు నుండి గుల్బర్గా వెళ్ళే బస్సులో హుమ్నాబాద్ చేరాలి. అక్కడికి నాలుగు ఫర్లాంగుల దూరంలో మాణిక్యనగర్ ఉన్నది. పూనా నుండి రాయచూర్ వెళ్ళు రైలు మార్గములో గుల్బర్గా స్టేషన్ వచ్చును. అక్కడ నుంచి బస్సులో 40 మైళ్ళు దూరంలో ఉన్న హుమ్నాబాద్ చేరవలెను. అక్కడకు నాలుగు ఫర్లాంగుల దూరంలో మాణిక్యనగర్ ఉన్నది.

అవధూత చింతన శ్రీగురుదేవదత్త !

సద్గురుండు నాకు చాల మేలొనరించె
పొగడతరమె వాని భూరి మహిమ
వేలవేల కనులు విప్పార్చి చూపించె
ఎన్నో దర్శనంబులను హృదయమందూ
మరచిపోకుడు శివానందుని మంచిమాట

* * *

చంద్రనాడిలోన సమసెను రవినాడి
రెండు కలసి బ్రహ్మదండమందూ
పూర్వజన్మ సుకృత భాగ్యంబున
చింతదీరి నాకు సిద్ధికలిగె
మరచిపోకుడు శివానందుని మంచిమాట

– శ్రీ స్వామి శివానంద మహరాజ్

శివపూజారతోవాఽ పి విష్ణు పూజారతోఽ థవా ।
గురుతత్త్వ విహీనశ్చే త్తత్సర్వం వ్యర్థ మేవహి ॥

– గురుగీత

శివుని పూజించువాడైనను, విష్ణువుని పూజించు వాడైనను
గురుతత్త్వము తెలియనిచో సర్వపూజలు వ్యర్థమే !

స్వామిసమర్థ
(అక్కల్‌కోట మహారాజ్)

అవధూతం మహా జ్ఞేయం లీలామానుషవిగ్రహం
సమర్థ స్వామినం వందే ఆశ్రితామరకల్పకమ్ ॥

దత్త అవతారాల్లో ఒక ముఖ్య అవతారము శ్రీ స్వామిసమర్థ. దత్తావతారాల్లోని విలక్షణం ఏమిటంటే తన దగ్గరికి వచ్చిన సాధకుడు ఏ గురువును ఆరాధిస్తున్నాడో, ఏ దేవతని ఆరాధిస్తున్నాడో ఆ గురు దేవతా స్వరూపాలుగా ఆ సాధకుడికి కనిపించి, ఆ స్వరూపాలన్నీ తనవేనని వెల్లడించటం. భిన్నత్వంలోని ఏకత్వాన్ని వెల్లడించడం అంటే అద్వైతాన్ని ప్రబోధించటమే ! శ్రీపాదశ్రీవల్లభులు, శ్రీ నృసింహసరస్వతి, శ్రీ మాణిక్యప్రభువు ఇట్లా చేసినవాళ్ళే. శ్రీ స్వామి సమర్థ కూడా తన జీవితాన్ని ఒక అవధూతగా గడిపి "బాలోన్మత్త పిశాచవత్" గా నడయాడి, ఎన్నో అద్భుతలీలలు వెల్లడించి, సాధకుల్ని ఎంతగానో ఉత్తేజితులయ్యేటట్లు చేశారు. "అక్కల్‌కోట" అనే గ్రామంలో ఎక్కువకాలం నివసించి, తన మహాశక్తి సామర్థ్యంతో అనేకులకు ముక్తిమార్గం చూపి, తానువచ్చిన పనిపూర్తి చేసుకొని దేహత్యాగం చేసిన ఆ దిగంబరవధూతనే "అక్కల్ కోట మహారాజ్" "శ్రీ స్వామిసమర్థ" అని పేర్కొంటూ, లోకం భక్తి ప్రపత్తులతో నీరాజనాలిస్తున్నది. శ్రీ నృసింహసరస్వతి గాణుగాపురం వదలి, శ్రీశైలం వెళ్ళి అక్కడ కృష్ణానదిలో అదృశ్యమైనారని గురుచరిత్ర చెబుతున్నది. అట్లా అదృశ్యమైపోయిన ఆయన అక్కడ ఉన్న కదళీవనానికి పోయి సుమారు 300 సంవత్సరాల తర్వాత 1838 ప్రాంతంలో "మంగళవేడా" చేరుకున్నారు. అప్పటి నుండి ఆయన 1878లో దేహత్యాగం చేసేవరకు గల చరిత్ర అన్ని విశేషాలతో సంపూర్ణంగా మనకి లభిస్తున్నది.

విచిత్రమేమిటంటే శ్రీ సమర్థను ఎవరు ప్రశ్నించినా "నామూలం వటవృక్షం. నా జన్మస్థానం దత్తనగరం" అని చెబుతుండేవారు. అసలు ఆయన పేరు, తల్లిదండ్రుల పేర్లు, వయస్సు, కులగోత్రాలు ఈ మొదలైన వివరాలెవరికీ తెలియవు. ఆయనెప్పుడు ఆ వివరాలెవరికీ చెప్పలేదు. అప్పుడప్పుడు ఏవో కొన్ని కొంతమందికి తెలిపినా అవి ఒక దానితో ఒకటి పొంతన లేకుండా ఉండేవి. ఒకసారి "చింతోపంత్" అనే భక్తుడడిగితే "నా తల్లిదండ్రులు మాదిగవాళ్ళు. వృత్తి తోళ్ళపని" అని చెప్పారు. ఇంకో భక్తుడితో "మేం కదళీవనం నుండి వచ్చాం" అన్నారు. "కార్వే" అనే భక్తుడితో "నేను యజుర్వేద బ్రాహ్మణ్ణి. కాశ్యపస గోత్రం. పేరు నరసింహభాను. మీనరాశి. మళ్ళీ అడిగితే చెప్పుతీసుక్కొడతాను"

అన్నారు. మరో భక్తుడితో "మూల పురుషుడు వటవృక్షం - మూలం మూలానికి మూలం" అని చెప్పారు. దీన్నిబట్టిచూస్తే ఆయన కారణకారణుడైన, సర్వసృష్టికీ మూలమైన దత్తాత్రేయస్వామియని మనకు అర్థమౌతుంది. ఆయన గురువులకు గురువనీ, "వటవృక్ష"మంటే సద్గురు దత్తాత్రేయ స్వామియనీ "ఊడ" లంటే లోకంలో గల ఇతర గురుపరంపర అనీ వారు చెప్పినదానికర్థం. అన్నింటికీ మూలమైన పరమాత్మను తానేనని, దత్తాత్రేయ స్వరూపం తానేననీ ఆయన తనమాటల్లో, చేతల్లో వ్యక్తం చేశారు. అందుకు సాక్ష్యం ఈ అవతారంలో ఆయన ఉన్మత్తుడిలా, అవధూతలా, బాలుడిలా సంచరించటమే! కదళీవనం నుంచి వచ్చానని చెప్పటం, పేరు నరసింహభాను అనటం మనం ఇట్లా భావించటానికి బలం చేకూరుస్తున్నవి.

1855లో స్వామి షోలాపురం వెళ్ళి, అక్కడదత్తమందిరం దగ్గర వున్న సుబ్బరాయమఠంలో ఒక స్తంభం వద్ద కూర్చుని, అక్కడకు వచ్చిన స్త్రీకి దత్తాత్రేయస్వామిగా దర్శనమిచ్చారు. అప్పుడు స్వామి వారు కూర్చున్న ఆ స్థలాన్ని దత్తాత్రేయస్థానంగా భక్తజనులు భావిస్తూ ఇప్పటికీ పూజిస్తున్నారు. 1856 వ సంవత్సరంలో స్వామి అక్కల్ కోటకు వచ్చారు. అక్కల్‌కోట రాజైన "మాలక్‌జీరావ్ భోన్స్లే", ఆయన తమ్ముడు స్వామి దగ్గరకు వచ్చి, మెడలో పూలమాలవేసి నమస్కరించారు. స్వామివారు తన మెడలోని పూల దండను రాజుగారి తమ్ముని మెడలోవేసి, తాను కప్పుకున్న పాతవస్త్రాన్ని రాజుగారికి కప్పారు. వాళ్ళు వాటిని మహాప్రసాదంగా భావించి స్వీకరించారు. అటుపిమ్మట వారు స్వామివారికి ముఖ్య శిష్యులైనారు. స్వామివారు చోళప్ప ఇంట్లో ఉంటున్నప్పుడు అక్కడి ఖర్చు యావత్తు వారే భరించారు. స్వామి అనుగ్రహంతో వారికి ఒక పుత్రుడు కూడా పుట్టాడు.

మహత్‌ఖాన్ అనే అతడు స్వామి దగ్గరకొచ్చి చిలుం తాగుతారా?" అంటూ వట్టి చిలుం చేతికిస్తే గంజాయి, నిప్పులేని ఆ చిలుము నోట్లో పెట్టుకొని పీల్చి, పొగ తెప్పించి అందర్నీ ఆశ్చర్యపరిచారు. "చోళప్ప" మొట్టమొదటిసారి కనిపించగానే "ఏమి చోళా! ఏమి నన్ను గుర్తుపట్టలేదా?" అని ఆ మాటకు చోళప్ప బిత్తరపోయి చూస్తుంటే, అతని తలపై చేయిపెట్టి గత జన్మ విషయాలన్నీ స్ఫురణకు వచ్చేటట్లు చేశారు. కృష్ణాజీ పంత్ ఇంట్లో ఉన్న గొడ్డుబోతు ఆవు పొదుగు నుండి పాలు స్రవించేలా చేశారు. బసప్ప అనే నూనె వ్యాపారి స్వామిని విడువక అనుక్షణం సేవిస్తూ వుండేవాడు. అదిచూచి అతని భార్య "ఆ స్వామిని అట్లాపట్టుకొని ఊరేగుతుంటే నాగతి, నా పిల్లలగతి ఏమిటీ" అంటూ స్వామివార్ని, బసప్పనూ విమర్శిస్తూ గోలచేస్తూ ఉండేది. అయినా స్వామిసేవ మానలేదు. ఒకరోజు స్వామి ఎక్కడికో వెళుతుంటే బసప్ప ఆయన్ని వెంబడించాడు. స్వామి "నాతో రావద్దు"

అన్నారు. అతడు విన్లేదు. దారిలో ఎన్నోపాములు కనిపించేలా చేశారు స్వామి. అయినా భయపడకుండా వాటిని దాటుకుంటూ పోసాగాడు. కొంతదూరం వెళ్ళాక స్వామి అతన్ని చూసి "నీ ఇష్టం వచ్చిన పాముని తీసుకొని నీ పైబట్టలో మూటకట్టుకో!" అన్నారు. అతడొక పాముని పట్టి మూటకట్టాడు. ఇంటికిపోయి మూట విప్పేసరికి "బంగారుముద్ద" కనిపించింది. బసప్ప భార్యకు ఈ సంఘటనతో స్వామి మహిమ తెలిసివచ్చింది. పరమభక్తురాలిగా మారిపోయింది.

ఒక ధనికుడైన బ్రాహ్మణునికి సంతానం లేకపోతే గాణుగాపురం పోయి నరసింహ సరస్వతి స్వామిని "నాకు పుత్రుడు పుడితే వేయిమంది బ్రాహ్మణులకు భోజనం పెడతా"నని మొక్కుకున్నాడు. అతనికి పుత్రుడు పుట్టినా మొక్కు విషయం మరచిపోయాడు. కొన్నాళ్ళకు అతడు మరణించాడు. సంపదంతా కరిగిపోయింది. అతని భార్య కొడుకుని తీసుకొని గాణుగాపురం వెళ్ళి "తప్పు మన్నించమని" స్వామిని వేడుకొంది. ఆ రోజురాత్రి దత్తగురుడు ఆమె కలలో కనిపించి "నీవు అక్కల్ కోటకెళ్ళి అక్కడున్న అవధూతకు భిక్ష పెట్టు. సహస్రబ్రాహ్మణ భోజనం పెట్టినట్లవుతుంది" అని చెప్పారు. ఆమె అక్కల్ కోటకు వచ్చి వటవృక్షం క్రిందవున్న స్వామిని దర్శించి భిక్ష పెట్టింది. అది స్వామి స్వీకరించి, వేయిమంది బ్రాహ్మణులకు భోజనం పెట్టిన ఫలం లభించింది పో!" అన్నారు. ఆ మాట విని ఆయన సాక్షాత్తు దత్తప్రభువే అని ఆమె విశ్వసించి ఆయన ముందు సాష్టాంగపడింది.

ఒక బ్రహ్మచారి గాణుగాపురం వెళ్ళి నరసింహసరస్వతీ స్వామిని దర్శించి, తనకు వస్తున్న కడుపునొప్పి తగ్గితే పాలకోవా సమర్పిస్తానని స్వామికి మొక్కుకున్నాడు. అతని నొప్పి తగ్గింది కాని మొక్కు చెల్లించకపోయే సరికి నొప్పి తిరగబెట్టింది. స్వామి పేరు విని అక్కల్ కోటకు వచ్చి తనబాధ స్వామితో చెప్పుకున్నాడు. స్వామి అతనివైపు తీక్షణంగా చూచి "మూర్ఖుడా! పాలకోవా విషయం మర్చిపోతే ఎట్లారా?" అన్నారు. అతడు తప్పు తెలుసుకుని స్వామి సమర్థకు పాలకోవా సమర్పించుకోగానే మంత్రించినట్లు నొప్పి మాయమైంది.

"బాలప్ప" అనే భక్తుడు మొట్టమొదట స్వామి ఉమ్మివేసుకొనే పాత్ర శుభ్రపరచే సేవను మొదలుపెట్టి, క్రమంగా వంటచేయటం, భోజనం పెట్టుట మొదలైన పనులు శ్రద్ధగా చేస్తూ ఆయనకు ప్రియసేవకుడయ్యాడు. ఒకసారి స్వామి బాలప్ప వీపుమీద అరచేత్తో గట్టిగా చరిచారు. వెంటనే అతనికి సమాధి స్థితి కల్గింది. స్వామి తన దేహత్యాగానికి ముందు తన వేలి ఉంగరం అతని వేలికి తొడిగారు. తనచేయి అతని మస్తకంపై పెట్టి "నా రాజముద్రిక నీకిస్తున్నాను. నా అధికారాన్ని, బలాన్ని తీసుకొని నా కార్యక్రమం నిర్విఘ్నంగా కొనసాగించు"! అంటూ ఆయన మెడలోని రుద్రాక్షమాల

తీసి అతని మెడలో వేశారు. "నోటినుండి పాదుకలు తీసి" వీటిని ఔదంబర వృక్షం క్రింద ప్రతిష్ఠించు!" అని చెప్పారు. ఆ నాటి నుండి అతడు బాలప్ప మహరాజ్‌గా ప్రసిద్ధి చెందాడు. శ్రీస్వామి నిర్యాణానంతరం 32 సంవత్సరాలు స్వామి అప్పగించిన కార్యము నిర్వహించి బాలప్ప దేహాన్ని వదిలాడు. స్వామి చెప్పినట్లు బాలప్ప ఒక మఠాన్ని నిర్మించాలని భావిస్తుంటే ఆంజనేయస్వామి ప్రత్యక్షమై తగిన స్థలాన్ని చూపగా స్వామివారి పాదుకలను ప్రతిష్ఠించి బాలప్ప ఒక మఠాన్ని నిర్మించాడు. అదే ఇప్పుడు "బాలప్ప మఠంగా" పిలవబడుతోంది.

"చింతోపంత్" అనే ఆయన కోటి తులసీ అర్చన విష్ణుమూర్తికి చెయ్యాలనుకొని మొదలుపెట్టాడు. రెండవరోజునుండి, సరిగ్గా ఆయన పూజమొదలుపెట్టే సమయానికి స్వామి ఆయన ఇంట్లో ప్రత్యక్షమౌతుండేవారు. "త్రిమూర్తి స్వరూపుడైన దత్తుడు తమ ఇంటికి వచ్చాడని" ఆయన స్వామి పాదాలకే పూజ చేయుట మొదలుపెట్టాడు. చివరి రోజు పూజ పూర్తికాగానే స్వామే దత్తాత్రేయునిగా దర్శనమిచ్చారు. ఆయన ఆనందం పట్టలేక స్వామి పాదాలు పట్టుకొని "స్వామి ఇట్లాగే ప్రతీదినం మీ పాదపూజ చేసుకొనేటట్లు అనుగ్రహించండి" అని ప్రార్థించాడు. "తథాస్తు!" అని స్వామి అదృశ్యమైనారు. స్వామివారు నిలచిన పీటమీద వారి పాదముద్రలు స్పష్టంగా ఏర్పడ్డాయి. అవి ఈనాటికి అక్కల్ కోటలో స్వామి మందిరంలో మనకు గోచరిస్తాయి.

అళౌనిబువా అనే బ్రహ్మచారి మరో ముగ్గురితో కలిసి పూరీ జగన్నాథయాత్రకు వచ్చాడు. దురదృష్టవశాత్తు నలుగురూ తీవ్ర అస్వస్థకు గురై గదిలోనుండి కదలలేకపోవడంతో భగవంతుని ప్రార్థించారు. వెంటనే స్వామి అక్కడ ప్రత్యక్షమై, వారి కృపాదృష్టి వారిమీద ప్రసరింపజెయ్యగానే వారికి స్వస్థత కలిగింది. వారు ఆయనకు నమస్కరించి తామెవరు అని అడిగారు. అందుకుస్వామి చిరునవ్వుతో "అఖండ విశ్వమే నేను. నేను సర్వత్ర ఉన్నాను. అయినా సహ్యాద్రి, గిర్నార్, కాశీ, మాతాపూర్, కరవీర్, పాంచాలేశ్వర్, ఔదుంబర్, కరంజా, నరసింహవాడి, గాణ్గాపూర్, ఇవి నా ముఖ్యమైన స్థలాలు" అని చెప్పారు. ఇది వారు సాక్షాత్తు దత్తాత్రేయుడినని తెలియజేయడమే కదా!

స్వామికి రాజులన్నా పేదలన్నా ఒకటే. అందరూ భగవంతుని ముందు సేవకులే! అక్కల్‌కోట సంస్థానరాజుగారు స్వామిభక్తుడే! కాని తన జన్మదినంరోజున సకల రాజలాంఛనాలతో వందిమాగధులతో స్వామి దర్శనమునకు వచ్చి వంగి నమస్కరించబోతుంటే స్వామి ఉగ్రుడై రాజు చెంపమీద బలంగా ఒక్క దెబ్బకొట్టారు. కిరీటం 20 అడుగుల దూరంలో వెళ్ళిపడింది. అప్పుడు స్వామి "నీ రాజరికం నీ భవనంలో, నీ దర్బారులో చెల్లుతుంది. ఇక్కడ అవసరంలేదు. ఇటువంటి

చదరంగంలో రాజువంటి రాజులను ఎంతమందిని కావాలంటే అంతమందిని మేము తయారు చేయగలం" అన్నారు. రాజు పశ్చాత్తాపం చెంది అప్పటి నుండి స్వామి దగ్గరకు సామాన్యుడివలె వచ్చేవారు. స్వామి అనుగ్రహంతో ఆ రాజుకి సంతానం కలిగింది.

బాబా సబ్నీస్ మొదట శ్రీ మాణిక్యప్రభువుగారి భక్తుడు ఒకప్పుడు మాణిక్యప్రభువు అతనికి అక్కల్‌కోటస్వామిని చూపించి "ఆయనే నీ గురువు" అని చెప్పారు. అప్పటి నుండి అతను అచంచల భక్తి విశ్వాసములతో స్వామిసేవ చేసుకునేవాడు. స్వామి నివాసంచేత అక్కల్‌కోట సంస్థానానికి పట్టిన మహా భాగ్యం చూసి బరోడా రాజు గారికి అసూయ కలిగింది. ఎలాగైనా స్వామిని తన రాజ్యానికి తీసుకొనిరమ్మని తాత్యాసాహెబ్ అనే మంత్రిని నియోగించాడు. అతడు స్వామి సేవకులకు ధనాశ చూపించి లోబరుచుకున్నా కార్యం సాధించలేకపోయాడు. ఇక మాయోపాయంతో సాధించాలనుకున్నాడు. స్వామిని మేనాలో త్రిప్పుతానని వేడుకున్నాడు. స్వామి మేనాలో కూర్చోనగానే దానికి తాళంవేసి కడబ్‌గామ్ రైల్వేస్టేషనుకి తీసుకొనివెళ్ళి అక్కడ రైల్లో ఎక్కించాలని మేనా తలుపు తెరవగానే అందులో స్వామి లేరు. స్వామి అనుమతి లేకుండా వారిని ఎక్కడకు తీసుకొని వెళ్ళడం సాధ్యంకాదని అప్పటికి తెలిసింది.

స్వామి వలన అనేకమంది మహాత్ములుగా రూపొందారు. వీరిలో వివిధ కులములకు, మతములకు చెందినవారున్నారు. బీడకర్ మహరాజ్, సీతారామ్ మహరాజ్, యవన్ ఔలియు, ఆనందభారతి, ఆనందనాథ్ మహరాజ్, తాతామహరాజ్, రంగోలీ మహారాజ్, బాలప్ప మహరాజ్, స్వామి సుత, కేల్కర్ మహరాజ్, కుమారస్వామి మొదలగువారు స్వామివలన యోగులైనారు.

సౌందర్యరాశినని మిడిసిపడే వేశ్య ఒకామె స్వామిదగ్గరకు వచ్చింది. స్వామి ఆమెకేసి చూచి "పురుషుడిలో లేనిది, స్త్రీలో ప్రత్యేకంగా ఉన్నది ఏమిటి? పురుషుడికి స్త్రీకి బేధమేమి?" అని ప్రశ్నించారు. స్త్రీపురుషులకు ఆత్మగా పరమాత్మే ఉన్నాడని బోధపర్చాలని స్వామి ఆ ప్రశ్నవేశారు. కాని ఆమె "ఎందుకు బేధం లేదు? పురుషుడికి లేని అందమైన పాలిండ్లు స్త్రీకి ఉన్నాయికదా!" అని అంది. స్వామి నవ్వి "అవి నీకు ఉన్నాయా? లేక నీ శరీరానికి ఉన్నాయా? నీకే ఉంటే మరొకరికి ఇవ్వగలగాలి కదా!" అన్నారు ఆమెలో విచక్షణా జ్ఞానం మేల్కొంది. సిగ్గుతో తలవంచుకొని నమస్కరించి వెళ్ళిపోయింది. కొద్దిరోజులలో ఆమె సౌందర్యానికి ఆధారమైన పాలిండ్లు కృశించిపోయి మగవాని రొమ్ములా తయారైంది. వృత్తిమీద ఏహ్యాభావం కలిగింది. కాశీకి వెళ్ళి జపధ్యానాదులతో శేష జీవితాన్ని గడిపింది.

సంవత్సరం 1857 లో కోడక్ ఫోటో కంపెనీవారు మనదేశంలో బొంబాయిలో క్రొత్తగా సంస్థను ప్రారంభించారు. వ్యాపారం బాగా వృద్ధి చెందడానికి స్వామి ఫోటో తీయాలని అక్కల్‌కోట వచ్చారు. స్వామి అంగీకరించలేదు. అయినా స్వామి అనుమతి లేకుండా ఫోటో తీసి విజయగర్వంతో ఆ ఫోటో స్వామికి చూపించాడు ఆ యజమాని. స్వామి ఆ ఫోటో ఒక భక్తుడికిచ్చి ఇందులో ఎవరి ఫోటో ఉన్నది చెప్పమన్నారు. అతడికి ఆ ఫోటోలో రాముడు కనిపించాడు కాని స్వామి లేరు. అదే విధంగా ఒకరికి శంకరుడు, ఒకరికి దేవి, ఒకరికి విఠల్, ఒకరికి ఖండోబా ఆ ఫోటోలో కనపడ్డారని చెప్పారు. ఆ ఫోటో గ్రాఫర్‌కి కోపంవచ్చి స్వామితో “వీళ్ళంతా పిచ్చివాళ్ళు. ఇది మీ ఫోటో. మీరు చూచి చెప్పండి” అన్నాడు. “ఓహో! అట్లాగా! ఇది నా బొమ్మా! చూడు” అని ఆ ఫోటో తిరిగి ఆ ఫొటోగ్రాఫర్‌కి ఇచ్చారు. అతను చూడగా అందులో కోతిబొమ్మ ఉంది. అతని గర్వాన్ని అణిచేందుకు స్వామి ఆ లీల చేశారని అర్థం చేసుకుని క్షమాపణ కోరాడు. పవిత్రమైన స్వామిఫోటో అందరి ఇళ్ళల్లో ఉండాలని, తద్వారా అతని వ్యాపారం అభివృద్ధి చెందాలని వినయంగా అనుమతికోరాడు. స్వామి అనుమతించాక ఫోటోలు తీస్తే అవి సరిగ్గా వచ్చాయి.

స్వామివార్ని తన ఇంట్లో అట్టిపెట్టికొని, బిక్షపెట్టి సేవించుకొనే మహాభాగ్యం, చోళప్పకి, అతని భార్య యశోబాయికి లభించింది. స్వామి వారింట్లో చేసే కొంటెపనులకు అంతుండేదికాదు. ఇంట్లోవున్న గోధుమలు, సెనగలు ఎవరికి చెప్పకుండ ఆవుకి పెడుతుండేవారు. చేతికందిన వస్తువులను బిచ్చగాళ్ళకి ఇచ్చేస్తుండేవారు. పసిపిల్లవాడిలా ఇంట్లో ఎక్కడ పడితే అక్కడ స్వామి మూత్ర విసర్జన చేస్తుండేవారు. మడిబట్టలు తాకేవారు. యశోబాయి విసుక్కుంటూ “పిచ్చివాణ్ణి తెచ్చి ఇంట్లోపెట్టి నా ప్రాణం తీస్తున్నారు” అని చోళప్పని సాధిస్తుండేది. కాని స్వామివారికి భిక్షపెట్టేటప్పుడు మాత్రం, ఎంతో ప్రేమతో పెట్టేది.

ఒకరోజు యశోబాయికి తేలుకుట్టింది. ఆ బాధ తట్టుకోలేక కేకలు పెడుతుంటే అందరూవచ్చి తలోవైద్యం చేశారు. కాని ఆమె బాధ తగ్గలేదు. స్వామి నిశ్చింతగా కూర్చొని, ఎటో గంభీరంగా చూస్తున్నారు. యశోబాయి స్వామివార్ని చూసి “నీవందరి బాధలు తీరుస్తావంటారే! నేనింత బాధపడుతుంటే చూస్తూకూర్చున్నా వేమిటి?” అనుకుంది తనలో, బాధతో కేకలు పెడుతూనే. వెంటనే స్వామి తాను తొడుక్కునే పాదరక్షతీసి ఆమె ముందు పడేటట్లు విసిరివేసి “ ఆ పాదుకలో చెయ్యిపెట్టు బాధపోతుంది” అన్నారు. ఆమె అట్లానే చేసింది. బాధపోయింది. కాసేపట్లేవుంచి చెయ్యి బయటికి తీసిన వెంటనే బాధ మొదలైంది. ఆ చేతిని మళ్ళీ పాదుకలో ఉంచగానే బాధ తగ్గింది. అట్లాగే ఆ పాదుకలో చెయ్యి పెట్టి ఉంచి, కాసేపటికామె హాయిగా నిద్రపోయింది. స్వామి పాదుకల్ని శరణువేడితే

ఏ బాధలూ వుండవని, లేకుంటే సంసారబాధలు తప్పవని స్వామి ఆమెకు ఆ విధంగా తెలియజేసి తనపై భక్తి విశ్వాసాలు ధృడంగా కల్గేటట్లు చేశారు.

చోళప్ప దంపతుల ధృడభక్తిని చూచి స్వామికి చాలా సంతోషం కలిగింది. తాను తొడుక్కున్న పాదుకలను అతని ముందుకు విసిరి "సరే! వీటిని పూజించుకో!" అని ఇచ్చారు. ఈ పాదుకలను వారింట్లో నేటికి దర్శించవచ్చును.

స్వామివారి మీద ఇంత భక్తి చోళప్పకి ఉన్నప్పటికి ధనకాంక్షను చంపుకోలేక పోయాడు. అతడు బరోడా రాజు ఇచ్చిన ధనం పుచ్చుకున్నందుకు స్వామికి ఇష్టంలేక పోయింది. అప్పటి నుండి చోళప్ప స్వామికీ, వారిసేవకు దూరంకాజొచ్చాడు. కాని స్వామి నిర్యాణం చెందిన తర్వాత తనింట్లోనే వారి సమాధి ఉండేటట్లు చెయ్యాలని, స్వామి సజీవులైవుండగానే తన ఇంట్లో ఒక గోతిని తవ్వించి, గదికట్టించి సిద్ధపరచాడు.

ఒకరోజు చోళప్పతో కలిసి స్వామి చోళప్ప ఇంటిముందు నుంచిపోతూ "చోళప్పా! మీ ఇంట్లో గొయ్యి తవ్వించావు కదా! ముందు నిన్నాగోతిలోపెట్టి గాని నేను పోను" అన్నారు నవ్వుతూ. అంతా అది వేళాకోళమనుకొన్నారు. కొంతకాలానికి చోళప్ప కలరావచ్చి, మరణించిన తర్వాతగాని అది వాస్తవమన్న విషయం వాళ్ళకర్థం కాలేదు. చోళప్ప మరణించినపుడు అవధూతయైన స్వామికూడా సామాన్యుడి మాదిరి, చోళప్ప శవం ప్రక్కన కూలబడి "చోళా! నువ్వు లేకపోతే నా లీలలు ఇంకా ఎవరికి చూపేది? నీవు తోడులేనిదే నేనెక్కడికి వెళ్ళేది? అంటూ భోరున దుఃఖించారు. స్వామివారు ఆనాడు చోళప్పకిచ్చిన పాదుకలు ఇప్పటికి చోళప్ప మఠంలోవున్నాయి. వాటిని పూజించి ఎందరో సత్ఫలితాలు పొందుతున్నారు.

కొన్ని రోజులు గడిచాయి. జ్వరమెరుగని స్వామికి జ్వరమొచ్చింది. "మీ ఆరోగ్యమెప్పుడు కుదుటపడుతుంది స్వామి?" అని భక్తులడిగితే "ఆ మాట తలపెట్ట వద్దు మా స్వస్థలానికి పోవాలి" అన్నారు.

కేశవ్‌నాయక్ అనుభక్తుడు కంటతడిపెట్టి "స్వామీ, మీరు వెళ్ళిపోయాక యిక మాకు దిక్కెవరు?" అన్నాడు. స్వామి అతడికి పాదుకలిచ్చి "నా అవతారం షిరిడిలో ఉన్నది. అక్కడికి వెడుతూ ఉండు. నేను లేని కొఱత నీకుండదు". అన్నారు. కేశవ్‌నాయక్ తర్వాత షిరిడీ వెళ్ళినప్పుడు సాయిబాబా అతనిని తనవాడుగా గుర్తించారు.

మందులు వేసుకోవటానికి ఒప్పుకోనందున భక్తులు స్వామిచేత బలవంతంగా

మాత్రమింగించినా, వెంటనే వాంతి చేసుకొన్నారు. స్వామివారు తమ శరీరాన్ని విడువటానికి సంకల్పించారన్న విషయం భక్తులకు అర్థమైంది. స్వామి నిర్యాణానికి కొద్దిరోజులముందు భక్తులందరిని “శివహర శంకర నమామి శంకర శివశంకర శంభో; హే గిరిజాపతి భవాని శంకర శివశంకర శంభో” అని భజన చేయమని చెప్పి తాము కూడా చేశారు.

స్వామి పద్మాసనం వేసుకొని వటవృక్షం క్రింద కూర్చుని “నేను ఈ వటవృక్షంలో కలవాలి ఎవరూ దుఃఖించరాదు, నేనెక్కడికో వెళ్ళాననుకోవద్దు. నేనంతటా, అన్ని స్థానాల్లోను వున్నాను. నా భక్తుల పిలుపు కందుబాటులో ఉంటాను” అని కళ్ళుమూసుకున్నారు. ఆ కళ్లు మళ్ళీ తెరుచుకోలేదు. స్వామిని పూర్వం భక్తులు వారికులగోత్రములను గూర్చి అడిగినప్పుడు “మూలానికి మూలం వటవృక్షం – దత్తనగరం” అని చెప్పినది గుర్తుచేసుకొంటే ఏమూలమైనటువంటి దత్తాత్రేయ తత్త్వం నుంచి వారు వచ్చారో అదే దత్తాత్రేయతత్త్వంలో శరీరంవిడిచి లీనమయ్యారని తెలియుచున్నది. మాతృగర్భాన జన్మించి ఈ శరీరమును ధరించారని చెప్పడానికి ఏ ఆధారము లేని స్వామి విషయంలో, ఆశరీమును మాత్రం జనులందరి మధ్య విడిచిపెట్టడం అద్భుతమైన దత్తలీల.

స్వామివారిని ఊరేగింపుగా చోళప్ప ఇంటి వద్దకు తీసుకుపోయి, క్రీ॥శ॥ 1878 వ సం॥ చైత్రశుద్ధ త్రయోదశి, మంగళవారం సాయంత్రం 4 గం॥లకు సమాధి చేయటం జరిగింది. కలియుగంలోని దత్తాత్రేయ చతుర్థావతారంగా స్తుతించబడిన అక్కల్‌కోట మహరాజ్, శ్రీస్వామి సమర్థుల యాత్ర ఈ భూమిపై ముగిసింది.

శ్రీ స్వామి సమర్థకు ముందున్న ముగ్గురు దత్తావతారులూ శ్రీపాదశ్రీవల్లభులు, శ్రీ నృసింహ సరస్వతి, శ్రీ మాణిక్యప్రభువు పరమశాంతులు. స్వామి సమర్థలో రుద్రాంశ ఎక్కువగా వున్నందున కోపిష్టులుగా లోకులకు కనిపించేవారు. కాని యదార్థమునకు వాత్సల్య ప్రపూర్ణులు, ఎల్లప్పుడు బ్రహ్మానందంలో మునిగి తేలుతూ వుండేవారు. వయోవృద్ధులైనా శరీరం ముడతలు పడలేదు. వారు సర్వజ్ఞులైనా వారి చేష్టలు పసిపిల్లల చేష్టలవలె ఉండేవి. ఆయన చాలా పొడవు, ఆజానుబాహువు. పెద్ద బొజ్జ, నవ్వు వచ్చినప్పుడు పొట్ట చేతులతో పట్టుకొని నవ్వుతుండేవారు. విశాలమైన భుజాలు, గోధుమ వన్నె శరీరము, చెవులు పెద్దగా, పలుచగా ఉండి వారే మాత్రం కదిలినా అటూ ఇటూ కదులుతుండేవి. విశాలమైన నుదురు. నెఱసిన కనుబొమ్మలు, పాదాలు పొడవుగా వుండేవి. ముఖాన ఎప్పుడూ తిలకం వుండేది, కౌపీనం ధరించేవారు. మెడలో తులసి, బంగారు కుండలాలుండేవి.

స్వామివారెప్పుడు తమలో తాము మాట్లాడుకుంటూ వుండే వారు. ఒక్కోసారి వేదమంత్రాలు,

శ్లోకాలు, కీర్తనలు ఆయన నోటినుండి వెలువడుతుండేవి. ఆయన మరాఠీ, హిందీలో మాట్లాడుతూవుండేవారు. ఆయనకు హిందు, ముస్లిం భేదం ఉండేదికాదు. గుళ్ళలో, మసీదుల్లో ఆయన కూర్చుంటుండేవారు. ఎందరో పూర్వ పుణ్య సుకృతం కలవారు ఆయన్ని ఆశ్రయించి మహాయోగులుగా మారారు. ఆయన శరీరాన్ని ఆశ్రయించి నిలచిన దివ్యశక్తికి ఒక నామం రూపమంటూ లేదు. ఒక సంప్రదాయానికి కట్టుబడటం కూడ లేదు. అవ్యక్తపరమాత్మ నాశ్రయించి ఉండే దత్త దివ్యశక్తిగా దాన్ని మనం గుర్తించవచ్చు. శ్రీస్వామి సమర్థ వంటి కారణ జన్ములు చాలా అరుదుగా భూమిపైకి వస్తుంటారు. వారికి జనన మరణాలుండవు. శుద్ధమైన మనస్సుతో ఆశ్రయించిన ఏ భక్తుడైనా, ఈనాటికీ ఆ దివ్యశక్తిని దత్తంచేసుకోగలుగు తారన్నది అక్షరాలా సత్యం.

అనంతకోటి బ్రహ్మాండ నాయక రాజాధిరాజ శ్రీస్వామి సమర్థ అక్కల్‌కోట మహారాజ్‌కీ జై!

ఓం ద్రాం శ్రీ స్వామి సమర్థాయ నమః

అవధూత చింతన శ్రీగురుదేవదత్త !

ముఖ్యక్షేత్రము, మార్గము : పూనా నుండి రాయచూర్ వెళ్ళు రైలు మార్గములో అక్కల్‌కోట రోడ్డు స్టేషన్ వస్తుంది. అక్కడ దిగి బస్సులో 7 కిలోమీటర్ల దూరములో ఉన్న అక్కల్‌కోట వెళ్ళవచ్చును. షోలాపూర్ మరియు గాణుగాపూర్ నుంచి బస్సులు కలవు.

హెచ్చు చదువు చదివి యింద్రియలోలురై
చచ్చు వారి కన్న స్వల్పమైరి
ఇంద్రియముల శక్తి యినుమడించును గాని
అట్టి చదువు చదివి ఆర్యుడగునే
చచ్చు చదువు చదివిసంతసము లేక
ఆత్మచింత నొందువాడు చదువరుండు
అట్టి ఆత్మశాంతి గురుపాద సేవచే కల్గును
మరిచిపోకుడు శివానందుని మంచిమాట

– శ్రీ స్వామిశివానంద మహరాజ్

సాయినాథుడు

సదానింబవృక్షస్య మూలాధివాసాత్
సుధా స్రావిణం తిక్త మప్య ప్రియంతం ।
తరుం కల్పవృక్షాధికం సాధయంతం
నమా మీశ్వరం సద్గురుం సాయినాథమ్॥

సృష్టి స్థితి లయాత్మకమైన నిర్గుణ, నిరాకార, నిరంజన, సచ్చిదానంద స్వరూపమైన పరతత్వం యొక్క సగుణ స్వరూపమే సాయినాథుడు. కనుకనే ఆయన్ను పూర్ణదత్తావతారంగా, జగన్మాతగా, సకల దేవతాస్వరూపంగా, గురువుగా, సర్వాంతర్యామిగా, సాయిగా పేర్కొనటం జరిగింది. "సాయి" అన్న పదానికి ఏవేవో కొన్ని అర్థాలు చెబుతున్నా, దానికి "సాహి" అన్నది మూలమనీ, "సాహి" వికృతరూపమే "సాయి" అనీ భాషా శాస్త్రవేత్తలు చెబుతూ, సాహెబ్ – సాయిబ్‌గా మారటాన్ని ఒక ఉదాహరణగా చూపిస్తున్నారు. "సాహి" అంటే ప్రభువు. అంటే ఈశ్వరుడు. ఈ విశ్వానికి యావత్తూ ప్రభువెవరో? ఆ ప్రభువే – ఆ పరబ్రహ్మే – ఆ పరమాత్మే సాయి.

" ఈ సకల సృష్టిని 72 మంది గురువుల పాలిస్తున్నారు. వాళ్ళల్లో ఐదుగురు అగ్రస్థానంలో ఉంటారు. ఆ అయిదుగురిలో సాయినాథుడు చక్రవర్తి వంటివారు" అంటారు మెహర్‌బాబా. శ్రీసాయి విశ్వరూపాన్ని సందర్శించి "శ్రీషిర్డీసాయిబాబా ఎంత గొప్పవారో తెలుసుకోవడం మీకెవ్వరికీ, ఎప్పటికీ సాధ్యంకాదు. ఆధ్యాత్మిక పరిపూర్ణతే ఆయన రూపంలో వెలసింది. ఆయన్ను గురించి నాకు తెలిసినంతగా మీకు కూడా తెలిస్తే, ఆయన ఈ చరాచర సృష్టి అంతటికీ గురువని మీరు చెప్పగలుగుతారు. అని ఆయన ఉద్ఘాటించారు.

సృష్టిలో పరబ్రహ్మ కన్నా గురువైంది, (అధికమైంది) మరొకటిలేదు. కనుక పరబ్రహ్మమే గురువైంది. బ్రహ్మ విష్ణు శివాత్మకమైంది పరబ్రహ్మయే కనుక మెహర్‌బాబా పేర్కొన్న "గురు" శబ్దం శ్రీ సాయినాథుడు దత్తావతారమన్న విషయాన్ని స్పష్టం చేస్తున్నది.

19 వ శతాబ్దం మధ్యలో వచ్చిన సాయినాథుడు వాస్తవానికి ఒక వ్యక్తికాదు. ఒక మహాశక్తి. ఇంకా విశేషించి "చిచ్ఛక్తి". ఎవరైతే తనకు సర్వస్య శరణాగతి చేసి, త్రికరణ శుద్ధితో, శ్రద్ధాభక్తులతో ఆరాధిస్తుంటారో, వాళ్ళకి తన శక్తిని దత్తంచేసి, శక్తిస్వరూపులుగా, తనవంటి వాళ్ళుగా మారుస్తుంటాడు. అందుకే సాయిదత్త సాంప్రదాయంలో గురుశిష్యులకు భేదం ఉండదు. ఆత్మీయతాభావం ఉంటుంది.

"మేరాభక్తి గురుకాశక్తి" అని భావిస్తూ శిష్యుడు ఆత్మగతంగా గురువుతో తాదాత్మ్యం వహిస్తూ ఉంటాడు. తనలో ఉన్న శక్తి యావత్తూ గురుశక్తేనని భావిస్తూ, ఆ విశ్వాసానికి ప్రతిఫలంగా మరింత శక్తిని గురువునుండి పుంజుకొంటూ ఉంటాడు. అనుక్షణం ఆ విశ్వాసాన్ని పెంచుకొంటూ ఉంటాడు. అదే నిజమైన సాధన. అదే నిజమైన గురుభక్తి. విశ్వాసంలేని భక్తి స్వరరహితమైన వేదపాఠం వంటిది. ప్రాణంలేని దేహం లాంటిది. స్వానుభవం వల్లగాని, ఆప్తుల అనుభవం తెలుసుకొంటూ ఉండటం వల్లగాని గురుసామర్థ్యం తెలుసుకొంటూ ఉండటం చేత తన విశ్వాసం ప్రబలమౌతూ ఉంటుంది. అట్లా గురువు మీద శ్రద్ధ పెంపొందించుకొనేందుకే 'గురుచరిత్ర' లు వెలిసాయి. సాయిబాబా కూడ తన దగ్గరకు వచ్చిన భక్తులను మహారాష్ట్రభాషలో గంగాధర సరస్వతి, రచించిన "గురుచరిత్ర" ను పారాయణం చెయ్యమని ఆదేశిస్తూ ఉండేవారని "సాయి సచ్చరిత్ర" లో చెప్పబడింది. ఆ చరిత్ర చదివితే "గురుభక్తి" అంటే ఏమిటో తెలిసి, భక్తులు గురువు పట్ల తమకు గల విశ్వాసాన్ని మరింత పెంపొందించుకుంటారనీ, ఆ విశ్వాసానికి తగిన ఫలాన్ని పొందుతారనీ, ఫలాన్ని పొందటం, పొందకపోవటం వాళ్ళ వాళ్ళ విశ్వాసానికి అనుగుణంగా ఉంటుందని ఆయన స్పష్టం చేశాడు.

"నావద్దకు అన్నీ బోర్లించిన కుండలే వస్తున్న"వని ఆయన చెప్పటంలోని అర్థం ఇదే! తనపై సంపూర్ణ విశ్వాసం లేనివాళ్లూ, తన తత్త్వాన్నీ, తాను చెప్పిందాన్నీ అర్థం చేసుకోలేనివాళ్ళూ తన దగ్గరికి వచ్చి, తానిస్తున్న ఫలాన్ని పూర్ణంగా పొందకుండానే తిరిగిపోతున్నారనే బాధ ఆయన మాటల్లో మనకు వ్యక్తమౌతుంది. "రాధాబాయి దేశ్ముఖ్" కు ఆయన సలహాయిస్తూ నీ గురువుపైన నమ్మకం ఉంచు, గురువు గొప్పతనాన్ని ఎవరు గ్రహిస్తారో, ఎవరైతే గురువును హరిహరబ్రహ్మల యొక్క (త్రిమూర్త్యాత్మకమైన) అవతారంగా భావిస్తారో, వాళ్ళే ధన్యులు" అని చెప్పిన మాటలు కూడా శిష్యుడికి గురువుపై అచంచల విశ్వాసం ఉండాలన్న విషయాన్ని నొక్కి చెబుతున్నవి.

సాయి యుగానికి అంకురార్పణ 1854 లో జరిగింది. శ్రీ సాయి షిర్డీలో ఒక వేపచెట్టు క్రింద కూచొని ప్రకటన మవటంతో విశ్వకళ్యాణానికి శ్రీకారం చుట్టి సాయి యుగం ప్రారంభమైంది. "నా భక్తుల్ని నేనే ఎన్నుకొంటా"ననీ, "పిచ్చుకకాలికి దారం కట్టి లాగినట్లు, నా వాణ్ణి నా చెంతకు లాక్కుంటా"ననీ బాబా చెప్పాడు. అదే ఆయన ప్రేమతత్వం.

మెహర్ బాబా చెప్పినట్లు షిర్డీ సాయినాథుని తత్త్వాన్ని కూలంకషంగా అర్థం చేసుకొని వంటబట్టించుకోవడానికి చాలామంది ప్రయత్నించటం లేదు. భక్తిపేరుతో సాయి చరిత్ర సప్తాహ పారాయణాలు చేస్తూ, భజనలతో, అర్చనలతో, అన్నదానాలతో షిర్డి యాత్రలతో తృప్తి పడుతున్నారు.

అదే భక్తిగా విశ్వసిస్తున్నారు. అట్లా చెయ్యటం వల్ల వచ్చే పుణ్యాన్ని పొందుతున్నారు. తమ కర్మలనూ, భక్తినీ, జ్ఞానంతో మిళితం చేసి యోగంగా మార్చుకోండని బాబా పదే పదే చెబుతుంటే ఆ మాటలువినటం లేదు. తాము చేసే కర్మకాండల్లో, భక్తిలో ఎన్నో మెట్లు ఎక్కవలసి ఉంటుందనీ, అంటే మానసిక స్థాయిని క్రమంగా పెంచుకోవలసి ఉంటుందనీ తెలుసుకొని అట్లా చెయ్యలేకపోతున్నారు. ఆ అవధూతకు, ఆ పరబ్రహ్మకు, వేపచెట్టే తన నివాసంగా భావించి, దాని క్రింద కూచున్న ఆ ఫకీరుకు మన గుండెల్లో కాక వేరే గుళ్లు గోపురాలతో పనేముంటుంది? చెడునంతా మంచిగా మార్చాలనే గదా! ఆయన పాడుపడ్డ మసీదును తన మందిరంగా చేసుకొని ద్వారకామాయిని చేసింది.

తన భక్తులకు బాబా చాలాసార్లు చాలా విషయాలు చెప్పారు. ఆయన చెప్పిన వాటిలో ముఖ్యంగా మనం జ్ఞాపకం పెట్టుకోవలసినవి రెండున్నవి. అందులో మొదటిది కామాన్ని (కోరికను) జయించటం, "కామాన్ని జయించలేనివాడు దైవాన్ని దర్శించలే" డంటారు బాబా. ఈ విషయం జ్ఞానులను గురించి బాబా చెప్పినట్లు తోస్తుంది. రెండోది అసూయను జయించటం. ఈ మాట సామాన్య జనులను ఉద్దేశించి బాబా చెప్పింది. అసూయరహితమైన తత్వాన్ని (అనసూయ తత్వాన్ని) మానసిక సహధర్మచారిణిని చేసుకొన్నవాడు కొంతకాలానికి తన సాధనవల్ల అత్రి (త్రిగుణరహితుడు) అవుతాడు. క్రమ క్రమంగా అతడిలో ఆత్మదర్శనం కలగటం మొదలుపెట్టి విశ్వశక్తి దత్తమౌతుంది. ఆ దత్తశక్తిని పొందాలంటే మునుముందు మనం అసూయను జయించవలసి ఉంటుంది. అసూయను జయించామంటే అది మన "సబూరికి" (ఓర్పుకు) నిలయమౌతుంది. అప్పుడు శ్రద్ధ ద్విగుణీ కృతమౌతుంది.

బాబా లక్షలాది జనాన్ని పరిశుద్ధమైన మార్గంలో (జ్ఞానమార్గంలో) నడిపిస్తానని చెప్పారు. ఆ మార్గంలో నడవాలంటే మొదట్లో అది అందరికీ సాధ్యమయ్యే పనికాదు. కనుక శ్రద్ధ, సబూరీలతో కూడిన భక్తిమార్గాన్ని ఆయన మనకు చూపించారు. రెండు కాసులు అంటే శ్రద్ధ, సబూరీ – దక్షిణ కోరటం ద్వారా మనలో త్యాగబుద్ధిని ప్రేరేపించారు. సాయి చూపించే పరిశుద్ధపథంలో మనం కాలుపెట్టాలంటే మొట్టమొదట మనం అసూయను వదలిపెట్టాలి. సాయి మార్గంలో అంటే దత్తమార్గంలో ప్రవేశించాలనుకొనేవాళ్ళు ఈ ప్రధాన విషయం ముఖ్యంగా గమనించవలసి ఉంటుంది.

నేటి సమాజంలో విపత్కర పరిస్థితులకూ, దారుణ మారణహోమాలకూ, అలజడులకి, అశాంతికి మూలం, అసూయాద్వేషాలే! అసూయను మన మనస్సులలోనుంచి తొలగించుకొంటే సమాజం

ప్రేమ, శాంతులతో మనగలుగుతుంది. సమాజాన్ని శ్రద్ధ, సబూరీలతో సంస్కరించి, నిత్యకళ్యాణం పచ్చతోరణంగా తీర్చి దిద్దాలన్నదే సాయిబాబా అవతారకార్యం. శాంతియుత సహజీవనానికి, సౌభ్రాతృత్వానికీ, మతసామరస్యానికీ శ్రద్ధా, సబూరీలతో, అల్లామాలిక్ (దేవుడొక్కడే) అన్న నినాదంతో బాబా ఇట్లా బీజావాపనం చేశారు.

సాయిబాబా పుట్టు పూర్వోత్తరాలు ఎవరికీ తెలియవు. ఒక్క బాబావే కావు. చాలామంది మహాత్ములు ఎక్కడ పుట్టారో? ఎవరికి పుట్టారో? తెలీదు. బ్రహ్మజ్ఞానం సిద్ధించిన వీళ్ళకు దేహాభిమానం ఉండదు. వాళ్ళు ఆత్మస్వరూపులు. వాళ్లకు తమదంటూ ఒక పేరూ, ఊరు ఉండదు. అనాదియైన ఆత్మస్వరూపంగా, విశ్వమంతా తమ నిలయంగా, అన్ని యుగాలలోనూ, తాము ఉన్నట్లుగా వాళ్ళు భావిస్తుంటారు.

సాయిబాబా మాటలు చాలా విచిత్రంగా ఉంటవి. ఒక పట్టాన అవి అందరికి అర్థం కావు. తాము అనాదిగా షిర్డీలోనే ఉన్నట్లు బాబా ఒకసారి "సాథే" తో చెప్పారు. పదహారేళ్ల వయస్సులో మొట్టమొదటిసారి షిర్డీలో వేపచెట్టు క్రింద దర్శనమిచ్చినప్పుడు "ఇది నా గురుస్థానం. ఇక్కడే నేను పన్నెండేళ్లు తపస్సు చేశా"ననీ అన్నారు. మరో విచిత్రం. సాయిబాబా కోర్టు వారికిచ్చిన వాఙ్మూలంలో తన వయస్సు లక్షల సంవత్సరాలనీ, తన మతం కబీరు మతమనీ చెప్పారు. "ద్వారకలో 50 కోట్లమంది యాదవులుండేవారట! రాముడికి కొన్ని కోట్ల మంది వానరులు సాయం చేశారట! నిజమేనా బాబా?" అని అడిగిన శ్యామాతో శ్రీసాయి "నిజమే శ్యామా! రాముడు, కృష్ణుడు అవతరించింది నిజమే" అన్నారు. ఆ మాట విని "అదంతా మీరు చూచినట్లు చెబుతున్నారే!" అని శ్యామా నవ్వగా, బాబా "నీకు, నాకూ ఎన్నో జన్మలు గడిచాయి. నాకవన్నీ గుర్తు ఉన్నాయి. నీకు లేవు. నేనిప్పుడెట్లా ఉన్నానో అప్పుడూ అట్లానే ఉన్నాను." అన్నారు. అంటే ఆ ఫకీరు (అవధూత) రూపం యుగయుగాల దన్నమాట! "మహాత్ములకు విశ్వమంతా తమ వూరే! అన్ని పేర్లు తమవే! అన్ని కాలాల్లోనూ వారుంటారు. ఆది మధ్యాంత రహితమైన పరబ్రహ్మ తత్వం అది!" అని సమాధానపడడం కన్నా మనం చేసేదేమి లేదు. పాము, కప్పలుగా జన్మించిన వీరభద్రప్ప, చెన్నబసవప్పలతో తనకు గల పూర్వజన్మ సంబంధం వివరించటం, అక్కలకోట స్వామిని తానే నని నిరూపించి, ఆ స్వామి పాదుకలు వేపచెట్టు క్రింద ప్రతిష్టింపచేయటం సమకాలికులైన తాజుద్దీన్‌బాబా, గజానన్‌మహరాజ్, వాసుదేవానందసరస్వతి వంటి మహనీయులను తన సోదరులుగా చెప్పుకొనుట మొదలైన వాటిని గమనిస్తే, సార్వకాలీన సార్వజనీన, సర్వదేవతా, స్వరూపంగా, సత్యం, జ్ఞానం, అనంతమైన పరబ్రహ్మ స్వరూపంగా ఆయన మనకు ప్రత్యక్షమౌతారు.

బాబా పరబ్రహ్మ స్వరూప మనటంలో ఎటువంటి సందేహంలేదు. కనుకనే ఆయన గురుస్థానం వహించారు. కరుణామయులై తమ భక్తులకు తమ విశ్వరూపాన్ని ప్రదర్శించారు. ఏ దేవతను కొలిచే భక్తుడు తన దగ్గరికి వస్తే ఆ దేవతా స్వరూపంగా కనిపించారు. దేవతా రూపాలన్నీ తన ఆత్మయొక్క విభిన్న రూపాలేనని స్పష్టం చేశారు. ఆయా భక్తులకు వారి వారి గురుస్వరూపాలుగా గోచరించి "దేహాలు వేరైనా గురుస్వరూపమొక్కటే! నీ గురువును గురువు లందరిలోను, గురువుల నందరిని నీ గురువులోను దర్శించటమే, దేహాతీతమైన, ఏకైకమైన, అద్వితీయమైన గురుస్వరూపాన్ని అనుభవంలోకి తెచ్చుకోవటమే నిజమైన గురుభక్తి" అని ప్రకటించారు. అన్ని జీవులు తన స్వరూపమేనని, ఏ జీవిని ఆదరించినా, లేక హింసించినా అది తనకే చెందుతుందనీ అనుభవపూర్వకంగా వెల్లడించారు. తనకూ, తన పటానికీ భేదం లేదని నిరూపించారు. షిర్డీకి ఎన్నో వందలమైళ్ళ దూరంలో ఉన్న "బాంద్రా" లో తార్కాడ్ తన పటానికి పూజచేసి నైవేద్యం పెట్టడం మరచిపోతే, షిర్డీలో తన ముందున్న ఆయన భార్యకు ఆవిషయం చెప్పి, తమ సర్వవ్యాపకత్వాన్ని నిరూపించుకొన్నారు. తన చేతిని ధునిలోకి దూర్చి, ఎక్కడో కొలిమిలో పడిన కమ్మరివాని బిడ్డను సంరక్షించి తన సర్వాంతర్యామిత్వాన్ని చాటారు. మొట్టమొదటి సారి తనను దర్శించడానికి వచ్చిన భక్తుణ్ణి చూచి "వీడు నాకు నాలుగు సంవత్సరాల నుంచి తెలుసు" అని చెప్పారు. అతడామాట ఆశ్చర్యపోయి ఆలోచిస్తుంటే, ఒకరోజు బొంబాయిలో, నాలుగు సంవత్సరాల క్రితం అంగడిలో ఉన్న సాయిబాబా పటాన్ని చూచి నమస్కరించిన విషయం అతనికి జ్ఞాపకం వచ్చింది. తమ పాదాలనుంచి గంగను ప్రవహింపచేసి, దాసుగణుని ఆశ్చర్యపరచి, తన విశ్వగురుత్వాన్ని వెల్లడించారు. ఒక భక్తుడు కష్టాల్లో ఉండి దత్తాత్రేయ స్వామి వారికి 15 రూపాయలు ఇస్తానని మొక్కుకొని, కష్టం తీరిన తర్వాత ఆ మొక్కు విషయం మర్చిపోయి, తన దర్శనానికి షిర్డీ వస్తే ఆ పైకం జబర్దస్తీగా అడిగి, వసూలు చేసి పుచ్చుకొని, దత్తుడికీ తనకూ భేదం లేదని వ్యక్తం చేశారు. మసీదులోకి హారతి సమయమప్పుడు వచ్చిన నార్వే, కోపోద్దీపితుడైన సాయినీ, ఆయన చేష్టలనూ చూచి, "ఇతడు పిచ్చివాడా ఏమిటి! ఇట్లా చేస్తున్నాడు.!" అని తనలో అనుకొని, ఆ రోజు సాయంత్రం బాబా దగ్గరికి పోయి, వారి కాళ్ళు వత్తుతున్నప్పుడు అతణ్ణి చూచి, "నేను పిచ్చివాణ్ణి కాదు" అని పలికి తన సర్వజ్ఞత్వాన్ని ప్రకటించారు. ఇలాంటి విశేషాలెన్నింటినో వారి చరిత్రలో మనం చూడవచ్చు. ఇన్ని మహిమలు ప్రదర్శించినా, తాను మహాత్ముణ్ణని గాని, అవతార పురుషుణ్ణనిగాని ఆయన ఎప్పుడూ చెప్పలేదు. సర్వశక్తులు, సర్వసిద్ధులు, కలిగి ఉన్నప్పటికీ ప్రతిరోజు అయిదిళ్లకు పోయి, "అమ్మా రొట్టె పెట్టు! అక్కా! అన్నం పెట్టు!" అని భిక్షయాచించేవారు. బిక్షగా వచ్చిన ధనాన్ని ఆరోజు సాయంత్రం లోగా అందరికి పంచేవారు. పాడుబడ్డ మసీదులో విశ్రమించేవారు.

భిక్షగా తెచ్చిన ఆహారాన్ని కాకులు, కుక్కలు, పిల్లులతో కలిసి, రుచి అనే విచక్షణ లేకుండా ఒకే విస్తట్లో భుజించి తన అవధూత స్థితిని లోకానికి వెల్లడించారు. అల్లామాలిక్ (భగవంతుడే యజమాని) అని, తాను భగవంతుడికి సేవకుణ్ణని వినయాన్ని ప్రకటించారు. నిత్యం తననే స్మరిస్తూ, తనకు అర్పించకుండా ఏమీ తినని వానికి బానిసనని (ఋణపడి ఉంటానని) చెప్పారు. సమస్త జీవుల్లోను తనను చూడమనీ, ఆకలిగొన్న జీవిని ఆదరించమని, ఇతరులలో దుర్గుణాలు వెదుకవద్దనీ, పరోక్షంగా ఎవరినీ విమర్శించవద్దనీ, పదిమాటల కొకమాట సమాధానం చెప్పమనీ ఉద్బోధించారు. ధనం మీది పేరాశ వీడనిదే బ్రహ్మజ్ఞానం దొరకదని స్పష్టం చేశారు. ఎంతదూరాన ఉన్నా తన భక్తుని కాపాడతాననీ, ఎవరినీ మధ్యలో విడవననీ, చివరి దాకా అంటిపెట్టుకొని ఉంటాననీ, గమ్యం చేరుస్తాననీ, తన శరీర పతనానంతరం కూడా తన సమాధినుండే భక్తుల్ని సంరక్షిస్తాననీ వాగ్దానం చేశారు. తన వద్దకు వచ్చిన ప్రతిపైసాకు (అంటే జీవికి) తాను లెక్క చెప్పుకోవలసి ఉంటుందన్నారు. అట్లా అనటమే కాదు. ఈ నాటికీ తన మాట పొల్లుపోకుండా, తన భక్తులెందరికో దర్శన, స్పర్శన, సంభాషణాదులు ప్రసాదించి, దయాళువులై ఆదుకొని, ఆనందాన్ని, ప్రశాంతినీ ప్రసాదిస్తూ, మత సామరస్యానికి దోహదపడుతూనే ఉన్నారు.

మతముల మధ్య (ముఖ్యంగా హిందూ ముస్లిం మతముల మధ్య) గల వైషమ్యాన్ని రూపుమాపి, అందరిని భావసమైక్యపరచి, సౌభ్రాతృత్వ భావంతో మెలగునట్లు చేయుటకే, సాయినాధుని అవతారము వచ్చినది. "సబ్‌కా మాలిక్ ఏక్" (అందరి ప్రభువు ఒక్కడే) అనే మంత్రంతో అన్ని మతాల గమ్యం ఒక్కటే నని చెప్పి, మతసామరస్యానికి ఎంతగానో ఆయన పాటుబడ్డారు. మతమార్పిడికీ, ఆరాధనా పద్ధతుల మార్పిడికి వారెన్నడూ ఒప్పుకోలేదు. జైన మతంలోని అహింస, బౌద్ధమతంలోని వైరాగ్యం, రామావతారంలోని ధర్మం, కృష్ణావతారంలోని నిష్కామకర్మ, క్రీస్తు యొక్క విశ్వమానవ ప్రేమ, ఇస్లాంమతంలోని విశ్వసౌభ్రాతృత్వం సాయినాధుని జీవిత విధానంలో విలీనమైనవి. బాబాలో అవధూత, హాజరత్, పరవర్ధిగర్, భిక్షు లక్షణాలన్నీ గోచరిస్తూ ఆయన మతాతీతవ్యక్తి అని నిరూపిస్తవి. కలియుగ దత్తావతారులైన శ్రీపాదుల యతి ధర్మం, నరసింహ సరస్వతి సన్యాస ధర్మంలోని ఆచార్యత్వం, మాణిక్య ప్రభువులోని సర్వమత సామరస్యం, స్వామి సమర్థలోని అవధూత తత్త్వం, ఆయనలో సంగమించి జ్ఞాన స్వరూపంగా, గురుస్వరూపంగా పరమదయాళువుగా, త్యాగమూర్తిగా, విశ్వమానవ సమైక్య కాంక్షిగా, భక్త కల్పకంగా పరిపూర్ణ దత్తావతారంగా ఆయన ఈనాటికీ విలసిల్లుతున్నారన్న వాస్తవాన్ని మనం గమనిస్తాం.

మరో ముఖ్య విషయం. "నేను" అంటే ఎవరో సాయినాథుడు చాలాసార్లు భక్తులకు బోధించారు.

"నీవు నాకోసం ప్రయాసపడి, ఇంత దూరం షిర్డీ రానవసరంలేదు. నాకొరకు మీరెక్కడికీ వెళ్ళనవసరంలేదు. నీలోను, సర్వజీవుల్లోనూ ఉన్న చైతన్యాన్ని (ఆత్మను) నేను. ఈ విషయం గ్రహించి నీలోనేగాక, అన్ని జీవుల్లోనూ నన్ను చూడు, ఈ చూడడాన్ని నీవు క్రమంగా అభ్యసించినట్లైతే నాలో ఐక్యం పొందుతావు" అని బాబా చెప్పారు. సాయిబాబా చెప్పిన ఈ మాటలను బట్టి సాయి ఎవరో? వారి తత్త్వాన్ని దర్శించి, వారిలో ఐక్యం కావట మెట్లాగో? మనకు అర్థమౌతుంది. కనుక సాయి చెప్పినట్లు చేసి, వారికిష్టమైన మార్గంలో సంచరించటం సాయిభక్తుల కర్తవ్యం. సాయి తత్త్వాన్ని గ్రహించి సాయిలో ఐక్యమైన మహాత్ములు సాక్షాత్తు సాయి స్వరూపులే? ఇందుకు సందేహం లేదు.

ఓం ద్రాం శ్రీ సాయినాథాయ నమః

అవధూత చింతన శ్రీగురుదేవదత్త!

ముఖ్యక్షేత్రము, మార్గము : హైదరాబాద్ నుంచి ముంబాయి వెళ్ళు రైలు మార్గములో మన్మాడ్‌లో దిగి బస్సులో "షిరిడి" చేరవచ్చును. ఇది ఔరంగాబాద్ జిల్లాలో ఉన్నది.

భక్తిమార్గాన చక్కగా పదము పెట్టి
ఈశ్వరుణ్ణి గూర్చి క్రీడించి హేళయందు
కామచయమును తైలంబుగా నొనర్చి
జ్ఞానదీపంబు వెలిగించువాడే సాధుజనుండు
మరచిపోకుడు శివానందుని మంచిమాట

* * *

సాధనములెన్నో సలిపి చూచితి గాని
వదలకుండా జీవభావముండే
సద్గురుండు నాకు సమకూరినంతనే
అంతరంగమందు చింత తొలగె
మరచిపోకుడు శివానందుని మంచిమాట

– శ్రీ స్వామి శివానంద మహరాజ్

శ్రీ వాసుదేవానంద సరస్వతి (టెంబేస్వామి)

నమః శ్రీగురో గేశదీశే దయాబ్ధే
భయార్తి ఘ్నతే స్వాత్మదో వాసుదేవ
యతీట్ సేవితానందపాదాబ్జయుగ్మం
సదా మేహృదిస్థాస్నుతాం యాతుదేవ

మహారాష్ట్ర దేశంలో మాణిగావ్ అనే గ్రామములో టెంబేవంశస్థులైన గణేశ భట్టు, రమాబాయి అను సదాచారవంతులైన దత్తభక్తులుండెడివారు. గణేశభట్టు నిరంతరం దత్త నామస్మరణలో జీవిస్తూ తరుచుగా శ్రీ క్షేత్ర గాణుగాపురం వెడుతూ శ్రీ నరసింహ సరస్వతీస్వామిని సేవిస్తూ ఉండేవాడు. ఒకసారి ఆవిధంగా పన్నెండు సంవత్సరము లున్నాడు. శ్రీ నరసింహసరస్వతీ స్వామి ఒక రాత్రి స్వప్నంలో దర్శనమిచ్చి "నీవు ఇకమీదట నా కొఅకు నీవు గాణుగాపురం రానవసరం లేదు. నీవు గృహస్థ ధర్మముననుసరించి ఇంటికి పొమ్ము. నీ కోరిక సఫలముకాగలదు. నేనే నీ దగ్గరకు వచ్చెదను" అని అనుగ్రహ సందేశమిచ్చారు. పవిత్ర జీవనులు, సుగుణశీలురైన ఆ దంపతులను మెచ్చి శ్రీ దత్తప్రభువు వారికి పుత్రుడుగా జన్మించి, మరొకసారి తన దత్తనామమును సార్థకమొనరించుకొనెను. ఆ శుభదినం 13-8-1854 ఆనందనామ సంవత్సరము, శ్రావణ బహుళ పంచమి, ఆదివారం. ఆ దివ్య బాలుడికి వాసుదేవశాస్త్రి అని పేరు పెట్టారు. ఉపనయన సంస్కారము జరిగిన నాటి నుండి ప్రతి దినము నియమనిష్టలతో సంధ్యావందనము, శ్రీగురుచరిత్ర (మరాఠీ) గ్రంథ పారాయణము, పండితుల వద్ద వేదాధ్యయనము, స్వయంపాకము, నైవేద్యము, వైశ్వదేవముతో కూడిన నిత్యకర్మానుష్టానము ఆచరించేవాడు. దాని వలన ఎంతటి బ్రహ్మతేజస్సు కలుగుతుందో తెలియజేయుటకు ఈయన చరిత్రను మించిన ఉదాహరణ మరొకటి లేదు. జ్యోతిషశాస్త్రము, సంస్కృతము కూడా గురువుల వద్ద అభ్యసించెను. వాసుదేవశాస్త్రికి 21వ సంవత్సరములో అన్నపూర్ణాబాయితో వివాహమయ్యెను. నియమనిష్టలతో వేదాధ్యయనము చేయుటవలన వాసుదేవ్‌కు మంత్ర సిద్ధి లభించింది. దీని సహాయముతో ప్రజలను బాధలనుండి కష్టనష్టముల నుండి విముక్తులను చేసేవారు.

"శ్రీగురుచరిత్ర" పారాయణ వలన దత్తానుగ్రహం అనుభవమవుతుండేది. ఒకసారి అడవిలో వెడుతుండగా పెద్దపులి ఎదురైంది. వాసుదేవశాస్త్రి భయంతో చెట్టు ఎక్కారు. అప్పుడు

"ఆత్మారాంజడియే" అనే సాహసవంతుని రూపంలో దత్తస్వామి వచ్చి రక్షించారు. ఆయనకు నరసోబావాడి వెళ్ళాలని ఉంది కాని, తల్లిఇంకా అనుమతించలేదు. ఒకనాటిరాత్రి స్వప్నంలో దత్తస్వామి ఒక బ్రాహ్మణుడి రూపములో కన్పించి "నీ తల్లి అనుమతిస్తుంది, ప్రయాణమునకు అవసరమైన పైకము, తోడూకూడా లభిస్తాయి. నర్సోబావాడి వెళ్ళు" అన్నారు. నిజంగానే తెల్లవారేసరికి అవి అన్నీ సమకూడి, నర్సోబావాడి బయలుదేరి దారిలో బోరుగాం అనే గ్రామంలో బస చేశారు. నాటి రాత్రి స్వప్నములో వాసుదేవశాస్త్రికి "నర్సోబావాడీలో గోవిందస్వామి అనే సిద్ధపురుషుడు ఉన్నాడు. ఆయన దర్శనం చేసుకో" అని ఎవరో చెప్పినట్లు దృష్టాంతమైంది. మరునాడు నర్సోబావాడి చేరగానే గోవిందస్వామియే ఎదురువచ్చి పేరుపెట్టి పిలిచి యోగక్షేమములు విచారించి వెళ్ళాడు. వాసుదేవశాస్త్రి మాసిపోయిన పంచ, అంగవస్త్రముచూసి మందిరములోని పూజారులు లోనికి వెళ్ళి దత్తపాదుకలను పూజించుటకు అనుమతించలేదు. ప్రక్క మఠంలోని గోవిందస్వామితో దత్తప్రభువు "మండపములో ఏమి జరుగచున్నదో చూడు. అంత దూరం నుండి కొండంత ఆశతో వచ్చిన ఆ బ్రాహ్మణుని, పాదుకల నభిషేకించుటకు పూజారులు అనుమతించుటలేదు" అని చెప్పాడు. వెంటనే గోవింద స్వామి జోక్యంతో అనుమతించారు. వాసుదేవశాస్త్రి ఒక మాసం నిత్యం ఆ పాదుకలను సేవించారు. ఒకరోజు దత్తస్వామి స్వప్నంలో కన్పించి "మీరజ్‌లో ఉన్న శంకరభట్టు నుండి శ్రీ గురు చరిత్ర గ్రంధము తెచ్చుకొని పారాయణచెయ్యి" అని చెప్పాడు. శంకరభట్టు తన పారాయణగ్రంథమును ఎవరికి ఇచ్చేవాడు కాదు. అందుకని దత్తస్వామి అతనికి కలలో కనపడి ఆ గ్రంథమును వాసుదేవశాస్త్రికి ఇవ్వమని ఆదేశించడం వలన ఇచ్చాడు. తర్వాత వాసుదేవశాస్త్రి ఒక సప్తాహము ఉపవాసదీక్షతో శ్రీ గురుచరిత్ర పారాయణ చేశారు. తర్వాత ఒకనాడు గోవిందస్వామి, వాసుదేవశాస్త్రిని దత్తోపాసన చెయ్యమని చెప్పెను. దానికి ఆయన బ్రాహ్మణులకు సూర్యాగ్నుల నిత్యోపాసనా విధి ఉండగా మరొక ఉపాసన ఎందుకు?" అనెను. ఆనాటి రాత్రి స్వప్నములో దత్తస్వామి స్వయంగా మంత్రోపదేశం చేశారు. అప్పుడు గోవిందస్వామి శయ్యమీద నుండి లేచి "శాస్త్రిబువా! మంత్రోపదేశము అయింది కదా. దాని అనుష్టాన విధానమంతా రేపు ఉదయం వివరిస్తాను" అని చెప్పాడు. గోవిందస్వామికి దత్తస్వామితో గల తాదాత్మ్యమును శాస్త్రి గ్రహించి ఆయనను గురువుగా స్వీకరించి మంత్రానుష్టానం చేశారు.

ఒకప్పుడు మాణెగాంచ్‌లోనే ఏడు సంవత్సరములు ఉండమని వాసుదేవశాస్త్రిని దత్తస్వామి ఆదేశించారు. ఆయన ఒక దత్తవిగ్రహమును తీసుకొని వెళ్ళదలచి, దారిలో కాగల్ అనే ఊరులో ఆగారు. అక్కడ ఒక శిల్పి ఎదురై ఒక దత్త విగ్రహమును ఇచ్చి దత్తస్వామియే అలా చేయమని

ముందటిరాత్రి స్వప్నంలో ఆదేశించారని చెప్పాడు. శాస్త్రి మాణేగాంవ్ చేరేసరికి, ఒక విధవరాలు ఆయనకు కొంత స్థలమిచ్చి, అంతకు ముందురోజు రాత్రి భర్త స్వప్నంలో కనపడి కొంచెం స్థలం సద్బ్రాహ్మణుడికి దానమిమ్మని చెప్పారని తెలియజేసింది. వాసుదేవశాస్త్రి ఆ స్థలంలో ఒక మందిరం నిర్మించి, ఆ విగ్రహమును అందులో ప్రతిష్ఠించారు. ఆ దత్తస్వామి వాసుదేవ శాస్త్రితో నిత్య ప్రసన్నంగా ఉండి సంభాషిస్తూ ఉంటాడు.

ఒక దత్త జయంతికి శాస్త్రిగారి బంధువొకరు మరణించారు. కాని దత్త జయంతి కార్యక్రమములకు ఆటంకమవుతుందని బంధువులా విషయం చెప్పలేదు. ఆనాడుదయం మందిరమునకు వెళ్ళగానే దత్తస్వామి "శివశివ! నన్ను తాకవద్దు. నీకు మైలవచ్చింది." అన్నాడు. అప్పుడు విచారిస్తే అసలు విషయం బైటపడింది. అలాగే, ఒక చంద్రగ్రహణమప్పుడు పంచాంగములన్నీ ఆ ప్రాంతంలో చంద్రగ్రహణం కనిపించదు. కనుక మందిరములలో యధావిధిగా అర్చనలు, నివేదనలు చేయవచ్చు అని పండితులు నిర్ణయించారు. కాని ముందు రోజు రాత్రి దత్తస్వామి శాస్త్రిగారికి దర్శనమిచ్చి "రేపుగ్రహణం కనిపిస్తుంది. కనుక నాకు భిక్ష, నైవేద్యము వద్దు" అన్నారు. మరునాడు ఆ మాట అక్షరాల నిజమైంది. ఒకసారి వాసుదేవశాస్త్రి ఆయన తల్లితో నరసోబావాడిలో ఒక ధర్మశాలలో బస చేసియుండగా, నాటిరాత్రి దత్తస్వామి ఇద్దరకు కలలో కన్పించి ఈ ధర్మశాల శిథిలమైంది. వేరొకచోటుకు వెళ్ళండి" అని చెప్పారు. ఉదయమే శాస్త్రి తన తల్లిని తీసుకొని ధర్మశాలనుంచి బయటకు రాగానే ఆ భవనం కూలిపోయింది. మహారాష్ట్ర భాషలోని శ్రీ గురుచరిత్రను సంస్కృతములోనికి అనువదించమని దత్తస్వామి ఆజ్ఞాపించగా వాసుదేవశాస్త్రి వ్రాసిరి. దత్తస్వామి దానికి "ద్విసాహస్రి" అని పేరుపెట్టమనిరి. తర్వాత అందులో రెండువేలకి తక్కువగా శ్లోకములున్నా కూడా ద్విసాహస్రి అని పేరు పెట్టమన్నారేమిటి అని ఆలోచిస్తుంటే, దత్తస్వామి "దేవిసప్తశతి" ప్రమాణముతో (అనగా అర్థశ్లోకములు, ఉవాచలు, మంత్రములతో కలిపి లెక్కలోకి) తీసుకొంటే ద్విసాహస్రి అవుతుందన్నారు.

భార్యతో కలిసి వాసుదేవశాస్త్రి దత్తక్షేత్రములు దర్శిస్తూ గంగాఖేడ్ చేరుకొన్నారు. అక్కడ ఒకనాటి రాత్రి స్వప్నంలో దత్తస్వామి దర్శనమిచ్చి "నేటి నుండి నాల్గవరోజున మీ ఇద్దరిని నా సన్నిధికి చేర్చుకుంటాను" అన్నారు. సనాతన వర్ణాశ్రమధర్మాలయందు నిష్ఠకలిగిన శాస్త్రిగారు "నేను సన్యాసం స్వీకరించాలని చిరకాల కోరిక. కనుక మీరు ఆమెను మాత్రమే తీసుకుపొండి" అన్నారు. ఆమెకు కలరావచ్చి కొద్ది రోజులలో మరణించింది. ఆమె కర్మకాండలు నిర్వహించిన తర్వాత నాటి రాత్రి

దత్తప్రభువు గోవిందస్వామిరూపంలో కనిపించి, శాస్త్రీబువా కుడిచెవిలో ప్రణవమంత్రముపదేశించి, నిత్యము జపించమని, మధూకరమును మాత్రమే గ్రహించమని చెప్పారు. మరునాడు గోదావరితీరమునకు పోయి సమస్త బ్రాహ్మణ సమూహము సమక్షములో ప్రాయశ్చిత్తకర్మలాచరించారు. ఎవరైనా యోగ్యమైన స్వామివచ్చి ప్రేషోచ్చారము చేయించి సన్యాసదీక్ష ఇస్తే బాగుండునని మనమున తలపోయసాగారు. వెంటనే ఎవరో పిలిచినట్లుగా గోదావరి అవతలి తీరం నుండి అకస్మాత్తుగా ఒక సన్యాసివచ్చి, ఆ తంతు జరిపించి, సన్యాసదీక్షనొసగి వెళ్ళిపోయెను. సన్యాసదీక్షకు సంబంధించి సర్వవిధులు నిర్వర్తించిన తర్వాత ఆ సన్యాసికి భిక్షయిద్దామని నదీతీరమంతా వెదికినా ఆయన కనపడలేదు. ఆ వచ్చినది దత్త స్వామియేనని అందరూ గ్రహించారు. తర్వాత దత్తప్రభువు వీరిని ఉజ్జయినీ నగరమందలి శ్రీమత్ పరమహంస శ్రీ నారాయణానంద సరస్వతీస్వామి వారి వద్ద కరదండము గ్రహించమని చెప్పారు. ఈ స్వామివారు కరంజానగరంలో జన్మించిన శ్రీ నరసింహసరస్వతీ స్వామివారి వంశీకులు. వారిది సమర్థ సంప్రదాయం. ఆవిధంగా కరదండమును ఆయన నుంచి స్వీకరించారు. అప్పటి నుండి వాసుదేవశాస్త్రి శ్రీమత్ పరమ హంస పరివ్రాజకాచార్య శ్రీశ్రీశ్రీ వాసుదేవానంద సరస్వతీ మహరాజ్‌గా ప్రసిద్ధి చెందారు. టెంబేవంశంలో జన్మించడంచేత టెంబేస్వామిగా కూడా వ్యవహరింపబడేవారు. అప్పటి నుండి ఆసేతు హిమాచల పర్యంతం ముమ్మారు పాదయాత్రతో పర్యటిస్తూ, వివిధ ప్రాంతములలో 24 చాతుర్మాసదీక్షలు నిర్వహించారు. అప్పుడు వారి ద్వారా ప్రకటమైన అద్భుత మహిమ, శ్రీ గురుచరిత్ర, యితర గ్రంథరచనలు, బోధలు, ఆయన దత్తాత్రేయ అవతారమని నిర్ధారిస్తాయి.

ఒకసారి మహరాజ్ కాశీ కాలినడకన పోవుచూ దారితప్పిరి. అన్నియు గుట్టలు, అడివి. మకాము చేయుటకు కనుచూపుమేరలో గ్రామము యొక్క జాడలేదు. అప్పుడు దత్తప్రభువు ఒక బోయబాలుడుగావచ్చి "నీవు కాశీకి పోవుచుంటివా? దారి నేను చూపించెదను. నావెంట రమ్ము" అని చెప్పగా అతనివెంట వెళ్ళుచుండిరి. దారిలో ఒక గుట్ట రాగా, దానినెక్కి దిగగానే ఒక ఊరు కనిపించెను. ఆ బాలుడు ఆయనతో ఆ గ్రామములో విశ్రమించి, అక్కడ నుండి సులభముగా కాశీ పోవచ్చునని చెప్పి అదృశ్యుడయ్యెను. ఎవరికైనా ఆ గ్రామము జేరుటకు మూడు రోజులు పట్టును అలాంటిది ఒకటిన్నర గంటలు కాలములోనే మహరాజ్ చేరినట్లు తెలుసుకొని ఆ గ్రామస్తులు అది దత్త లీల అని ఆనందించారు. బ్రహ్మావర్తములో చాతుర్మాసము నిర్వహించునప్పుడు మహరాజ్ 3500 శ్లోకములతో ఋగ్వేదమునసనుసరించి "దత్తపురాణము" సంస్కృతములో రచించిరి. ఒకసారి బదరీయాత్రకు హిమాలయములలో వెడుతుండగా దారిలో ఒక పెద్ద మంచుగడ్డ దారికడ్డముగా

పడియుండుటచే ఆగిపోయిరి. ఆ మంచుగడ్డపై నుండి ఇద్దరు వ్యక్తులు దిగివచ్చి ఇటుదారిలేదు, చాలా ప్రమాదము వెనుకకు మరలిపొమ్మనిరి. నారాయణదర్శనము చేసుకొనకుండా వెనుదిరిగే ప్రసక్తిలేదని మహరాజ్ చెప్పిరి. అది వినివారు అదృశ్యులైరి. వీరు ఎవరై ఉందురా అని మహరాజ్ ఆలోచన చెయ్యగానే నర, నారాయణ మహా ఋషులు అల్లంతదూరంలో దర్శనమిచ్చి అంతర్ధానమైరి.

మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ దగ్గరగల పేట్‌లాడ్ అనే గ్రామంలో చాతుర్మాసదీక్ష మహరాజ్ నిర్వహించారు. అక్కడ "దత్తలీలామృతసింధువు" అనే గ్రంధమును వెయ్యి ఓవీలతో ప్రాంతీయభాషలో రచించారు. అక్కడ ఉన్నప్పుడే దీపావళి ముందు వచ్చే చతుర్దశికి ముందురోజు రాత్రి స్వప్నములో దత్తప్రభువు కనిపించి "రేపు నాకు అభ్యంగన స్నానము కావలయును" అని కోరెను. "నేను సన్యాసిని, వేడినీరు సుగంధ ద్రవ్యములు నేను ఎక్కడ నుండి తేగలను. అభ్యంగన స్నానము బదులుగా నీవు గతంలో చెప్పినట్లు భస్మము మాత్రమే పూసెదను" అని మహరాజ్ చెప్పిరి. మరునాడు ఆవిధముగా భస్మము పూసి విగ్రహమును పీఠముపై ఉంచిరి. దత్తప్రభువుకు కోపము వచ్చి నర్మదానదిలో దాగుకొనెను. మహరాజ్ భిక్షకుపోయి వచ్చి దత్తప్రభువుకు నైవేద్యమిచ్చుటకు పూజగదిలోనికి రాగా, పెద్ద కంఠముతో "దీపావళిపండుగైనా సరే, మంగళస్నానం చేయించకుండా నైవేద్యము పెడితే, దానికై నేనేమి ఇక్కడ కాచుకొని కూర్చోలేదు. పోయి, నదిలో కూర్చున్నాను" అని దత్తప్రభువు చెప్పిరి. పీఠముపైన విగ్రహము లేదు. వెంటనే నదితీరమునకు పరుగునపోయి వెదుకుచుండగా జలమునుండి పసిపిల్లవాడి ఏడుపు వినిపించెను. అటువైపు చూడగా దివ్యమైన తేజస్సుతో నీటిపై దత్తవిగ్రహం తేలియాడుతూ కనబడింది. మహరాజ్ పసిపిల్లవాడిని ఎత్తుకున్నట్టుగా ఆ విగ్రహమును తీసుకొన్నారు. గ్రామస్తులు ఈ విషయం తెలిసి మంగళస్నానమునకు అవసరమైన వేడినీరు, సుగంధద్రవ్యములు, పంచామృతములు సమకూర్చగా అందరూ కలిసి ఆనందంగా అభిషేకించిరి. సన్యాసులై కూడా మహరాజ్ సగుణోపాసన (విగ్రహారాధన) చేయుట గురించి గ్రామస్తులు అడిగిరి. దానికి మహరాజ్ "ప్రతిమనుజుడు సగుణోపాసన తప్పక చేయవలయును. శాస్త్రములు సగుణోపాసన చేయవలెనని శాసించుచున్నవి. రాజశాసనముల వలె ఈ శాస్త్ర నియమములు పాటించి తీరవలయును. ఒక మహరాజు రాజవైభవము కాదని సామాన్యునివలె నున్నచో ఏమి గౌరవము. అదేవిధంగా రాజాధిరాజు యోగి రాజైన దత్తప్రభువును సగుణోపాసన విధానముతో అర్చింపకపోయినచో, ఆయన మహాత్మ్యమును మనమెట్లు గుర్తించినట్లు? సగుణోపాసన చేయకుండా నిర్గుణోపాసన స్థాయికి మానవుడు పోలేడు. బ్రహ్మసాక్షాత్కారము పొందలేడు." అని సగుణోపాసన ప్రాశస్త్యము వివరించిరి.

గిరినార్ పర్వతముపై నున్న దత్తపాదుకలు దర్శించిన తర్వాత ప్రభాస తీర్థమునకు మహరాజ్ వచ్చిరి. అక్కడ దత్తస్వామి ఆదేశం మేరకు "ద్విసాహస్రి" గురుచరిత్రకు టీక మాణెగాంవ్‌లో వ్రాసిన సంస్కృత మూల ప్రతి దగ్గర లేకపోయినా, తొమ్మిది అధ్యాయములు వ్రాసిరి. తర్వాత ద్వారకలో ఉన్నప్పుడు మిగిలిన పదునాలుగు అధ్యాయములు పూర్తిచేసిరి. సంస్కృతమూల ప్రతి దగ్గర లేకున్నా దానికి టీక వ్రాయడం నావల్ల జరిగినది కాదు. దత్తస్వామి నాద్వారా వ్రాసుకొన్నదే అని మహరాజ్ తెలియజేసిరి. మహత్‌పురాలో చాతుర్మాసదీక్ష నిర్వహించినప్పుడు దత్తపురాణంలోని కథలన్నీ సంగ్రహించి "దత్తమహత్మ్యము" అనే గ్రంధము ప్రాంతీయభాషలో వ్రాసిరి. అప్పుడే "త్రిశతిగురుచరిత్ర" అనే మూడువందల శ్లోకములు గల సంస్కృత కావ్యము రచించిరి.

మహరాజ్ బ్రహ్మావర్తములో ఉన్నప్పుడు గ్వాలియర్ నుంచి వచ్చిన శాస్త్రి అనే పండితుడు "సన్యాసాశ్రమములో ఉండి మూర్తిపూజ చేయవచ్చని ఏ శాస్త్రములో నున్నది?" అని ప్రశ్నించెను. దానికి సమాధానంగా మహరాజ్ "అలాగని శాస్త్రములో లేదు. కాని, ఈ దత్త మూర్తియే నన్ను వదులుట లేదు." అని చెప్పిరి. ఆ పండితుడు ఆ విషయము నమ్మక "మీరే ఆమూర్తిని వదిలిపెట్టుడు. అంతేచాలు" అని చెప్పగా, సరే, అటులే చేసెదనని అంగీకరించిరి. మరునాడు గంగానదిలో మహరాజ్ స్నానం చేసి ఆ దత్తమూర్తిని గంగానదిలో వదిలివేసి తీరమునకు చేరెను. అంతే గంగార్పణం చేసిన ఆ బొటనవేలు ప్రమాణములో నున్న దత్తమూర్తి, మహరాజ్ ముందు వచ్చి నిలబడెను. ఇది ప్రత్యక్షముగా చూచిన ఆ గ్వాలియర్ పండితునకు నిర్గుణోపాసనయే శ్రేష్టమైనదనే అహంకారం తొలగి, సగుణోపాసనలో భక్తి రేకెత్తింది. యోగనాధుడైనప్పటికి దత్తస్వామి సగుణోపాసనను ఆమోదించి చేయించుకుంటున్నారని అర్థమైంది.

ప్లేగు వ్యాధితో మరణించబోతున్నావని అప్పానిగిడీకర్ అనే కర్ణాటక బ్రాహ్మణ భక్తునితో మహరాజ్ అన్నారు. కొన్నిరోజులలో ఆయన చెప్పినట్లే ప్లేగు సోకి మృత్యులక్షణములు గోచరించాయి. అతనికి సన్యాసం స్వీకరించాలనే కోరిక బలంగా ఉండటం చేత మహరాజ్‌కి తెలియజేశాడు. కరుణాస్వరూపులైన మహరాజ్ అతనికి ఆతుర సన్యాసము ఇప్పించి, పద్మాసనంలో కూర్చుండబెట్టి, ప్రేషోచ్చారము చేయించి, మూడుపర్యాయములు దీర్ఘముగా ఓంకారము చేయించుచుండగా అతడు ప్రాణము విడిచెను. మహాయోగులకు మాత్రమే సిద్ధించే ఇటువంటి మరణమును ప్రసాదించగలగడం దత్తస్వరూపులు సమర్ధసద్గురువులుయైన టెంబేస్వామి లాంటివారికే సాధ్యము! తర్వాత మహరాజ్‌కు కూడా ప్లేగువ్యాధి సోకింది. అయినా దత్తప్రభువు, అదేసమయంలో ఆరువేల ఏడువందల యాభై

శ్లోకములతో కూడిన సమశ్లోకి గురుచరిత్రను సంస్కృతములో రచించమని ఆదేశించిరి. అటువంటి స్థితిలో కూడా దత్తప్రసాదిత దివ్యశక్తితో మహరాజ్ ఆ పవిత్ర గ్రంథమును పూర్తి చేసిరి.

వాడీలో మకాము పూర్తియైన తర్వాత ఉత్తరదిశగా మహరాజ్ ప్రయాణం సాగిస్తూ గాణుగాపురం వస్తూ దారిలో కమలాపూర్‌లో విడిది చేశారు. నాటిరాత్రి స్వప్నంలో ఒక ఆజానుబాహుడైన మహాపురుషుడు కనపడి "దేశమంతా మీరూ పర్యటిస్తున్నారు. కవిత్వము చెప్పుచున్నారు. మేమంటే లెక్కలేకున్నది" అన్నారు. మహరాజ్ ఆ మహాపురుషుడెవరని దత్తస్వామిని ప్రార్థించగా, దత్తస్వామి "తెలియదా? ఆయన అక్కల్‌కోట స్వామి నీవు తనదగ్గరకు రావలయునని, తన చరిత్ర నీవు కావ్యముగా వ్రాయవలెననియు ఆయనకు కోరికగాయున్నట్లు కనిపించుచున్నది" అని చెప్పిరి. ఆ మాటలు విని, మహరాజ్, ఈ జిహ్వను దత్తపాదారవిందములకే అంకితముచేసితిని. ప్రభువులైన మీరు ఆయన మహత్త్వము తెలిపి ఆజ్ఞాపించినచో కావ్యము వ్రాయగలను" అని జవాబిచ్చిరి. కమలాపూర్‌నుండి పండరివెళ్ళి, అక్కడ నుండి గాణుగాపురం వెళ్ళాలని మొదట మహరాజ్ అనుకున్నారు. కాని దత్తస్వామి అక్కల్ కోట మీదుగా గాణుగాపూర్ వెళ్ళమని, గాణుగాపురంలో పాదుకలు దర్శించి మూడురోజులుండమని, "గాణుగాపురంలో తుకారామ్ అనే దత్తభక్తుడు, దత్తస్వామి యొక్క ప్రత్యక్ష దర్శనం కావలయునని మూడు సంవత్సరములుగా కేవలము ఫలహారము తింటూ ఎదురుచూస్తున్నాడు. అతనికి నేను నీరూపమున దర్శనమీయదలచితిని. కనుక గాణుగాపురము పొమ్ము" అని ఆజ్ఞాపించిరి. గాణుగాపురం వెడుతుంటే దారిలో అతిసార వ్యాధి మహరాజ్‌కి సోకింది. అయినా లెక్కచేయకుండా అక్కల్ కోటలో స్వామి సమర్థుల (ప్రత్యక్ష) దర్శనం చేసుకున్నారు. తర్వాత షేగాం నివాసియైన సంత్ గజానన్ మహరాజ్‌ని కూడా శ్రీ టెంబేస్వామి దర్శించారు. ఆ వివరం శ్రీ గజానన్ మహరాజ్ చరిత్రలో తెలియజేయబడింది. గాణుగాపురం చేరుకుని మహరాజ్ మఠంలో నిర్గుణపాదుకలను దర్శించారు కాని దత్తస్వామి దర్శనమివ్వలేదు. మహరాజ్ పాపవినాశన తీర్థమునకు వెళ్ళి దత్తదర్శనము కాలేదని భీష్మించి మూడు రోజులక్కడే ఉన్నారు. దత్తప్రభువు వాణి "నీకు సంగమంలో నాదర్శనమవుతుంది" అని వినిపించింది. సంగమమునకు పోగా అక్కడ దత్తస్వామి దర్శనమైంది. మహరాజ్ "మీరు లోగడ గాణుగాపురం మఠంలో ఎప్పుడూ ఉంటానని వాగ్దానము చేసియున్నారు కదా (అనగా నరసింహ సరస్వతిగా ఉన్నప్పుడు) మరి అక్కడ నాకు దర్శనమెందుకివ్వలేదు" అని దత్తస్వామినడిగిరి. అందుకు దత్తస్వామి "మఠంలో అనాచారము ప్రబలినందున నేనచ్చట ఉండలేక ఇక్కడ సంగమంలో ఉంటున్నాను" అని జవాబిచ్చిరి. దత్తస్వామి ఆదేశించిన విధంగా తుకారాం అనే భక్తునికి దర్శనమిచ్చి సర్వబాధా నివారకమైన అష్టకమునొకదానిని వ్రాసి యిచ్చి అనుగ్రహించిరి.

గాణుగాపురంవచ్చేదారిలో కృష్ణానదీమాత దర్శనమిచ్చి ఆయనచేత స్తోత్రము చేయబడి ఆనందించాలని కోరెను. దత్తప్రేరణతో "కృష్ణాలహరి" పేరుతో ఆశువుగా 51 శ్లోకములతో స్తోత్రముచేసెను. అంతసేపు కృష్ణామాత ప్రత్యక్షముగా ఆయన ముందు నిలబడి విని సంతృప్తి చెంది అదృశ్యమయ్యెను.

నర్సీ అనే గ్రామంలో 15వ చాతుర్మాస దీక్ష నిర్వహించారు. ప్రవచనము, ప్రసాద వితరణము జరుగు ప్రదేశం భక్త జనులతో క్రిక్కిరిపోయేది. మహారాజ్ దర్శనం కష్టమయ్యేది. అప్పుడు మహారాజ్ భక్తుల సౌకర్యము కొఱకు రెండు శరీరములు ధరించి ఒక శరీరముతో ప్రాంగణములోపల, మరోశరీరంతో బయట అశ్వద్ధవృక్షము క్రింద కూర్చుని దర్శనమనుగ్రహించారు. లోపల దర్శనం చేసుకొనివచ్చిన వారు బయట కూడా మహరాజ్ కూర్చుని ఉండటం చూచి ఆశ్చర్యపోయిరి. ఈ ఊరులోనే ఒకస్త్రీ నదీతీరంలో ఒకసారి మహరాజ్ ఒడిలో ఆరునెలల వయస్సు ఈడుగల పిల్లవాడు ఎడమ చేయి బొటనవ్రేలు నోటిలో చీకుతూ ఆనందంతో కేరింతలు కొడుతూ ఉండుట చూచింది. తర్వాత ఆయన ఆ స్త్రీతో "నీవు చాలా పుణ్యాత్మురాలవు దత్త ప్రభువును కన్నులారా దర్శించితివి" అన్నారు. ఒకసారి నరసోబావాడిలో పల్లకీ సేవ జరుగుచుండగా జనుల త్రోపిడికి ఉత్సవమూర్తి ఒకపూజారి చేతిలో నుండి జారి క్రిందపడెను. అది అపశకునమని వాడీలో ఏదో భయంకరమైన విపత్తు రాబోవుచున్నదనే భయంతో నర్సీలో ఉన్న మహారాజ్ దగ్గరకు ఒక పూజారివెళ్ళి కర్తవ్యముపదేశంచమని ప్రార్థించాడు. అప్పుడు మహరాజ్ దత్తస్వామిని "పల్లకీలోనుంచి మీరెందుకు జారితిరి?" అని ప్రశ్నించెను. అందుకు దత్తస్వామి కోపముతో "నీవు ఏ నియమములు విధించితివో, ఆ పూజారులవి పాటించుట లేదు. అంతే కాదు నిన్ను కృతఘ్నులై నిందించుచున్నారు. నా పాదుకలపై నిషిద్ధపదార్థములను వేయుచున్నారు. నేను వాటిని భరించలేకుండా ఉన్నాను. ఇలా జరుగకుండ చక్కని వ్యవస్థనేర్పాటు చేయవలెను. ఎచ్చట ధర్మవ్యవస్థకు భంగము కలుగునో అప్పుడు కష్టములు తప్పవు. వారిని నీవు శిక్షించవలెను" అని చెప్పిరి. అప్పుడు మహరాజ్ వాడీపూజారులను మంచి నడవడి కలిగి ఉండమని, పూజావిధులు సక్రమముగా శ్రద్ధగా నిర్వహించమని దత్తకరుణాష్టకమును అపరాధక్షమాపణ భావముతో పఠించమని చెప్పిపంపించిరి.

కృష్ణానదిలో చిన్న ద్వీపమైన కురుగడ్డ (కురువపురం) శ్రీపాదవల్లభుల క్షేత్రం. మహరాజ్ అక్కడ కొంతకాలం నివసించిరి. అక్కడి పూజారులు బ్రాహ్మణాచారములు సరిగా పాటించనందున ఏవగించుకొని కురవపురం నుండి వెడలిపోవాలనుకున్నారు. అప్పుడు శ్రీపాదశ్రీవల్లభులు బ్రహ్మచారి రూపములో మహరాజ్ దగ్గరకు వచ్చి "నా రజక భక్తుడొకడు ఈ భూమిని నాకు ధారాదత్తం

చేసెను. ఈ భూమిపై వచ్చు రాబడితోనే నందా దీపము, నైవేద్యము నడచుచున్నవి. ద్రవ్యశుద్ధి, భావశుద్ధి పుష్కలముగా నున్న ఇక్కడి భిక్ష నాకు పనికి వచ్చుచుండగా నీకెందుకు పనికిరాదు. ఈ జనుల ఆచారముపట్టించుకొనకుండా భిక్ష అంగీకరించు" అని చెప్పిరి. అప్పటి నుండి ఆ పూజారుల యిండ్లలో భిక్షతీసుకొనిరి. కురుగడ్డలోని ఒక గుట్టలోగల గుహ తపస్సుకు అనుకూలముగా నుండెను. కాని అందులో ఒక సర్పము నివసించుచుండెను. మహరాజ్ ఆ సర్పమును ఆ గుహను విడిచి వేరేచోటికి వెళ్ళవలసినదిగా కోరిరి. అంత ఆ సర్పము ఎంతో సాధువర్తనంతో ప్రక్కనే ఉన్న రావిచెట్టు వద్ద తన నివాసమేర్పరుచుకొనెను. మహరాజ్ ఆ గుహలో తపస్సు చేయునప్పుడు రోజూ ఆ సర్పము ఒకసారి వచ్చి దర్శనము చేసుకొని వెడుతుండేది.

మహరాజ్ బరోడా సమీపములో నర్మదా నదీతీరంలో గరుడేశ్వరములో నివాసముండిరి. అప్పుడొకసారి ముసల్మాను భక్తులు వచ్చి వారి బాధలు చెప్పుకొనిరి. మహరాజ్ వారికి కొన్ని మందులొసగి పవిత్ర ఖురాన్‌లోని కొన్ని మంత్రములను రోజూ పఠించమని చెప్పిరి. రోజూ ఖురాన్ పఠించే ఆ భక్తులకు కూడా తెలియని మంత్రములు ఆ గ్రంథము దగ్గర లేకుండానే మహరాజ్ నోటితో ఉచ్చరించి ఉపదేశించడంతో ఆ ముసల్మాను భక్తులు విభ్రాంతులైరి. గరుడేశ్వరములో రోజూ రాత్రి భజనయైన తర్వాత ప్రసాద వినియోగము జరుగుచుండెను. ఒకరోజు భక్తులు చాలా ఎక్కువమంది వచ్చిరి. మందిర నిర్వాహకులైన సబ్నీస్‌కు ప్రసాదము సరిపోదని అనుమానము కలిగెను. సగంమందికి పంచిన తర్వాత మహరాజ్ ఆ పాత్రలను తన వద్ద పెట్టమని, వారిచేతులతో ఆ పాత్రలపై మూతలు తీయగా ఆ పాత్రలలో మరలప్రసాదము నిండుగా ఉండెను. మహరాజ్‌కు సమర్పించిన దక్షిణలన్నీ ఒక డబ్బాలోవేసి సబ్నీస్, ఆశ్రమ నిర్వహణకు వాడేవాడు. రోజూ రెండు వందలు పైగా భక్తులు వచ్చేవారు. ఒకరోజు ఆ డబ్బాలో మూడు రూపాయలే మిగులుట చూచిన సబ్నీస్ మరురోజు ఖర్చులకెట్లా సరిపోవునని చింతించుచుండెను. మహరాజ్ దేవుని సంకల్పానుసారం అన్నీ జరుగుతాయి. నీవు ఖంగారుపడవలసిన పనిలేదని" చెప్పారు. మరునాడు పట్టణం నుండి వంట సరుకులు పంపించే దుకాణదారుడు వచ్చి పైకమడిగెను. మహరాజ్ సబ్నీస్‌ని చూచి ఆ పైకమిచ్చి పంపించమన్నారు. సబ్నీస్ ఆ డబ్బామూత తియ్యగానే దాని నిండా బంగారు కాసులున్నాయి.

ఒకసారి గంగామసలే అనే గ్రామ సమీపంలో గోదావరినదిలో ఎవరినీ దిగవద్దని శాసించి, మహరాజ్ ఒక్కరే స్నానం చేస్తున్నారు. అయినాసరే కొంతమంది వారి మాట వినకుండా నదిలో దిగిరి. ప్రవాహవేగమునకు ఒకతను కొట్టుకు పోయెను. అతనిని వెదికిపట్టుకొని ఒడ్డుకి తీసుకొని

వచ్చిరి. కాని అప్పటికే అతను మరణించెను. అప్పుడు మహరాజ్ "నేను చెప్పిన మాట వినకుండా నాకు తిప్పలు తెచ్చి పెడుతున్నారు" అని బాధపడి దత్తుని స్మరించి తన కమండలంలోని నీరు శవముపై చిలకరించిరి. అతను వెంటనే సజీవుడయ్యెను. అక్కడి ప్రజలు విభ్రాంతులై ఉత్సవం నిర్వహించిరి.

మహరాజ్ పాదయాత్రలో ఒకసారి నాటిశృంగేరి జగద్గురు శంకరాచార్యులైన శ్రీ నృసింహభారతీస్వామి వారిని దర్శించారు. శ్రీశంకరాచార్య వీరి నెంతగానో సన్మానించి, తమ శిష్యులతో "అయంహి భగవాన్ సాక్షాత్ దత్తాత్రేయో సమం యతిః" అనగా ఈయతి సాక్షాత్తు దత్తాత్రేయుడే అని చెప్పారు. ఈయన దేశ సంచారం చేస్తున్నపుడు ఆంధ్రదేశంలో తిరుపతి, శ్రీకాళహస్తి, వెంకటగిరి, నెల్లూరు, శ్రీశైలం సందర్శించారు. ముత్యాలలో 1908లో చాతుర్మాసం చేశారు. తరువాత హంసలదీవికి వచ్చి సాగర సంగమంలో స్నానం చేశారు. మచిలీపట్నం మీదుగా సప్తగోదావరి దర్శించారు. తరువాత రాజమండ్రి విచ్చేసి శృంగేరి శంకరమఠంలో "భక్తవత్సలుడు" అనుపేరుతో 1910లో దత్తమూర్తిని ప్రతిష్టించారు. వీరు రాజమండ్రిలో వున్నపుడు నాందేడ్ నుండి పుండరీకరావను భక్తుడు కొంతమంది స్నేహితులతో వచ్చి వీర్ని దర్శించాడు. అతడు తిరిగి వెళ్ళేటప్పుడు మహరాజ్ అతని కొక కొబ్బరి కాయ ఇచ్చి, "ఇది మా నమస్కారాలతో షిరిడీలోవున్న మా అన్న గారైన శ్రీ సాయిబాబాకు సమర్పించు, నన్ను మరువక ప్రేమతో కనిపెట్టి వుండమను, సన్యాసులమైన మేము ఎవరికి నమస్కరించము. కాని వారి విషయం వేరు" అన్నారు. తరువాత దారిలో పుండరీకరావు, అతని మిత్రులు మరిచిపోయి ఆ కాయను తినివేశారు. వారు షిరిడి చేరాక, ఇంకా ఏమి చెప్పకముందే సాయిబాబా వారు " నా సోదరుడిచ్చిన కొబ్బరికాయ ఏది?" అని అడిగారు. వారు జరిగినది చెప్పి, వేరొక కాయ ఇస్తామన్నారు. ఆయన "నా సోదరుడిచ్చిన కాయతో మరేదీ సాటికాదు" అని అన్నారు. వైదికాచార, నిష్ఠాగరిష్ఠుడైన శ్రీవాసుదేవానంద సరస్వతీస్వామి, ముస్లిమ్ ఫకీరైన సాయిబాబావారు ఒకరినొకరు సోదరులుగా వ్యవహరించటం గమనార్హం. తరువాత వీరు కాకినాడలో సముద్రస్నానం చేసి పిఠాపురం వచ్చారు. పిఠాపురంలో జనులు అది శ్రీపాదశ్రీవల్లభ జన్మస్థానం అని ఏ నాడో మర్చిపోయిరి. వీరు పిఠాపురం వచ్చి ఆ విషయం చెప్పిన తర్వాతే అక్కడి ప్రజలకు తెలిసింది. వీరి రాకతో పిఠాపురం తిరిగి దత్తక్షేత్రముగా ప్రసిద్ధి చెందింది. ఆంధ్రదేశంలో నేడు దత్త భక్తి సంప్రదాయం విస్తరించడానికి శ్రీవాసుదేవానంద సరస్వతి స్వామి వారి పర్యటనయే కారణం.

శ్రీ టెంబే స్వామివారు దేశమంతా పర్యటించి సర్వోత్కృష్టమైన దత్తభక్తిని గ్రామగ్రామాన

ప్రచారంచేశారు. అనారోగ్య బాధలు, పిశాచ బాధలు, సర్ప బాధలు, ఈతిబాధలను దత్తమంత్రములు, దత్త స్తోత్రములు అందించి తొలగించారు. దత్తపురాణము, శ్రీ గురుచరిత్ర విశేషంగా ప్రచారం చేశారు. శ్రీ నృసింహసరస్వతీ స్వామి కాలం నుండి సుమారు 400 సంవత్సరములు కేవలం మహారాష్ట్రభాషలో మాత్రమే ఉన్న శ్రీ గురుచరిత్ర మహాగ్రంథమును 1903 వ సంవత్సరంలో వీరు సంస్కృతములో అనువాదముచేసిన తర్వాత మాత్రమే ఆంధ్రభాషలోను ఇతర ప్రాంతీయ భాషలలోను ఆ గ్రంథం లభ్యమైంది. ఇష్టదేవతా భక్తిని శ్రేష్టమైన గురుభక్తిగా (దైవమును గురువుగా ఆరాధించడం) మలచడం అనే విప్లవాత్మకమైన, చారిత్రాత్మకమైన మార్పు "శ్రీగురుచరిత్ర" గ్రంథం ద్వారా సాధ్యమైంది. ఈ ఆధ్యాత్మిక విజయంలో టెంబేస్వామి వారి పాత్ర గణనీయమైనది. అంతేకాదు విగ్రహారాధన చాలా పామరస్థాయిలో చేసేదని ప్రచారం చేస్తూ ధ్యానమే చాలా గొప్పదని అనేక ఆధ్యాత్మిక సంస్థలు ఉధృతంగా ప్రచారం చేస్తూ ప్రజలను ఆకర్షిస్తున్న ఈ కాలంలో, దత్తావతారంగా ఆరాధింపబడుతూన్న శ్రీ వాసుదేవానంద సరస్వతీ స్వామి అంతటివారే ఏనాడుమూర్తి పూజ మానలేదని, దత్త ప్రభువు మాననివ్వలేదనేది ధ్యాన మార్గాభిమాను సాధకులందరూ గుర్తించవలసిన అంశం.

శ్రీ టెంబేస్వామివారు వారి బోధ సారాన్ని ఒకసారి ఈ విధంగా తెలియచేశారు.

"మానవ జన్మ ఎత్తినందుకు ముక్తిని సాధించుటకై ప్రయత్నించుట మన అందరి ప్రథమ కర్తవ్యము. అందుకై మనసును సుస్థిరము చేసుకొనవలెను. అందుకొరకై బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్యాసములలో ఎవరే ఆశ్రమంలో యుంటే దానికి విహితమైన ధర్మములను శాస్త్రానుసారము ఆచరించవలెను. సద్గ్రంథ శ్రవణము, మనన, నిధి, ధ్యాసలు నిత్యము అభ్యాసము చేయవలెను. అందులో ముఖ్యముగా శ్రవణముపై మనస్సు నిలుపవలెను. అందువలన మనస్సులోని అనర్థధాయకమైన ఆసక్తి తొలగిపోవును. ఆహారము హితముగా, మితముగా, పవిత్రముగా స్వీకరించుటవలన సాత్వికప్రవృత్తి కలుగుతుంది.మన ప్రవృత్తి సాత్వికముగానున్నదో లేదో కొన్ని లక్షణములను బట్టి మనమే గ్రహించవచ్చును. మగవారిలో – స్వధర్మము మీద శ్రద్ధ కలుగుట, స్నాన సంధ్యలు, పూజ, పంచమహాయజ్ఞములు, సకాలమున చేయుట, అతిథి సత్కారము, గోసేవ, భగవత్కథాశ్రవణ, కీర్తన భజనలలో పాల్గొనుట, అందరితో మృదువుగా సంభాషించుట, ఇతరులకు కష్టము, నష్టము కలుగకుండ మెలగుట, తల్లి దండ్రులను సేవించుట మున్నగు గుణములు కలిగియున్నట్లు కనిపించినచో వారి ప్రవృత్తి సాత్వికమైనదని చెప్పవచ్చును. ఇక ఆడవారిలో – ప్రీతితో అత్తవారింటిలో కాపురము చేయుచూ, పెద్దల ఆజ్ఞకు లోబడినడచుకొనుట, శ్రద్ధతో పతిసేవ

చేయుట మున్నగు గుణములు కలిగి యున్నట్లు కనిపించినచో వారి ప్రవృత్తి సాత్వికమైనదనుటకు నిదర్శనము. ఉదరపోషణకై వ్యాపారము గాని, వ్యవసాయముగాని, ఉద్యోగముకాని, ఎవరేవృత్తిని గాని చేపట్టినను, వేద విహితకర్మలు, గుర్వాజ్ఞ పాలనము ఎన్నడు విడువరాదు. స్వకర్మానుష్ఠానము వలన అంతః కరణము పరిశుద్ధమైనంతనే ఉపాసనము స్థిరమగును. ఉపాసన స్థిరమైనంతనే మనశ్శాంతి దొరకును. ఆవిధంగామనస్సు స్థిరపడి ప్రశాంతమైనప్పుడు ఆత్మజ్ఞానము కలిగి మోక్షలాభము ప్రాప్తించును."

పై విధంగా సప్తజ్ఞానభూమికలను సాధకులకు అరటిపండు ఒలిచి చేతిలో పెట్టినంత తేలికగా హృద్యంగా బోధించిరి.

శ్రీ టెంబేస్వామివారు ముందే సూచించిన విధంగా 1914 వ సంవత్సరములో ఆషాఢశుద్ధ పాడ్యమినాడు దత్తప్రభువు ఎదురుగా కూర్చొని దీర్ఘప్రణవోచ్చారణతో భౌతిక శరీరము విసర్జించి బ్రహ్మీభూతులైనారు. సన్యాసధర్మముననుసరించి శాస్త్రోక్తవిధులతో వారి శరీరమును నర్మదామాత గర్భములో విడిచిపెట్టిరి. వారు సిద్ధి పొందిన ప్రదేశములో వారి స్మృతి మందిరం (సమాధిమందిరం) నిర్మించారు. అది బరోడా నుండి 50 మైళ్ళ దూరంలో గరుడేశ్వర్ అనే ఊరిలో ఉన్నది. అది దత్తగురుభక్తులకు పుణ్యక్షేత్రమై వెలుగొందుచున్నది.

ఓం ద్రాం శ్రీ వాసుదేవానంద సరస్వత్యై నమః

అవధూత చింతన శ్రీ గురుదేవదత్త!

ముఖ్యక్షేత్రము, మార్గము : గుజరాత్‌లో నున్న బరోడా నుంచి "గరుడేశ్వర్" 50 కిలోమీటర్ల దూరములో ఉన్నది. ఇచ్చటనే "శ్రీ వాసుదేవానంద సరస్వతి స్వామివారు" సిద్ధిపొందారు.

శ్రీ గజానన మహరాజ్

అది 1878 వ సం॥ ఫిబ్రవరి 23 వ తేది. మహారాష్ట్రలోని షేగాం అనే గ్రామంలో ఒక ధనవంతుని ఇంట బ్రాహ్మణ సమారాధన జరుగుచున్నది. ఎంగిలి విస్తళ్ళు దారి ప్రక్కన పారేస్తున్నారు. వెంకట్, దామోదర్, అనేవారు, ఆ ఆకుల్లో మిగిలిన మెతుకులకోసం చేరిన కుక్కల మధ్య దిగంబరంగా కూర్చొని వాటితోపాటు ఎంగిలిమెతుకులు తింటున్న 16 ఏళ్ళ యువకుడ్ని గమనించారు. ఆ వ్యక్తి ముఖవర్చస్సు చూడగానే శ్రీ దత్తాత్రేయులవారు గుర్తొచ్చి అతన్ని పిలిచి మంచి భోజనం పెట్టించారు. అతడు రుచికి ప్రాధాన్యత నివ్వక అన్నింటిని కలిపి కొంచెం తిని, ప్రక్కనున్న మురికిగుంటలోని నీటితో దాహం తీర్చుకున్నాడు.

అనతికాలంలోనే ఆ యువకుడే "శ్రీ గజాననమహరాజ్" గా ప్రసిద్ధికెక్కారు. ఆయనెప్పుడూ "గణ్ గణ్ గణాంత్ బోతే, గణ్ గణ్ గణాంత్ బోతే" అంటూ ఉండేవారు. అందుకనే ఆయన్ని ప్రజలు గజానన్ మహరాజ్ అని పిలిచేవారు. నిజానికి ఆయనెవరో, పేరు ఊరు, ఎక్కడ, ఎప్పుడు పుట్టారో తెలిసిన వారెవరూ లేరు.

చాలాకాలం వరకు ప్రజలాయన్ని పిచ్చివాని క్రింద జమకట్టారు. ఒకరోజు ఒక హరిదాసు దేవాలయంలో సొంపుగా భజనలు పాడి తరువాత "హంసగీత" అనే ఆధ్యాత్మిక గ్రంథములోని కొన్ని శ్లోకాలు పాడాడు. బయటనుండి ఎవరో ఆ తర్వాత శ్లోకాన్ని అతి శ్రావ్యంగా పాడడం విని అందరు ఆశ్చర్యపోయారు. ఆస్వర ఉచ్ఛారణకు సమ్మోహితుడైన హరిదాసు బయటికి వచ్చి చూడగా ఆ 'పిచ్చి' గజాననే ఉన్నాడు. హరిదాసు ఆయన్ని లోపలికి రమ్మని ఆహ్వానించగా "లోపలైతేనేం, బయటైతేనేం? భగవంతుడు సర్వవ్యాపకుడని ఇప్పుడేగా శ్లోకం చదివావు?" అన్న గజానన్ మాటలు హరిదాసులో మంచి పరివర్తన తీసుకువచ్చింది. అప్పటినుండి అతడు ధనంపై ఆశతో కాక భగవంతునిపై ప్రేమతో హరికథలు చెప్పేవాడు.

ఎండలుమండుతున్న 'మే' నెలలో శ్రీగజానన్ రోడ్లమ్మట తిరుగుతూ భాస్కర్ అనే ధనవంతుని దాహంగాఉందని, త్రాగటానికి మంచినీళ్ళు అడిగాడు. భాస్కర్ "తిండికోసం ఇతరులపై ఆధారపడి సోమరిగా తిరిగే నీలాంటివాడికి సహాయం చేయడం మహాపాపం. నీళ్లు ఇంకెక్కడన్నా అడుగు ఫో" అని కసిరాడు. శ్రీగజానన్ ఏమి మాట్లాడక ప్రక్కనేఉన్న బావిలో చూడగా అది ఎండిపోయి ఉంది. అది చూచి భాస్కర్ "మూర్ఖుడా! నీకెక్కడా నీరు దొరకదు" అన్నాడు. శ్రీ గజానన్ మౌనంగా ఆబావి

వద్ద కూర్చొని, తీవ్ర ధ్యానములో మునిగిన కాసేపట్లో బావి అంచులదాకా నీరు నిండింది. భాస్కర్ ఆశ్చర్యపడి, తన మూర్ఖత్వానికి క్షమించమని ప్రార్థించి, తన జీవితాన్ని ఆయన సేవకే వినియోగించాలని నిశ్చయించుకొన్నాడు. షేగాంలో వెంకట్ అనే భక్తుడు తన తోటలో ఏర్పాటుచేసిన సత్సంగానికి, శ్రీ గజానన్ మహరాజ్‌ను భక్తులతో సహా ఆహ్వానించారు. అందరూ సమావేశమయ్యాక మొక్కజొన్నలు కాల్చటానికి మంటవేశారు. పైకి లేచిన మంట చెట్టుకొమ్మకు వ్రేలాడుతున్న తేనె తుట్టలోని ఈగల్ని కదల్చడంతో తేనెటీగలు భక్తుల్ని కుట్టసాగేసరికి వారంతా చెల్లా చెదురుగా పరిగెత్తారు. శ్రీ గజానన్ మహరాజ్ మాత్రం తెనెటీగలు తమని కసితీరా కుడుతూ ఉంటే, కదలకుండా కూర్చోవడం చూచి, వెంకట్, దుఃఖంతో చలించిపోయి ఆయన వద్దకు పరిగెత్తుకొచ్చాడు. మౌనంగా శ్రీ గజానన్‌మహరాజ్ ఇచ్చిన ఆజ్ఞ పాటిస్తున్నాయా అన్నట్లు తేనెటీగలు వెళ్ళిపోయాయి. వాచిపోయిన స్వామి శరీరానికెన్ని మందులు పూసినా ఫలితంలేదు. చివరికి స్వామి ఒక విధమైన యోగాసనంలో కూర్చోవడంతో ఆయన శరీరమంతటా గ్రుచ్చుకొనిపోయిన ముళ్ళన్నీ జలజలారాలిపోయి శరీరం యధాపూర్వకంగా తయారైంది. అప్పుడు భక్తులాయన వద్ద చేరి కాల్చిన మొక్కజొన్నలను తృప్తిగా తిన్నారు.

ఒకసారి గజానన్ మహరాజ్ వెంకట్‌తో చిలిం వెలిగించు కోడానికి నిప్పు తెమ్మన్నారు. అక్కడ నిప్పులేనందున దగ్గర్లో గల కమ్మరిని కొలిమిలోని నిప్పు ఇవ్వమన్నాడు వెంకట్. ఆ నిప్పు గజానన్ మహరాజ్ కోసమని తెలిసి, ఆ కమ్మరి శ్రీ గజానన్ సమాజానికి భారమని , ఆయన వల్ల ఏ ఉపయోగం లేదని నిందిస్తూ, నిప్పు ఇవ్వనిరాకరించాడు. శ్రీ గజానన్ మహరాజ్ వెంకట్‌ని పిలిచి, కాలిన అగ్గిపుల్లనొకదాన్ని తన చిలుంపై ఉంచమన్నారు. అతడలా చేయగా శ్రీగజానన్‌మహరాజ్ చిలుం పీల్చగా, అగ్గిపుల్ల నుండి, చిలుం నుండి పొగరాసాగింది. ఆ రోజే ఆ కమ్మరి తన బంధువులకు విందుచేయగా వడ్డించిన పదార్థాలు కుళ్ళు కంపు వచ్చాయి. బంధువులు కమ్మరిని నిందించి భోజనం చేయకనే కోపంగా వెళ్ళిపోయారు. మహాత్ముడైన గజానన్ మహరాజ్‌పట్ల తన మూర్ఖ ప్రవర్తనే ఇలా జరగడానికి కారణమని తలచిన కమ్మరి ఆయన సన్నిధికి చేరి క్షమాపణ కోరాడు. శ్రీ గజాననమహరాజ్ చెడువాసన వేస్తున్న ఆ పదార్థాలను తెప్పించి వాటికేసి కాసేపు చూడగానే అవన్ని ఘుమ ఘుమలాడే సువాసనలు వెదజల్లాయి. కమ్మరి వాటిని తీసుకొనివెళ్ళి మరలా విందుచేయగా అతిథులు తృప్తిగా భోంచేసి శ్రీ గజానన్ మహరాజ్ మహిమను కొనియాడారు.

ఒక రోజున గజానన్ మహరాజ్ ఒక ఆలయంలో కళ్ళుమూసుకుని నిశ్చలంగా కూర్చొన్నారు. ఆ ఊరి పాటిల్ కొడుకులు ఉత్తకోతిమూక, శ్రీ గజానన్ మహరాజ్ ధ్యానాన్ని భగ్నం చేయడానికి

ఎన్నో ప్రయత్నాలు చేసి విసిగిపోయారు. చివరికి ప్రక్క పొలంలోని చెఱకు గడలతో వారి శక్తికొద్ది అర్ధగంటసేపు బాదసాగారు. శ్రీ గజానన్ మహరాజ్ చలించలేదు. నగ్నంగాఉన్న ఆయన శరీరంపై దెబ్బల గుర్తు లేర్పడకపోవడంతో ఆ పిల్లలు భయపడి వినయంగా వారికి ప్రణమిల్లారు. ఆయన మెల్లగా కళ్ళు తెరచి, మెత్తనిస్వరంతో “అబ్బాయిలూ! మీరు బాగా అలసిపోయారు. ఉండండి ఇది తీసుకోండి” అంటూ చెఱుకుగడలను చేత్తో పిండి ఒక పాత్ర నిండా రసం తీసి త్రాగమని, ఆ పిల్లలకిచ్చారు. నిజమైన అహింస బలవంతులకే చెల్లుతుంది. నిజమైన ప్రేమ అన్నది శత్రువులను కూడ ఆదరిస్తుంది.

విఠల భక్తుడైన శ్రీ నరసింగ్ అనే గొప్ప సాధువు తీవ్రయోగసాధన చేయడానికి ఆవూరి పరిసరాల్లోని అడవులకు వెళ్లాడు. ఒకరోజు శ్రీ గజానన్ హఠాత్‌గా దర్శనమిచ్చారు. కళ్ళు మూసుకుని ధ్యానంలో ఉన్న ఆ సాధువుకు దివ్యమైన కాంతి దర్శనమై కళ్ళుతెరచిచూడగా పండరి విఠలుడే తనముందు నిలబడియున్నాడు. అతడు విఠలునికి సాష్టాంగపడి లేచి చూడగా, శ్రీ గజానన్‌మహరాజ్ నవ్వుతూ నిలబడి కనిపించారు. ఆయన ఆ సాధువుతో “నీకు పూర్ణవైరాగ్యమబ్బింది. ఇకపై నీరు, బురద అంటక చెఱువులో నిలబడి ఉండే తామర పువ్వులా జీవించు. నీకు జ్ఞానం ప్రసాదించటానికై విఠలుడే నన్ను పంపించాడు ” అన్నారు.

ఒకసారి శ్రీ గజానన్ కూర్చున్న శివాలయానికి కొందరు సాధువులొచ్చారు. ఆ రోజు సాయంత్రం ఆ సాధువుల్లో పెద్దవాడైన బ్రహ్మగిరి భగవద్గీతలోని సాంఖ్యాయోగాన్ని వివరిస్తూ శరీరం భ్రాంతి జన్యం, – దాని కే ప్రాముఖ్యత లేదన్నాడు. అది విన్న స్వామి భక్తులు, “ఆధ్యాత్మికసాధనకు శరీరం అత్యావశ్యకమే. మరి ఈయనిలా అంటాడేమిటి?” అని తలచారు. ఇంతలో బ్రహ్మగిరి, శ్రీ గజానన్ ఇరువురూ కూర్చున్న మంచం నిప్పుఅంటుకొనగా అందరూ దూరంగా పరుగెత్తారు. బ్రహ్మగిరి సైతం లేచి పరుగెత్తబోగా, మండుతున్న మంచంపై నిశ్చలంగా కూర్చొని యున్న శ్రీగజానన్ అతనిని చేయిపట్టినిలిపి “శరీరం ఉత్తభ్రాంతి, ఆత్మ శాశ్వత మైనది కదా! ఎందుకు పరిగెడతావ్” అన్నారు. ఆ సాధువు భయంతో “స్వామీ! స్వానుభవంలో లేని విషయాన్ని గూర్చి మాట్లాడినందుకు నన్ను క్షమించి కాపాడండి” అని బ్రతిమిలాడగా, శ్రీ గజానన్ అతన్ని విడిచిపెట్టారు. తాము మాత్రం భక్తులు పరిగెత్తుకొచ్చి తమను దానిపై నుండి తొలగించేవరకూ, మంచంపైనే ఉన్నారు. మంటలారిన తర్వాత చూస్తే, శ్రీ గజానన్ కూర్చుని ఉన్న భాగం మాత్రం కాలలేదు! బ్రహ్మగిరి తన తప్పుకు సిగ్గుపడి, ఆ చోటు విడిచి ఎటో వెళ్లిపోయాడు. ప్రజలకు కలిగిన అనుమానంలోని సత్యాన్ని శ్రీ గజానన్ ఈ విధంగా ఋజువు చేశారు.

శ్రీ సాయిబాబా, శ్రీ అక్కల్ కోట స్వామి చరిత్రలలో వలె జంతువులపై కూడా శ్రీ గజానన్ మహరాజ్ దివ్యత్వ ప్రభావముండేది. తక్లీకర్‌కు ఒక పొగరుబోతు గుఱ్ఱముండేది. అది జనాన్ని తన్నేది, కఱచేది, దాని అపఖ్యాతి ఎంతగా వ్యాపించిందంటే దాన్ని అమ్మినా కొనేవారు దొరకలేదు. దానివల్ల ఏ ఉపయోగములేదు. చివరికి అతను విసిగి, దాన్ని శ్రీ గజానన్ వద్దకు తెస్తుండగా దారిలో చీకటి పడగా ఇనుపగొలుసులతో కట్టేసి అతడు నిద్రించాడు. అర్ధరాత్రి హఠాత్‌గా మెలకువ వచ్చి చూడగా గుఱ్ఱం గొలుసులు తెంపుకొని వెళ్ళి దూరంగా ఒకచోట నిశ్చలంగా నిలబడి ఉంది. దాని కాళ్ల మధ్యన పడుకొని నిద్రిస్తున్నారు, శ్రీ గజానన్. తెల్లవారగానే గజానన్ లేచి వెళ్ళి పోయారు. పొగరు తగ్గి, సాధువుగా మారిన గుఱ్ఱం తక్లీకర్ వెంట ఇంటికి నడిచింది.

సుక్‌లాల్ అగర్వాల్ ఇంటిలోని ఆవు ఎవరికి లొంగక పొడిచేది. దాన్నతడు నలుగురి సాయంతో గజాననమహరాజ్ వద్దకు ఈడ్చుకొని వచ్చాడు. శ్రీ గజానన్ ఆ దృశ్యం చూచి కోపంతో “పవిత్రమైన గోమాతను గొలుసులతో బంధిస్తారా? ముందు విడవండి” అని గద్దించారు. వారు విడవగానే ఆ ఆవు గబగబా శ్రీ గజానన్ వద్దకొచ్చి వారి పాదాలపై తన తలనుంచి నిలబడింది. ఆశ్చర్యపోయిన అగర్వాల్ ఆ ఆవును శ్రీ గజానన్‌కే సమర్పించాడు. ప్రస్తుతం షేగాం సంస్థానంలో ఉన్న గోసంపదలో అధికభాగం ఆ ఆవు సంతానమే.

పీతాంబర్ తన సర్వస్వం విడచి శ్రీ గజానన్ సేవకంకితమయ్యాడు. ఒకరోజు గజానన్ అతనికి పీతాంబరాలు (పసుపురంగుపట్టు వస్త్రాలు) ఇచ్చి “ఇతరులేమన్నా పట్టించుకోకు, నాసేవకు తగిన వాడవు నీవే” అన్నారు. ఇతరభక్తులు అసూయతో అతన్ని బాధించారు. శ్రీ గజానన్ అతన్ని పిలిచి “ఇక్కడ అందరూ నిన్ను నిందిస్తున్నారు. షేగాం విడిచి వెళ్లు. ఇది నా ఆజ్ఞ” అన్నారు. గురువు నుంచి దూరమౌతున్నందుకు పీతాంబర్ ఎంతో దుఃఖిస్తూ వెళ్ళి, రాత్రయ్యేసరికి “కొంథాలి” అనే గ్రామం చేరి ఒక చెట్టుక్రింద నిద్రించాడు. మరుసటి ఉదయం ఊరివారతనిని పలుకరించి “నీవు నిజంగా గజానన్ శిష్యుడవైతే ఆ ఎండిన చెట్టును చిగురింపచేయాలి. అని నిలదీశారు. పీతాంబర్ తన గురువును మనసారా ధ్యానించగా మరుసటి ఉదయానికంతా ఆ మోడు చిగురించింది.దాంతో జనమంతా పీతాంబర్ కాళ్ళపైబడి “జయసద్గురు పీతాంబర్‌మహరాజ్” అని కీర్తిస్తూ ఊరేగించి ఆ గ్రామంలోనే నివాసమేర్పరిచారు.

కాల్‌గావ్‌లోని రాజారామ్‌కు శరీరంపై లేచిన పెద్దపుండుకు ఏమందు పనిచేయలేదు. రాజారామ్‌ని రక్షించమని అతనిసోదరుడు తన గురువైన గజాననన్ను ప్రార్థించాడు. ఆ రాత్రి ఎడ్లబండిలో

ఒక బ్రాహ్మణుడు వచ్చి తీర్థము, విభూతి ఇస్తూ ఇవి శ్రీ గజానన్ పంపారని చెప్పి వెళ్లిపోయాడు. వాటిని వినియోగించిన తక్షణమే రాజారాం పుండు పగిలి చీముకారి, నొప్పి తగ్గిపోయింది. రాజారాం ఎన్నో నెలల తరువాత ఆ రాత్రి హాయిగా నిద్రపోయాడు. ఆ బ్రాహ్మణుని సరిగా సత్కరించడం మరచినందుకు ఇంటివారు పశ్చాత్తాపపడ్డారు. తరువాత ఆ కుటుంబం వారంతా శ్రీ గజానన్‌ను దర్శించినపుడు ఆయన వారితో "నేను మీ ఇంటికొచ్చినప్పుడు మీరు నా ఎడ్లకు ఆహారం పెట్టలేదు" అన్నారు.

ఒకసారి శ్రీగజానన్ పండరి వెళ్లి అక్కడ ఒక ఇంటి వాకిట కూర్చున్నారు. భక్తులంతా ఆలయానికి వెళ్ళారు. వారిలో బాపూ అను భక్తుడు ఆ రద్దీలో పాండురంగని దర్శించలేక తిరిగి శ్రీ గజానన్ సన్నిధికి చేరి విఠలుని దర్శనం కాలేదని వాపోయాడు. శ్రీ గజానన్ అతన్ని ఊరడిస్తూ "విఠలుడాలయంలోనే ఉన్నాడనుకోకు. జాగ్రత్తగా నాకేసి చూడు" అన్నారు. అలా చూస్తున్న బాపూకు తన గురుస్థానంలో విఠలుడే దర్శనమిచ్చాడు. తృప్తి కలిగిన మరుక్షణమే విఠలుని స్థానంలో తన గురువు కనిపించాడు. అందుకే 'గురుగీత' గురువే సకలదేవతలు అని చెబుతుంది.

శ్రీ గజానన్ అకోలాలో ఉన్నప్పుడు మూర్తిజాపూర్ సమీపంలోని 'కురుం' గ్రామానికి చెందిన మెహతాబ్‌షా అనే ముస్లిం సాధువు శ్రీ గజానన్ నుండి ఆంతర్యంగా తనకందిన పిలుపుననుసరించి వారి దర్శనానికొచ్చారు. శ్రీ గజానన్ అతని వైపు వడిగా నడిచి "మత కలహాలు రేపావో జాగ్రత్త! మతాలు వేరైనా మానవులు ఒక్కటే. అందరూ దేవుని సంతానమే" అని అతని చెంపపై కొట్టి, "సాధువైనందుకు అందరిపైన ప్రేమ వహించు, సాధు లక్షణాలు అలవరచుకో" అన్నారు కోపంగా. ఇంతలో బచ్చూ లాల్ అనే భక్తుడు శ్రీ గజానన్ కొఱకై ఒక బండిని పంపి ఆయన్ని తన ఇంటికాహ్వానించాడు. బండి ఎక్కి వెళ్ళి శ్రీ గజానన్ తీరా అతనిఇంటివద్ద బండిదిగుటకు నిరాకరించారు. బచ్చూలాల్ తన తప్పు తెలిసికొని వెంటనే వెళ్లి మెహతాబ్‌షాను భోజనానికాహ్వానించాడు. కాని ముస్లిం అయినందున ఆయన్ని తన ఇంటి సమీపంలోని మసీదులో కూర్చొని భుజింపమని ప్రార్థించాడు. వెంటనే గజానన్ తమ ముందు వడ్డించిన పళ్ళెంతో పాటు లేచి వెళ్ళి ఆ ఫకీరు వద్ద కూర్చుని కలిసి భోంచేశారు. భోజనం చేస్తున్నంత సేపు వారిద్దరూ ప్రేమగా ఒకరికొకరు చూచుకుంటున్నారు. తర్వాత ఫకీరు తన నలుగురుసేవకుల్ని పిలిచి వారితో "నేను లాహోరు వెళ్ళుచున్నాను." కురుం'లో మసీదు కట్టించుటయందు నాకాసక్తిలేదు. శ్రీ గజానన్ ఆజ్ఞను దాటడం నా వల్ల కాదు. మీరు వెళ్ళవచ్చు" అని చెప్పి పంపి తాను లాహోరు వెళ్ళిపోయాడు.

కాని చిత్రమేమిటంటే శ్రీ గజానన్ మహరాజ్ స్వయంగా ఆ గ్రామంలో మసీదు కట్టించారు. మరి భగవంతుడు హిందువా? ముస్లిమా? మనమే ఆలోచించుకోవాలి.

ఎప్పుడూ అస్పృశ్యత, పవిత్రా పవిత్రములు గురించి జాగ్రత్తపడే బాహ్యాచార నిష్టాగరిష్టుడైన బ్రాహ్మణుడొకడు స్వామి దర్శనమునకు వచ్చెను. కాని బాహ్యాశౌచమున ప్రాధాన్యతనివ్వని స్వామిని, పరిసరములను ఏవగించుకొనెను. మఠానికెదురుగా నల్లకుక్క ఒకటి దారిలో ఎప్పటి నుంచో చచ్చిపడిఉన్నా ఎవరికి దానిని తొలగించుదామనే ధ్యాసే లేకుండా తిరుగుతున్న స్వామిని, భక్తులను చూచి, గంజాయి పీల్చుతూ భ్రష్టాచారశిరోమణి వలెనున్న ఈ పిచ్చివాడిని మహరాజ్ అంటూ గౌరవించడం చూసి మనస్సులో మండి పడుతున్నాడు. అతని అంతరంగములోని ఆలోచనలు పసికట్టిన స్వామి " ఆ కుక్క మరణించలేదు ఒక పాత్రలో నీరు తీసుకొని నా కూడా రమ్మని రా" అని చెప్పారు. స్వామిని నిందిస్తూనే కూడా వెళ్ళాడు. స్వామి ఆ కుక్క కళేబరమును స్పర్శించగానే, అదిలేచి పరుగుతీసింది. అప్పుడు ఆ గర్విష్టి బ్రాహ్మణుడికి స్వామి శక్తి తెలిసి, ఆయన నిత్య పవిత్రుడని గ్రహించి శరణువేడెను. ఆ విప్రుడు అదేరోజు స్వామి సన్నిధిలో అన్న సమారాధన నిర్వహించెను.

అదే జ్ఞానియై ఉండి, కర్మ నిష్ఠుడైన శ్రీ వాసుదేవానంద సరస్వతీస్వామిని శ్రీ గజాననుల దర్శనమునకు వచ్చినప్పుడు ఎంతో ఆదరించారు. సర్వజ్ఞులైన గజానన్ మహరాజ్ శ్రీ టెంబేస్వామి వస్తున్నారని తెలుసుకొని ముందురోజే ఆయన సేవకులతో "రేపు అత్యంత కర్మనిష్ఠుడు, కర్మయోగియైన నా గురుబంధువు నన్ను చూడటానికి వస్తున్నాడు. అతడు వచ్చే మార్గాన్నంతా ఎటువంటి గుడ్డపీలికలు లేకుండా శుభ్రం చేయండి. అతడు శుచిర్భూతుడు, జ్ఞానసంపన్నుడు అతనిని ఉచిత రీతిని గౌరవించాలి" అని చెప్పిరి. మరునాడు శ్రీ వాసుదేవానంద సరస్వతీ స్వామి మఠమునకు వచ్చిరి. ఒకరి నొకరు చూచుకొని మందహాసం చేశారు. ఆకలయిక ఇరువురికి మహదానందం కలిగించింది. ఒకరు కర్మ నిష్ఠాగరిష్ఠులైతే మరొకరు యోగయోగీశ్వరులు. ఒకరు మల్లెపూవు ఐతే, మరొకరు గులాబి. ఒకరు గంగానది యైతే మరొకరు గోదావరి. ఒకరు పశుపతియైతే మరొకరు శేషసాయి నారాయణులే! శ్రీ టెంబేస్వామి కొంత తడవైన తర్వాత మౌనంగానే శెలవుతీసుకొని వెడలిపోయారు. తర్వాత భక్తులు " ఇరువురి మార్గములలో ఎంతో వ్యత్యాసం కనపడుతుంటే వారిని గురుబంధువని వ్యవహరించడం మమ్ములను సందిగ్ధంలో పడవేయుచున్నది." అని గజాననుల వారిని అడిగిరి. దానికి గజానన్ మహరాజ్ "కర్మ, భక్తి, యోగమార్గములు మూడు జ్ఞానప్రాప్తిని కలిగించేవే? మార్గము కన్నా గమ్యమే ప్రధానం. గమ్యమును ఇంకాచేరని మార్గాభిమానం అహంకార కారణమవుతుంది.

గమ్యము (జ్ఞాన ప్రాప్తి) సాధించిన వారికి మార్గ భేదం కనపడదు." అని అద్భుతమైన దత్తసమత్వసమన్వయ బోధనందించారు.

బాలాపూర్ నివాసి బాలకృష్ణ, శివాజి గురువైన సమర్ధరామదాసు స్వామికి భక్తుడు. ప్రతి సంవత్సరం వారి మహాసమాధి దినమైన దాస నవమికి సజ్జనగడ్ వెళ్ళేవాడు బాలకృష్ణ. వృద్ధుడైన తరువాత బలహీనత కారణంగా అలా వెళ్ళలేక తన గురువుని తన ఇంటనే దర్శనమివ్వమని కన్నీటితో ప్రార్థించసాగాడు. ప్రార్థన మధ్యలో అతనికి నిద్ర తూగింది. నిద్రలో కలలో శ్రీ రామదాసస్వామి కనిపించి "బాధపడకు. నీ ఇంట్లోనే నీకు దర్శనమిస్తాను" అన్నారు. మరుసటి రోజు దాసనవమి, బాలకృష్ణ తన గురువుకోసం కళ్ళు ఇంతచేసుకొని చూస్తున్నాడు. మధ్యాహ్నం వాకిట ముందు "జయ రఘువీర సమర్థ్" అని వినిపించింది. పరుగెత్తి కెళ్ళి చూసిన బాలకృష్ణ వాకిట కనిపించిన శ్రీ గజానన్‌ను సగౌరవంగా ఇంట్లోకి ఆహ్వానించి, పూజాదులు చేసి ఆతిధ్యమిచ్చాడు. అయినా అతని మనసులో తన గురువురాని కొరత మిగిలిపోయింది. తిరిగి ఆ రాత్రి రామదాసస్వామి అతని కలలోకనిపించి తమకు, శ్రీ గజానన్‌కు భేదం లేదని నచ్చచెప్పడంతో కళ్ళు తెరచిన బాలకృష్ణ నాటి నుండి శ్రీ గజానన్‌ను తన గురువు అవతారంగా పూజించసాగాడు.

1909 లో గజానన్ ఆరోగ్యం క్షీణించసాగెను. ఆరోజు వినాయకచవితి కావడంతో శ్రీ గజానన్ మహరాజ్ తన భక్తులందర్ని పిలిచి "భక్తితో పూజ చేయండి. ఆతర్వాత, విగ్రహాన్ని నీటిలో కలపండి" అని చెప్పారు. భక్తులంతా ఏక కంఠంతో "మీరే మా గణేశులు, మీకే పూజ చేస్తాం." అని ఆయన్ని పూజించారు. మరుసటి ఉదయం తిరిగి భక్తులందర్ని సమావేశపరచి శ్రీ గజానన్ యిలా అన్నారు" ఈ దేహయాత్ర చాలించ బోతున్నాను. మీలో ఎవ్వరూ దుఃఖించకూడదు. నేనెప్పుడు మీతో ఉంటాను" అని వారు పద్మాసనంలో కూర్చున్నారు. కాసేపటికి శరీరం చల్లబడి బరువెక్కింది. సూర్యుడస్తమించాడు. తరువాత ఆయన దేహాన్ని వూరేగించి ఆశ్రమంలో ముందుగా సూచించిన ప్రదేశంలో సమాధి చేశారు. తన పేరేమిటో ఎవరికి తెలియని ఆయన నామరూప రహితమైన తత్వంగా నిలిచారు. నేడు షేగాం ఒక మహా సంస్థానంగా,గొప్ప దత్తక్షేత్రంగా నిత్యం వేలాదిమంది భక్తులతో విలసిల్లుచున్నది.

ఓం ద్రాం శ్రీ గజాననాయ నమః

అవధూత చింతన శ్రీగురుదేవదత్త!

ముఖ్యక్షేత్రము, మార్గము : నాగపూర్ నుంచి ముంబాయి వెళ్ళు రైలు మార్గములో "షేగాం" స్టేషన్ కలదు.

హజరత్ తాజుద్దీన్ బాబా

హజరత్ తాజుద్దీన్ బాబా పూర్వీకులు అరేబియానుంచి వచ్చి మద్రాసులో స్థిరపడ్డారు. మద్రాసు సైన్యంలో సుబేదారుగా పనిచేసిన బద్రుద్దీన్ గారికి జనవరి 27,1861 లో గురువారం నాడు కాంప్టి అనే గ్రామంలో తాజుద్దీన్ జన్మించారు. జనన మరణాలకు ప్రాపంచిక దుఃఖాలకు తాము అతీతులమని సూచించడానికా అన్నట్లు పుట్టగానే ఆ పసిగుడ్డు ఏడవలేదు. పవిత్ర రంజాన్ నెలలో పగటిపూట ఆ బాలుడసలు తల్లిపాలు కూడా త్రాగేవాడుకాదు.

ఆరేళ్ళ తాజుద్దీన్ బడిలో ఉండగా హజరత్ అబ్దుల్లాషా అనే ముస్లింఫకీరు పిలిచి, మిఠాయితాను కొంచెం కొరికి తిని, మిగతాది ఆ బాలతాజుద్దీన్ చేత తినిపించి "స్వల్పంగా తిను స్వల్పంగా నిద్రించు, స్వల్పంగా మాట్లాడు, ఖురాన్ చదివేటప్పుడు మహమ్మదులవారు ఆవేశించారా అన్నట్లు చదువు" అని బోధించి వెళ్ళిపోయారు. అప్పటినుంచి తాజుద్దీన్ ప్రవర్తనే మారిపోయింది మూడురోజులు ఏకధారగా కళ్ల నీరుకారాయి. ఆటలయందు ఆసక్తి పోయింది. ఒంటరిగా కూర్చుని సూఫీమహాత్ముల చరిత్రలు తాదాత్మ్యంతో చదివేవాడు. ఒక మహాత్ముడు వ్రాసిన ద్విపద "మద్యంసేవించినా, ఖురాన్, కాబాలను తగులబెట్టినా, విగ్రహారాధన జరిగే దేవాలయంలో నివసించినా ఫరవాలేదు. కానీ ఏ మానవుని మనస్సునూ గాయపరచవద్దు" హృదయంలో బాగా ముద్రించుకుపోయింది. అందుకనే హిందువులు, ముస్లిములు ఏ మతం వారు తన వద్దకు వచ్చినా సమానంగా గౌరవించి వారి శరీరాలను గాని, హృదయ గత భావాలను కాని గాయపరచకుండా జీవించారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు సరిగా లేనందున తన 20 వ యేట నాగపూర్ రెజిమెంటులో (సైన్యంలో) చేరారు. అయినా నమాజ్ చేయటం ఎప్పుడు మానలేదు. సవ్‌నగర్ అనేచోట ఒకసారి శిబిరంలో ఉండగా ఒక అద్భుతమైన కంఠ ధ్వని వినిపించింది. అటువైపు వెళ్ళగా హజరత్ దావూద్‌షా అనే ముస్లిం మహాత్ముని దర్శనము, సేవ లభించాయి. వారి అనుగ్రహంతో అద్వైత సిద్ధి కలిగి ఉన్మత్త స్థితిలో నగ్నంగా తిరగసాగాడు. వారి స్థితి తెలుసుకోలేని బంధువులు పిచ్చి పట్టిందని వైద్య ప్రయత్నంచేశారు కాని ఫలించలేదు. ఆయన నుండి గొప్ప ఆధ్యాత్మికశక్తులు, అద్భుతమహిమలు ప్రకటమవసాగాయి.

ఒక కమ్మరి వాని ఇంటికి తాజుద్దీన్ వెళ్ళి ఆ ఇంటిని వెంటనే ఖాళీచెయ్యమన్నారు. వారు ఆవిధంగా చేయగానే ఆ రాత్రి ఆ ఇల్లు కూలిపోయింది. ఇలాంటి మహిమలు ఎన్నో జరగడంతో జనం తండోపతండాలుగా రావడం మొదలైంది. వారితో విసిగిపోయిన బాబా "రేపు పిచ్చాసుపత్రికి పోతాను" అని గొణుక్కొన్నారు. మరునాడు ఆంగ్లేయస్త్రీలు టెన్నిస్ ఆడుకొనే క్లబ్బు దగ్గర నిలబడ్డారు. దిగంబరంగా నిలబడ్డ ఆయనను చూచి అశ్లీలమైన పద్ధతిలో తిరుగుతున్నాడని పోలీసులను ఫిర్యాదుచేసి

పిలిపించి అప్పజెప్పగా, వారు న్యాయాధికారి ఉత్తరువులననుసరించి నాగపూర్ పిచ్చాసుపత్రిలో గదిలో పెట్టి తాళం వేసారు. కొన్ని రోజుల తర్వాత తాజుద్దీన్ మరల ఆ ఆంగ్లేయ స్త్రీల ఇంటి ముందు వెడుతూ కనపడ్డారు. పోలీసులు తమ ఫిర్యాదు మీద ఏచర్యా తీసుకోలేదని అడగడానికి నేరుగా పిచ్చాసుపత్రికి వెళ్ళగా, అక్కడ కటకటాల వెనుకగదిలో బాబా హాయిగా కూర్చుని కనిపించారు. అప్పుడు అక్కడ డాక్టరుగా పనిచేసిన డాక్టర్ అబ్దుల్ మజీద్ ఇలాంటి ఎన్నో మహిమలు చూసి ఆయన భక్తుడయ్యాడు. ఒక సారి ఒక పిచ్చివాడు ఆసుపత్రి నుంచి పారిపోయి దొరకనందుకు డాక్టర్ ఖంగారుపడుతుంటే, తాజుద్దీన్ "ఏమీ కంగారుపడకు. రేపు ఉదయం తనంతట తానే ఆ పిచ్చివాడు తిరిగి వస్తాడు" అని చెప్పారు. అలాగే జరిగింది. ఆ డాక్టరుగారు ఎలా పోయావు మరలా ఎలా వచ్చావని అడగ్గా "నేను బయట తిరుగుతుంటే తాజుద్దీన్ వచ్చి చేయిపట్టుకుని తీసుకొని వచ్చి గేటువద్ద వదిలి వెళ్ళాడు" అని ఆ పిచ్చి వాడు చెప్పాడు. తాజుద్దీన్ ఒకసారి డాక్టరు గారిని రైలు ప్రమాదం నుంచి రక్షించారు. ఆలీఘర్ ముస్లిమ్ యూనివర్శిటీ నుంచి విద్యార్థులు పిచ్చాసుపత్రిలోని బాబా దర్శనమునకు వచ్చి బాబాతో కలిసి ఫొటో దిగారు. కానీ తర్వాత ఆ ఫొటో చూసుకుంటే అందులో బాబా తప్ప మిగిలిన వారంతా ఉన్నారు. ఇలా అద్భుతమైన లీలలతో పిచ్చాసుపత్రిలోనే బాబా జీవితం 16 సంవత్సరములు గడిచింది.

నాగపూర్ మహారాజు రఘోజీరావు బోంస్లే బాబాని పిచ్చాసుపత్రి నుంచి విడుదల చేయించి లాల్‌కోటి అనే రాజభవనంలో నివాసం ఏర్పాటుచేశారు. కాని బాబా మాత్రం ఫకీర్ ధర్మాన్ననుసరించి కటికనేలపైనే నిదురించేవారు. రోజూ చుట్టు ప్రక్కల గల అడవుల్లో తిరిగి వచ్చేవారు. హిందువులు వారిని భగవదవతారంగా భావించి ఆరాధించేవారు. బాబావారికి అడ్డుచెప్పలేదు. తర్వాత నాగపూర్ సమీపంలోని "వాకీ" "సకర్దరా" అనే ప్రదేశములలో కూడా కొంతకాలం నివసించారు. బాబా దగ్గర షేరూ అనే పెంపుడు కుక్క ఆయన సేవ చేస్తూ ఉండేది. రోజూ రైల్వేస్టేషనుకు వెళ్లి రైలులలోంచి దిగిన భక్తులకు ముందు నడుస్తూ బాబా ఉన్నచోటుకి తీసుకువచ్చేది. బాబా ఎక్కడ అడవిలో తిరుగుతున్నా భక్తులకు ఏ శ్రమ లేకుండా బాబా దగ్గరకు తీసుకొని వెళ్ళేది. ఒకసారి షేరూ ఒక అడవిదారిలో మరణించి ఉంటే భక్తులు ఎంతో బాధతో బాబాకి చెప్పారు. బాబా "షేరూ మరణించడం అసంభవం. పదండి చూద్దాం" అన్నారు షేరూ కళేబరాన్ని ఒక బుట్టలో పెట్టి బాబా తన చొక్కా ఒకటి ఇచ్చి బుట్ట మీద కప్పి కూడా తీసుకురమ్మన్నారు. దారిలో అది బ్రతికి బుట్టలోనుంచి ఒక్క దూకు దూకి వారిని అనుసరించసాగింది. ఆ తర్వాత అది చాలాకాలం జీవించి మరణించింది. బాబా స్వయంగా దగ్గర ఉండి దానిని సమాధి చేయించారు. ఆ సమాధి ఇప్పటికీ ఉంది. పిచ్చి కుక్క కరచినవారు వచ్చి ఆ సమాధి దర్శించి నివారణ పొందుతున్నారు. మొండిరోగాలను తగ్గించడమే

కాక చనిపోయిన భక్తులను బ్రతికించిన సంఘటనలున్నాయి. గిరిజాబాయి దీర్ఘవ్యాధితో బాధపడుతూ బాబాకు సేవ చేసేది. ఆమె ఒకరోజు మరణించగా భర్త ఆమెను దహనం చేయించమంటారా లేక సమాధిచేయించమంటారా అని బాబా వద్దకు కబురుపంపించాడు. అదే సమయంలో బాబా గిరిజాబాయికి "టీ" ఇచ్చి రమ్మని ఒక భక్తుని పంపించారు. అతను చనిపోయిన ఆమెతో "బాబా టీ పంపించారు." అని మూడుసార్లు బిగ్గరగా చెప్పాడు. ఆశ్చర్యంగా గిరిజాబాయి తాజుద్దీన్ బాబా పేరు ఉచ్ఛరించి నెమ్మదిగా భర్త పోస్తున్న టీని చప్పరిస్తూ అది త్రాగగానే లేచి కూర్చుంది. ఆ తర్వాత చాలా కాలం ఆమె జీవించింది.

హనుమంతరావు అనే భక్తుడు తాను ముస్లిమ్‌గా మారితే తాజుద్దీన్ బాబా అనుగ్రహం శీఘ్రంగా పొందవచ్చని అనుకుంటూ బాబా దగ్గరికి వచ్చాడు. బాబా ఏదైనా ఒక పుస్తకాన్ని తనకిమ్మనికోరారు. హనుమంతరావు తన దగ్గర ఎప్పుడూ ఉండే భగవద్గీత ఇచ్చాడు. బాబా ఆ పుస్తకమంతా తిరగేసి "ఏమిటీ? మనం ఇందులో కూడా ఉన్నామే?" అన్నారు. "భగవంతునికి సర్వస్యశరణాగతి చేస్తే సత్యం లభిస్తుంది." అన్న ధర్మం మహమ్మదీయమతంలోనే కాక హిందూమతంలో కూడా ఉందని బాబా హనుమంతరావుకి బోధపర్చి అన్ని మతధర్మాలు భగవంతుని చేర్చేవే అని, మతం మార్చుకోవలసిన అవసరం లేదని స్పష్టం చేశారు. మతకలహాలు జరగుతున్న సమయంలో ఒక ముస్లిం తాజుద్దీన్ బాబాతో "హిందువులు ముస్లింలను చంపుతున్నారు. మీరే రక్షించాలి" అనగా బాబా కోపంతో "నోర్ముయ్! నిజమైన ముస్లింను ఎవరూ చంపలేరు" అన్నారు. భగవంతుని సంపూర్ణంగా నమ్మిన వారు తప్పక రక్షింపబడతారు. నామమాత్రపు మతస్తులు, మతం పేరుతో రాజకీయాలు నెరపేవారు ఆ మతం పేరు చెప్పుకొనుటకు అర్హతలేదనే భావం వారికి అర్థమైంది.

ఒకసారి మద్రాసుకు చెందిన భక్తుడు నాలుగురోజులుపాటు ఆఫీసుకు శెలవుపెట్టి తాజుద్దీన్ బాబా దర్శనమునకు సకర్దరా వచ్చాడు. అక్కడ ఆయన నాలుగురోజులూ ఆయన సేవలో ఆనందంగా గడిపాడు. అయితే శెలవు అవగానే మద్రాసు వెళ్ళిపోదామనుకున్నా బాబా అనుమతి ఇవ్వలేదు. ఎన్నోసార్లు తర్వాత అడిగినా అనుమతి ఇవ్వలేదు. బాబా తనంతట తానుగా వెళ్ళమని ఆశీస్సులిచ్చేదాక వెళ్ళకూడదని నిశ్చయించుకున్నాడు. ఒక నెల రోజుల తర్వాత బాబా అనుమతిచ్చి పంపించారు. శెలవు అయిపోయాకా కూడా డ్యూటీలో చేరనందుకు పై అధికారులచేత చివాట్లు తిని తలవంచుకోవలసి వస్తుందని ఆందోళనతో ఇంటికి చేరాడు. భార్యాపిల్లలెవరు ఇన్నిరోజులెక్కడున్నావు, ఎందుకురాలేదని అసలు అడగకపోవడం అతనికి ఆశ్చర్యంగా ఉంది. ఆఫీసులో కూడా ఎవరు అతనిని ఆ విషయం

అడగటం లేదు. ఆఫీసులో జవాను ఆఫీసరుగారు నిన్న యిచ్చిన ఫైళ్ళు పట్టుకురమ్మంటున్నారని మామూలుగా చెప్పాడు. హాజరు పట్టీచూచుకుంటే ఆ ముప్పైరోజులు అతని సంతకాలుచేసే ఉన్నాయి. బాబా అద్భుతమైనలీలకి ఆనందాశ్చర్యములతో తలమునకలైనాడు. బాబా తన రూపంతో ఇంటివద్ద, ఆఫీసులో యధావిధిగా బాధ్యతలు ఆ నెలరోజులు నిర్వర్తించారు. ఇది అందరూ తెలుసుకొని తాజుద్దీన్ బాబా మహత్యమును కొనియాడారు. ఈవిధంగా తాజుద్దీన్ బాబా సంకల్ప మాత్రం చేత ఏ రూపమైనా, ఎన్ని రూపాలైనా ధరించి క్షణంలో ఎంత దూరాన్నైనా దర్శనమిచ్చి సంచరించగలిగిన సిద్ధపురుషులు.

ఒకసారి ఒక ముస్లిం బాబాని దర్శించి “హాల్” (సమాధిస్థితి) ఎలా సిద్ధిస్తుంది? ” అని అడిగాడు. బాబా తదేకంగా అతనికేసి చూచి తమ తల మీది టోపిని తీసి దాన్ని తలక్రిందులుగా నేలమీదుంచారు. వెంటనే ఆ ముస్లిం శరీరంలో ఒక అద్భుతశక్తి వ్యాపించి “హాల్” అనుభవమైనది. దానికతని శరీరం తట్టుకోలేక తలక్రిందులుగా చేతులమీద గెంతనారంభించింది. కాసేపాగి బాబా తమ టోపీని మామూలుగా ధరించడంతో అతడు తిరిగి మామూలు స్థితికి వచ్చాడు. ఇట్టి అనుభూతిని ప్రసాదించే సామర్థ్యం తాజుద్దీన్ బాబా వంటి సద్గురువుకే ఉంటుంది.

అవతార్‌మెహర్‌బాబా వారు తన గురువైన బాబా జాన్ అనే ముస్లిం యోగిని, తాజుద్దీన్ బాబాని సేవించుకున్నారు. అలాగే ఉపాసినీ బాబా వారు సాకోరి నుంచి తరచుగా నాగపూర్ వచ్చి తాజుద్దీన్ బాబా గార్ని దర్శించేవారు. విజయనగరానికి చెందిన ఖాదర్ వలీబాబాగారు కూడా తాజుద్దీన్ బాబావారి అనుగ్రహ ఆశీస్సులతో సిద్ధపురుషులైనారు. తాజుద్దీన్ బాబాగారు వారి భక్తుల్ని షిరిడీసాయిబాబా వారి దర్శనానికి, షిరిడీ సాయిబాబాగారు వారి భక్తుల్ని తాజుద్దీన్ బాబా దర్శనమునకు పంపేవారు. శ్రీ షిరిడిసాయిబాబా వారు “మేము (సాయిబాబా), తాజుద్దీన్, సాయిఖేడానివాసి ధునీవాలదాదా, నాసిక్ నివాసి నరసింగమహరాజ్, అక్కల్‌కోట స్వామి సమర్థులు, షేగాం నివాసి గజానన్ మహరాజ్ – మేమందరము దత్తాత్రేయ అంశలతో అవతరించి పరస్పర సహకారంతో ఒక లక్ష్య సాధనకు పాటుపడుచున్నాము” అని చెప్పారు. తాజుద్దీన్‌బాబాగారు దత్తాంశ సంభూతులని చెప్పేందుకు ఈ ప్రమాణం చాలుకదా?

ఒకరోజున ఒకవేశ్య తాజుద్దీన్ బాబా వద్దకు వచ్చి “ఇక్కడికి వచ్చేవారందరూ పవిత్రులు, ఇంక మాలాంటి పాపులెక్కడకెళ్ళాలి” అని పాడింది. బాబా వెంటనే “ ఓ కరుణామయా? మంచివాళ్ళంతా అక్కడికెళ్ళాలి, పాపులే ఇక్కడికి రావాలి అని ఆశీర్వదించు” అని అల్లాని ప్రార్థించారు. మరొకసారి వేలసంఖ్యలో తమ చుట్టూఉన్న భక్తుల్ని పరికించి, దృష్టి ఆకాశం వైపుకు త్రిప్పి “భగవంతుడా

వీరి పాపాలకు సంజాయిషీ నన్నడుగు. వార్ని విడిచిపెట్టు, వారంతానావారు." అని ప్రార్థించారు. ఈవిధంగా తాజుద్దీన్ బాబా అనుగ్రహ దృష్టి పవిత్రులపైన, పాపులపైన సమంగా ఉండేది.

1925 వ సం॥ ఆగష్టు 17 వ తేదీన ఎన్నో పక్షులు గుంపుగా వచ్చి మహరాజు భవనంమీద చేరాయి. ఎప్పుడూ కిలాకిలారావాలు చేసే పక్షులు అందుకు భిన్నంగా ఎంతో నిశ్శబ్ధంగా కూర్చున్నాయి. బాబా వాటిని చెయ్యెత్తి ఆశీర్వదించారు. ఆయన ప్రశాంతంగా పడుకుని భౌతికశరీరాన్ని విడిచిపెట్టారు. దాదాపు అర్ధశతాబ్దం పాటు కొన్ని లక్షలమంది చేత తోడు, నీడ, గురువు, దైవంగా, ఆరాధింపబడిన బాబా వారిని విడిచిపెట్టి వెళ్ళిపోవుటచేత కన్నీరు మున్నీరుగా విలపించారు. వారు పుట్టినప్పుడు ఏడవలేదు. అలాగే పోయే ముందు కూడా ఒక్క బొట్టయినా కన్నీరు కార్చలేదు. కాని ఒక అద్భుతం జరిగింది. తాజుద్దీన్‌బాబా నిర్యాణం చెందిన రోజున పాండురంగ మందిరంలోని విఠల్, రుక్మిణి విగ్రహాలు 12 గంటల పాటు ఏకధాటిగా కన్నీరు కార్చాయి. ఈ దృశ్యాన్ని వేలాదిమంది భక్తులు దర్శించారు. ఈ విషయం నారాయణరావు మదన్ అనే ఆయన "ఈవినింగ్ న్యూస్" అనే పత్రికలో ఆగష్టు 25,1925 తేదీన వ్రాశారు. ప్రముఖ దినపత్రికలైన "ది మెడ్రాస్ మెయిల్" "ఆంధ్రపత్రిక"లు ఆగష్టు 22, 1925 తేదీన "సాక్షాత్తు శ్రీరాముడే తిరిగి తాజుద్దీన్ బాబారూపంలో అవతరించి లోకాన్ని పవిత్ర పరిచారు. ఆయన వచ్చిన పని పూర్తి కాగానే నిష్క్రమించారు. ఆయన మహత్యాన్ని అందరూ గుర్తించారు" అని వ్రాశాయి. తాజుద్దీన్ బాబా సమాధికార్యక్రమంలో 50 వేల మంది పైగా ప్రజలు పాల్గొన్నారు. హజరత్ తాజుద్దీన్‌బాబా అత్యున్నతస్థాయికి చెందిన సిద్ధపురుషుడు, ఇటువంటివారు, సమాధిఅనంతరం కూడా దైవకార్యాన్ని నిర్వహించగల్గిన సమర్ధులు. ఈ విషయం తాజుద్దీన్ బాబా నాగపూర్ మహారాజాగారికి చేసిన వాగ్దానంలో స్పష్టంచేశారు. తాను ఒక లక్షా ఇరవై ఐదువేలమంది మహాత్ములను తయారుచేసే వరకు ఈ ప్రపంచంతో సంబంధం కలిగి ఉంటానని వాగ్దానం చేశారు. ఆ విధంగానే యోగ్యులైన భక్తులను నేటికి ఆధ్యాత్మికంగా ఉన్నతస్థితికి తీసుకొని వెడుతున్నారు.

నాగపూర్‌లో వారి సమాధి మందిరాన్ని అన్ని మతాలకు చెందిన కొన్ని వందలమంది నేటికీ రోజూ దర్శిస్తూఉంటారు.

ఓం ద్రాం శ్రీ తాజుద్దీన్ బాబాయ నమః

అవధూత చింతన శ్రీ గురుదేవదత్త !

ముఖ్యక్షేత్రము, మార్గము : హజరత్ తాజుద్దీన్‌బాబా వారి సమాధి "నాగపూర్" నందు కలదు.

శ్రీ సిద్ధేశ్వర్ సంత్ గులాబ్ బాబా

తానైనందనాయ పరమానంద ప్రదానాయ
పరమాత్మ రూపాయ పావన చరితాయ
గోపాలమంత్ర రూపాయ గోలోకనివాసాయ
పరమప్రేమ రూపాయ గులాబ్‌బాబాయ నమః

తనను మాత్రమే ప్రేమించేవాడు అజ్ఞాని. ఒకరినొకరు ప్రేమించుకొనే యువతీ యువకులు వ్యామోహితులు. తనకిష్టమైన వారిని, తనకు ఉపయోగపడేవారిని మాత్రమే ప్రేమించేవాడు స్వార్ధపరుడు. తనకుటుంబమును మాత్రమే ప్రేమించేవాడు సంసారి. ఇరుగుపొరుగువారిని కూడా ప్రేమించేవాడు ఉత్తముడు. సమాజమును కూడా ప్రేమించేవాడు గొప్ప వ్యక్తి. తన శిష్యులను భక్తులను ప్రేమించేవాడు మహనీయుడు. సృష్టియందలి ప్రతిజీవిని ఎటువంటి తారతమ్యములు చూడకుండా అవ్యాజంగా అఖండంగా, అనంతంగా ప్రేమించేవారిని "ప్రేమావతార్" అంటారు. దత్తావతారములలో అష్టైశ్వర్యములు, అష్టాంగయోగము ప్రసాదించే తత్వమే ప్రధానంగా కనబడుతూ ప్రేమతత్వం గుప్తంగా నేపథ్యంలో ఉంటుంది. ఏ సాధనమైనా, ఏ యోగమైనా భగవంతుని, ఆయన సృష్టిని ప్రేమించి, సేవించే పరిణతి రాకపోతే నిష్ఫలమైపోతుంది. దత్తప్రభువులోని అట్టి దివ్యప్రేమతత్వమునకు సాకారరూపమే శ్రీ గులాబ్ బాబాగారు. కఠిన, కర్కశ హృదయములను సహితం తన దివ్యప్రేమామృత వృష్టితో కుసుమకోమలంగా సంస్కరించి, ప్రేమనిలయాలుగా, దైవమందిరాలుగా మలచిన దత్త దివ్యప్రేమావతారం శ్రీగులాబ్ బాబాగారు.

మహారాష్ట్రలో అంజన్‌గాంవ్ సుర్జీ అనే పట్టణమునకు సమీపములోని టాకర్‌ఖేడా అనే గ్రామంలో విఠల్ భక్తులైన సీతారామనందలాల్, తానైమాతలకు మూడవ సంతానంగా, 1-7-1932 వ తేదీన కృష్ణ ద్వాదశినాడు రోహిణీ నక్షత్రంలో (శ్రీకృష్ణుని జన్మనక్షత్రం) జన్మించారు. పుట్టగానే పసిబిడ్డ ఏడవడం లోక సహజం. కాని గురునానక్, తాజుద్దీన్‌బాబా వలె బాలగులాబ్ పుట్టగానే ఏడవకుండా చిరుమందహాసం చేసి, అందరి హృదయములకు ఆనందం కలిగించడమనే తన అవతార కార్యమును పుట్టగానే సూచించారు. పేద కుటుంబంలో జన్మించడం వలన, తల్లిదండ్రులు చిన్నతనంలోనే కోల్పోవడం వలన గులాబ్ బాల్యంలోనే అష్టకష్టములు అనుభవించారు.

శ్రీకృష్ణుడు లోని దివ్యలీలాతత్వము, దత్తసద్గురువులోని గురుతత్వము రెండూ గులాబ్ బాబాకు

జన్మతః సిద్ధించినప్పటికి, సామాన్యుడివలె కష్టనష్టములను ధైర్యంగా, ఓర్పుతో అనుభవించి లోకులకు ఆదర్శమై నిలచారు. ఆకలిగా ఉన్నప్పుడు ఒక్క రొట్టెముక్క ఎవరు ఇస్తానన్నా, ఎంత కష్టమైన పనియైనా సరే చేసేవారు. కొంతకాలం గడచిన తర్వాత దివ్యలీలా ప్రకరణం ప్రారభమైంది. ప్రజలలో భగవంతునిపై భక్తి విశ్వాసములు కలిగించి, వాటిని వృద్ధిచేయడం మహాత్ముల లక్ష్యం. వీరి లోక కళ్యాణ కార్యదీక్షకు ప్రకృతి యే పరవశించి తనకు తానుగా అద్భుత సిద్ధులను అనుగ్రహిస్తుంది. సముద్రమునకు అలలు ఎంత సహజమో మహాత్ముల ద్వారా వారి లక్ష్యసాధనకు అవసరమైన మేరకు ఈ లీలలు అంతసహజంగా ప్రకటమవుతాయి.

బాలగులాబ్ ఒక పాలవ్యాపారి దగ్గర పనిచేసేవారు. ఒకసారి నెత్తిన పాలకుండ పెట్టుకొని, వర్షం పడి బురదమయంగా ఉన్న రహదారిలో వెడుతుంటే కాలుజారి పడిపోయి పాలకుండ పగిలిపోయింది. ఇది తెలిసి ఆ యజమాని వచ్చి గులాబ్‌ని చితకబాదాడు. బాలగులాబ్ ఏడుస్తూ "గోపాలా!గోపాలా! దేవకినందనగోపాలా?" అంటూ కుండ పెంకులను ఒకదానిపై ఒకటి పేర్చగానే అవన్నీ అతుక్కుని కుండ యధాప్రకారంగా రూపొందింది. దానిని నెత్తిమీద పెట్టుకోగానే పాలతోనిండింది. ఆ పాలవ్యాపారి ఆదివ్యలీలతో తన తప్పు క్షమించమని గులాబ్ పాదాలపై వ్రాలాడు. ఒకసారి అంజన్ గాంవ్‌లో గోధుమలు మరపట్టించి పిండి మూటనెత్తిన పెట్టుకొని వస్తుంటే పెద్ద వర్షం పడింది. ఆవర్షంలో అలాగే నడుచుకుంటూ వచ్చినా కూడా గులాబ్‌కాని, పిండి మూటకాని తడవలేదు. రాముడు, శ్రీకృష్ణుడు వలెనే లోకధర్మము ననుసరించి గులాబ్ పండరి వెళ్ళి నామానాంద్, గాడ్గేబాబా, కైకాడి మహరాజ్ మొదలగు సద్గురువుల సేవ చేశారు. కైకాడి మహరాజ్ పండరిలో 33 కోట్ల దేవతా విగ్రహములతో "పద్మవ్యూహం" నిర్మాణం చేసే రోజులో గులాబ్ గుంటలు త్రవ్వడం, మట్టి రాళ్ళ తట్టలు మొయ్యడం వంటి కూలిపనులు చేశారు. సద్గురు నామానంద్ ఎన్ని కఠినమైన పరీక్షలు పెట్టినా, ఓర్చుకొని సేవ చేశారు. గాడ్గేబాబా భజనబృందంతో కలసి గులాబ్ డోలక్ వాయించేవారు. కొంతకాలం కర్హాజ్ గ్రామంలో పుండరీకబాబా సేవ చేశారు. అప్పుడు వారితో అన్ని గ్రామాలు తిరుగుతూ వేదసారమును కీర్తనల రూపంలో, ప్రవచనముల రూపంలో గులాబ్ తెలియచేసేవారు. అందరూ ముగ్ధులై వినేవారు. ఒకసారి పుండరీక బాబా ప్రవచనం చేస్తుండగా దీపంలో ఉన్న నూనె ఆయిపోయింది. అప్పుడు గులాబ్ దీపంలో నీరుపోసి వెలిగించారు. అందరూచూచి ఆశ్చర్యపడ్డారు. మన్మాడ్ సమీపంలో గల కుందల్‌గాంవ్ అనే గ్రామంలో పాటిల్ ఇంట్లో పనివాడుగా చేరారు. ఒకరోజుపాటిల్ పొలందున్నుతుండగా గులాబ్ వెళ్ళి నాగేటికర్రుపైకాలు పెట్టారు. అది బంగారంగా మారింది. ఈ విషయంఎవరికి చెప్పవద్దన్నారు, గులాబ్. ఆ బంగారం అమ్మగా వచ్చిన,

60,000 రూపాయలతో 100 ఎకరాల పొలం కొన్నాడు. పాటిల్. పాటిల్ చూడకుండా గులాబ్ దూడలను విప్పేసి గేదెల వద్దకు వదిలివేశారు.. దూడలు పాలుత్రాగేసిన తర్వాత పాటిల్ ఎదురుగా పాలు పిండగా 2 లీటర్లు ఇచ్చే గేదె 7 లీటర్లు ఇచ్చింది. ఒకసారి ఆ దూడ చనిపోతే గులాబ్ పాదస్పర్శతో పునరుజ్జీవురాలైంది. ఒకసారి పాటిల్, గులాబ్ కలిసి నీరు తీసుకొనిరావడానికి ప్రక్క పొలంలోని బావి దగ్గరకు బిందెతో వెళ్ళారు. కాని వెంట త్రాడు తీసికెళ్ళడం మరిచారు. త్రాడుకోసం మరలా పాటిల్ వెనుదిరిగి వెడతానంటే బాబా "త్రాడు అక్కర్లేదులే! బిందె బావిలోపడవేసి త్రాడుతో లాగుతున్నట్లుగా అభినయించు చాలు". అన్నారు. పాటిల్ అలా చేయగా నీళ్ళతో నిండిన బిందె చేతిలోకి వచ్చింది. గులాబ్ దైవాంశ సంభూతుడని పాటిల్‌కు అర్థమైంది. తర్వాత కాలంలో కాశీనాథ్ పాటిల్ తన ఇంటిలో గులాబ్‌బాబా దర్బారు ఏర్పాటుచేసుకున్నాడు. కాటేల్ ఆశ్రమమునకు నాలుగు లక్షల రూపాయలు విరాళంగా ఇచ్చాడు. ఆ గ్రామంలో గులాబ్ బాబా పేరిట ఒక పాఠశాల కూడా ఏర్పడింది.

గులాబ్ బాబా జ్ఞానేశ్వర్ మహరాజ్ సజీవసమాధి యున్న పుణ్యక్షేత్రం "ఆళంది"లో కొంతకాలం గడిపారు. జ్ఞానేశ్వర్‌మహరాజ్ గోడను వాహనంగా చేసుకొని నడిపించిన స్థలంలో నిదురించేవారు. అక్కడ సమీపంలో గల ఒక బండను చూపించి జ్ఞానేశ్వర్ మహరాజ్ "జ్ఞానేశ్వరి" గ్రంథం రచించినప్పుడు తాళపత్రములను ఈ బండమీద పెట్టి వ్రాసేవారని తెలియచేసారు. (జ్ఞానేశ్వర్ మహరాజ్ 12 వశతాబ్దమునకు చెందినవారు) అది తెలియక ఊరిజనులు చెత్త అంతా ఆ బండ దగ్గరపోసేవారు. ఆ స్థలం పవిత్రతను కాపాడేందుకు, గులాబ్ బాబాగారు అక్కడ జ్ఞానేశ్వర్ మహరాజ్‌మందిరమును నిర్మింపచేశారు. సుమారు 1948 వ సంవత్సరములో గులాబ్‌బాబా గాణుగాపురం, అక్కడకు దగ్గరలో గల కులాలీ గ్రామములో కొంతకాలం సంచరించారు. గాణుగాపురంలో సంగమం దగ్గర గల ఐదు ఔదుంబర్ వృక్షముల దగ్గర, అక్కడ సమీపంలో గల చక్రేశ్వర మహదేవుని మందిరం దగ్గర నివసించేవారని, ఎల్లప్పుడూ మౌనంగా ఉండేవారని, టాంగా నడిపే శ్రీమంత్ రోబి అనే ఆయన మరియు ప్రసాద్ దుకాణంలో పనిచేసే చన్నెయ్యాస్వామి అనే ఆయన తెలియచేసారు. గులాబ్‌బాబా చాలాకాలం హిమాలయములలో పాదరక్షలు లేకుండా సంచరించారు. బదరీనాథ్, కేదార్‌నాథ్‌లలో కొంతకాలమున్నారు. బదరీనాథ్‌లో పూజారియైన సతీష్‌శాస్త్రి, ది. 30-12-1984 న మహాశివరాత్రినాడు గులాబ్‌బాబా దర్శనం కోసం కాటేల్ వచ్చి "శ్రీ గులాబ్ బాబాగారు గోకులాష్టమినాడు భౌతికంగా మీ మధ్య కాటేల్‌లో ఎలా ఉంటారో అదేవిధంగా ప్రతిగోకులాష్టమి పండుగకు బదరీలో మాకు భౌతికంగా దర్శనమిస్తారు." అని చెప్పారు. గులాబ్ బాబా పేరిట బదరీలో భక్తులు ధర్మశాల కూడానిర్మించారు.

సంత్ గజానన్ మహరాజ్ క్షేత్రమైన షేగాంకు ఇరవైమైళ్ళ దూరంలో “కాటేల్” అనే గ్రామంలో భయంకరమైన అరణ్యంగా, స్మశానభూమిగా ఉన్న 48 ఎకరముల విస్తీర్ణములో శ్రీగులాబ్ బాబాగారు వారి తపోశక్తిని ధారపోసి భక్తుల సేవా, సహకారములతో పావనక్షేత్రం ఒకటి రూపొందించారు. బాబా వారిని శ్రీకృష్ణావతారంగా ఆరాధించేవారందరికి ఇది బృందావనం. బాబాను దత్తావతారంగా ఆరాధించే వారికి ఇది మరో దత్తక్షేత్రం. ఇక్కడ శ్రీ సాయిబాబా, శ్రీ కైకాడి మహరాజ్, శ్రీ గాడ్గేబాబా, శ్రీ గజానన్ మహరాజ్, శ్రీ దత్తాత్రేయ విగ్రహములు ప్రతిష్టించబడినవి. ఆశ్రమమును ఆనుకొనియున్న కచేరినది ఒడ్డున అనేక దేవతామందిరములు , గోశాల, కదంబ వృక్షములు, నదికి ఆవలి ఒడ్డున కూడా దేవతా మూర్తులను ప్రతిష్టించారు. ఆశ్రమమునకు ఒక రూపం ఏర్పడటానికి 15 సంవత్సరముల కాలం పట్టింది. ఇంకా ఏవో నిర్మాణములు జరుగుతూనే ఉన్నాయి. సుమారు 1958 వ సంవత్సరములో ఎండిపోయిన కచేరీనది ఇసుకలో కూర్చుని గులాబ్ బాబాగారు అక్కడి పశువుల కాపరులతో మాట్లాడుతూ తన వ్రేలును ఇసుకలో గ్రుచ్చారు. వెంటనే గ్రుచ్చిన ప్రదేశంలో నీరుపైకి చిమ్ముతూ వచ్చింది. ఒక్క వర్షాకాలంలో తప్ప ఎప్పుడు నీరు ఉండని కచేరీనదిలో, పాతాళంలో ఉన్న గంగను పైకి తీసుకొని రావడం అవతారపురుషులకే సాధ్యం. దీనికి బాబా “అమృతకుండం” అని పేరు పెట్టారు. ఇది మూడు అడుగుల వృతాకారంలో ఉండి సుమారు ఐదు అడుగులలోతు ఉంటుంది. చేప ఆకారం కలిగియుంటుంది. ఇప్పుడు అందరి ఇళ్ళల్లో నీరు నిలువ చేసుకొనేందుకు భూమిలో ఉండే నీటికుండీ అంత ఉంటుంది ఈ అమృతకుండం. గంగానదిలో నీరువలె ఇందులో నీరు ఎన్నివేలమంది స్నానం చేసినా అదే స్థాయికి నీరు ఉంటుంది. భక్తితో సేవించిన వారికి ఈ నీరు అమృత తుల్యమై అనేక వ్యాధులనుండి ఉపశమనం కలిగిన దృష్టాంతములెన్నో ఉన్నాయి. మేము 30 మంది భక్తులం కలిసి, దత్తావధూత శ్రీస్వామి శివానంద మహరాజ్‌గారితో నాగపూర్ వెళ్ళి శ్రీ గులాబ్ బాబా గారి ఆశీస్సులు తీసుకొని కాటేల్ వెళ్ళాము. మా బృందంలో విశాఖ పట్నం పోర్టులో పనిచేస్తూ కేన్సరుతో బాధపడుతున్న యువకుడొకడు ఉన్నాడు. అమృతకుండజలంలో స్నానం చేసి, ఆ పవిత్రజలమును త్రాగి, సీసాల్లోనింపి విశాఖతీసుకొని వెళ్ళి ఒక వారం రోజులు తీర్థంగా సేవించాడు. అప్పుడు పరీక్ష చేయించుకుంటే తెలిసిన విషయం ఏమిటంటే అంతకుముందు 90 వేలున్న కేన్సర్ సోకిన కణముల సంఖ్య 18 వేలకి తగ్గిపోయింది. అంత తక్కువ సమయంలో అంత మెరుగుదల చూసి డాక్టర్లు ఆశ్చర్యపోయారు. నెమ్మదిగా అతనికి పూర్తి స్వస్థత కలిగింది. భవరోగమును కూడా ఉపశమింపచేయగల మహాతీర్థం ఇందలినీరు.

అమృతకుండ మహాత్మ్యమును పరీక్షించాలనే ఉద్దేశ్యంతో తుకడోజి మహరాజ్ అనే

సిద్ధపురుషుడు కాటేల్ వచ్చి ఒక పెద్ద ఆయిల్ ఇంజను తెప్పించి నీటిని తోడించడం మొదలుపెట్టారు. కొన్ని రోజుల పాటు నీరు తోడి బయటకు పంపినా అమృతకుండంలో నీటిమట్టం ఏ మాత్రము తగ్గలేదు. చివరకు ఇంజన్ చెడిపోయి ఆగిపోయింది. ఈ ప్రయోగం ఎంతోమంది చూస్తూ ఉండగా జరిగింది. శ్రీ గులాబ్‌బాబా ఒక చెట్టు క్రింద కూర్చుని ఇదంతా తిలకిస్తూ నవ్వారు. తుకడోజీమహరాజ్ బాబా దగ్గరకు వచ్చి "నేను ఓడిపోయాను కుమారా" అని సంతోషంగా అన్నారు. సమస్త పుణ్య నదులతో కూడిన మహాతీర్థమే ఇది. అదృశ్యరూపంలో దేవతలు, ఋషులు వచ్చి అమృతకుండ జలంతో స్నానం చేస్తుంటారు. కలియుగము అంతమై సత్యయుగం ప్రారంభమయ్యే సంధికాలంలో ప్రతి ఊరిలో సంత్‌లు జన్మిస్తారని అమృతకుండ జలం అమృతమవుతుందని అందులో దత్తాత్రేయులవారు స్నానమాచరిస్తారని కొందరు మహాత్ములు చెప్పారు.

కాటేల్ ఆశ్రమంలో ఒక ఫర్లాంగు దూరంలో ఐదు ఔదుంబర వృక్షములున్నాయి. రాత్రి సమయాల్లో ఎవరూ ఈ వృక్షముల దగ్గరకు రారు. కాని బాబాగారు రాత్రిళ్ళు వచ్చి కూర్చునేవారు. బాబాగారు వెళ్ళేటప్పుడు పెద్ద పెద్ద పాములు కూడా వెడుతుంటాయి. గోకులాష్టమి పర్వదినమునాడు ఈ వృక్షములపై సుదర్శన చక్రం దివ్యమైన కాంతులు విరజిమ్ముతూ ఒక భక్తునికి బాబాగారి అనుగ్రహంతో దర్శనమైంది. సత్య, ధర్మములను దర్శించలేని దోషదృష్టి ప్రబలిన వేళ శ్రీకృష్ణుడు దానిని ఖండించి సుదర్శనము (మంచిదృష్టిని) సుదర్శన చక్రంతో ప్రసాదిస్తుంటారు. ఈ వృక్షములకు 108 ప్రదక్షిణములు భక్తులు చేస్తుంటారు. శ్రీ గురుచరిత్ర, శ్రీగులాబ్ బాబా గారి చరిత్ర మొదలగు సద్గురువుల చరిత్రలు ఈ వృక్షముల క్రింద కూర్చుని పారాయణ చేస్తుంటారు. వీటికి దగ్గరలో దత్తమందిరం ఉంది.

అక్కడ కాటేల్‌లో శ్రీగులాబ్ గారి అద్భుత మహిమకు తార్కాణంగా చెప్పతగ్గ భక్తుడొకరు పరిచయమయ్యారు. అతను ఏమీ చదువుకోలేదు. అతిపేదవాడు. బాబా భక్తుడు. ఒకరోజు బాబాగారు తాను తినే రొట్టెలో కొంతభాగం ప్రసాదంగా ఇచ్చి "నీవు జ్యోతిషశాస్త్ర పండితుడవు అవుతావు. దాని ద్వారా నీకు భుక్తికి లోటు ఉండదు" అని ఆశీర్వదించారు. సర్వసమర్థులైన బాబాగారి ఆశీర్వాద బలంతో అతనికి జ్యోతిషశాస్త్ర పరిజ్ఞానం లభించింది. పంచాంగములు, జ్యోతిష గ్రంథములు కూడా పట్టుకొని తిరుగుతున్నాడు. చూడడానికి పామరుడుగానే ఉన్నాడు. మా భక్త బృందములో కొంతమంది జాతక ఫలములు, గ్రహశాంతి విధానములు చెప్పించుకొన్నారు.

పూరీజగన్నాథ్ యాత్రలో మాలెగావ్ అనే గ్రామం బాబాగారు కొందరు భక్తులతో వెళ్ళినపుడు

గ్రామ ప్రజలు , వర్షాకాలం ప్రారంభమై 19 రోజులు గడిచినా ఒక్క చినుకు వర్షం పడలేదని, వ్యవసాయ పనులన్నీ ఆగిపోయాయని మొఱపెట్టుకున్నారు. వెంటనే బాబా కారుదిగి, ఒక భక్తుని హోటల్‌లో పాలు స్వీకరించి "గోపాలా! గోపాలా! దేవకినందనగోపాలా!" అని పాడడం ప్రారంభించగానే గ్రామస్తులందరూ పారవశ్యంతో కలిసి పాడారు. అప్పుడు ఆ ఊరంతా ఎండగానేఉంది. మేఘాలజాడే లేదు. అలాంటిది గోపాలనామ సంకీర్తనం ఊపందుకోగానే ఆకాశమంతా మేఘాలు ఆవరించి కుంభవృష్టి కురిసింది. అందరూ ఆవర్షంలో తడుస్తూ ఆనందనాట్యం చేశారు.

ఒకసారి మహారాష్ట్రలో అమరావతి జిల్లాలో రామతీర్థమనే గ్రామంలో కుండపోత వర్షాల వల్ల పూర్ణానది నీటిమట్టం పెరిగిపోయి, గ్రామంలోకి వరద నీరు ప్రవహించడం మొదలైంది. గులాబ్‌బాబాతో గ్రామ ప్రజలు "మీరు నిజంగా దైవాంశ సంభూతులైతే ఈ వరద ఉపద్రవం నుండి రక్షించండి. లేదా మిమ్మలిని ఈ నదిలో పడవేస్తాం" అన్నారు. అయితే నా షరతు కూడా వినండి అని బాబా "మీరు సారా త్రాగడం మానివేసి, సారా కాచే బట్టీలన్నీ తీసి వేస్తామని ప్రతిజ్ఞ చేస్తే ఈ వరదలను ఆపి మీ గ్రామమును కాపాడతాను" అన్నారు. దానికి ఆ ప్రజలు అంగీకరించారు. అప్పుడు బాబాగారు పూర్ణానది రూపంలో ఉన్న గంగానదికి పూలతో పూజచేసి, నది ప్రక్కన ఒక గీత గీసి, "నీ ఉధృతి తగ్గించుకొని ఈ గీత దాటి రావద్దు. లేదా నన్ను నీఒడిలో శాశ్వతంగా చేర్చుకో" అని ప్రార్థించారు. అంతే ఆ గీత దాటి ఒక్కచుక్క కూడా గ్రామంలోనికి రాలేదు. అప్పుడు బాబా దైవశక్తికి ఆ గ్రామస్తులందరూ జోహార్లర్పించి 1400 సారా బట్టీలను తీసివేసి సారాడ్రమ్ములన్నీ లారీలమీద ఊరేగింపుగా తీసికెళ్ళినదిలో పారవేశారు. పంచభూతములను అదుపుచేయగలగడం పరమాత్మ స్వరూపులైన శ్రీగులాబ్ బాబా వంటి మహనీయులకే సాధ్యం.

ది. 23-3-1999న ఒక నలభైమంది భక్తులం స్వామి శివానంద మహరాజ్‌గారితో కలిసి నాగపూర్ శ్రీగులాబ్ బాబాగారి దర్శనం చేసుకున్నాము. అక్కడ గులాబీరంగు లాల్చీ వేసుకుని తిరుగుతున్న ఒక భక్తుని పరిచయం చేశారు. అతను అద్భుతమైన లీల ఒకటి స్వయంగా మాతో చెప్పాడు. అతడు పోలీస్ డిపార్టుమెంటులో పనిచేస్తున్నాడు. ఒక రోజు ట్రాఫిక్ కంట్రోల్ డ్యూటిలో ఉండగా శ్రీగులాబ్ బాబా గారు అతని దగ్గర కారు ఆపి ఎక్కమన్నారు. అతను ఎక్కాడు. బాబా అతడిని వెళ్ళేందుకు అనుమతించలేదు. నాలుగురోజులు బాబా ఎక్కడికి వెడితే అక్కడి కల్లా కూడా తీసుకొని వెళ్ళారు. ఆ తర్వాత అతడు పోలీస్‌స్టేషనుకు వెళ్ళి సర్కిల్ ఇన్‌స్పెక్టరుతో నాలుగు రోజులు రాలేకపోయినందుకు క్షమించవలయునని, శెలవు మంజూరు చేయమని కోరగా ఆ అధికారి "నీవు

చెప్పేదేమీ అర్థం కావడంలేదు. నాలుగురోజులనుంచి డ్యూటీచేస్తూనే ఉన్నావుగా, హాజరుపట్టీలో నీ సంతకం కూడా చేశావుకదా చూడు. ఇంక శెలవు దరఖాస్తు ఎందుకు" అని అన్నాడు. అంటే ఆ నాలుగురోజులూ బాబాగారు తన రూపంలో వెళ్ళి తన డ్యూటీ యధాప్రకారం చేశారని తెలుసుకొని ఆయన సామర్థ్యానికి ప్రేమకు పొంగిపోయిన నాటి అనుభవమును స్వయంగా మాతో వివరించాడు.

ఔరంగాబాద్ జిల్లా కలెక్టర్ శ్రీమేఘ్ (ఐ.ఎ.యస్) మరికొంతమంది అధికారులతో కలిసి బాబాను దర్శించి మీరు కృష్ణావతారమని ఆ బాలగోపాలం కీర్తిస్తున్నారు కదా. మాకు విశ్వాసం కలిగేలాగ డ్రైవరు లేకుండా, పెట్రోల్ లేకుండా కారును నడిచేటట్లు చేయమని ప్రార్థించారు. బాబా చిరునవ్వు నవ్వి ఊరుకున్నారు. కాని అక్కడున్నవారు అందరూ ప్రార్థించిన పిమ్మట, అక్కడ పెట్రోల్ తీసివేసి నిలబడి ఉన్న కారును బాబా ఆజ్ఞాపించగా 25 సార్లు గుండ్రంగా తిరిగి వచ్చింది. ఒకసారి నాందేడు జిల్లాలోని జింటూరులో గ్రామ ప్రజలు బాబాను 1990 లో ఆహ్వానించారు. అక్కడకు గంగారామ్‌ధక్కర్ వాడే అనే శేక్ తన కారులో బాబాను దర్శించుకొనుటకు వచ్చాడు. బాబా సంకీర్తనా కార్యక్రమం వినేందుకు పదివేల మంది భక్తులు వచ్చారు. అక్కడ ఆగి ఉన్న ఆ శేక్ కారును (కారులో ఎవరూ లేరు) సంబోధిస్తూ "ఛలోభాయ్!" అన్నారు. జడపదార్థమైన ఆ కారుకు ప్రాణశక్తి వచ్చినట్లు శబ్దం చేస్తూ బయలుదేరుటకు సిద్ధపడింది. అప్పుడు గులాబ్‌బాబా గారు తన బాల్య స్నేహితుడైన సుధాంబాబాను కారుముందు నడవమని కారుతో "ఓ భాయి! సుధాంబాబా ఎటువైపు వెళ్ళమని సైగ చేస్తే అటువైపే వెళ్ళాలి" అని ఆదేశించారు. సుధాంబాబా పరిగెత్తితే కారు ఆయన వెంట పరిగెత్తేది. ఆయన నెమ్మదిగా నడిస్తే కారు నెమ్మదిగా నడిచేది ఆయనకు ఆయాసం వచ్చి ఆగిపోతే అదీ ఆగిపోయేది. ఆయన వెనుకకు తిరిగి నడిస్తే కారుకూడా గేరు మార్చుకుని వెనక్కు నడిచింది. ఇలా గంటసేపు గోమాతను అనుసరించే లేగదూడలా సుధాంబాబాను ఆ కారు అనుసరించింది. భక్తులు, శిష్యులు కూడా గురువుల మాట పాటించరు. కాని జడపదార్థమైన కారు బాబాగారి ఆజ్ఞలు యథాతథంగా అనుసరించింది. జడజీవ ప్రకృతి అంతా ఏ పరమాత్మ సంకల్పానుసారం ఆవిర్భవించిందో ఆ పరమాత్మస్వరూపులైన గులాబ్‌బాబాగారికి అసాధ్యమేముంటుంది? ఈ వైజ్ఞానిక యుగంలో రిమోట్ యంత్ర పరికరములను తమ స్వబుద్ధితోనే తయారు చేశామనుకొనే శాస్త్రజ్ఞులు, అనంతము అపారముయైన భగవత్‌శక్తిలో అణువంత తెలుసుకొని వినియోగంలోకి తెచ్చుకొనేందుకే కొన్ని శతాబ్దములు కృషి అవసరమవుతోందని గ్రహించి భగవత్ స్వరూపులైన మహనీయులపట్ల భక్తి శ్రద్ధలు, వినయ విధేయతలు కలిగి ఉంటే ఇంకా త్వరితగతిన వైజ్ఞానిక అభివృద్ధిని సాధిస్తారు.

మధ్యప్రదేశ్‌లోని చంబల్‌లోయలో పేరుమోసిన బందిపోటు దొంగలముఠానాయకుడైన డాకూపదమ్‌సింగ్ ఒకసారి గులాబ్‌బాబాగారు భక్తులతో కలిసి వ్యాన్‌లో వెడుతుంటే అడ్డగించి వారి దగ్గర గల డబ్బు బయటకు తీయమన్నారు. మా దగ్గర డబ్బులేదని బాబాగారు చెప్పారు. అది నమ్మక పదమ్‌సింగ్ డబ్బు తీస్తారాలేదా అని తుపాకి తీసి గురిపెట్టి పేల్చేందుకు ట్రిగ్గర్ నొక్కాడు. బుల్లెట్లు బయటకి రాలేదు. మరో తుపాకి తీసుకొని పేల్చాడు. గుండ్లు బయటకు రాలేదు. పైకెత్తి ఆకాశంలోకి పేల్చాడు. గుండ్లన్నీ ఒకటి తర్వాత ఒకటి దూసుకొని పైకి పోయాయి. అతనికి ఆకాశాన దివ్యమైన వెలుగు గోచరించి అందులో శ్రీకృష్ణుడి దర్శనమైంది. బాబాను దివ్యపురుషుడుగా అంగీకరించి వారి పాద పద్మములను శరణుజొచ్చాడు. బాబావారు, వారికి హింసా ప్రవృత్తిని విడిచిపెట్టి సన్మార్గములో భక్తి కలిగి జీవించమని హితబోధ చేశారు. బాబా చెప్పిన విధంగా బందిపోటు పదమ్‌సింగ్ ప్రభుత్వానికి లొంగిపోయి ఆ తర్వాత భక్తిమార్గంలో పదమ్‌సింగ్‌బాబాగా భక్తబృందంతో కలిసి నిరంతరం భగవన్నామ సంకీర్తనలో జీవిస్తున్నాడు. ఇదేవిధంగా మాన్‌సింగ్, పరమార్‌సింగ్, పూజాబబ్బా, ఫూలన్‌దేవి అనే బందిపోటు దొంగల ముఠాల నాయకులు కూడా గులాబ్‌బాబాగారిని దర్శించి వారి ప్రభావంతో జనజీవన స్రవంతితో కలిసి జీవిస్తున్నారు. వీరు ప్రతి గోకులాష్టమికి కాటేల్ వస్తారు. అక్కడ దర్శించవచ్చు. దుష్టులను సంహరించడం రాముడు, కృష్ణుడు వంటి అవతారమూర్తులు నిర్వహించారు. శ్రీగులాబ్‌బాబా గారిలో శ్రీకృష్ణ తత్వంతో కలిసి దత్తాత్రేయ తత్వం కూడా పనిచేయుచున్నందువల్ల దుష్టులను శిష్టులుగా మార్చి సన్మార్గంలో నడిపించగలిగారు.

దత్తపాటిల్ అనే భక్తుడు తన నూతన గృహంలో ఈశాన్యమూల గోడలోని గూటిలో పెట్టుకొనుటకై నడుముమీద చేతులు పెట్టుకొని నిలబడి ఉన్న పాండురంగడు, రుక్మిణీదేవి శిలా విగ్రహములు పండరి నుండి తెచ్చుకున్నాడు. వాటిని గూటిలో పెట్టేందుకు ప్రయత్నించగా ఆ విగ్రహాలు గూడు సైజు కంటే రెండంగుళములు ఎక్కువగా ఉన్నాయి. ఆ విగ్రహముల చేతులు అడ్డు తగులు తున్నాయి. ఆ ఊరు శ్రీగులాబ్‌బాబాగారు వచ్చినప్పుడు వారిని తన ఇంటికి ఆహ్వానించాడు. గులాబ్‌బాబాగారితో విగ్రహములు గూడులో పట్టని విషయం చెప్పాడు. బాబాగారు ఆ విగ్రహములకు నమస్కరించి గూటిలో పెట్టగా ఆ విగ్రహములు అందులో చక్కగా ఇమిడాయి. వారి సంకల్పంతో వారి స్పర్శతో రాతి విగ్రహములు వాటి పరిమాణం తగ్గించుకొనడం అద్భుతమైన విషయం. సిద్ధేశ్వరుడైన బాబా గారు కొంతమందికి దేవతా ప్రసాదములు సృష్టించి ఇచ్చేవారు. ఇండోర్‌దగ్గర ఛత్రేభాగ్ రాజస్వాం అనే ప్రదేశంలో ఇండోర్ మాతాజీగా ప్రసిద్ధిచెందిన శివభక్తురాలికి మహంకాళేశ్వర్ దగ్గర చిత్రావతి నదిలో భక్తులతో స్నానం చేస్తున్న బాబాగారు ఆ నదిలో నుండి ఈశ్వరుని పాదుకలు తీసి యిచ్చారు. ఇప్పటికీ ఆ పాదుకలను ఆమె ఆశ్రమంలో చూడవచ్చు.

కలియుగంలో ప్రధమ దత్తావతారమైన శ్రీపాద శ్రీ వల్లభులను తిరుమలదాసు అనే రజకభక్తుడు ప్రత్యక్షంగా సేవించి ఆయన అనుగ్రహపాత్రుడయ్యాడు. తిరుమలదాసుకు బాలకృష్ణుని రూపము మీద చాలా మక్కువ. శ్రీపాదులవారు తిరుమలదాసుతో "నీవు మరాఠదేశమున రజక కులములో జన్మించి గాడ్గేమహరాజ్‌గా ప్రసిద్ధి చెందుతావు. దీన దళితులసేవలో పునీతుడవు అవుతావు. ధీశిలా నగరంలో (షిరిడి)నా సమర్ధ సద్గురువు అవతారమైన సాయిబాబా అనుగ్రహము కూడా పొందుతావు. నీకు బాలకృష్ణుని రూపం యందు మక్కువ గనుక "గోపాలా! గోపాలా! దేవకినందన గోపాలా! అను నామమును నిత్యము జపించెదవు గాక. నీ మనోనేత్రమందు నేను సదా నీకు దర్శనమిచ్చెదను. నీవు ఈ శరీర పతనానంతరము హిరణ్యలోకంలో కొంతకాలముండిన తర్వాత మరలా జన్మించి సంత్‌గాడ్గే మహరాజ్‌గా లోకహితమును సాధించి ప్రసిద్ధి చెందెదవు. ఇదే నీకు నావరము! నా అభయము!" అని దీవించారు. ఈ గాడ్గే మహరాజ్ గారి శిష్యుడు శ్రీ కైకాడి మహరాజ్. శ్రీ కైకాడిమహరాజ్ గారి శిష్యుడు శ్రీ నామానంద్. శ్రీ నామానంద్ గారి శిష్యుడు శ్రీ గులాబ్ బాబాగారు. పై ముగ్గురు సద్గురువులను కూడా శ్రీ గులాబ్‌బాబా గారు సేవించారు. ఈ ముగ్గురు సద్గురువులు సాక్షాత్తు దత్త ప్రభువైన శ్రీ పాద శ్రీవల్లభులు ఆమోదించి అనుగ్రహించిన "గోపాలా!గోపాలా! దేవకి నందన గోపాలా!" అనే గోపాలతారకమంత్రమును నిరంతరం గానం చేస్తూ భక్తుల చేత గానం చేయిస్తూ జీవించారు. అద్భుతమైన విషయం ఏమిటంటే, ఈ ముగ్గురు సద్గురువులు శ్రీ గులాబ్‌బాబా గారిలో శ్రీకృష్ణుని దర్శించడము, బాబాను శ్రీకృష్ణుని అవతారంగా అంగీకరించి భక్తులకు తెలియజెయ్యడం. ఒక గోకులాష్టమినాడు కాటేల్‌లో వేలాదిమంది భక్తులనుద్దేశించి శ్రీ సద్గురు నామానందులవారు "పాండురంగడు ఒక సేవకుని రూపంలో వచ్చి ఏకనాధుని పన్నెండు సంవత్సరములు సేవించినా కూడా ఆ విషయం గుర్తించలేకపోయాడు. అదేవిధంగా శిష్యుడిగా వచ్చి నన్ను సేవించిన గులాబ్‌బాబాను భగవంతుని అవతారంగా మొదట్లో తెలుసుకోలేక పోయాను. ఇప్పుడు మనముందున్న ఈ గులాబ్‌బాబాను సామాన్య సిద్ధపురుషునిగా, సంత్‌గా భావించవద్దు. అంతకంటే అధికాధికమైన శ్రీకృష్ణ అవతారంగా తెలుసుకొని ఆరాధించండి" అని ధ్రువీకరించారు. పై వృత్తాంతం వల్ల శ్రీపాద శ్రీవల్లభుల నుండి శ్రీగులాబ్ బాబావరకు మనం స్మరించుకుంటున్న మహనీయులందరూ దత్త సంబంధము కలిగి శ్రీపాద శ్రీవల్లభుల దివ్య ప్రణాళికలో పాలుపంచుకొంటున్నారని తెలియుచున్నది. సత్యమైన మహనీయుడైతే ఆయన ప్రత్యక్షంగాకాని పరోక్షంగా కాని దత్తసంబంధం కలిగి ఉంటారని భక్తులు గ్రహించాలి. వీరే కాక మూర్తిజాపూర్‌లోని పుండలీక మహరాజ్, అమర్‌కంటక్‌లో నివసించే బర్ఫానందమహరాజ్ (వీరి వయస్సు సుమారు 300 సంవత్సరములు) వంటి సిద్ధ పురుషులు శ్రీగులాబ్‌బాబాను దర్శించేవారు. సాకోరిలోని గోదావరి మాత ఎంతో ప్రేమగా బాబాగారికి ఆహారం తినిపించేవారు.

ఉత్తరాది రాష్ట్రములలో ముఖ్యంగా మహారాష్ట్రలో ప్రసిద్ధి చెందిన సంత్‌శ్రేష్ఠులు మాత్రమే గోపాల్ కాలా ఉత్సవం నిర్వహిస్తారు. రామ్‌టెక్‌లో ఉండే శ్రీ సీతారామ్ మహరాజ్‌గారు వారి ఆశ్రమంలో లక్ష్మీనారాయణ పూజలు నిర్వహించేవారు. ఆ సందర్భంలో రాష్ట్ర సంత్‌అయిన శ్రీ తుకడోజి మహరాజ్‌గారు ప్రతిసంవత్సరం గోపాల్ కాలా ఉత్సవం నిర్వహించేవారు. వారు బాగా వృద్ధులైనందున వారి అనుమతితో శ్రీ సీతారామ్ మహరాజ్‌గారు గోపాల్‌కాలా ఉత్సవ నిర్వహణ బాధ్యత శ్రీ సిద్ధేశ్వర్ సంత్ శ్రీగులాబ్ బాబాగారికి సమర్పణ చేశారు. అంతేకాదు శ్రీ గులాబ్ బాబాను సామాన్య సంత్‌గా భావించవద్దని, మన బుద్ధికి అందని పరమాత్మే శ్రీగులాబ్ బాబా అని కూడా ప్రకటించారు. అప్పటి నుండి శ్రీ గులాబ్‌బాబా గారు గోపాల్ కాలా ఉత్సవం నిర్వహించేవారు. మరాఠీ భాషలో కాలా అంటే ఎందుకు వచ్చావు అనే అర్థముంది. “గోపాలా నీవు ఈ భువిపైకి ఎందుకు వచ్చావు” అని దానిభావం. జగదానంద కారకుడైన పరమాత్మ మన దుఃఖమయ జీవితములలో ఆనందమును నింపేందుకే ఈ భువిపై దేవకీ నందనుడైన శ్రీకృష్ణుడుగా వచ్చాడు. ఆయన సర్వాంతర్యామియైనా కూడా ఆయన నామ స్మరణ జరిగే ప్రదేశంలో అనుభవమయ్యే ఆనందం ద్వారా ఆయన ఉనికి తెలుస్తుంది. ఆ ప్రదేశం ఆనంద బృందావనమవుతుంది. గోపబాలకులందరితో కలిసి గోపాలకృష్ణుడు గోవులను మేపుటకై అడవికి వెళ్ళేవారు. వారందరూ వారి ఇళ్ళనుండి పాలు పెరుగు, వెన్న, పండ్లు ఇంకా అనేక తీపి పిండివంటలు కుండ ముంతలలో నింపి, వాటిని ఉట్టిలో పెట్టి కావిడి బద్దకు తగిలించి కూడా తీసుకొని వచ్చేవారు. ఆ తర్వాత వాటిని చెట్టుకొమ్మకు వ్రేలాడ దీసేవారు. శ్రీకృష్ణుడితో కలిసి ఆటలతో, పాటలతో, భజనలతో, నాట్యములతో మహదానందంగా క్రీడించేవారు. తర్వాత శ్రీకృష్ణుడే స్వయంగా అన్ని కుండలలోని పదార్థములను కలిపేసి సహపంక్తిలో చల్దులారగించేవారు. ఈ ప్రాచీన సంప్రదాయము ఆధారముగానే నేడు ఈ గోపాల్‌కాలా ఉత్సవం రూపు దిద్దుకుంది. కమ్మనైన, మధురమైన అనేక పదార్థములను ఒక కుండలో వేసి, ఆ కుండను ఉట్టిలో పెట్టి ఎత్తుగా వ్రేలాడదీస్తారు. సత్సంగము, భజనలతో, గోపాలనామ సంకీర్తనంతో ఆ బాలగోపాలం ఆ బాలగోపాలుని సాన్నిధ్యమును ఆనందిస్తున్న వేళ గులాబ్‌బాబాగారు వెండిదండంతో ఆ ఉట్టిలో కుండని కొడతారు. ఆ మధురాధిపతి దివ్యనామ గానంతో మరింత మాధుర్యమును సంతరించుకున్న మధుర భక్ష్య పదార్థములను మహాప్రసాదంగా స్వీకరిస్తారు. గులాబ్‌బాబాగారు “స్వర్గంలో దేవగణాలకు కూడా ఈ అదృష్టం లేదు. వారు మారురూపాలలో భువికి దిగి వచ్చి ఈ గోపాల్ కాలా ఉత్సవంలో పాల్గొంటారు” అని చెప్పారు. నాటి శ్రీకృష్ణుని అంశతో జన్మించిన గులాబ్‌బాబా గారే స్వయంగా నిర్వహించే ఈ గోపాల్ కాలా ఉత్సవంలో పాల్గొన్న వారు ధన్యులు.

శ్రీ గులాబ్‌బాబా గారు గులాబీరంగు చొక్కా ధరించి మోకాలు వరకు ధోవతి ధరించి, చూడటానికి వామన మూర్తిలా కనిపించినా ముఖంలో బ్రహ్మతేజస్సు ఉట్టిపడుతుంది. పసిపాప వంటి అమాయక మనస్సు ప్రతి పలుకులోను చర్యలోను కనపడుతుంది. ఆహారవిహారాలలో పట్టింపుకాని, విశ్రాంతి ప్రసక్తికాని లేకుండ రాత్రింబవళ్ళు గ్రామ గ్రామాలు నామ సంకీర్తనంతో, భజనలతో ప్రజలను మైమరపిస్తూ కులమత, ధనిక పేద, పండిత పామరబేధాలు లేకుండా తన ప్రేమను పంచి పెడుతూ, కదిలే బ్రహ్మం నడిచే దైవంగా సంచరిస్తూ ఈ భరతభూమిని పావనం చేశారు. ఆయన ఉపన్యసించడం మొదలుపెడితే వేద వేదాంగాలు, సమస్త శాస్త్రాలు సహజంగా ప్రవాహంలా వెలువడి పండితులను సైతం ఆశ్చర్యపరిచేవి. అయితే అందరికి సుబోధకంగా ఉండేందుకు భజనల రూపంలోనే ఎక్కువగా ఆయన బోధను అందించేవారు. తానైమాత తాను మరణిస్తూ తన మాతృహృదయమును బాల గులాబ్‌లో ఆవిష్కరించి మానవాళి అంతటికి మాతృప్రేమను వర్షించే విశ్వమాతను అందించి వెళ్ళింది. తల్లిప్రేమకు సాటి వచ్చే ప్రేమ సృష్టిలో లేనే లేదు. గులాబ్‌బాబాగారు సర్వజ్ఞుడైనా, సర్వసిద్ధి సంపన్నుడైనా, సర్వశక్తిమంతుడైనా, సర్వసమర్థుడైనా, అవతార పురుషుడైనా, తనకు తాను ఎప్పుడూ అలా భావించకుండా, అతి సామాన్యుడికి కూడా అందుబాటులో ఉండేటట్లు చేసినది గులాబ్‌బాబా గారి లోని ఈ మాతృప్రేమయే! బాబాగారు గతంలో అనేక కష్టాలుపడుతూ తిరిగిన రోజుల్లో ఎవరు ఒక చిన్న రొట్టె ఇచ్చినా, కాసిని మంచినీరిచ్చినా ఇప్పుడు కారులో ఆ మారుమూల గ్రామాలకు, పొలాలకు వెళ్ళి వారికి నమస్కరించి యోగక్షేమములు అడుగుతారు. అతిసామాన్యుడిలా ఆయనే ముందు అందరికి నమస్కరిస్తారు. గులాబ్‌బాబా గారు కిడ్నీలు పాడైపోయి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నప్పుడు కూడా ఆయనలో ఎటువంటి దైన్యము కనబడేది కాదు. కారులో డయాలసిస్ యంత్రములు, డాక్టర్లను కూడా ఏర్పాటుచేసుకొని వెళ్ళి భక్తుల యోగక్షేమములు విచారించేవారు. కొంతమంది మహనీయులలో ఈ ప్రేమ వారి శిక్షణ, దండన, రక్షణల వెనుక గుప్తంగా ఉంటుంది. అది గుర్తించి అనుభూతి చెందడం కష్టం. కాని గులాబ్‌బాబా గారి విషయంలో ప్రతీక్షణం, ప్రతి భక్తుడు ఆ మాతృప్రేమను అనుభవించి కరిగి పోతాడు. శ్రీ గులాబ్‌బాబా గారు ప్రతి స్త్రీలోను తన తల్లినే చూస్తారు. ప్రతి జీవి గులాబ్‌బాబా గారిలో విశ్వజననినే చూస్తారు. బాబాగారు "స్త్రీ అబలకాదు. ఆమె మాతృమూర్తి. అందరికి జన్మనిచ్చేది. ఈ అమ్మ రక్తం నుండే రాముడు, కృష్ణుడు, ఆంజనేయుడు వంటి వారు జన్మించారు" అని తరచుగా భజనలలో కీర్తించేవారు. బాబాగారు కురిపించే ప్రేమకు హేతువుండదు. వారి కరుణకు కారణముండదు. సేవకు ప్రతిఫలాపేక్ష ఉండదు. సూర్యుని నుండి వెలుగు, చంద్రుని నుండి వెన్నెలంత సహజంగా బాబా గారి నుండి ఆప్రేమ అందరిపైనా వర్షిస్తూ ఉంటుంది. శ్రీ గులాబ్‌బాబా గారిని మూడు,నాలుగు సార్లు నాగపూర్‌లో దర్శించాము. ఒకసారి

మేము రెండు బస్సుల జనం ఉన్నాము. అందరికి పాదసేవ నిచ్చి పలకరించి, ప్రసాదమిచ్చారు. బాబాగారు. అంతమందికి అన్నం వండించి పెట్టించారు. మరోసారి దత్తావధూత శ్రీస్వామి శివానంద మహరాజ్‌గారితో దర్శించాము. ప్రతి వారిని ఎప్పటి నుంచో పరిచయమున్న వారిలా కొత్త వారిని సైతం ఆప్యాయంగా పలకరించి పాదనమస్కారమిచ్చారు. భక్తుల బాధలు విని కన్నీరు కార్చారు. అందరూ గుండెల్లోని బరువంతాదిగిపోయి స్వాంతనపొందారు. బాబాగారు టీ ఫలహారాలు పెట్టించారు. మా ప్రోగ్రామ్ ఏమిటి అని అడిగారు. తాజుద్దీన్ బాబా దర్గా దర్శిస్తామని చెప్పాము. అయితే తొందరగా వెళ్ళండి. 12 గంటలకు కట్టేస్తారు. నా వ్యాన్ తీసుకొని వెళ్ళండి అన్నారు. బాబాగారితో మేము నలభైమంది ఉన్నామని చెప్పగా ఏం ఫరవాలేదు, నా రెండు వ్యానులు తీసుకొని వెళ్ళి రెండేసి ట్రిప్పులు వేయించుకోండి అని చెప్పారు. దర్శనం అయ్యాక భోజనం ఇక్కడికే వచ్చి చెయ్యండి అన్నారు. తిరిగి మూడు గంటలకు అందరినీ పిలిచి పలుకరించారు. భగవంతుడు పిలిస్తే పలుకుతానంటాడు. కాని తానే పిలిచి పలుకరించే ఈ బాబాగారిని ఏమని పిలిస్తే సరిపోతుంది? తర్వాత కార్యక్రమం ఏమిటని అడిగారు. కాటేల్ వెళ్ళి అక్కడి నుంచి ఆంధ్రా వెళ్ళి పోతాం అని చెప్పాము. ఇంక రెండు రోజుల్లో శ్రీరామనవమి వస్తుందని నాగపూర్‌లో పెద్ద ఉత్సవం జరుగుతుందని, కాటేల్ నుంచి మరల నాగపూర్ వచ్చి శ్రీరామనవమికి ఉండి వెళ్లమన్నారు. మనింట్లో పెళ్ళి ఉన్నా అంత ఆప్యాయంగా మనం పిలవలేము కదా అనుకున్నాము. మా బృందంలో ఉద్యోగులెక్కువమంది ఉండడం చేత శెలవు లేదు వెళ్లిపోతాం బాబా అన్నాము. సరేనన్నారు బాబా! కాటేల్ వెళ్ళేందుకు బస్సు మాట్లాడుకున్నాం అని చెప్పాము. ఆ బస్సు డ్రైవరు త్రాగుబోతుకాకుండా మంచివాడేనా? పిలవండి, నేను మాట్లాడతాను అని బాబాగారన్నారు. డ్రైవరుని పిలిచి టాకర్ ఖేఢామీదుగా కాటేల్ జాగ్రత్తగా తీసుకొని వెళ్ళమన్నారు. టాకర్ ఖేడా మీదుగా వెడితే దూరం ఎక్కువ అవుతుంది అలా వెళ్ళనన్నాడు డ్రైవరు. అప్పుడు బాబాగారు, తాను చెప్పినట్లు వింటేనే బస్సులు సరిగ్గా నడుస్తాయి అన్నారు. అప్పుడతడు ఒప్పుకున్నాడు. తర్వాత బాబాగారు, కాటేల్ అడవి ప్రాంతం. అక్కడ తినేందుకు ఏమీ దొరకవు అంటూ పుష్పాతాయి గారిని పిలిచి కాటేల్‌లో వారికి “వీరు బాబాకు కావల్సినవారు. ఆంధ్రానుంచి వచ్చారు. వీరికి వరి అన్నం వండించి పెట్టండి” అని చీటి వ్రాయించి మాకిచ్చారు. వారి ప్రేమను, భక్తుల యోగక్షేమముల పట్ల వారికి గల శ్రద్ధను చూసి అందరి హృదయములు ద్రవించిపోయాయి. ఇంక వారిని విడిచి వెళ్ళాలనే ఆలోచనరాగానే అందరి మనస్సులు మౌనంగా విలపించాయి.దాచుకోలేనివారు పైకే విలపించడం మొదలుపెట్టారు. మేము దుఃఖించడం చూచి బాబాగారు దుఃఖించారు. ఇది మా అనుభవమే కాదు. వారిని దర్శించిన వేలాదిమందిలో ప్రతి ఒక్కరు ఇలాంటి ప్రేమానుభవమును పొందారు. అదే ఆయన విశిష్టత. ఆయన ప్రేమ స్పర్శతో మన

హృదయాలు వికసించి ప్రేమమయం కావాలి. ఆయనలాగా నిష్కల్మషంగా, నిస్వార్థంగా, నిరంతరంగా అందరిని ప్రేమించగలిగి, సేవించగలడమే ఒక మహాయోగం. అదే ప్రేమయోగం. మధురభక్తి యోగం. దాని వలన రజోగుణం, తమోగుణం, అసురగుణం అంతరించి అంతరంగంలో సత్వగుణం, దైవీగుణం, సేవాగుణం ప్రతిష్ఠితమవుతాయి. అత్రి, అనసూయల స్థితికి చేరుకుంటారు. అప్పుడు దత్త శక్తి స్వంతమవుతుంది. దత్తయోగం సిద్ధిస్తుంది. బాబాగారు చెప్పిన రూటులో కాటేల్ వెళ్ళడం వలన దారిలో అమరావతిలో సంత్‌గాడ్గే బాబాగారి సమాధి దర్శనం, టాకర్ ఖేడాలో బాబాగారి మాతృమూర్తి పేరున నిర్మింపబడిన తానై మాత ఆశ్రమం దర్శనం చేసుకొనే భాగ్యం కలిగింది.

సద్గురువును ఆశ్రయిస్తే జ్ఞానం లభిస్తుంది. భగవంతుడిని ఆశ్రయిస్తే ఇష్ట కామ్యసిద్ధి లభిస్తుంది. గులాబ్ బాబాగారిని ఆశ్రయిస్తే ఇటు కామ్యసిద్ధి అటు జ్ఞానము రెండూ లభిస్తాయి. అందుకే శ్రీగులాబ్‌బాబా గారు పూర్ణ పరబ్రహ్మ రూపం. శ్రీ గురుదేవదత్తుని మరో రూపం. గులాబ్ బాబా గారు నిత్యం సాయిబాబా, గజానన్ బాబా, తాజుద్దీన్ బాబా నామాలు. స్మరించేవారు. ఆ ముగ్గురు మహనీయుల ద్వారా నిర్వహింపబడిన ఆధ్యాత్మిక కార్యక్రమము గులాబ్‌బాబా గారి ద్వారా కొనసాగుచున్నదని మహారాష్ట్రలోని భక్తుల విశ్వాసం. శ్రీ గులాబ్ బాబాగారికి సమకాలికులుగా జన్మించడం మనందరి అదృష్టం. గులాబి పువ్వు పుష్పజాతిలో శ్రేష్టమైనది. అదే విధంగా సమకాలీన సంత్‌లందరూ గులాబ్ బాబాగారిని సంత్ శిరోమణిగా కీర్తించారు. గులాబీగా జన్మించి, గులాబీలా జీవించి భక్త హృదయాలపై ప్రేమ సౌరభాలు వెదజల్లి, గులాబీ అంత త్వరగానే కనుమరుగయ్యారు. విక్రమ నామసంవత్సరం, ఫాల్గుణ పౌర్ణమినాడు అనగా ది. 9-3-2001 వ తేదీన భౌతిక శరీరమును త్యజించారు. వారి జన్మభూమి యైన టాకర్ ఖేడాలో కొన్ని కోట్ల రూపాయల వ్యయంతో పెద్ద చలువరాతి సమాధిమందిరం నిర్మించారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, ఆంధ్రప్రదేశ్‌లలో కొన్ని వందల "గులాబ్‌బాబా" దర్బారులు ఆయన ఆశీస్సులతో ఏర్పడ్డాయి. ఆ దర్బారుల్లోను, అందరి హృదయాల్లోను నిత్యచైతన్యమూర్తిగా భాసిల్లుతూ గులాబ్‌బాబాగారు వారి ప్రేమను కురిపించుచునేయున్నారు.

ఓం ద్రాం శ్రీ గులాబ్ బాబాయ నమః

అవధూత చింతన శ్రీ గురుదేవదత్త !

ముఖ్యక్షేత్రములు, మార్గము : **గులాబ్‌బాబా వారి జన్మస్థలము "టాకర్‌ఖేడా" వెళ్ళుటకు, భక్తులు ముందు నాగపూర్ నుంచి ముంబాయ్ వెళ్ళు రైలు మార్గములో మూర్తిజాపూర్ లో దిగి, బస్సులో దరియాపూర్ నుంచి అంజన్‌గాం-సూర్జీ మీదుగా 3 కిలోమీటర్ల దూరంలో నున్న "టాకరఖేడా" చేరవచ్చును. ఆయన తపోభూమి అయిన కాటేల్ వెళ్ళుటకు షేగాం నుండి బస్సులు గలవు.**

దత్తావధూత శ్రీ స్వామి శివానంద మహరాజ్

గురుపాదుకాపీఠ విరాజిత దత్తావధూతం
బ్రహ్మసమరస సన్మార్గశాంతి దూతం
నిరతాగ్ని సేవనం పాపకర్మవిదాహినం
చిదానంద రూపం వందే శివానంద సద్గురుం

దత్తవటవృక్షమునకు చిగురించిన మరో పట్టుకొమ్మ శ్రీ స్వామి శివానంద మహరాజ్‌గారు. అది ఇప్పుడు ఊడగా మారి ధృఢంగా భూమిలో నాటుకొని వృక్ష సమానంగా విస్తరించుచున్నది. ఇంతవరకు మనం స్మరించుకొన్న దత్త ప్రభువును, దత్తావతారములను నిత్యం ఆరాధిస్తూ, వారి బోధననుసరించి జీవిస్తూ, భక్తుల చేత దత్తావతారముల దివ్యనామ సంకీర్తనం చేయిస్తూ, వారి మహిమాన్వితమైన చరిత్రలు పారాయణ చేయిస్తూ, దత్త భక్తి ప్రచారమునకు, దత్త సేవకు తన జీవితమును అంకితం చేసిన మహనీయులు శ్రీ స్వామి శివానంద మహరాజ్‌గారు. వీరి తల్లిదండ్రులెవరో, ఏకులమో, ఎప్పుడు, ఎక్కడ జన్మించారో ఎవరికి తెలియదు. ఆవివరములు స్వామీజీ ఎప్పుడు చెప్పలేదు. అవి తెలిసిన బంధువులెవరూ ఇంతవరకు రాలేదు. వారి జన్మ రహస్యం పరమశివునికి మాత్రమే ఎఱుక. గతంలో వీరు ఆ సేతుహిమాచలం దివ్యోన్మత్త స్థితిలో అవధూతగా సంచరించానని, ఎందరో మహనీయులను సేవించానని అప్పుడప్పుడు వారు చెప్పిన మాటల వల్ల తెలియుచున్నది. దత్తస్వామి వారి తపోజ్ఞాన సిద్ధులను భక్త జనోద్ధరణకు వినియోగించదలచి వీరిని గృహస్తుగా మలిచారు. అప్పటినుంచి విశాఖపట్టణంలో అనగా సుమారు ఒక ఇరవై సంవత్సరములనుండి గుప్తంగా జీవిస్తున్నారు. వారి దివ్యత్వం బహిర్గతం కాకుండా సామాన్య గృహస్తుగానే ప్రారంభించారు. స్వామి యొక్క పుట్టు పూర్వోత్తరములు తెలుసుకొనగోరు వారిని స్వామి ఇలా మందలిస్తారు.

మహనీయులు గూర్చి అడుగకేజాతియనుచు
అడగదలచిన జ్ఞానంబు నడగవచ్చు
కత్తి విలువ విచారించి కత్తికొనుము
విలువ ఒరకేల దానిని విడిచి పెట్టు
మరచిపోకుడు శివానందుని మంచిమాట

స్వామీజీ శ్రీ గులాబ్ బాబాగారిలో తను ఆరాధించే దత్తగురుమూర్తిని దర్శించారు. గులాబ్‌బాబావారు స్వామిని ఒక గొప్పస్థితిలో ఉన్న అవధూతగా, మహనీయుడుగా ఆదరించేవారు. స్వయంగా స్వామికి రొట్టెలు తినిపించారు. వారు తొడుక్కున్న గులాబీ రంగు లాల్చి స్వయంగా తొడిగి, స్వామితో కూడా వెళ్ళిన భక్తులతో ఇలా అన్నారు. "నాశిక్‌లో ముక్తిధామం కట్టించిన కోటీశ్వరుడు తనకు ప్రసాదంగా ఒక గులాబీ లాల్చీ ఇస్తే కాటేల్ ఆశ్రమానికి కోటిరూపాయలిస్తానన్నాడు. వారం రోజులు నావెంట పడి తిరిగినా ఇవ్వలేదు. అలాంటిది మీ స్వామీజీకి నేనే స్వయంగా నా లాల్చీ ధరింపచేశానంటే మీ స్వామి విశిష్టత తెలుసుకోండి. భగవంతుని అనుగ్రహమైనా సులభంగా లభిస్తుందేమో గాని, ఇటువంటి అవధూత సాన్నిధ్యం లభించడం చాలా కష్టం. అట్టి మీ స్వామిని సేవించి తరించండి. వారికి చక్కని ఆశ్రమం నిర్మించి ఇవ్వండి." అని చెప్పారు. ఆంధ్రానుంచి భక్తులెవరు గులాబ్ బాబా గారి దర్శనమునకు వచ్చినా వారిని "శివానంద మహరాజ్ గారిని దర్శించారా" అని అడిగేవారు. వారు దర్శించ లేదంటే "మీరాష్ట్రంలో ఉన్న అంతటి మహనీయుడిని దర్శించకుండా నా దగ్గరకు వచ్చారా" అని అనేవారు. అలాగే స్వామీజీ తన దగ్గరకు వచ్చిన భక్తులతో "ఇప్పుడు సశరీరంగా ఉన్న మహనీయులలోకెల్లా శ్రీగులాబ్‌బాబా గారు అగ్రగణ్యులు. అవధూతలమైన మేము సామాన్యంగా ఎవరిని ప్రశంసించం. అయితే గులాబ్ బాబా గారెంతటివారో మీరు గుర్తించలేరు. అందుకని వారి గురించి తెలియచేస్తున్నాను" " అనేవారు.

స్వామీజీ అంతరాంతరాల్లో ఏనాటినుంచో గురుతత్వమును తెలియచేస్తూ, సత్యమైన గురుమార్గమును గురుభక్తులందరకు అందించేందుకు ఒక దత్తపీఠం నిర్మాణం చేయాలని ఉన్న సంకల్పం శ్రీ గులాబ్‌బాబాగారి ప్రేరణ ఆశీస్సులతో కార్యరూపం ధరించే సమయం ఆసన్నమైంది. శ్రీగురుచరిత్ర పారాయణ సప్తాహములు ద్వారా స్వామికి పరిచయమైన భక్తులను వారి దివ్యప్రణాళికా నిర్వహణలో పాల్గొనేటట్లు చేశాయి. వీటన్నిటి ఫలితమే, దత్తస్వామి అనుగ్రహించి గురుభక్తులందరికి వరంగా స్వామీజీ ద్వారా ప్రసాదించిన "శ్రీ షిరిడిసాయి గురుపాదుకాపీఠం" అనే దివ్యధామము.

అవధూత చింతన శ్రీగురుదేవదత్త !

దత్తావధూత శ్రీస్వామి శివానంద మహరాజ్‌గారి తత్వము - సందేశము

దత్తావధూత శ్రీస్వామి శివానందమహరాజ్‌గారే ఒక సద్గ్రంథం. వారి జీవితమే ఒక సందేశం. వారి జీవన విధానమే వారి బోధ. వారి సాన్నిధ్యమే పావనక్షేత్రం. వారి పిలుపే మేలుకొలుపు. వారి పలకరింపే మనకు పులకరింత. వారి దరహాసమే భక్తులకు ఆత్మవికాసం. వారి వామనరూప దర్శనమే సుదర్శనయోగం. ఏ విషయంలోనైనా స్వామి ఆదర్శమే. ఆయన ఆదర్శగృహస్తు. తెల్లవారుజామున నాలుగు గంటలకే లేస్తారు. దత్తమందిరంలో దత్తస్వామికి నిర్మాల్యం తొలగింపు, మంగళస్నానం, అలంకరణ, అర్చన స్వయంగా ఎంతో శ్రద్ధగా చేస్తారు. రోజూ అగ్ని కార్యము, వైశ్యదేవము పూర్తిచేసిన తర్వాతనే స్వామీజీ ఆహారం తీసుకుంటారు. పిల్లల చదువు సంధ్యలు, గృహావసరములు అన్నీ స్వయంగా స్వామి చూసుకుంటారు. ఆశ్రమ నిర్మాణ నిర్వహణ పనులు యెన్ని ఉన్నా కుటుంబ సభ్యులపట్ల బాధ్యతలను ఏమాత్రం విస్మరించరు. సహృదయంతో, సమర్పణభావంతో సేవచేస్తున్న భక్తుల యోగక్షేమములు విచారిస్తూ ఉంటారు. అతిధి అభ్యాగతులను ఆదరిస్తూనే ఉంటారు. పర్వదినములలో భక్తులందరూ భుజించిన తర్వాత మాత్రమే తాను భుజిస్తారు. క్షేత్ర దర్శనమునకు వెళ్ళినపుడు కూడా వచ్చిన భక్తులకు వసతి సదుపాయములు అందరికీ లభించిన తర్వాతే వారు విశ్రమిస్తారు.

యద్యదాచరతి శ్రేష్ఠః తత్తదేవేత రోజనః ।
సయత్ప్రమాణం కురుతే లోక స్తదనువర్తతే ॥

పెద్దలు, ప్రముఖులు దేనిని ఆచరిస్తారో ప్రజలందరూ దానినే అనుసరిస్తారు. ప్రమాణంగా స్వీకరిస్తారన్న గీతాచార్యుని హెచ్చరికను అనుసరించి స్వామి జీవిస్తుంటారు.

ప్రజలకు బోధ చెయ్యాలి. సన్మార్గంలో నడిపించాలి అంటే గృహస్తుగా ఉండి తీరాలన్నదే స్వామి అభిప్రాయం. గృహస్తుడైన మహనీయుని వద్ద మాత్రమే బోధను శిక్షను స్వీకరించేందుకు సమాజము, శాస్త్రము ఆమోదిస్తుంది. మహర్షులందరు గృహస్థులే కదా! అయితే అవధూతగా సంచరించిన స్వామి తిరిగి గృహస్తుగా మారడం స్వామితత్వం తెలియనివారికి అంతుబట్టదు. దత్తునితో త్వమేవాహం అన్నస్థితిని అందుకున్న తర్వాతే అవధూత అవుతారు. తిరిగి దత్తస్వామే వీరిని గృహస్తుగా మార్చి వారి జీవితం భక్తులకు ఆదర్శంగా తీర్చి దిద్దుతున్నారు. అందువలన ఉగ్రప్రవృత్తిని విడిచినా

అవధూత తత్త్వమును నిలుపుకుంటూనే ప్రజలకు సన్నిహితంగా ఉంటూ సమాజసేవ చేస్తున్నారు. స్వామి తత్త్వతః ప్రవృత్తి శూన్యమైన సచ్చిదానంద స్వరూపమే అయినా, భక్తులను క్రమంగా నివృత్తిమార్గంలోకి నడిపించేందుకు కొన్ని ప్రవృత్తులను ఆపాదించుకుంటారు. మహిమా ప్రవృత్తి దృష్ట్యా చూసినట్లయితే స్వామి ఎంతో మహిమాన్వితులు. వారి సర్వజ్ఞత్వం భక్తులకు అనేక సందర్భములలో అనుభవమవుతూనే యుంటుంది. మనస్సులో కోరిక పెదవులతో భక్తులు చెప్పకుండానే, వారే ఆ కోరిక చెప్పి సంతానమును అనుగ్రహిస్తున్నారు. రోజూ ఇంట్లో భుజించేటప్పుడు స్వామి ఫోటోకి చూపించి తినడం అలవాటు చేసుకుంటున్న భక్తుడు ఒకసారి అదిమరచి తింటుంటే సరిగ్గా అప్పుడే అతనింటికి స్వామి ఫోను చేసి నాకు పెట్టకుండ తింటున్నావే అని గుర్తుచేశారు. స్వామి సేవ చేస్తున్న భక్తునితో, అతడు ఎక్కడినుంచో తన సన్నిధికి వచ్చి సేవచేసుకోగలగడానికి కారణం వాళ్ళ తాతగారు ఎన్నో సీతారామకళ్యాణాలు, రామపట్టాభిషేకాలు, అన్నదానాలు చేసి ఉండడమే అని చెప్పారు. అతను వాళ్ళ తాతగారిని చూడలేదు. అతని తండ్రిని ఈ విషయం విచారించగా స్వామి చెప్పినది సత్యమని తెలిసింది. ఒకోసారి స్వామి ప్రసాదవితరణ చేయునప్పుడు ఆ పదార్థములు అక్షయమవడం భక్తులు గుర్తించారు. స్వామి అనుగ్రహ ఆశీస్సులతో ఉన్నతవిద్యకు అవకాశం లభించినవారు, మంచి ఉద్యోగములు వచ్చినవారు, మంచి పెళ్ళి సంబంధములు కుదిరినవారు, వ్యాపారాభివృద్ధి కలిగినవారు, రోగవిముక్తి పొందినవారు ఎంతోమంది ఉన్నారు. వారి సంకల్పబలం అమోఘం. పీఠం నిర్మాణం కాని, గ్రంథరచనకాని, ఆధ్యాత్మిక కార్యక్రమముల నిర్వహణకాని, ఏ పనైనా సరే సత్వరమే సాధించగలడం వారి అద్భుత మహిమకు తార్కాణంగా నిలుస్తాయి.

ఆచార్యప్రవృత్తి దృష్ట్యా చూచినట్లయితే స్వామి చక్కటి గురుమార్గమును అందిస్తున్నారు. వారి బోధలోని కొన్ని అంశములు యివి. గురువు లేకుండా లౌకిక విద్యల అధ్యయనమే సాధ్యం కాదు. అలాంటప్పుడు ఆధ్యాత్మిక విద్యకు గురువు లేకుండా ప్రవేశమే లేదు. దత్తస్వామిని కాని దక్షిణామూర్తిని కాని తెలియచెప్పకుండా, గురుపరంపర చెప్పకుండా గురుత్వం వహించడం సత్ సంప్రదాయం కాదు. దత్తాత్రేయుల వారే మూలగురుతత్త్వం. గురువంటే ఒక వ్యక్తి కాదు. గుణములకు రూపములకు అతీతమైన వాడే గురువు. సాయి మహిమను చవి చూడగానే సాయితత్త్వమంతా తెలిసిపోయిందనే ఆవేశంతో సాయిభక్తి ప్రచారం ఉధృతంగా చేయాలని ప్రారంభించి సాయిగురువులుగా మారిపోతున్నారు కొందరు. వారు సాయినాధునికి, అంతకుముందు వచ్చిన ఏ మహనీయునితో కాని, ఏ దత్తావతారంతో కాని, అసలు దత్తునితో కాని సంబంధము లేదని అలా పోలిక పెట్టడం

తగదని, శ్రీ గురుచరిత్ర వంటి గ్రంథములు ఈ కాలమునకు వర్తించేవి కావని, అవి చదువవలసిన అవసరం లేదని, సాయి చరిత్ర ఒక్కటి చదువుకుంటే చాలని ప్రచారం చేస్తున్నారు. గ్రంథములు వ్రాస్తున్నారు. స్వామీజీ ఇటువంటి ప్రచారమును అంగీకరించరు. సాయి హృదయంలో దత్త తత్వం సంపూర్ణంగా ఆవిష్కరింపబడిఉంది. అందుకని సాయిని పూర్ణదత్తావతారంగా అర్థం చేసుకొని ఆరాధించుకుంటేనే అది శాశ్వతమైన గురుమార్గమవుతుంది. మూలగురుతత్వమును వదిలి వేసి గురుపరంపరకు వినయంగా ఒదిగి ఉండకుండా గురుత్వం వహించేవారు, వారిని ఆశ్రయించేవారు అహంకార సర్పద్రష్టులై పరమార్థ భ్రష్టులవుతారు. మారే సంవత్సర పంచాంగముల మాటున మారని కాలంలా, మారే గురుస్వరూపముల మాటున మారని గురుతత్వం అనంతంగా సాగుతూనే ఉంటుంది. గురుతత్వమును వారు క్రొత్తగా తెలుసుకుంటూ అది అప్పుడే మొదలైందని చెప్పడం బాల్యచేష్ట. గురువు యొక్క కృపాదృష్టిచేతనే మానవుడు సద్గతిని పొందుతాడు. తాను ధర్మాన్ని ఆచరిస్తూ తన్ను ఆశ్రయించిన వాళ్ళచేత ఆచరింపచేస్తూ ముక్తిపథమునకు చేర్చేవాడే నిజమైన సద్గురువు. త్రివిధతాపములను హరించేవాడే నిజమైన సద్గురువు. మనలో అహంకారం తొలగితేకాని సద్గురువు లభ్యం కాదు. ఎన్ని విధములుగా బలవంతుడు, సమర్థుడు యైనా సరే గురుబలము లేకపోతే కూలిపోతాడు.

కండబలంబు, బుద్ధిబలంబు
ధనబలంబు, ఎంత ఉండిననూ
గురుబలంబులేక దాసుడగును
కర్ణుడంతటివాడు కడపటికేమయ్యె
మరిచిపోకుడు శివానందుని మంచిమాట

మనమీనాడు అనుభవించే కష్టాలు రోగాలు మొదలైన బాధలు మనం పూర్వం చేసుకున్న కర్మల ఫలితమే. ప్రశాంత చిత్తంతో వాటిని అనుభవించి వదిలించుకోవాలి. నిష్కామంగా సత్కర్మలు ఆచరిస్తూ జీవిస్తే కర్మబంధాలుండవు. మోక్షానికి, జన్మరాహిత్యమునకు అవసరమైన జ్ఞానమును ప్రసాదించేవాడే సద్గురువు. ఒకసారి గురువుకు శరణాగతిచేసిన శిష్యుని సద్గురువు జన్మజన్మలకు విడిచిపెట్టడు. దత్తాత్రేయ తత్వము తెలుసుకొనుటకు శ్రీదత్తపురాణం చదవాలి. మూల దత్తగురుశక్తి దత్తవతారముల ద్వారా యెలా ప్రకటమవుతుందో తెలుసుకొనుటకు దత్తావతారముల చరిత్రలు పారాయణ చెయ్యాలి. నిత్యమువారి నామస్మరణ చెయ్యాలి. శ్రీ గురుచరిత్ర, శ్రీ పాదవల్లభ చరితామృతం, స్వామి సమర్థ

అక్కల్‌కోట మహరాజ్, శ్రీ సాయిబాబా, సంత్‌గజానన్ మహరాజ్, హజరత్ తాజుద్దీన్‌బాబా, శ్రీ వాసుదేవానంద సరస్వతి స్వామి, సంత్‌సిద్దేశ్వర్ గులాబ్‌బాబా వారి దివ్యచరిత్రలు పారాయణ చేస్తుండాలి. వీటిలో శ్రీపాదవల్లభ చరితామృతము, శ్రీ గురుచరిత్ర, శ్రీ సాయిసచ్ఛరిత్ర నిత్యము పారాయణ చెయ్యాలి. వీరందరి ద్వారా పనిచేయుచున్నది. ఒకే దత్తతత్వమని ధృడంగా మనసులో నిలుపుకోవాలి. సర్వస్య శరణాగతి భావంతో, ప్రేమతో, విశ్వాసంతో, పరాయణత్వం చెంది, ధర్మబద్ధమైన, పవిత్రమైన జీవనంతో ఈ గ్రంథములను చదవాలి. ఇవి కేవలం చరిత్రగ్రంథములు కావు. వారి దివ్య సాన్నిధ్యాన్ని మనకు ప్రసాదించి దత్తానుగ్రహమునకు పాత్రులుగా తీర్చిదిద్దే సాధనాగ్రంథములే దత్తావతారముల చరిత్రలు. భగవంతుని అనుగ్రహం సులభంగా లభిస్తుందేమో కాని, గురువు అనుగ్రహం లభించడం చాలా కష్టం. కాని దాన్ని సులభసాధ్యం చేసే పరమరహస్యం శ్రీ గురుచరిత్ర పారాయణలో ఉంది. స్వామీజీ ఇంకా ఇలా బోధిస్తారు. శ్రీ గురుచరిత్ర శ్రీపాదశ్రీవల్లభులు మరియు శ్రీనృసింహసరస్వతుల చరిత్ర మాత్రమే అని, వారి భక్తులు మాత్రమే చదువుకోవలసిన గ్రంథము అని భావించరాదు. గురువులందరి ద్వారా ప్రకటమయ్యే గురుతత్వము ఒక్కటే కనుక ఏ సంప్రదాయమునకుచెందిన మహనీయుని గురువుగా ఆరాధిస్తూ అనుసరిస్తున్న వారైనా శ్రీ గురుచరిత్ర పారాయణ చేసినట్లైతే గురుతత్వ ఉపాసన జరిగి (దత్త) గురు కృప ఆ మహనీయుని ద్వారానే లభింపచేస్తుంది. శ్రీ గురుచరిత్ర గురుభక్తులందరకు విశ్వజనీనమైన సాధనా గ్రంథం. చరిత్రపారాయణ ప్రాధాన్యత స్వామీజీ ఇంకా ఇలా వివరిస్తారు. సర్వస్యశరణాగతి భావముతో నిరంతర భగవత్కథాశ్రవణము, నామస్మరణము చేస్తూ ధర్మ బద్ధంగా జీవించడమే, భవత్ ప్రాప్తికి కలియుగంలో అనుసరించదగిన మార్గమని నారదమహర్షి శ్రీకృష్ణ పరంగా వ్యాసమహర్షికి చేసిన భాగవతోపదేశము ఇదే. దత్తాత్రేయులవారు శ్రీపాద శ్రీవల్లభులు, శ్రీ నృసింహసరస్వతి అవతారముల ద్వారా ఈ మార్గమునే మరల ధ్రువపరిచారు. ఈ పారాయణమార్గము పట్ల ప్రజలు ఏమరుపాటు చెందకుండా శ్రీ షిరిడిసాయినాధుడు పునరుద్ధాటించి అనుసరింపచేస్తున్నారు. భగవత్కథాశ్రవణ, మనన, నిధి, ధ్యాసములతో కూడిన చరిత్ర పారాయణమార్గము సనాతనమైనది, శాస్త్రసమ్మతమైనది అని తెలియచేస్తూ విశాఖపట్టణంలోని శ్రీ షిరిడిసాయి గురుపాదుకాపీఠములో దానికి ప్రధానస్థానం కల్పిస్తున్నారు. శ్రీ షిరిడిసాయి గురుపాదుకాపీఠం ద్వారా (శ్రీగురుచరిత్ర), శ్రీదత్తపురాణం, శ్రీ గురుగీత, భాగవతసన్నిధి, భావసహిత శ్రీ షిరిడిసాయిహారతులు, దత్తస్తోత్ర వైభవం, గ్రంథములు ముద్రించి అందిస్తున్నారు. వీటిలో శ్రీగురులీల, శ్రీ దత్తపురాణం స్వామి కూర్పు చేసి అందిస్తున్నారు. శ్రీపాద వల్లభ చరితామృతం, పిఠాపురం సంస్థానం నుండి గ్రంథములు తెప్పించి భక్తులకు

అందుబాటులో ఉంచుతున్నారు. అందరి మహనీయుల చరిత్రలు చదవమని ప్రోత్సహిస్తుంటారు. అంతేకాకుండ శ్రీ దత్తపురాణం, శ్రీపాదవల్లభ చరితామృతం, శ్రీ గురులీల గ్రంథములు శ్రవణ పారాయణనిమిత్తం స్వామీజీ ప్రవచించి సి.డి.లరూపంలో విడుదల చేశారు. ఇండ్లవద్ద కూడా దత్త సంకీర్తనామృతమును ఆస్వాదించేందుకు దిగంబరా దిగంబరా, గజాననాయ్ ఓం గజాననాయ్, శ్రీస్వామి సమర్థ సద్గురు జయజయస్వామి సమర్థ అనే మూడు దత్తభజన్స్ సిడిలు విడుదల చేశారు. దత్వస్వరూపులైన స్వామీజీ హృదయంలోనుంచి బయలుదేరి వారి మేఘగంభీరస్వరం ద్వారా దత్త గురు లీలా వైభవాన్ని శ్రవణం చేస్తుంటే ఆత్మానందప్రదంగా యుంటుంది. సత్సంగములో, గురుపౌర్ణమి, దత్తపౌర్ణమి, శివరాత్రి మొదలగు పర్వదినములలో స్వామి చేయించే దత్తదివ్య నామ సంకీర్తనం మనస్సులను ఉత్తేజితం చేస్తుంది. సంకీర్తన ఉచ్ఛైస్వరంతో తారాస్థాయిలో స్వామి చేయిస్తుంటే స్థబ్దత, నిర్లిప్తత, నిరాశ, నిస్పృహలు తొలగిపోయి యెంతో స్వస్థత కలుగుతుంది. స్వామి చెప్తుంటారు తుపాకి ధ్వనికి చెట్టుమీద పక్షులు ఏవిధంగా ఎగిరిపోతాయో అలా గొంతెత్తి భజిస్తే మానవ శరీరమును ఆవరించుకొనియున్న కర్మలన్నీ చెల్లాచెదురైపోతాయని ఈవిధంగా స్వామి బోధ చేస్తూ ఉంటారు. ప్రతి అమావాస్యనాడు, పౌర్ణమి మరియు పర్వదినములలో స్వామి దత్త, సాయినాధ సర్వదేవి దేవతా హోమములు అఖండధునిలో నిర్వహిస్తారు. తద్వారా మన పాపకర్మలు దగ్ధమవడమే కాకుండా వాయుమండలమంతా దత్తస్పందనలతో నిండి సత్కార్మాచరణకు బుద్ధిని ప్రేరేపిస్తాయి. దత్తప్రేరణతో దత్తవాంగ్మయమునందిస్తున్న ప్రముఖ దత్తభక్తులు స్వామిని దర్శించి ఈవిధంగా కీర్తించారు.

దత్తాత్రేయ స్వరూపం త్వాం, అవధూత శిరోమణిమ్।
శివానంద మహారాజం, ప్రణామామి యతీశ్వరమ్॥
ధూమపానేన పాపాని దహంతం, భజన ప్రియమ్।
శివానంద మహారాజం, ప్రణమామి యతీశ్వరమ్॥
శ్రీనృసింహగురోర్గాధాం, శ్రావయన్తం సమంతతః।
శివానంద మహారాజం, ప్రణామామి యతీశ్వరమ్॥

తత్వపరంగా స్వామి గురించి చెప్పాలంటే, స్వామి ఎప్పుడూ గురువునని, అవధూతనని, స్వామినని భావించరు. తాను ఎప్పుడూ సేవకుడననే చెప్తారు. అలానేభావించుకుంటారు. అయితే ఆ సేవ సమర్థుడైన సద్గురువుకి మాత్రమే చేస్తాను అంటారు. నిరంతరం దాసభావంతో, ప్రేమభావంతో, సర్వస్యశరణాగతి భావంతో, కర్తృత్వభావం (నేను చేస్తున్నాను అనే భావం) అణుమాత్రం లేకుండా దత్తసేవ చేయడం వల్ల జరిగే పరిణామం ఏమిటో వారి మాటల్లోనే తెలుస్తుంది.

నేను నిలచి ఉన్న నిలువడూ గురుమూర్తి
నేను తొలగిపోవ నిలుచు గురుడు
ప్రేమగొంది చాలా చిన్నది ఇరుకుది
ఇద్దరందు జేరి యిమడ లేరు.
మరచిపోకుడు శివానందుని మంచిమాట.

అహంకార కారణమైన నేను అనేభావం సద్గురుని సేవలో తొలగిపోవడం వల్ల, వారి హృదయంలో గురువు నిలిచాడు. గురువుతో తాదాత్మ్య స్థితిని సాధించారు. దత్తునికి భక్తులపై, సేవకులపై యెంతప్రేమ అంటే వారి ద్వారా పనిచేసేది ఆయనే అయినా, కీర్తి ప్రతిష్టలు భక్తుడికే వచ్చేట్లు చేస్తారు. అందుకే ఆయనను భక్త కీర్తి వివర్థనుడుగా వర్ణించి ఆనందిస్తారు. దత్తుని, దత్తావతారములను అనన్య చింతనతో స్వామి సేవించడం వలన, దత్తగురుశక్తి, దత్తతత్వము దత్తుని నుండి ప్రచండమైనధారగా బయలుదేరి శ్రీపాదవల్లభులు, నరసింహసరస్వతి, మాణిక్య ప్రభువు, అక్కల్‌కోట స్వామి, సాయినాధుడు, టెంబెస్వామి, సంత్‌గజానన్‌మహరాజ్, హజరత్ తాజుద్దీన్ బాబా, సంత్ సిద్దేశ్వర్ గులాబ్‌బాబా వారి మీదుగా ప్రవహించి, శ్రీస్వామి శివానందమహరాజ్‌గారి ద్వారా భక్తులపై వర్షిస్తోంది. ఆ గురుశక్తే అద్భుతాలను సాధించుచున్నది. కాబట్టి గురుసేవ ఎలా చెయ్యాలో తాను చేసి చూపించడం ద్వారా, మనకు గురువు అవుతున్నారు కాని, వారికి వారుగా గురువునని భావించరు. దత్తతత్వం వారి ద్వారా ప్రకటమవుతోంది కనుక స్వామి దత్తస్వరూపులు, దత్తావతారులు అనడం సమంజసంగా యుంటుంది. స్వామీజీ నిర్వహించిన శ్రీ గురుచరిత్ర సప్తాహములు శ్రవణం చేస్తున్న భక్తులకు, శ్రీ గురుచరిత్ర, సాయి చరిత్ర పారాయణం చేసుకొనే భక్తులకు, శ్రీ గులాబ్ బాబాగారి భక్తులకు స్వామీజీలో దత్తస్వామి, సాయినాధుడు, గులాబ్‌బాబాగారు దర్శనమిచ్చిన అనుభవములు చెప్తుంటారు. దత్తస్వామికి, సాయినాధునికి సమర్పించాలనుకున్న దక్షిణలు స్వామీజీకే సమర్పించినవారున్నారు. స్వామి యింకా ఇలా చెప్తారు. మార్గదర్శి అంటే మార్గమును చూపించి ఆదారిలో వెళ్ళండి అని చెప్పేసి వదిలివెళ్ళిపోయే వాళ్ళే ఉంటారు. కాని తాను మాత్రం మార్గంలో తోడు ఉండి చేయి పట్టుకుని నడిపించి గమ్యాన్ని చేరుస్తాను అంటారు. అది ఎంతటి అభయప్రదానమో చూడండి.

మరోసారి స్వామీజీ నేను ఒక మండుతున్న అగ్నిగోళాన్ని. లోకకళ్యాణం కోసం నన్ను నేను జ్వలింపచేసుకుంటున్నాను. నన్ను అంటిపెట్టుకొని ఉండగోరువారు నాతోపాటు ఆ అగ్నికి సమిధలుగా మారేందుకు సంసిద్ధులుగా ఉండాలి. లేదా అంతటి త్యాగానికి సంసిద్ధత లేనివారు యజ్ఞఫలితమైన

భగవద్విభూతిని ధరించి లాభం పొందండి!! నిస్వార్థంగా తనను తాను దహించుకుంటూ లోకులకు సన్మార్గపు వెలుగును యిస్తూ జీవితాన్ని ఒక యజ్ఞంగా నిర్వహించే స్వామి యొక్క మహోన్నత వ్యక్తిత్వమును ఈ వాక్యములు తెలియచేస్తాయి.

ఓం ద్రాం శ్రీ శివానంద గురవేనమః

అవధూత చింతన శ్రీ గురుదేవదత్త!

నాదియన్నది లేదు ముక్తుడనైతినీ
బ్రహ్మనిష్ఠయందు నేను నిలచినానూ
ద్వంద్వమేది నాకు తలపడదిప్పుడూ
ఒక్క నిన్నే నేను తలచుచుంటీ
మరచిపోకుడు శివానందుని మంచిమాట

గురుని వెదుకుచుండి భ్రమణంబు సల్పితి
దేశదేశములు తిరిగినాను
భేదముడిగిపోయె ప్రియతముని గనినంత
నాది పరులదన్నదేది లేదు
మరచిపోకుడు శివానందుని మంచిమాట

– శ్రీ స్వామి శివానంద మహరాజ్

సద్గురు చరిత్రల పఠనావశ్యకత

గురుకృపచేతనే మోక్షజ్ఞానం లభిస్తుంది. గురు కృప గురుస్మరణ వలన లభిస్తుంది. గురుస్మరణ గురుభక్తి వలన లభిస్తుంది. గురుభక్తి గురుతత్వ అవగాహన వలన లభిస్తుంది. గురుతత్వ అవగాహన అనేక సద్గురు మూర్తుల చరిత్రల పారాయణము ద్వారా లభిస్తుంది.

గురుతత్వం ఒక్కటే! గురురూపములు అనేకం. మూలగురుతత్వమే దత్తాత్రేయుడని చెప్పుకొన్నాం. అందుకనే పైన పేర్కొన్న మహనీయులందరిని దత్తావతారములు గానే వ్యవహరిస్తున్నాం. దత్తసద్గురువులుగానే ఆరాధిస్తున్నాం. ఎన్ని గురురూపములు భువిపైకి దిగి వచ్చినా అపారము, అగాధముయైన దత్తతత్వమును, ఆయన అనంతకోటి కళ్యాణ గుణములను ప్రకటించేందుకు సరిపోవు. అలాంటప్పుడు గురువును ఒక రూపానికి ఒక నామానికి పరిమితం చేసి ఆ ఒక్కరి చరిత్రే చదివితే సరిపోదు. ఇందులో వివరించిన సద్గురువుల చరిత్రలన్నీ చదవడం వలన వారి ద్వారా ప్రకటమైన గురుతత్వం పట్ల కొంత అవగాహన కలుగుతుంది. వీరి ద్వారా ప్రకటమైన కారుణ్య, సౌజన్య, సౌందర్య, సౌరభ్య, ఔదార్య, గాంభీర్య, ధైర్య, వీర్య, జ్ఞాన, బల, యోగ , తేజ, విభూతి, సామర్థ్యాది కళ్యాణగుణములు, లీలా వైభవమంతా వీరి శరీరములకు సంబంధించినవి కావు. ఈ శరీరములు ధరించిన దత్త పరబ్రహ్మమునకు చెందినవి.బ్రహ్మజ్ఞానులకు శరీరాభిమానం ఉండదు. వారు ఆత్మస్వరూపులు. అందువల్ల అనాదిగా, అనంతంగా విశ్వమంతా తమ నిలయంగా, అన్ని యుగములలోను వారు ఉన్నామనే ఆత్మానుభూతిలో వారుంటారు. అందువల్లనే శరీరమును ధరించడం, నిలుపు కొనడం, అదృశ్యం చెయ్యడం, విసర్జించడం అనే క్రియలు ప్రకృతి యొక్క అధీనం కాదు. ఇవన్నీ వీరి విషయంలో దత్తుని యోగలీలలు. మాతృగర్భమున జన్మించిన శ్రీపాద శ్రీవల్లభుల భౌతికశరీరం తర్వాత ఏమైందో ఎవరికి తెలియదు. అదేవిధంగా జన్మించిన శ్రీ నృసింహసరస్వతీ స్వామి శరీరం కూడా ఏమైందో తెలియదు. మాతృగర్భమున జన్మించిన శ్రీమాణిక్య ప్రభువు సజీవసమాధి చెందారు. మాతృగర్భమున జన్మించిన ఆధారమే లేని (అయోనిజుడు) అక్కల్‌కోట మహరాజ్‌గారు వారి భౌతిక శరీరమును అందరి ఎదుట విసర్జించారు. ఎలా, ఎప్పుడు, ఎక్కడ జన్మించారో, అసలు మాతృగర్భమున జన్మించారో, లేదో తెలియని సాయిబాబా వారి శరీరమును భక్తుల సమక్షములోనే త్యజించారు. శ్రీ గజానన్ మహరాజ్ విషయంలోను అలాగే జరిగింది. హజరత్ తాజుద్దీన్‌బాబా, శ్రీవాసుదేవానంద సరస్వతి, శ్రీగులాబ్‌బాబాగారు అందరివలెనే జన్మించి అందరివలెనే శరీరములను త్యజించారు. శ్రీస్వామి శివానందమహరాజ్‌గారి జన్మ వృత్తాంతము కూడా ఎవరికి తెలియదు. కాబట్టి వీరి అవతార కార్యములు కూడా శరీరముతో సంబంధం లేకుండా, దానికి

అతీతంగా కొనసాగుతూనే ఉంటాయి. వీరు నివసించిన ప్రదేశములు దత్తక్షేత్రములుగా, గురుశక్తి ప్రసారకేంద్రములుగా నేటికీ గురుభక్తులపై అమృతకిరణములను కురిపిస్తూనే ఉన్నాయి.

అందుకని మనభక్తినంతటిని ఒక రూపానికి, ఒక నామానికి పరిమితం చేసుకొని, విపరీతమైన ఇష్టమును పెంచుకొని, ఆయన సర్వోన్నతుడని, ఆయనకు ముందు వచ్చిన మహనీయులతో కాని, తర్వాత వచ్చిన మహనీయులతో కాని సంబంధము లేదని, అలాపోలిక పెట్టడమే తగదని, ఇలాంటి భావములతో ఆరాధిస్తే హిరణ్యకశిపుడు, రావణాసురుడు మాదిరిగా రాజసిక భక్తిగా మారుతుంది. మూఢత్వం చోటు చేసుకుంటుంది. తత్వవికాసంలోపిస్తుంది. వివాదములకు, ఘర్షణలకు మనస్సును ప్రేరేపిస్తుంది. చివరకు అశాంతి మిగులుతుంది. అందుకని అనేకమంది మహనీయులను అంగీకరించటం చరిత్రలు చదవటం సాధకులకు అత్యంత ఆవశ్యకం.

శ్లో॥ మధులుబ్ధో యథా భృంగోపుష్పాత్ పుష్పాంతరం వ్రజేత్ ।
జ్ఞానలుబ్ధ స్తథా శిష్యో గురోర్గుర్వంతరం వ్రజేత్ ॥

మధువునందు ప్రీతి కల తేనెటీగ ఒక పుష్పమునుండి మరొక పుష్పమునకు ఎట్లు వెళ్ళునో అట్లే జ్ఞానమునందు ప్రీతిగల శిష్యుడు ఒక గురువు నుండి మరొకగురువు వద్దకు (అందరిలోను ఒకే "గురువు" ఉన్నాడనే భావంతో) వెళ్ళి జ్ఞానసంబంధమైన విషయములు సేకరించుకొనవలెనని "శ్రీగురుగీత" తెలియచేయుచున్నది. ఇక్కడ వివిధ గురువులను దర్శించడం, వారిని గురించి మంచి విషయములు గ్రహించడం వ్యభిచార భక్తి అవుతుందని, చిత్త ఏకాగ్రతకి భంగమవుతుందనే సందేహమునకు తావే లేదు. గురువులు వేరు వేరు అని భావిస్తూ, వేరు వేరు లౌకికప్రయోజనములు ఆశించి ఆశ్రయిస్తే అది వ్యభిచారభక్తి అవుతుంది. విశ్వములోని గురువులందరి రూపంలో దిగి వచ్చినది విశ్వగురువైన దత్తాత్రేయుడనే దేహాతీతమైన, ఏకైకమైన, అద్వితీయమైన గురుస్వరూపమును అనుభవంలోనికి తెచ్చుకొనుటే నిజమైన గురుభక్తి అవుతుంది. అప్పుడే అది అవ్యభిచార భక్తి అవుతుంది. చిత్తైకాగ్రతకి దోహదం చేస్తుంది. అనన్యచింతనకు, భిన్నత్వంలో ఏకత్వదర్శనమునకు కూడా ఈ భావమే ఆధారము.

నేటి సమకాలీన సమాజంలో వివిధ గురువులను, వివిధ సాధనామార్గములను అనుసరించేవారు ఒకే ప్రాంతంలో ఉంటున్నారు. అందుకని గురువులందరూ, దేవతలందరూ దత్త పరబ్రహ్మము ధరించిన రూపములే అనే విశాలమైన, విశిష్టమైన భావము హృదయంలో

ప్రతిష్ఠించుకొనడం ద్వారా విశ్వకుటుంబ భావన విశ్వ సమైక్యత, తద్వారా విశ్వశాంతి సాధ్యమవుతుంది. అంటే మానవులంతా ఒక్కటే అనే భావం కలగాలంటే గురువులంతా ఒక్కటే అనేభావంతో ప్రారంభిస్తేనే సాధ్యమవుతుంది. ప్రజల మధ్య సంచరిస్తూ, వారి యోగక్షేమములకు కృషిచేస్తు ధర్మమార్గంలో నడిపిస్తూ, జ్ఞానమును మోక్షమును ప్రసాదిస్తూ విశ్వ కళ్యాణానికి కృషి చేస్తున్న మహనీయులందరూ ఏ మతమునకు చెందినవారైనా వారి చరిత్రలలో వారు దత్తస్వరూపులగా చెప్పబడకపోయినప్పటికి, వారందరూ తత్వపరంగా దత్తస్వరూపులే! ఇందలి దత్తావతారముల చరిత్రలు చదివిన తర్వాత అందరి మహనీయుల చరిత్రలు కూడా దత్తభక్తులు చదువవలయును. గత కాలమునకు చెందిన సద్గురువుల చరిత్రపారాయణ ఫలంగా దత్తకృపలభించి సజీవ సద్గురువుల సాన్నిధ్యమును కూడా ప్రసాదిస్తుంది. ఇది మా అందరి స్వానుభవం కూడా. కనుక అనంతంగా అఖండంగా సాగే దత్తావతారలీలా వైభవ మహాగ్రంథంలో పూర్ణులైన మహనీయులందరూ వివిధ అధ్యాయముల వంటివారు అనే సమన్వయాత్మకమైన బ్రహ్మసమరస జ్ఞానం సాధనాపరంగాను, సమాజపరంగాను నేడు అత్యవసరం.

ఏగురువు యొక్క శిష్యులైనా, భక్తులైనా వారిగురువుని చక్కటి తత్వపరమైన సమత్వభావనతో, అవగాహనతో ఈవిధంగా స్మరించుకోవాలి.

శ్లో॥ మన్నాథ శ్రీ జగన్నాథో మద్గురుశ్రీ జగద్గురుః

మమాఽత్మా సర్వభూతాత్మా తస్మై శ్రీగురవేనమః

జగత్తంతటికి ప్రభువుగా నున్నవాడే నా ప్రభువు రూపంలో ఉన్నాడు. జగత్తంతటికి గురువుగా నున్నవాడే నన్నుద్ధరించుటకు నా గురు రూపంలో ఉన్నాడు. సర్వభూతములకు ఆత్మగానున్నవాడే నాయందు ఆత్మగా ఉన్నాడు. అట్టి శ్రీగురునికి నమస్కారము.

అవధూత చింతన శ్రీగురుదేవదత్త!

గురుదేవ మంగళహారతి

ఓం జయ జయ గురుదేవా స్వామి జయ జయ గురుదేవా
బ్రహ్మవిష్ణు పరమేశ్వరరూపా బ్రహ్మవిష్ణు పరమేశ్వరరూపా
పరమానందనిలయా ఓం జయ జయ గురుదేవా ॥ఓం జయజయ ॥

వేదమునీవే నాదమునీవే జ్ఞానము నీవేలే
బ్రహ్మజ్ఞానమునీవేలే అందరిలోన వెలుగుచునున్న
ఆత్మవు నీవేలే పరమాత్మవునీవేలే ॥ఓం జయజయ ॥

లోపల నీవె వెలుపలనీవె అంతయు నీవేలే
ఈ జగమంతయు నీవేలే
అండ పిండ బ్రహ్మాండములోన ఉన్నది నీవేలే
నిలుచున్నది నీవేలే ॥ఓం జయజయ ॥

యోగము నీవే – ధ్యానము నీవే
తేజము నీవేలే – దివ్య తేజము నీవేలే
అందరినీ భక్తి మార్గమున నడిపే
భారము నీదేలే – పెను భారము నీదేలే ॥ఓం జయజయ॥

అభయ ప్రదాతవు – అనుసంధాతవు
అంతర్యామివిలే – సర్వాంతర్యామివిలే
శరణు శరణు శరణంటిని దేవా
ముక్తిని చూపు మయా – సంతృప్తిని ఒసగుమయా ॥ఓం జయజయ॥

ఓం జయజయ గురుదేవ! ఓం జయజయ గురుదేవ! ఓం జయజయ గురుదేవా!

శ్రీ ఆదిగురుదత్తాత్రేయ మహరాజ్‌కీ జై!
శ్రీ పాదశ్రీవల్లభ మహరాజ్ జై !
శ్రీ నృసింహ సరస్వతి మహరాజ్‌కీ జై !
శ్రీ మాణిక్యప్రభుమహరాజ్‌కీ జై !
శ్రీ స్వామి సమర్థ అక్కల్‌కోట మహరాజ్‌కీ జై
శ్రీ సాయినాథ్ మహరాజ్‌కీ జై !
శ్రీ వాసుదేవానంద సరస్వతీ మహరాజ్‌కీ జై !
శ్రీ గజానన్ మహరాజ్‌కీ జై !
శ్రీ తాజుద్దీన్ బాబా మహరాజ్‌కీ జై !
శ్రీ గులాబ్ బాబాకీ జై !
శ్రీ స్వామి శివానంద మహరాజ్‌కీ జై !
శ్రీ అవధూత చింతన గురుదేవదత్తకి జై !